విషయానుక్రమణిక

చిత్రములు



చెన్నపట్టణము, మే ౧౯౨౮

సంపుటము ౫ విభవ సంవత్సరము వైశాఖమాసము సంఖ్య ౫

సీతాంజనేయము

సెట్టి లక్ష్మీనరసింహము గారు

ఆహా! యెంతటి చల్లనైన నుడి! యన్నా పావనీ, నాదు సం
దేహం బాఱఁగ పల్కుమా మరల: మ చ్చిత్తేందు కాంతోల్లస
న్నీహారాంశు విభుండు నావిభుఁడు తా నిక్కంబుగా నాపయిన్
మోహంబున్ విడనాడకుండ ననుఁ గన్గొమ్మంచు నిన్నంపెనా?

నా విభుఁడు, నా ప్రభుఁడు, నాదు దేవుఁడు నను-వెదుక నిన్నంపె నను నుడి వీనులందుఁ
బడి, మడియ నున్నయట్టి నా ప్రాణపు మొల-కలకు నమృతరసపు జడిగాఁగఁ దేలె.

దయితుని క్షేమంబును, నా ప్రియునికి నాయెడలఁ గలుగు ప్రేమంబును నీ
క్రియఁ దెలియవచ్చుటం బతి-వియోగసాగరము నీఁద వీలు ఘటిల్లెన్,

"చచ్చితి లక్ష్మణా", యని నిజంబుగ భర్తృగళ స్వరంబుతో
వచ్చిన కేక నాకు వినవచ్చినదాదిగ సోకుమూకచే

నొచ్చెనో నాథుఁడంచును మనోగతసంశయ మొందు కల్గి నే
నిచ్చలుఁ గుందుచుందు: నది నేఁటికిఁ దీఱెను నీదు మాటలన్.

"అమ్మా, యన్నకు వచ్చినట్టి భయమే? మమ్మేటి శ్రీవిష్ణు వే
సుమ్మా, దైత్యుల మాయలం బడఁడు", మంచున్ లక్ష్మణుండన్న, నే
నమ్మంజాలక యమ్మఱంది నతి నిందావాక్యముల్ పల్కి పా
పమ్మున్ జేసితిఁ, దత్ఫలం బనుభవింపన్ యోగ మిట్లుంటచే.

మఱంది మాటలటుండ, నేనెఱుఁగనె పురహరధనుష్ఖండనుఁడు, ఖరాద్య సురదండ
నప్రచండ దోర్దండమండనుఁడు నైన-మామక మనోవిభుని మహిమంబు మున్న?

అప్పటి కేమిమాయ కనులం దకటా! పొగమంచు కైవడిం
గప్పెనొ కాని, లక్ష్మణుని గానకు గెంటుటె కా కతండు న
న్నప్పుడు దాఁటకుండ విధియించిన గీఁతను దాఁటివచ్చి యీ
త్రిప్పుల పాల నేను బడితిం; జెడితిన్ శని నెత్తిఁ దన్నుటన్.

శని వేఁతే మఱియేల? భిక్షుకుని వేషంబూని యేతెంచి, గీఁ
తను నే దాఁటిన యంత నే పదితలల్, దట్టంపుమీసంబు, లె
ఱ్ఱని గ్రుడ్లిర్వది చేతులున్, నిడుదకోఱల్, జుంజురున్ వెండ్రుకల్
తనరన్ రావణుఁడొందె నష్టమశని స్థానంబు నాపాలికిన్.

వాని వెడరూపుగని పయి-ప్రాణంబులు నాకుఁ బైకిఁ బాఱెమె యుండున్
నే ననుభవింపవలసిన-నానాకష్టముల బలము నన్నిల నిలిపెన్.

నా కష్టంబులు లోకమందు మఱి-యే నారుల్ పడంబోరు; ము
ల్లోకంబుల్ వడఁకింపఁజాలు పతి యాలున్ నేను; రాకాసి జేఁ
జే కాని,మ్మటువంటి నన్ బలిమిమై నిట్లీడ్చునా లంకకున్?
కాకుల్ గ్రద్దలు పీఁకఁగా వలదె తత్కాయంబు నీపాటికిన్?

గ్రద్దమైన జటాయు వా ఖలుని కాయ-మును నఖంబులఁ బీఁకఁగాఁ బూనుకొనెను
గాని, 'పాపీ చిరాయు'వన్నాకారణమున, నా యభాగ్యంబునను జావఁడాయె వాఁడు.

ననుఁ జెఱగొన్న యా దనుజనాథుని పాపపుఁ జేతులెప్డు కూ
లునో? మరులొంది నన్గని ముడుంగని పాపపుఁ గన్నులెప్డు వ్రే

లునో? ననుఁ గాఱిలాడుటకు లోగని పాపపు నాల్క-లెప్డు ప్రీ
లునో? యులపాపి మేను చితిలోఁబడి బగ్గన నెప్డు కాలునో?

అంత దనుకను బగ్గుబగ్గనుచుఁ గాలు-చుండుఁగాని, నాదుఃఖాగ్ని యుడుకు చెడదు:
నడుమ నడుమ నద్దానికిఁ బుడకలయ్యె-రావణుఁడు వచ్చియనిన దుర్భాషణములు.

కుతకుత మఱుఁగుచుండుఁజుమి కోపమహాగ్నియు దుఃఖవహ్నితో
జతయయి, నాఁడు పల్కు- పరుషంబులు విన్నతఱిన్ మహానల
ద్వితయమిదేల కాల్పదు మదీయశరీరము? నన్ మహాపతి
వ్రత నిటు క్షోభపెట్టియును వాఁడును భస్మముకాఁ డదేటికో?

అటులు నేఁజావకున్న నేమాయె? తల్లి-భూమిదేవి నాకన్నిటిబోట్లు పడిన
యపుడు వానిలోనికిఁ గొన్నయట్లు నన్నుఁ-గూడఁ దనలోనికిం జేర్చుకొనఁగరాదె?

ఆకరణిన్ ధరంబడిన యశ్రువు లొక్కటి రెండు మూడు నా
ల్గా? కనులే ద్రవించినటు కంటికిమంటికి నేకధారగా
శోకము నేనుబొందుట, నశోకవనంబిది నేతిబీరకా
యే కద? తోఁడుఁబుట్లగుట నేడ్చుచు నున్నవి చెట్లు నిచ్చటన్.

భర్తృవిహీనయై బ్రదుకఁ బాయుట కాదని నిశ్చయించి యుం,
గర్తృత యిందు నిక్కముగఁ గాంతుని కున్నది గాని నేను నం
పూర్తిగ నస్వతంత్ర నను బుద్ధిని బ్రాణములన్ భరించి, త
న్మూర్తిని సంతతంబును మనోగతదృష్టులఁ జూచి మ్రొక్కుదున్.

క్రొమ్మెఱుంగుల మ్రింగు గుబురు మబ్బుల రంగు మించి చాల వెలుంగు మేనితోడ,
నిండు పున్నమనాఁటి పండువెన్నెలసాటి నాఁదగు తగుపాటి నగవుతోడ,
తేనియల్ దిగజాఱు తెలిదామరల మీఱుచును గనికరమూఱు కనులతోడ,
మగఁటిమిసిరికింద మందిరమ్మన సుందరమ్మయిన వెడంద ఱొమ్ముతోడ,
మూర్తిమంతుఁడై మన్మనోముకురమందు-నావిభుండు ప్రత్యక్షమై, "దేవి, భయము
వల" దనుచుఁ దెలుప నిబ్బరంపడుచునుంటి-నావిభుని క్షేమమునుగూర్చి నన్నుఁగూర్చి.

విభుని క్షేమంబెఱుంగు టవ్విధినె కాదు-నేలఁ బొరలి, కేలుదగిలి, నీళ్లఁగడిగి
యును జెడక నానొసట నిల్చియున్న యట్టి-కుంకుమపుబొట్టు జంకు పోఁగొట్టుచుండు.

ఆబొట్టును, బలికట్టిన-యీబంగరు తాళిబొట్టు, నివి విడిచినచో
నే బిట్టుగాఁగ నేడ్వం-గాఁబడు కన్నీటిబొట్లు కలవిఁక నాకుఁ.
మఱచితిన్ మఱచితి; మఱియొక్క నగయును,-నాకుఁ గలదు: శోభనంపు రాత్రి
నే నెఱుంగకుండ నా నెఱులందు-వ,రుండు పెట్టినది శిరోమణి యిది.

అంబరవీథి నన్గొని దశాననుఁడేగిన వేళ ఋశ్యమూ
కంబున మిమ్మొ కావలయుఁ గంటిని నే నపు డాత్మభూషలె
ల్లం బతి కిత్తురంచును నిలం బడవైచి, పరాకుచేత దీ
నిం బడవైవ మానితిని: నేడిది పంపెద నాననాలుగన్.

రమణుం డంపిన యుంగరంబిది శిరోరత్నంబుగాఁ దాల్చి జీ
వములన్ నిల్పెద: శ్రీసమేతముగ మత్ప్రాణేశు పుణ్యంపు నా
మమునన్ వర్ణములెన్ని దీనఁ గలవో, మాసంబు లింకన్ని యే
సుమి నాకున్ మితి పెట్టె రావణుఁ: డిటుంచున్ నాథుతోఁ జెప్పుమా.

నా దేహంబును వాఁడు వ్రేలి మొననైనన్ ముట్టలేఁడంచు నన్
ఖైదుంబెట్టిన యాది నేనెఱుఁగుదుం; గానం దనుం గాంచి తమ్మి
మీఁదన్ నేఁ బడియున్న యప్పుడును నామేనంటకుండంగ న
న్నాదైత్యుండు ధరిత్రితోఁ గలిపి తీయఁ లేదె చెట్టున్ బలెన్ ?

అటులు రథంబు మీఁదికి దశాస్యుఁడు నన్గొని వచ్చి లంక కి
చ్చటికిని దెచ్చునప్పుడు దిశల్ ప్రతిశబ్దములీన భర్త పే
రటవిని నిండె; నేఁ బలికినట్టిది కాదది: భార్య యట్లు ప
ల్కుట యుచితంబు కాదనెడి కోవిద వాక్యము నే నెఱుంగనే?

అది మొదలుగాఁగ నెపుడున్-మదనుచ్చరిత పతినామమయనాదము నా
పెదవుల వెలువడినటులగు-హృదయధ్యానము వెలుపటికే తెంచెననన్.

గోళ్లతోనైనఁ జిక్కును దీయకున్న నా-నిడుదపెన్నెఱులెల్ల జడలుగాఁగ
పయినుండి మేదినిపై కేశధారగాఁ-గాఱు కన్నీరు మిన్నేఱుగాఁగ
అనలకణంబట్లు లలరు కుంకుమబొట్టు-నెన్నొసటంగల కన్నుగాఁగ
స్నానంబులేమి నెమ్మేనునఁ గడు దట్టముగఁ బొదవినధూళి బూదిగాఁగ.

ఈశునకు వెలిగా నగమా శరీర-మమరఁ దారకనామమంత్రము నిరంత
రము జపించెడి నతినని రావణుండు-భయపడియె నేమొ తాశివభక్తుఁ డగుట?

అరచేతి దళసరికన్న హెచ్చుగ మేనునం దట్టకట్టియున్నట్టి మన్ను
తెరతెరలై నిరంతర మేకధారఁగా గాఱుచు నున్నట్టి కంటినీరు,
బడబానలంబులై వడిని నాయెడఁద నదా కుతకుతమండు శోకవహ్ని
యుడుకు డెందమునుండి వెడలెడి యూపిరియును బోని వేఁడినిట్టూర్పు గాలి
నాకనుల చూపు కను వట్టి యాకసంబుఁ-గలిసి పంచభూతంబులై వెలసి, నాదు
మేను నిలిపియుండఁగనోపు: లేనియెడల-నంతరింపదే నాకాయ మాంజనేయ?

ఈదృశమైన మద్విధము నెల్లను దెల్లముగాఁగ నీవిఁకన్
నాదు మనోధినాథుని మనంబు కరంగ నెఱుంగఁ దెల్పి, త
త్పాదపయోరుహద్వయముపైని మదీయశిరంబుఁ జేర్చి, యీ
మాదిరిగాఁగ నంటినను మా హనుమా, యనుమాన మేటికిన్?

“సెగకంటి దేవర సింగిణిన్ విఱిచినట్టిది మీబలంబు మీ కెదురు గలదె?
లక్ష్మణుతో వచ్చి లంకలో విజయలక్ష్మీనూత్నవరులరై మెలఁగ వలదె?
ననుఁ దెచ్చి దనుజుండు మనియుండి మీకీర్తి రమ మొగమ్మున మసిరంగు నలఁదె;
సింగ మేన్గును జీల్చుభంగి మచ్చిత్తదాహకుని గూల్చు పని మీయొకని తలదె;
రణమునందు వేవేగ రావణు వధించి-చిరవియోగ దుఃఖితను నన్ జేకొనుఁ”డని
తనకు నేవిన్నవించితి ననుచు నీవు, ముఖమునం దెల్పు హనుమంత, పుణ్యవంత!

మేఘసందేశకావ్యమున నాకుఁ గొన్ని సందియములు కలుగఁగా, తన్మూలములు, కవివ్యాఖ్యాతల సరసులనియే సేనెన్నుకొని మన్నకున్నచో వారియెడల నపచార మొనర్చినవాఁడ నగుదునని జడిసి, సహృదయులగు ప్రాజ్ఞులు, వాని సాధుతాసాధుతలను నిర్ణయింతు రను విశ్వాసముతో ప్రభవ సంవత్సరాది సంచికయందు వానిని వెల్లడించితిని.

అందులకు భారతీ భాద్రపద సంచికయందు శ్రీయుత బులుసు వెంకటరమణయ్యగారు గనువారును, 1927 అక్టోబరు ౨౦ తేది యుగంధరపత్రికయందు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేంకటాచార్యులుగారు గను వారును కొన్ని సమాధానములను వ్రాసిరి.

అందు. *వెంకటరమణయ్యగారి యుపన్యాసము మసమగ్రమనియు, వారు పన్నినయుక్తులు దుర్బలము లనియుఁ దెలుపుచు శ్రీమాన్. సేలటూరు రామదాసయ్యంగారు, యం. ఏ., యల్. టి., అనువారు, భారతీపుష్య సంచికలో నొక దీర్ఘవ్యాసమును ప్రచురించినారు. ఆవ్యాసమున, పయిపండితు లిరువురు నొసఁగిన సమాధానములకన్నను విశేషసమాధానము లేమియు లేవుగాని, ప్రతివిమర్శనము నపేక్షించు వ్రాఁతమాత్రము మెండుగాఁ గలదు. ప్రతివాక్యమును విమర్శించుచో గ్రంథము విస్తరిల్లి పాఠకులకు విసువుపుట్టించునుగాన రామదాసుగారి వ్యాసమునఁ బ్రకృతములయిన కొన్నివిషయములనుమాత్రము సంగ్రహముగా విమర్శింతును.

I. ఇంద్రధనువు

'బొమ్మకొరడు' వర్ణనమున నయ్యంగారి వ్రాఁత యిట్లున్నది:—

"తూర్పునం దోఁచు నింద్రధనురాకారమును, ఖండము సేని అఖండము సేని, మేఘునికి ఆభరణీకరింప వలయు సేని మేఘునికి తూర్పుపయనము చెప్పి, దానిని 'నెలవంక' 'చందురునంక' అను పేరుల వెలయు నాభరణముగా, ఈశ్వరుని తలనుండు దానింగాని, సరస్వతి తల నుండుదానింగాని మించినదానింగా నుత్ప్రేక్షింపఁదగును. మఱి యూగోపవేషునికేని, ఇతరులకేని బర్హముతో అట్టి వగను రచించుట దృష్టశ్రుతచరము గాదు." అని.

ఈప్రసంగము కేవల మప్రసక్తము. ఐనను, అయ్యంగారి యూహలోని పొరపాటును చూపు కొఱకే యీ సమాధానము.

బర్హముతో అట్టివగను రచించుట దృష్టచరమును గాదు; శ్రుతచరమునుగాదు. కాని, ఇంద్రధనువు నెలవంకవలె నుండుట దృష్టచరమా? శ్రుతచరమా?

ఇంద్రధనువు తెలుఁగు (∩) ఒకటివలె నుండును. (Welcome Arch) వలె నుండును. ఇఁక నెలవంకయో, గణప్రస్తారమునఁ జూపఁబడు గురుచిహ్నము (◡) వలె నుండును. మఱియు, "అ" అను నక్షరపు§ తొలిరూపమువలె నుండును. నెలవంక తలక్రిందుచేయఁబడిన యింద్రధనువువలెను, ఇంద్రధనువు తలక్రిందు చేయఁబడిన నెలవంకవలెను ఉండును. ఒకదాని కొకటి కేవలము విపరీతము. నెలవంకకు శృంగములుమీఁది కుండును. ఇందులకు పేరులలో చందమామపేరు. మసీదులపై నెలవంక, సుందరులు ధరియించు (నెలవంక) తిలకము. శాసనములలోని చంద్రఖండము మున్నగునవి యెన్నియో తార్కాణములు. శిశుపాలపుస్తకమున, చంద్రకళాభివృద్ధినిచూపు చిత్రమునుచూచినను ఇది తెలియును. పెక్కుపలుకులేల? నెలవంక ఇంద్రధనువువలె తలక్రిందగు

---

* రామదాసుగారు వేంకటాచార్యులవారి వ్యాసమును తిలకింపరో; తిలకించియు వారివాక్యములు, తమ కనుకూలింపవని తలఁచిరో,—ఆచార్యులవారిని తమవ్యాసమునఁ దడవక జాఱవిడిచిరి.

§ బాలేందు పరిధిశృంగావర్త...(ఆంధ్రశబ్దచింతామణి). విదియచంద్రునిమాడ్కి— వెలయు వత్వము (◡—ఇది అకారము)—అప్పకవీయము చూచునది.

ట భూలోకమువారి యనుభవముకాదు. ఈశ్వరుని తల యందును, సరస్వతి తలయందును, ఇంద్రధనువుంబోలు నెలవంక నెలకొనియుండఁగా రామదాసుగారు చూచి యుందురా! ఎంతచిత్రము?

* ఇంద్ర ధనుర్విషయమున వెంకటరమణయ్య గారు వ్రాసిన దసమగ్రమనియు, తామేమో సమగ్రముగా వ్రాయుదుమనియు వచ్చిన రామదాసుగారు తూర్పున నున్న ఇంద్రధనువును, తలక్రిందుచేసిరేకాని, వలసిన ఉత్తరమునకుఁ గొనివచ్చినదిగాని సంజీవనీటీకావాక్యము లకు సమర్థనము కల్పించినదిగాని లేదు.

II. మేఘము, రాజహంసలు

మహాకవి, మేఘహంసల సమానదేశగమనమును నిమిత్తముగాఁ గొని "రాజహంసాస్సహాయాః" అను రచనమును గావించెను. 'సహాయాః' అనుపదమునకర్థ§ 'సయాత్రాః' అనునర్థము మాద్రివాసిరేకాని - సహాయులు అనునర్థమును, కవియగు కాళిదాసుగాని వ్యాఖ్యాతయగు మల్లినాథుడుగాని భావింపలేదు.

ఆసయాత్రతను సమర్థించుటకే వ్యాఖ్యాతలు (మల్లినాథాదులు) "విరుద్ధానామపి హంసానాం సహాయత్వోక్తిః" అని ముందుగ వ్రాసియు, "హంసానాం పరమం మేఘగర్జితమితి ప్రసిద్ధం" అని చెప్పికొనియు, వలసినంతెంతో వ్రాయవలసి వచ్చెను. అట్టిపట్టున, హంసమేఘవిరోధము నించుకయు సూచింపక—"మేఘుఁడా! వారికి నీవు ఉపకారివి. వారే నీసాంగత్యమును కోరి నీతో వత్తురు. నీవు వారిని ప్రార్థింపవలసినది లేదు" అని విశేషించి పదప్రయోజనమును వ్రాయుచో, పాఠకునకు సందేహము కలుగ కెట్లుండును?

మేఘుఁడు హంసల కుపకారి యని చెప్పవలసివచ్చుచో—బాధించిరైనను, భయపెట్టిరైనను వానికిఁ బ్రియతముఁడు మానసమునకుఁ దలుమువాఁడు గావున ఉపకారి— అని చెప్పవలయును. అట్లు చెప్పుట చమత్కారముగను గాని నిక్కముగా మేఘుఁడు హంసల కుపకారి యనుట కాదు. మేఘబాధవలన హంసలకు గలుగు నిజనివాసస్థానభూత మానసగమనలాభము కీడువలనఁ గలిగినమేలు. ఉద్యోగమూడిన దొరగారికి గలుగు నిజదేశగమనలాభము వంటిది. అంతియకాని మేఘుని యనుగ్రహమునఁ గలిగిన మేలుకాదు. కావున వారికి పరస్పరము గాటంపుచెలికారము నడువుట కూడదు. శ్రీ శాస్త్రిలవారి పదప్రయోజనమునకు సమాధానము నెట్లో చెప్పికొందుముగాక.—

"హంసలు కావ్యలోకముననేకాని లోకమున లేవు; అంచ, ఊలముల కులుకదు; జలదమునకు జడియదు; హంసమేఘద్వేషము కవిసమయసిద్ధము కాదు; ఆరెంటికిని మైత్రినిగూడఁ జెప్పవచ్చును" అను మొదలగు నూతనసిద్ధాంతములతో రామదాసుగారు తొడఁగిన వాదమున కే మనవచ్చును?

(1) హంసలు లోకమున నున్న నేమి? లేకున్న నేమి? ఉన్నట్లు కవులు భావించిరి. కాళిదాసు మేఘుని

---

* వేంకటరాయ శాస్త్రిగారు వ్రాసినది తృప్తికరముగ లేదు. ... ఎదుట అనగా - 'మేఘుఁడు వెళ్లఁబోవుమార్గమందు ఉత్తర దిక్కునం' దని మల్లినాథుఁడు వ్రాయలేదు. ఎదుట అనేదానితో 'నీయొక్క' యని సమన్వయింప లేదు. శ్లోకతాత్పర్య మేమనఁగా:—మనయెదుటను గనుకనే ఏతత్ అనునది స్వరసతః కుదురును. ఏ యింద్రధనుః ఖండముచేత నీయొక్క శరీరము కృష్ణునియొక్క శరీరమువలెనే కాంతిని బొందఁగలదో అట్టి యింద్రధనుః ఖండము మనయెదుట బుట్టుచున్నది. గనుక వర్షాకాలము త్వరగావచ్చును. గనుక నీవు త్వరగా వెళ్లవలసియుంటువని తాత్పర్యము. (వ. చ. వేంకటాచార్యులుగారు, యుగంధర.)

§ 'సహాయాః' అనుస్థలమునందు 'సయాత్రాః' అని నిఘంటుప్రదర్శనపూర్వకముగా కల్పించి వ్యాఖ్యానముచేసిన మల్లినాథసూరి స్నేహాభాస వచ్చునేమో యని భయముతో విరోధమునే స్థాపించినాఁడు. (వ. చ. వేంకటాచార్యులుగారు, యుగంధర.)

చేతఁబోలె, నుజిదియొకకవి హంసచేత సందేశమునుగూడ బంపెను. అది లోకమున నున్నను లేకున్నను కవులు వర్ణించునెడల, వానికిని బకోటములకును నెయ్యము చెప్పిరా? అన్యము చెప్పిరా? అనుటయే మనకుఁ బ్రకృతము. అవి భాతులవంటివో, కోతులవంటివో పరిశీలించి నిర్ణయించుట కిదియేమి జంతుశాస్త్రమా?

(2) హంస, మేఘమునకు జడిసికాదు. పరుగెత్తుట—అనిచెప్పుట కెంతో శ్రమపడి రామదాసుగారు, విక్రమోర్వశీకేఁబోయి పురూరవుని పిల్చికొనివచ్చిరి. కాని పాప మాతఁ డున్మత్తుఁడు. కావుననే, జలదావృతము లయిన దిక్కులనుగని మానసమునకు బయలుదేఱలేదు హంసలనుచూచి—

"మానసోత్సుకము లయిన యీపక్షులు సరస్సునుండి ఎగిరిపోకమునుపే వీనివలన ప్రియావృత్తాంతమును తెలిసికొనవలయు" ననుచు...క. నాకొమ్మనిమ్మ హంసమ, కైకొంటె తదీయమైన కాంతగతంబుల్...అని యడిగెను. ఆతఁ డడుగుచుండఁగనే అదివరకే పోవ నుంకించుచున్న ఆహంస యెగిరిపోయినది. అప్పుడు పురూరవుఁడు—"ఇది, దొంగలను దండించువాఁడు రాజు అని భయముచేత ఎగిరిపోయినది"—అనెను.

ఆమాటను బంకించికొని యయ్యంగారు— పురూరవుఁడు. (హంస) *తనదండనకు భయపడిపోయెనే గాని మేఘగర్జకు బెదరిపోయె ననలేదు. కాన హంస మేఘగర్జకు జడియదని యుపన్యసించిరి. ఏమాత్రము కార్యజ్ఞానము కలవానికైనను పురూరవునిది ఉన్మత్తప్రలాపమని తెలియకపోదు. ఉన్మత్తప్రలాపములతో పుటలు పూరించుటయు నుపపత్తియగునా?

(3) "హంసమేఘ వైర మందందు ఆయాకవి యుత్ప్రేక్షితముకాని, ప్రకృతిసిద్ధమేనియు, దాటరాని కవిసమయ సిద్ధమేనియుకా"దనియు కాళిదాసునకు హంస మేఘద్వేషమున తాత్పర్యములే"దనియు, వారివాదము.

హంస మేఘ ద్వేషమున కాళిదాసునకుఁ దాత్పర్యమే లేనియెడల§ 'కతిపయదిన' కొలఁది దినములే యుండుట మేఘములవలని ఉపద్రవముచేతను—అనుశాస్త్రిల వారి వివరణ మెట్లు సంగతపడును? (హంసమునకు మేఘ ముపద్రవకారి'యని గురుపాదు లుపపాదింపఁగా 'హంస మేఘములకు వైరము ప్రకృతిలోనే లే' దని శిష్యపాదులు సిద్ధాంతముచేయఁ బెనఁగుట యెంత సరసముగా నున్నది? కాక ఉపద్రవము సేయుటయు మైత్రీలోక లక్షణమని యయ్యంగారి భావమా?

మేఘము హంసకు ఖేదమును, నెమలికి మోదమును గలిగించును. కావుననే కవులెల్లరును విరోధమును చెప్పుచో మరాళ మేఘములను, మైత్రిని చెప్పుచో మయూర మేఘములను జెప్పవలయునట్లు సమయము చేసికొన్నారు. 'ఇది కవిసమయమే యైనచో సాహిత్య దర్పణమున నేలలే"దని రామదాసుగారి సందేహము. కవి సమయములన్నియు, నెవ్వరును సంపూర్ణముగాఁ జెప్పలేదనియు, వానినన్నిటిని సాకల్యముగా నరయుటకు కావ్యజ్ఞతయే సాధనముకాని కతిపయాలంకృతి గ్రంథపరిశీలన మాత్రము చాలదనియు సమాధానము. సమయములు చెప్పుచోట కొన్ని గ్రంథములలో, కవిలోకసుప్రసిద్ధమగు కమలార్కమైత్రియే చెప్పఁబడ లేదే? తావన్మాత్రమున కమలార్కులకు విరోధమును కల్పించినను కల్పింపవచ్చునని వారు వాదింతురా?

ఏపుస్తకములో నీవిషయము లేదో—అద్దానింగూర్చి యెవరేని—ఎట్లని చెప్పవచ్చుననియా? వీరి వాదము. తక్కుగ్రంథముల నరయవలదా? సంప్రదాయమెఱుఁగవలదా? కవులెల్లరును వాడుటయే కవిసమయమన:—ఆకవులు చెప్పవలసినచోట నెల్లరును హంస

* పురూరవుఁ డన్నాఁడు గనుక—అతని ప్రియురాలి 'కాంతగతమును' హంస దొంగిలించినదియు నిక్కమందురు కాఁబో లయ్యంగారు?

§ 'కతిపయదినస్థాయిహంసాదశార్ణాః' - అనుస్థలమందును, బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిల వారు వ్రాసినట్లు వ్రాయుట నాకు దృప్తికరము గాలేదు. (న. చ. వేంకటాచార్యులుగారు, యుగంధర.)

మేఘములకు విరోధమునే చెప్పిరి. ఇంతయేల? హంస మేఘములకు మైత్రియుం జెప్పవచ్చు ననిరిగదా! మిత్రములుగా నారెంటి కలయిక చెప్పఁగూడునని ఒక్క పండితునిచేతనైన ననిపింపఁగలిగిరా?

హంస మేఘములకు విరోధము ప్రసిద్ధమని లోకి కాగ్రగణ్యుఁడగు కంకంటి పాపరాజకవిచేతఁ జెప్పించితిని. ప్రకృతితత్త్వవేత్తృతయందు రామరాజభూషణుని తలఁదన్నిన అయ్యలరాజు రామభద్రకవిచేతఁ జెప్పించితిని. కవితాప్రజ్ఞచే యతిని విటునిగను, విటుని యతిగను మార్పనేర్పుగల ప్రోఢయగు సంకుసాల నృసింహకవిచేఁ జెప్పించితిని. అభినవవాగనుశాసనునిచే, కూచిమంచి తిమ్మకవిచేఁ జెప్పించితిని. కవియు, పండితుఁడును, ప్రభుఁడును నగు శ్రీకృష్ణరాయలచేఁ జెప్పించితిని. కడకు జగత్త్రియ మెవ్వని యుచ్ఛిష్టమో, ఆకవి భట్టబాణుని ముఖమున నైతము చెప్పించితిని. ఆ మహామహుల వాక్యములనుగూడఁ జెవిఁబెట్టక హంసమేఘ మైత్రి నెలకొలుపఁ దలఁపువ నెంతో శ్రమపడిరి. కాని తుద కేమియయ్యెను?

(4) ఆషాఢము ఘర్మమనియు, కాదు కాదు, వర్షయనియు అవ్యవస్థితముగా నొకసిద్ధాంతమును జేసి, ఆషాఢమునఁ బొడము మేఘము తొలిమేఘమనియు నవజలధర మనియు, అది హంసల కుపకారియనియు—విమర్శకులనిరి.

వర్షాకాలము శ్రావణశుక్ల ప్రతిపత్తు అను స్టేషను నుండి బయలుదెడలి భాద్రపదబహుళామావాస్య అను స్టేషనులో ఠక్కున ఆగిపోవు రైలుబండి కాదు. కావుననే లోకజ్ఞులగు పెద్దలు ఆషాఢమును, ఆశ్వయుజమునుగూడ యథోచితము వర్షలోనే చేర్చిరి.

ఇంతకును, సందేశములోనిది మలిమేఘముకాదు; తొలిమేఘమే యగునుగాక. అయినంతమాత్రమున రామదాసుగారి కగునది యేమియును లేదు. తొలిమేఘ మయినను హంసకులమునకు భయావహమేకాని, ముదావహముకాదు. తిలకింపుఁడు.

పాండురంగ మాహాత్మ్యము

క. సలిలంపు వృద్ధజలధర
ములు పూనిన యూతకోల మొత్తముల క్రియన్
దొలువాన కాకు లెసఁగన్
కలహంస కులంబు లెల్లఁ గలఁగంబడఁగన్.

కరకలవర్షించునవి తొలిమేఘములే. (నవజలధరములు) అందులకును ప్రమాణము కావలయునందురా? ఇదిగో—ఆముక్తమాల్యదలో

గీ. కృతపయఃపాన నవమేఘ పృథుకములకు
రాలె నొయ్యన వడగండ్ల పాలపండ్లు
మఱిబలాకా ద్విజాళి సంప్రాప్తి గలిగెఁ
జెరుగఁ జెరుగంగ ధ్వనియు గంభీర మయ్యె. ఆ. 4.

నవమేఘపృథుకమునకే వెఱచి మరాళములు పఱచిన ట్లాకావ్యముననే:—

క. ఉఱుము విని యలకకై దివి
వెఱఁబఱచు మరాళపటలి విడిచినఁ బడున
క్కఱచిన బిసలవ విసరము
తెఱఁగున వడగండ్లు ధవళవీథిని రాలెన్. ఆ. 4.

మఱియొక యుదాహరణము:—

క. నిర్భరగతిఁగరకాసం
దర్భంబులు రాలె నంత ధరపై జలదా
విర్భావమగ్నహంసీ
గర్భస్రవసండపిండఖండము లనఁగన్.

— వికర్ణరసాయనము. ఆ. 6.

(కరకలనుకురియు) తొలిమేఘ మావిర్భవించినంతనే హంసలకు గర్భస్రావములుగూడ కాఁదగినంతటి భయము కలుగునని పయిపద్య ముద్ఘోషించుచున్నది. రామదాసుగారేమో, అంచలకుఁ దొలిజలద ముపకారి యని వాదించుచునే యున్నారు.

“నవజలధరః సన్నద్ధః” అని ‘నవ’ మని విశేషించి రూఢిచేసినాఁడు. తాను కవికులగురువుగదా— అని యయ్యంగారు—నవం—దెచ్చికొనిరి గాని—నవయును బాధించునదే చూడుఁడు.

ఉదపాదివ...నవ జలధరరవభయచకిత కలహంసకుల
కోలాహలకోమలో...భూవననివాదః.

—కాదంబ.

కలహంసకులమును జడిపించిన బాణుని మేఘము వలెనే కాళిదాసుని మేఘమును (కరకలను వర్షించు) నవజలధరమే. (తాఁ కుర్వీధాస్తుములకరకా వృష్టిపాతాన కీర్ణాః పూ. మే. ౬౪). కావున హంసలను బెదరింపక రేఁ విడచును?

ఇట్లు పెద్ద లెల్లరును తొలి మేఘము (నవజలధరము)-అంచల కపకారి యనుచుండఁగా రామదాసుగారు ఉపకారియని సిద్ధాంతింప కోరకొనుట కానిపనికదా!

ఆషాఢము వర్షలోఁ జేరుచో, నా మేఘము వర్షామేఘమును అగును. అగుచో నది యంచలను దప్పక బెదరించియే తీరునుగదా!

(౫) హంసమేఘ వైరనిర్ణాయకములుగా మదుదాహృతములగు పద్యములలో నొకటియగు.

క. నిర్భరగతిఁ గరకాసం
 దర్భంబులు రాలినంత ధరపై జలదా
 విర్భావమగ్నహంసీ
 గర్భస్రవనండపిండఖండము లనఁగన్.

అనుపద్యములోని_అనఁగన్_అను ఉత్ప్రేక్షా వాచకము హంసమేఘ విరోధము లేమిని తెలుపుచున్నదని విమర్శకులు మఱికొంత ప్రసంగముఁగావించిరి.

ఆపద్యములోని ఉత్ప్రేక్షావాచకము కరకలు, అండపిండ ఖండములు కావని తెల్పునేకాని మేఘహంస, తద్విరోధాదికము లబద్ధములని తెలుపనే తెలుపదు. ఇది అలంకార తత్త్వజ్ఞులకు విప్పి చెప్ప నక్కఱ లేదు. తక్కిన పద్యములలోని ఉత్ప్రేక్షావాచకములను గూడ నిట్లే అన్వయించు కొందురేని విమర్శకులు-ఉదాహృత పద్యములు హంస మేఘముల విరోధము లేమిని తెలుపుచున్నవనిగాని-ఆ రెంటికిని వైరమేకాంతముగా సిద్ధింపదనిగాని యనరు. మఱి ఉత్ప్రేక్షావాచకములు లేని

"పరమహంసలఁబాఱఁదఱుమని ఘనుఁడు"

"అరిహంసనంపద భాగమంబు"

"అపూర్వ నిర్వహితృహంసఘనాఘన"

మున్నగు వాక్యముల కేమి యర్థము? హంసలు లేవనియా? మేఘములు లేవనియా? ఆ రెంటికిని విరోధము లేదనియా?

(౬) ఆదికవి వాల్మీకి, ఊరక "సంప్రస్థితా మానసవాసలుబ్ధాః" అనిమాత్రమే చెప్పెను. గాని... మేఘభయమును జెప్పఁడాయెను. కనుక గాయంచలకును, మేఘునకును వైరము లేదు—అని రామదాసుగారిది మఱియొక యుక్తి.

ఆదికవి అంతమాత్రమైనను, అనెనుగాని మఱియెందఱో కవులు, ప్రావృడ్వర్ణనమున, హంసలమానసగమనము నే చెప్పిరి. ఇంక యెందులకు, వర్షర్తులక్షణనిర్ణయమును గావించుచోఁ గావ్యాలంకారచూడామణి కర్త.

క. తటిదటన మేఘపటలీ
 ఘటితాంబర శక్రచాప కరకావ్రాత
 స్ఫుట ధారాసారాది వి
 కటత నుతింపంగవలయు ఘనకాలమునన్.

అని చెప్పెనేకాని హంసలసంగతి చెప్పకపోయెను. కాబట్టి వర్షర్తువున హంసలు మానసమునకుఁ బోవుట అబద్ధమనవచ్చునా? హంసమానసగమనమును వర్ణించుట ఆయాకవుల పొరపాటందురా? అట్లనుట సరికాదు. వాల్మీకిగాని, మఱియొక కవిగాని హంసమేఘవిరోధమును దనకావ్యమునఁ జెప్పిరేతీఱవలయునని ప్రభుశాసనము లేదు. చెప్పినఁ జెప్పవచ్చును; చెప్పకపోయినను, బోవచ్చును. అందువలనఁ బ్రత్యవాయము పుట్టదు. కాని, చెప్పుచో హంసమేఘములకు వైరము నే చెప్పవలయును గాని మైత్రిని జెప్పఁగూడదనిమాత్రము కవిసమయము, కావుననే గదా! కవులెల్లరును, ప్రసక్తమైనచోట, నేకగ్రీవముగా తద్విరోధము నే చెప్పుట. మైత్రిం జెప్పకపోవుట. జలధరసమయే మానసం యాంతిహంసాః—అని కనిపట్టి రామదాసుగారు శాస్త్రము నుదాహరించినారు. కాని, ఆ యంచలపోకకు కారణముగా కవు లేసమయమును నిబంధించికొనిరో వారరసిరా? కాక హంస లట్లుపోయి

నష్టే గ్రంథమునం జెప్పంబడినను—అవి పురూరవుని దండ నకు భయపడిపోయినట్లే వారు తెలుపుచుండిరా? పురూరవుండు లేని గ్రంథములలో హంసాపగమప్రస్తావమే యుండదాయేమి? చూడుండు, ఎంచ కొంద రీహంసమేఘ వైరమును ఎట్లెట్లు విస్పష్టము కావించిరో!

—మృచ్ఛకటిక.

శ్లో. *ఆలోకితం గృహశిఖండిభి రుత్కలాపై
ర్హంసైర్యియాసుభి రపాకృత మున్మనస్కైః;
ఆకాలికం సపది దుర్దిన మంతరిక్ష
ముత్కంఠితస్య హృదయంచ సమం రుణద్ధి.

అపాకృతమున్మనస్కైః=అనుచో రామదాసుగా లేమిగా నర్థముచేసికొందురో?

శ్లో. *ఏత ద్దధ్యతరాష్ట్రవక్త్రసదృశం
మేఘాంధకారంనభో
హృష్టో గర్జతి చాతిదర్పితబలో
దుర్యోధనోవాశిఖీ;
అక్షద్యూతజితో యుధిష్ఠిర ఇవా౽
ధ్వానంగతః కోకిలో
హంసాస్సంప్రతిపాండవా ఇవవనా
దజ్ఞాతచర్యాం గతాః.

పాండవులవలె హంసలకు నజ్ఞాతచర్య ఘటిల్లినది; మేఘాంధకారమున. అజ్ఞాతవాసమును హంసలకుం గల్గిన యభ్యుదయమే యందురేమో విమర్శకులు?

శ్లో. ఏహ్యేహీతి శిఖండినాంపటుతరం
కేకాభిరాక్రందితః
ప్రోడ్డీయేవ బలాకయా సరభసం
సోత్కంఠ మాలింగితః;
హంసై రుజ్ఝితపంకజై రతితరాం
సోద్వేగముద్వీక్షితః
కుర్వ న్నంజనమేచకా ఇవదిశో
మేఘస్స ముత్తిష్ఠతి.

ఇందు హంస సోద్వేగముగా వీక్షించుట జలజాగమనమున కడలిరో? అలరిరో?

పోనిందు ఇవి కాళిదాసకవికిం బూర్వుఁడైన శూద్రకుని పలుకులు. ఈవలివా రేమనిరో చూతము.

"శ్లో. రామాకర్ష ణభగ్న కార్ముకభువా
ధ్వానేనరోదోభృతా;
దృప్తక్షత్రియకల్పితచ్ఛదకులే
జీమూతనాదాయితమ్"—రామాయణచంపువు.

(వ్యాఖ్యా:—దృప్తాః మదోద్రిక్తాః యేక్షత్రాః క్షత్రియాః... తేషాంయశ ఏవ సితచ్ఛదకులం హంస శ్రేణీతిరూపకం, తస్మిన్ విషయే జీమూతనాదేవ, జలధరగర్జితేనేవాచరితం జీమూతనాదాయితం తస్యతన్ని వారకత్వాదితిభావః) అని జీమూతనాదమునకు, సితచ్ఛదకుల మడలు ననెను మహాకవిభోజుఁడు.

శ్లో. "దయితోపి రతత్రతః పృథివ్యా
మయిజీమూత! జనస్యతేవనేన;
విమయాదపి గన్త్రతః కిమేతా
ధ్వనిభిర్భీమయ సింహరాజహంసాన్."

అని మఱియొక మహాకవి. ఈయుమునకు హంస భయపడుటను మిగుల చమత్కరించి చెప్పినాఁడు.

శ్లో. తతోఘనా విర్భవనా ద్భియేవ
శీతామలం మానస మప్యభీక్ష్ణే;
కర్ణాంతరక్రొందపక్షేనశోభా
యశోమరాళోయదుకన్యకాయాః—భారత చంపువు.

(వ్యాఖ్యా!—...ఘనానాం మేఘానాంతత్కాలస్యవా ఆవిర్భవనాత్ ఉదయాత్ భియా భయేన.) దుంతర లంకత్కీర్తియను, ననంతకవికుంజరుఁడును, మేఘావిర్భావము హంసకు భయావహ మనెను.

శ్లో. *పృథ్వీతాపం సపది శమయ న్దేవకీ దక్షిణస్యాః
ప్రాదుర్భూత స్సపది మురజి న్నీలమేఘో నిశీథే;
హర్షోత్కర్షం విబుధ శిఖినాం వర్ధయ న్నాసురశ్రీ
హంసశ్రేణ్యాః కిలకలయితుం దూరదేశప్రవాసమ్.

—భాగవత చంపువు.

అసురులను హంసలకు శ్రీకృష్ణుఁడను మేఘమువలన దూరదేశప్రవాసము చెప్పఁబడెను. అది విరోధమువల

నకో మైత్రివలననో రామదాసుగారే నిర్ణయించుకొనవలయును.

ఉ. శోకకుభ్రపదం బవలభిస మనేకపక్షణీకాసరా
నీక శరీరతాపహ మనీరతటాక, నదీ, నదాది, నీ
రాకరహర్ష కారణ మహాఃపతిదీప్తి నిరోధిః కంధరా
లోకసమాప్తషోభితశిఖిలోకమురాళముసోనఁడోఁ దివక.
హంసవింశతి—ఆ. 5.

శా. సర్వద్వీపనదీ ప్రపూరిత పయస్సంబంధ ధారాధరా
ఖర్వధ్వాన భగ్నోత్పత్తిష్ణు బిస భృంగాళి... ఆ. 4.

ధారాధరధ్వానము హంసలను భయపెట్టి ఉత్పతిష్ణువులను జేయుటయు మైత్రివలన నేనా?

నక్షత్రచిహ్నితములగు పై యుదాహరణములవలననైనను, మయూర మేఘములకు మైత్రి యెట్లు కవిసమయమో మరాళ మేఘములకు వైరమును, అట్లే కవిసమయమని రామదాసుగారు తెలిసికొందురుగాక. ఇంకను ప్రయోగములు వలయునా? ఇదిగో—,

క. ఆరాజధాని కధిపతి
రైయ రాజిలు వసున్నృపాలుఁ డతఁ డసి ధారా
ధారాధర ధారాజల
భారాహత రాజహంస పద్మోదయుఁడై.
వసుచరిత్ర—ఆ. 1.

ధారాధరధారాజలపాతము పద్మము నెట్లు చిందరవందర చేసి బాధించునో అట్లే హంసమునుగూడ బాధించునని పద్యము చెప్పుచున్నదిగదా.

క. నిరతంబు రాజహంసల
బరువెత్తఁగఁ జేయు నౌర పటుచటులభవ
త్కరకరవాల కరాళ
స్ఫురితాంభోదము నృసింహభూపాలమణీ!
—కావ్యాలంకారసంగ్రహము.

పైపద్యము ప్రతాపరుద్రీయమున శ్లిష్టకేవల పరంపరితాలంకారోదాహరణమునకై రచింపఁబడిన

"ప్రతాపరుద్రదేవస్య మండలాగ్రవిధుంతుదః;
అఖండవిక్రమోద్దామా గ్రసతేరాజమండలమ్."

అను శ్లోకమున కనువాదము. శ్లోకమున విధుంతుడు రాజమండలములు చెప్పఁబడఁగా, పద్యమున నంభోదరాజహంసలు చెప్పఁబడెను. విధువిధుంతుదుల కెట్టిమైత్రియో, హంసమేఘములకు నట్టిమైత్రియే యనుట. నీయాలంకారిక రచనమును గనినైన ఆరామదాసుగారు తెలిసికొందురుగాక.

సీ. మదఘూర్ణదురుసంకుమదమలీమసకుచ
ద్వీపమహోద్ధతిఁ గొనుఁ దీగ నలియ
ఘనసార పుండ్రక గ్లానిం బనికటను
ర్మహిమా ప్తిమోముదామర చలింప
నాసికానూత్న గంధఫలియూరుపుఁదావి
నధరదంతపనమత్తాళి విరియఁ
గింకిణీక్వాణ నకింకిలగర్జితప్రసప్త
కాంచీఁచలగతి యంచ జడియ.
* * * *
—పాండురంగమాహాత్మ్యము.

తీగకు ద్వీపమును, తామరకు సోముఁడును, మత్తాళికి గంధఫలియు, నెట్టి మిత్రములో, అంచకు, నభ్రమును, అట్టిమిత్రమే—అని యీపద్యము తెలుపుటలేదా?

క. "సురుశేరములు సితపక్ష
స్ఫురణంబున నంచపిండు పోలుపు వహించెఁ
నరుబాణతతి ఘనావలి
కరణి మిగుల నొప్పె నల్ల గఱుల చెలువునఁ."
—విరాటపర్వము. ఆ. 5.

అని సమయజ్ఞుఁ డగు తిక్కన మహాకవి సురుశేరములను అంచపిండుగను, నరుశేరములను అభ్రమండలిగను వర్ణించుటలోఁ గల చమత్కారమును, ఆకళింపుచేసికొందురేని, అయ్యంగారు హంసమేఘవైరము కవిసమయము కాదను తమవాదమును మానుకొందురని నానమ్మకము.

శ్లో. లక్ష్మీవిద్యుల్లలితవపుషం తత్ర కారుణ్యపూర్ణం
మాశైషీస్త్వం మరకతశిలా మేచకం వీక్ష్య మేఘమ్;
శుద్ధైర్నిత్యం పరిచితపద స్త్వాదృశైర్దేవహంసై
ర్హంసీభూత స్సఖలుభవతా మన్వవాయాగ్రజన్మా.
—హంససందేశము.

స్వమతగురువులును, మహాపండితులును నగు వేదాంత దేశికుల వాక్యము నేని అయ్యంగారు ప్రమాణముగాఁ గొనరా?

శ్లో. చిత్రంచిత్రం జృంభతే కృష్ణమేఘే
కం సంప్రాప్తా ప్రాపలోపం సమృద్ధిః,
ఆసేదుస్త్యక్తం హానిదాఘ ప్రశాంతిః
హంసో హింసాం మానసే కీర్తిరుగ్ధా.
　　　　　　　　　　　　——విశ్వగుణాదర్శము.

వ్యాఖ్యా:—హంసః పక్షీ; అసురశ్చ. హింసాం మానసే ప్రాప్తవా నితియత్. వార్షికాపసరస్య హంస హింసాకరణత్వం ప్రసిద్ధం.

"మేఘము హంసను హింసించుననది" యని, శ్లేష యమక చక్రవర్తి మహాకవి వేంకటాధ్వరి తెల్పెనుగదా! ఇంతకన్నను బలవత్తరసాక్ష్యమేమి కావలయును?
మఱియు—

1. తొలకరిఁ గలఁగు నువ్వ
2. వానజాలిపులుఁగు
3. తొలకరిపులుఁగు. —(లక్ష్మీనారాయణీయము.)

ఇట్లు నిఘంటువులయందే హంస వర్షపు జంకుపక్షి యని నిర్వచనము కనుపట్టుచుండఁగా—అంచ వర్ష (మేఘ ముల)కు కలఁగుననుటయు మిణుమిణుకు వర్షా (మేఘ) హంసములకు విరోధమునుచెప్పుట, ఐచ్ఛికముగాని, అవశ్యకము కాదనుటయు తెలుఁగమిగాక యేమగును?

గ్రంథవిస్తరభీతిచే మావలనివచ్చెఁగాక హంస మేఘవిరోధమును దెల్పు నుదాహరణములు పరశ్శతములు.

రామదాసుగారూ! ఆంధ్రకవులేకాక సంస్కృత కవులును గద్యకవులేకాక పద్యకవులును, కవులేకాక ఆలంకారికులును, కవులు నాలంకారికులే కాక, వ్యాఖ్యాతలును, నిఘంటుకర్తలును, అర్థవాదులేకాక సనాతనులును, అల్పులేకాక అధికులును, వారువీరననేల యెల్లవారును హంసమేఘములకు విరోధము నిర్విరోధముగా నిరూఢము గావించుచుండఁగా, తారెట్లు—మేఘహంస ద్వేషము ప్రకృతిసిద్ధము కాదంటిరి? ఎట్లు కవిసమయము కాదంటిరి? హంసలు మానసమున కేకారణమునఁ బోయినను, మేఘభయమువలననే పోయినట్లు వర్ణించుటే కవిసమయమనియు, హంసమేఘములకు విరోధమునే కాని సెయ్యము నడుపఁగూడదనియు నిన్ని ప్రమాణముల వలన నేర్పడుచుండఁగా—వానికి నెయ్యముంగూడఁ జెప్ప వచ్చుననుట తమసమాధి యెంతవికలముగా నున్నది! ఇంద్రధనువునుబోలె హంసమేఘవిరోధమునుగూడ తల్లక్రిందు చేయనెంచితిరా యేమి!

III. ప్రక్షిప్తములు

"తత్సందేశం జలధరవరో దివ్యవాచా చచక్షే"
"శ్రుత్వావార్తాం జలదకథితాం తాంధనేశోఽపిసద్యః"

అనుశ్లోకములు రెండును కథాసౌందర్యమును చెఱచు ప్రక్షిప్తములని నేనంటిని. రామదాసుగారును సమ్మతించిరి. కాని "అవి ప్రక్షిప్తములని పెద్దలు చిరకాలముగా చెప్పుచునే యున్నా"రనియు, శ్రీశాస్త్రిలవారు తమ యుపోద్ఘాతమున 'ధారాసిక్త, తత్సందేశ, శ్రుత్వా వార్తామ్' అనుశ్లోకములు ప్రక్షిప్తములని యుదాహరించి నారనియు నొకకొంత అసత్యమును లిఖించిరి.

శాస్త్రిలవారు,ఉపోద్ఘాతమున ధారాసిక్త *ఇత్యాఖ్యాతే,శ్రుత్వావార్తామ్,అనుశ్లోకములనుగూర్చి వ్రాసిరి గాని, 'తత్సందేశ'మునుగూర్చి వ్రాయలేదు. కాని గురుభక్తిఁ బూపుటతో యన రామదాసుగారు,ఆమాటలో 'ఇత్యాఖ్యాతే' తొలఁగించి, 'తత్సందేశ'మును జొనిపి, ఆపాపమును, శాస్త్రిలవారికే అంటగట్టిరి.

ప్రతిభాధికులగు శ్రీ శాస్త్రిలవారు, కథావిరుద్ధ శ్లోకప్రక్షిప్తతను గురుతింపజాలనివారన నెవఁడు సాహసించును? కాని ఆరెండు శ్లోకములను పూర్వకథావిరుద్ధములని వారు తమ వ్యాఖ్యానమునఁ దెలుపలేదని మాత్రము నేనంటిని.

* శ్రీశాస్త్రిలవారు నంబరు 39 వేయఁబోయి 56 వేసిరో! లేక 'తత్సందేశం' అని వాయుటకుబదులు, 'ఇత్యాఖ్యాతే' వ్రాసిరో?

దానికి రామదాసుగారు, "వ్యాఖ్యలో కథావిరుద్ధములని తెలుపకున్న నేమి? వానికి ప్రాముఖ్యమునిచ్చి, మూలకథతోఁ జేర్చి, పదప్రయోజనాదిసారస్యవివరణమును వ్రాసిన నేమి? శ్రీశాస్త్రిలవారు శిష్యులకు మాకు, ఇవి ప్రక్షిప్తములని, ముప్పదియేండ్లనుండి సోపపత్తికముగా నేర్పినారు"అని యొక నిస్సారపు వ్రాఁత వ్రాసిరి. అట్టివ్రాఁతయుఁ, ఆక్షేపమున కొక సమాధానమని విమర్శకులకు రామదాసుగారు తలఁచుట మిగుల నచ్చెరువుగదా!

"ముప్పదియేండ్లకుమునుపే అవి కథావిరుద్ధప్రక్షిప్తములని శాస్త్రిలవారెఱిఁగియుండియు, ఇరువదియైదేండ్ల క్రిందట ప్రతిపదార్థతాత్పర్యపదప్రయోజనాదులతో మిగుల విపులముగా రచించిన తమవ్యాఖ్యానమున ఆవిషయ మిందుకయుఁ దెలుపక గ్రంథమును ముద్రించిరనుట-రామదాసుగారు శాస్త్రిలవారి జాగరూకతను, వ్యాఖ్యానవైఖరిని కొంచెపఱచుట కాదా?

ఆరామదాసుగారు, "ఆశ్లోకములు ప్రక్షిప్తములని ఈ ప్రభవనామసంవత్సరమున సిద్ధాంతముచేయుట పిష్టపేషణము కాబోలునని యేమో నమస్కరింపఁ బోయిరిగాని అది యర్థములేనిమాట. ఏమయినను రసలుబ్ధులగు శ్రీమదయ్యంగారికి "సర్వనం గుణవర్ధనమ్" అను విశ్వాసము కలిగియుండుట శ్రేయమే.

"మతే ప్రక్షిప్తములైనను కవపసౌభాగ్యము కలిగె వ్యాఖ్యయుఁ గలిగియున్న విడువ నిష్ప్రయోజనమకుండును. ముద్రింపఁబడును. అందులకేమి"—అని రామదాసుగారందురుగాని, "కవితాశిల్పము నెఱిఁగినవారట్లన"రని ప్రాజ్ఞు లందురు. కథాస్వరూపమును చెఱుపని, ధారాసిక్తాది ప్రక్షిప్తముల కొన్నిటికైనను కావ్యమున చోటు దొరకునుగాని, కథాబాధకమగు నొక్కపదమునకైనను, మెలకువగల కవికావ్యమున చోటు దొరకదు. కథాబాధకములగు (పద్యములుగాదు) పదము లెట్లో కథాగర్భమున జొచ్చినను, ప్రమాదవశమున గర్భమున జొచ్చు నుక్షికలవలె నెప్పటికేని వెలువడవలసినవేకాని ఇముడునవి గావు.

గ్రంథమును పుస్తకలము గావించిన శాస్త్రిలవారిమాట నే నుదాహరించిన తెఱంగున అసత్యము కలదనియు, అది శ్లోకములంగూర్చి...వ్రాసినమాట కాదనియు, వ్యాఖ్యానములం గూర్చినమాట యనియుఁ విమర్శకులొక కొన్నిపంక్తులు వ్రాసిరి.

శాస్త్రిలవారి వాక్యము బొంబాయి ముద్రణములో లేనివ్యాఖ్యానమును, తన్మూలశ్లోకమును, తమ ప్రతిలో చేర్చుట కన్వయింపదా? అన్వయింపకపోవుఁ గాక, ఆశ్లోకమును చేర్చుట పుస్తకలతకుఁ గాదందురా? కాకున్న మఱియెందులకు? "పూర్ణశ్లోకములకును ఒక ప్రతిలో లేనివ్యాఖ్యను ప్రార్థముగానే వేఱొకదానినుండి గ్రహించుట ముద్రణమును పుస్తకలము గావించుటయే"—అని రామదాసుగారే లిఖించిరే! అటులయిన నే నుదాహరించిన తెఱంగున అసత్యమెందున్నదని నే నడుగవలదా?

అతివిస్తరమెందులకు? ఇంద్రధనూరాజహంసప్రక్షిప్తములనుగూర్చి యింతయే నాకు ప్రష్టవ్యము. నా యీ యుపన్యాసము నుపసంహరింపక మును నే వ్యాసరచనమున నాయుద్దేశమును విజ్ఞులకు విన్నవింపందలంతు.

మల్లినాథపాదులు, వేంకటరాయపాదులు మున్నగువారు మహాపండితులు; అలోకసామాన్య ప్రతిభానిధులు. వారు కావించినవి ఘనకార్యములు. అట్టి మహాకార్యములందు, రసాలఫలమున నాడీలేశములపగిది ప్రమాదము లుండును. భ్రమప్రమాదములు మానవ సహజములు. అందును ప్రమాదము పండితులకు పదలించుకొనరాని చుట్టము. కావుననే "ప్రమాదో ధీమతామపి"—అనుచో అపిధ ఏవకారార్థః. (పండితులకే పొరపాటు) అని లోకజ్ఞులగు విద్వాంసులు చమత్కరించియు నున్నారు. పెద్దలు గావరించిన పనులలో సంబియములు గాడమి పిన్నలడుగుదురేని వానికనువనుసంతవరకు సమాధానము చెప్పవలసిన బాధ్యత పెద్దలయం దున్నది. గురువులు కావించు పొరపాటులను సమర్థించు శిష్యులమనీషాబలమును కొనియాడఁ దగినదే; కాని దాసపాలులవలె, నసత్యములు లిఖించియు, నపార్థములు కల్పించియు, సమర్థింపఁ దెనఁగులాడి తుద కా గోరంతపొరపాటును కొండంతచేసి

లోకమున వెల్లడించుటమాత్రము తగనిపని. ఆసారపాటు లెట్లో సవరింపఁబడకున్నమాత్రమున లోకపూజ్యులగు నా ప్రసిద్ధపండితుల యశశ్చంద్రికలు తఱఁగిపోవునా? ఆజగన్మాన్యుల పవిత్రనామములు, సారస్వతభవ్యభవన భిత్తికలయం దింతకుమున్నే రత్నములతో చెక్కఁబడి యున్నవి.

శ్రీశాస్త్రిలవారు 'ఇప్పుడు కళాప్రపూర్ణ'లని రామదాసుగా రందురుగాని వా రింతకుమున్నే కళాప్రపూర్ణులు. గ్రంథములలో నిగూఢములయియున్న పరమార్థములను, ప్రతిభాంజనసాహాయ్యమున, చక్కఁగా గుర్తించి, గ్రహించి, వెలువరించి, పాఠకలోకమున కందించి పతికృజనకృతజ్ఞతాపాత్రులయిన మహామహులు. వేయేల? సంస్కృతగ్రంథములకు మల్లినాథులు వోలె, ఆంధ్రగ్రంథములపాలికి శాస్త్రిలవారు పుట్టువంది రన్నను అతిశయోక్తి కాను.

ఇఁక మేఘసందేశ కావ్యమో; 'మాఘే మేఘే గతం వయః' అని సంస్కృతవ్యాఖ్యాతృ చక్రవర్తిచేఁ గొనియాడఁబడిన మహాకావ్యము.

కావ్యకర్తయో, కవికులగురు మెలఁకువతో, పద ప్రయోగౌచిత్య మించుకయు చెడకయుండ కావ్యసృష్టి కావించు కవికులమునకు గురుఁడు.

అంతటి కవికులగురువు రచించిన మహాకావ్యమున, అట్టి అపరమల్లినాథులచే వ్యాఖ్యాతమైన యుత్తమ కావ్యమున, ప్రకృతివిరుద్ధములగు వర్ణనలకును, కథావిరుద్ధములగు ప్రక్షిప్తములకును చోటేల కలుగవలయును? వాని సౌందర్య మేల చెడవలయును? తన్మూలమున పాఠకులకు సందేహము లేల పొడమవలయును?

> ప్రకృతివిరుద్ధవర్ణనలు చక్కఁబడుఁ బడుఁగాక
> ప్రక్షిప్తములు తొలఁగింపఁ బడుఁగాక
> కథాసౌందర్యము చెడకయుండుఁగాక
> పాఠకులకు సందేహములు పొడమకుండుఁగాక.

అన్న తలఁపున నావ్యాసమును వెల్లడించితినిగాని, నా యీ విమర్శమువలన శ్రీశాస్త్రిలవారి యశోధనమునఁ బాలుగొందమన్న తలఁపునఁగాదు. కావున శ్రీశాస్త్రిలవారు నామనవి చిత్తగింతురుగాక. తప్పులుండినయెడల నాయెడఁ గూర్మి నింతురుగాక.

"వగచి శరణంటి నీపాదయుగళమంటి"

కోట వెంకటరామయ్యగారు

౧

తెలియకయు కొన్ని, కొన్నింటి దెలిసి, పెక్కు-తెలిసి తెలియక, యఘముల సలిపినాఁడ,
కరుణఁ దిలకించి మన్నించి కావు మనఘ!-వగచి శరణంటి నీ పాదయుగళమంటి.

౨

ఆత్మజుం డెట్టిఁడైనను సానురాగ-హృదయుఁడై కాంచు జనకుని రీతిఁగనుము,
కావె జనకుఁడ వీవు లోకమున కరయ!-వగచి శరణంటి నీ పాదయుగళమంటి.

౩

తజ్ఞ నరయు టదెంత? యల్పజ్ఞ నన్ను-దరికిఁ జేర్చిన సత్కీర్తి పొరయుదీవు;
పాలనము సేయరాదె కృపాలవాల?-వగచి శరణంటి నీ పాదయుగళమంటి.

కాళిదాసకవి కార్తికేయభక్తుఁడా?

బులుసు వేంకటరమణయ్య గారు

కాళిదాసమహాకవి కాళికాభక్తుఁడైనను, కార్తికేయభక్తుఁడైనను— అతని యిలువేల్పునుగుఱించి, విమర్శింపఁబూనుట యనుచితము. విమర్శకునిచర్చ రేవిధమునకైనను, లోకోపయోగకరమై యుండవలెను. కాని, రేదో యొకటి చర్చింపఁబూనుట టనవసరము. కవియొక్క యిష్టదైవతమును గూర్చిన విమర్శనము, లోకోపకారమనుట యసంగతము. మఱియుఁ బుక్కిటి పురాణములవలనఁ గానిండు, పుణ్యాహములవలనఁ గానిండు— పురాతనమై ప్రబలి వాడఁబడు వాడుకను—ద్వేషించి క్రొత్తసృష్టి చేయుట యనవసరము. కాళిదాసమహాకవి కార్తికేయభక్తుఁడే యని, కొందఱు నిర్ధారణచేసిన పిదప, యాదరకుండు టంగీకార మగుననియు, నందువలనఁ బ్రాచీనుల వాడుకకు భంగము కలుగవచ్చుననియు, నెంచి యీ వ్యాసమును వ్రాయఁ గడంగితిని.

లోకము నందలి పరంపరాగతములగు కథలు కేవలము కల్పితములని నిరాకరింపఁ దగదనియుఁ, గాళి కాలయమున శయనించిన మన కవీంద్రుని నోటిలో గాళీమహాదేవి పీరసము నించుట నతని కీలలితకవిత యలవడెనని "స్తన్యైన కల్పి త్యక్తనయాం బభూవతాంబూల సారేణ పరోజనన్యా" అని నీలకంఠకవి గ్రంథస్థముకూడఁ గావించియున్నాఁడనియు శాస్త్రిగారే యంగీకరించిరి గదా! మఱి యిప్పుడుఁ గుదుర లేదు? కాళికాదాసుఁడైనచోఁ గాళిదాసుఁడై యుండవలెనఁట! కాళిదాసుఁడన సరిపడదఁట!

"జ్యాపోస్సంజ్ఞాచ్ఛందసోర్బహుళమ్" అను పాణినీయానుశాసనము సామాన్యవిషయము గాక యుండుటఁ గనుక్వాచిత్క ప్రయోగములకు సాధుత్వము గల్గించుటకుఁ బుట్టినదనుట సాహసైకమూలము; నిరాధారము. ఈ యనుశాసనము క్వాచిత్కవిషయమని యంగీకరించినచో "బహుళ—వా—అన్యతరస్యామ్—" అను మొదలగు వికల్పార్థక పదములుఁగల సూత్రములును, శాకల్య, శాకటాయన, గార్గ్యాచార్య, స్ఫోటాయన భారద్వాజాదిముని నామములుగల సూత్రములును, తదితరములగు (వ్యాఖ్యానములలోఁ గ్వాచిత్కములని నిరూపింపఁబడిన) కొన్ని సూత్రములును గ్వాచిత్కము లగుటయు, నందువలన వ్యాకరణము సంకుచితమగుటయు సంభవించును.

పై యనుశాసనము క్వాచిత్కమని శాస్త్రిగారు సులభముగ ననిరేకాని కవి కార్తికేయభక్తుఁడని యాతని పేరున నిముడ్చుట కెంతటి యాయాసముపాలైరో చూడుడు.

"కాళస్య—శివ స్యాపత్యం పుమాన్ కాళీ—కార్తికేయః తస్య దాసః — కాళిదాసః" అని విగ్రహమఁట! తొలుతఁ బ్రసిద్ధములగు నిఘంటువులఁ బట్టిగాని, కావ్యములఁబట్టిగాని యాలోచించినచోఁ బూర్వముగ నొక శబ్దము లేకుండిన కాళశబ్దము శివవాచక మగుట సాధారణ్యముగఁ బొసఁగ నేరదు. చూడుఁడు — మహాకాలః, కాలకంఠః, మొ॥ మఱియుఁ గాలశబ్దమునకు సామాన్య యైవపరముగ నగ్రము ప్రసిద్ధము. అట్టి సందిగ్ధార్థమగు పదమును దీసికొని 'తస్యాపత్యం పుమాన్ కాళీ' యనియర్థము చెప్పుట మఱియు వింతగ నున్నది. కాళీయనునది యీకారాంతమగు,— స్త్రీవాచక మగు కాళికాదేవియందుఁ బ్రసిద్ధమైన రీతిగ, నకారాంత పుల్లింగమునఁ గుమారార్థమునఁ బ్రసిద్ధమై యుండలేదు. ఏ నిఘంటువులోఁ గూడఁ జెప్పఁబడలేదు. (కాళీయనిన శీఘ్రముగ — శీఘ్రముగ నేమి? ఏయర్థము స్ఫురించునో చదువరులే యూహింతురుగాక!) ప్రకృతి యగు కాళ పదమే సందిగ్ధమగునపుడు కాళీపదమును గూర్చి వేఱుగఁ జెప్ప నక్కఱయే లేదు. కాళీశబ్దమునకు సమాసమున నకారలోపమును జేసికొనిన (ద్రావిడ ప్రాణాయామమురీతి) గుదురునేమో? ఇందు (కాళిదాస పదమున) శాస్త్రిగా రెంతటి శ్రమకుఁ బాలైరో యాలోచింపుఁడు, "జ్యాపోస్సంజ్ఞాఛందసోర్బహుళమ్" అను

దానిచే హ్రస్వము చేసినంత మాత్రమునఁ గుదురు నీపదమునకు విపరీతార్థమును గల్పింపఁదలఁచిన నింతటి కష్టము గలిగినది. వారిరూప సాధనమున నేమైన లాఘవముండినఁ గదా యద్దాని నంగీకరించుట. తల్లిదండ్రు లుంచిన నామము వేఱైయుండిన నుండవచ్చును. కాళిదాసుఁ డనుటచేఁ బిదపఁ గాళిదాసుఁడు కావచ్చును. ఇందు దోష మేమున్నది?

కాళిదాస మహాకవికి వాల్మీకియెడ దృఢతరభక్తి గౌరవములు గలవనుట నిర్వివాదాంశము; కాననే మహాకవి మహర్షి రామాయణ బాలకాండమున వ్రాసిన రీతినున్న కుమారసంభవకథనే తీసికొని పురాణాంతర సాపేక్ష లేకయే కుమారసంభవమును రచించెను.

కాళిదాసు తొలుదొల్త కుమారసంభవమును రచించెనని చెప్పి శాస్త్రిగారు కవికిఁగల కార్తికేయ భక్తిని సమర్థింపఁ దలఁచిరి గాని కుమారసంభవము తొలుదొల్త రచింపఁబడెననుట కాధారము లేదు. ఒకయెడ "అస్తికశ్చిద్వాగ్విశేషః" అను సాంప్రదాయానుకూలముగఁ గుమారసంభవమే కవియొక్క తొల్లిటి కృతియని శాస్త్రిగా రనుకొనినను — దానింబట్టి కవి యిష్టదైవము కాళీదేవి యనెడి కథనుగూడ విశ్వసింపవలసి వచ్చును. మహాకవికి వాల్మీకియెడఁగల భక్తిచేఁ దద్రచిత రామాయణానుసారముగ రఘువంశరాజుల వర్ణనచే విలసిల్లు రఘువంశమునే తొలుతరచించెను.

రఘువంశమునే తొలుదొల్త రచించెననుటకు మఱియొక యుక్తికలదు. కవి తారచించుఁ దొల్లిటి గ్రంథమునఁ బీఠికరూపముగఁగాని, దనసైచ్యాను సంధానమునఁగాని తనయాసమర్థతను (ఆరోపితమైనను) జెప్పుకొనును గాని మొదటికృతిలో నేమియుఁ జెప్పుకొనక రెండవదానిలోఁ గాని, మూఁడవదానిలోఁగాని తనపీఠికను వ్రాయుట యనుచితము. మనకు రఘువంశ ప్రథమ సర్గారంభముననే—

"క్వసూర్యప్రభవో వంశః క్వచాల్పవిషయా మతిః;
తితీర్షు ర్దుస్తరం మోహా దుడుపే నాస్మి సాగరమ్.
మందః కవియశః ప్రార్థీ గమిష్యా మ్యుపహాస్యతామ్;
ప్రాంశులభ్యే ఫలే లోభా దుద్బాహురివ వామనః.
అథవా కృతవాగ్ద్వారే వంశేఽస్మిన్పూర్వసూరిభిః.
మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మేగతిః.
(రఘువంశము, 1 సర్గ. 2, 3, 4 శ్లో.)

అను శ్లోకములచే మహాకవి పీఠికా రూపముగఁ గొంత చెప్పెనని మన మూహింప వచ్చును. పిదప (మేఘసందేశమును రచించిన పిదపఁగాని రచించుటకుఁ బూర్వమునఁ గాని—యేది యెట్లయినను మనకు విరుద్ధముకాదు) మఱియొక కావ్యమునకుఁ గథావస్తువును రామాయణ ప్రసిద్ధమైనదానినే వెదకుచు— బాలకాండలోని,

"కుమార సంభవ శ్చైవ ధన్యః పుణ్యస్తథైవచ"

ఈమొదలగు శ్లోకములచేఁ గుమారసంభవము రచించుటకు యోగ్యమగు కావ్యమని యెంచి వాల్మీకి మతానుసారముగ నతనియందలి భక్తిచే దానినే రచించెను. కాన నీకథకు స్కాందపురాణము మూలమనుటయు నసంగతము. స్కాందపురాణమునఁ గుమార విజయాదికము వర్ణితమగుటచేతను, గాళిదాసకృతకుమార సంభవములోని మొదటి యెనిమిది సర్గలే కాళిదాసకృతములని సిద్ధాంత మంగీకరించినప్పుడే కుమారసంభవమను పేరు కావ్యమునకు సరిపడియుండుటచేతను, వాల్మీకి మహర్షి చెప్పిన కథ కుమారసంభవాంతమే యుండుటచేతను, గవి వాల్మీకి కృతరామాయణము ననుసరించియే కుమారసంభవమును వ్రాసెనని యంగీకరింపవలెను. కాళిదా సెనిమిది సర్గలే రచియించెనని పండిత ప్రసిద్ధమగు సిద్ధాంతము.

కాళిదాసు కార్తికేయభక్తుఁడే యైనచో స్కాందపురాణమునంతి నేల ఆధారముగఁ దీసికొనకుండును? తన స్వామిప్రభావాదులం దెలుపక జననాంతముమఱికే యేల కావ్యమును రచింపవలెను? కుమారభక్తుఁడే యైనచోఁ దారకాసుర విజయాంతమువఱకుఁ గథను రచింపకయుండునా? భక్తుఁడయ్యుఁ బ్రభావమును వర్ణింపకుండుట యుచితమగునా? కానఁ బురాణైకదేశమగు స్కాంద సంభవకాండ సాహాయ్యమునఁ గావ్యమును రచియించె ననుట యుచితము కానేరదుగదా!

వర్ణ్యమున కత్యధికము, నుదారమునగు నవర్ణ్యముతో సామ్యము నాపాదించునెడ నవర్ణ్యమునఁగల గౌరవ

ము తేటతెల్లము కాఁగలదుకాని, అంతమాత్రమున నసర్గ్య మునఁగల భక్తి ప్రకటితమగు ననుకొనుట విచారణీయము. కార్త్తికేయుఁడు ప్రసిద్ధమహాపురుషుఁడగుటఁ దజ్జన్మాదిక సామ్యము ప్రకృతోత్కర్షా వహమగును. అందువలనఁ గవికిఁ గార్త్తికేయుని యెడఁగల గౌరవము ప్రకటీకృత మగును గాని తనకుఁగల కార్త్తికేయ భక్తిత్వము వ్యక్తము కాఁజాలదు.

లోకకంటకుఁడగు తారకాసురునిదండింప నెవ్వరి శక్యము గాకపోవుటచేఁ బితామహుఁడు పార్వతియెడ నీశ్వరునకు మక్కువగలుగున ట్లొనర్పవలెననియు, వారల కుద్భవించిన కుమారుఁడే తారకుని సంహరించుననియు, దేవతలకుఁ జెప్పెను. మఱియుఁ గుమారుఁడు తక్క తక్కిన వారెవ్వరును దారకుని సంహరింపలేరని—

"సంయుగే సాంయుగీనం త ముద్యతం ప్రసహేత కః?
అంశాదృతే నిషిక్తస్య నీలలోహితరేతసః"

అను శ్లోకమునఁ జెప్పఁబడినది. స్కందుఁ డింతటి మహాపురుషుఁడు కావుననే తత్సామ్యముకొఱకుఁ దన్నామమును, దచ్చరిత్రమును దీసికొని యుండవచ్చును. ఆ యభిప్రాయముననే "సురసరిదివ తేజో వహ్నినిష్ఠ్యూతమైశమ్॥ గౌరీ...... రసజ్ఞా॥, బ్రాహ్మ్యముహూర్తే...... కుమారమ్॥, ఉమా...... శరజన్మనా యథా॥" ఈమొదలగు సందర్భములు కుమరఁ గలవు. మఱియుఁ గొన్నియెడలఁ గుమారసామ్యమునకు మఱియు నెక్కుడుగ నౌచిత్యము కన్పట్టుచున్నది.

"అస్త్రైస మద్రే స్తనయాశుశోచ
సేనాన్య మాలీఢ మివాసురాస్త్రైః॥"

ఇట్టి యెడఁగల చమత్కృతిం గనుఁడు. గిరి పుత్రిక పుత్రనిర్విశేషముగ దేవదారు వృక్షమును బెంచుకొను చుండెను. అట్లయినను దనపుత్రుఁడగు కుమారునికంటె నం దెక్కుడుమక్కువయుండుట కవకాశము లేదుకదా? తన సుతునియందున్న ప్రేమకంటెఁ జాల తక్కువగనే కూరిమి యుండుట సహజము. అట్టి చెట్టుయొక్క పట్టను మదపు టేనుఁగులు కపోలముల రాచి యూడఁగొట్టినప్పుడు తనకన్న కుమారుననిలో శత్రువులు బాధించిన నెట్లు విచారించెనో యట్లే విచారించెను. ఇట సేనాని యను కుమారుఁడు పార్వతీకుమారుఁ డగుటచేఁ దత్సామ్యమున దేవదారు వృక్షములయెడఁ గల మక్కువ యెక్కువ యని తేటతెల్ల మగును.

ఇట్లు కొన్నియెడల నీ కుమారసామ్య మున్నను సాభిప్రాయముని యెఱుంగవలెను.

మఱియు మహాకవి కాళిదాసు కార్త్తికేయభక్తుఁడే యైనచోఁ గ్రింది కాళిదాసోక్తియే సరిపడదు.

"ప్రాలేయాద్రేరుపతటు మతి
క్రమ్య తాంస్తా న్విశేషాన్
హంసద్వారం భృగుపతియశో
వర్త్మయ త్క్రౌంచరంధ్రమ్,
తేనోదీచీం దిశమనుసరే
స్తిర్యగాయామశోభీ
శ్యామఃపాదో బలినియమనా
భ్యుద్యతస్యేవవిష్ణోః."
(మేఘ సందేశము ౧ సర్గ. ౫౭ శ్లోకము.)

ఈశ్లోకమునఁ గ్రౌంచపర్వతమును భేదించినవాఁడు పరశురాముఁడనియు, నందువలన నతనికిఁ గీర్త్తి లభించెననియు వర్ణింపఁబడినది. కాని న్యాయ్యమును బట్టిచూడ నాకీర్త్తి కుమారునిదే. స్కందుఁడు తొలుత బాణప్రయోగమును (దన శక్తినంతటిని వినియోగించి) చేసెననియుఁ బిదప కొంచెము పట్టుగలిగియుండఁ బరశురాముఁడు దానిని విడఁగొట్టెననియుఁ బ్రసిద్ధము; కావుననే యమరసింహుఁడు క్రౌంచమును భేదించినది కుమారుఁడేయని "కుమారః క్రౌంచదారణః" అని తననిఘంటువునఁ జెప్పుకొనెను. * న్యాయ్యము నాలోచించిన లోకమును గుమారుఁడే క్రౌంచభేదకుఁడని యంగీకరించుచున్నది. ఇయ్యదియే సుప్రసిద్ధమగు కింవదంతి. కాళిదాసు కుమార భక్తుఁడే యైనచోఁ దనస్వామియొక్క ప్రభావమును వర్ణింపవలెను. ఇందుఁ బ్రభావము వర్ణింపకపోవుటయటుండ— ప్రసిద్ధమును, యథార్థమును, గుమార ప్రభావప్రతిపాదకమునగు క్రౌంచభేదనగాథను గుమారపరముగఁ జెప్పక యాకీర్త్తి పరశురామునిదనియును, దానిని భేదించిన



చిత్రము ౧.



చిత్రము ౨.

వాఁడు పరశురాముఁడనియు, (కోడలిపనిలో వత్తగారు జారెను. కార్త్తికేయభక్తుఁ డిట్లుచెప్పుట యుక్తమగు నట్లు తోఁచుటలేదు.

క్రౌంచం క్రౌంచం ఖురళీ విహారతః కార్త్తికేయేషు జాత
చ్ఛిద్రచ్ఛద్మ శ్రవణపదవీ చారిణీంచారణౌ స్కైః। శశ్వద్గీతాం
భువనమహితాం కాకతీంద్రస్య కీర్త్తిం క్రౌంచచ్ఛిద్రైర్నిస్సృతవతీ
మహాలో విస్మయా న్నిశ్చలాంగః ॥ (ప్రతాపరుద్రీయే)

ఇట్లనేకములు గలవు. లాతిపదము లనేకము లున్నను కుమారపదము పలుసారులు వాడుటచేఁ గుమారభక్తుఁ డనవచ్చుననుట యుక్తిసారము. కవులుఁ దను కుపకరించు పదములనే దీసికొనుట సహజము. "ఆ కుమారకథోద్ఘాతం శాలిగోప్యో జగు ర్యశః," ఈ మొదలగు చోట్లఁ గుమారపదమే యుక్తముగను మాధుర్యవిలసితముగను నున్నది. లేక "బాల" మొదలగు శబ్దములనే చొప్పించిన చో ఛందోభంగము కలుగకుండుటకై పదాంతరముకూడఁ జొప్పింపవలసియుండును. కాన నట్టియెడ కుమారపదము వాడుటకుఁ బ్రయోజనాంతరము చెప్ప వలనుపడదు.

మహాకవి కాళికాభక్తుఁడనుటకును, మన కవీంద్రుని కోటం గాళిదేవి వీరరసము నుంచుట నీలలితకవిత యలవడెననుటకును

" చేటీభవన్నిఖిలఖేటీకదంబవనవాటీషు నాకపటలీ,
కోటీరచారుతరకోటీమణీకిరణకోటీకరంబితపదా;
పాటీరగంధికుచశాటీకవిత్వ పరిపాటీమగాధిపసుతా;
ఘోటీకులాదధికధాటీముదారముఖవీటీరసేన తనుతామ్.

ఈ మొదలగు దేవీపరశ్లోకములు సత్ప్రమాణములు. సర్వాధికకవితాసమర్థుఁడగు మహాకవి రసమును జిప్పిలుచు, యమకభూయిష్ఠములై హృద్యములగు నీపరశ్లోకములను రచింపక యన్యుఁడు రచించెననుట సాహసముకాఁగలదు.

మహాకవి కాళీభక్తుఁడు కాఁడనుటకు శాస్త్రిగారు చూపిన యుక్తులు సరిగానుండునట్లు తోఁచుటలేదు. అట్లే కార్త్తికేయభక్తుఁడని చెప్పుటకును ప్రమాణములు వారివ్యాసమునఁ గాన వచ్చుట లేదు. అందుననే నేనిట్లు వ్రాసియుంటిని. ప్రమాణాంతరముచూపి సాధించిన నభిప్రాయము మార్చుకొన వలనుపడును.

విరహిణి

ఒక యాంధ్రవనిత

ఏయెడ నుంటివో యెచ్చోటికేగితో నీజాడలను జూడ నేరనైతి;
ఏ తరుచ్ఛాయలం దేవేళ నిలుతువో నీ జాడలను జూడ నేరనైతి;
చలువ పూపొద నొంటి నిలచి సైపగలేక నీ జాడలను జూడ నేరనైతి;
" హా! నాథ " రమ్మంచు నందందు వెదకియు నీ జాడలను జూడ నేరనైతి
వీనులారగ నీ వేణుగానసరణి-విను టెపుడో! నిన్ను కనులార గనుటయెపుడో?
విమల సుజ్ఞాన మానసవీథులందు-దాగియుంటివో యేమొ విరాగివగుచు?

గీ. కిసలయముచేత మేనెల్ల కృత్రిమముగ-జేసి 'యా' దీసి 'మూ' ద్రోసి చింతలేక
సలలితం బగు 'కి' ద్రుంచి సాగుడిచ్చి-సదయ! హృదయము జేసెనా సామిబ్రహ్మ?

గీ. అనుచు నేడువసాగె నాయతివ రాధ-విపులదుఃఖాబ్ధిలో మున్గి ప్రియునికొఱకు
కనుల దుఃఖాశ్రుగణములు కారదొడగె-విధిని దూరదు మాధవు వీడలేదు.

వినోదవిమర్శపరామర్శము

శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి గారు

'వినోదవిమర్శ' మను పేరితోఁ బ్రభవ ఫాల్గుణ భారతిలో బ్ర. శ్రీ. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తిక్కనసోమయాజి కవిత్వమందలి స్వారస్యములు చూపుచుఁ జిక్కని పాఠములను, వాని యర్థములను బ్రకటించినారు. అది యాంధ్రభాషకు మహోపకారము. పూర్వము భారతాదిగ్రంథములు వ్రాసికొన్నపుడు, నిరక్షరకుక్షులు తెలియక వ్రాసిన తప్పులు కొన్ని, అక్షరాస్యులు తమ కర్థము కాకపోవుటచేత దిద్దినవి కొన్ని, విమర్శకుల కావేశము స్ఫురింపకపోవుటచేత సవరించినవి కొన్ని, ఎట్లయిన నేమి మాఱుపాఠముల పాలయిన భారతాదిగ్రంథముల యథార్థరూపము గ్రహించుట కొన్నిపట్టులఁ గష్టముగానే యున్నది. అట్టివానిని బరామర్శించి ప్రకటింపఁబూనిన బ్ర. శ్రీ. ప్రభాకరశాస్త్రిగారియెడల నాంధ్రలోకము కృతజ్ఞతఁ జూపఁదగును.

వారి వినోదవిమర్శారంభమున భారతోద్యోగపర్వమందలి "పగయడఁగించు టెంతయు శుభంబు" అను (3 ఆశ్వా. ౨౧) పద్యమునకు నర్థమును వివరణమును వ్రాసి "ఈపద్యమునకు నాకు గోచరించిన యర్థమును తెలుపుకొన్నాఁడను. ఇంతకంటె సరసమైన యర్థ మెవ్వరికేని గోచరించినచో వెల్లడింప వేఁడుచున్నాఁడను." అని వ్రాసినారు. ఆపద్యమున కర్థము నాకు మఱొకవిధముగా గోచరించినది. అది సరసమయినదగునో కాదో ప్రభాకరశాస్త్రిగారును, పాఠకులును నిర్ణయింపవలయును. గాని నేను నిర్ణయింపఁజాలను. నాకుఁ దోఁచిన యర్థమును వారి యనుజ్ఞాప్రకారము వెల్లడించుచున్నాను.

ఈ పద్యమున ననేకపాఠములు గలవు. నాకు లభించిన వ్రాఁతప్రతుల పాఠములును, ముద్రితగ్రంథపాఠములును ముందు చూపఁబోవుచున్నాను. ప్రభాకరశాస్త్రిగారు కీ. శే. తం. వేదప్పెరుమాళ్లయ్య గారు ప్రకటించిన పాఠమునే గ్రహించినారు. నేనును ఆపాఠమునే గ్రహించి యర్థము వ్రాయుచున్నాను.

చ. "పగ యడఁగించు టెంతయు శు
    భంబది లెస్స యడంగునే పగం
బగ వగగొన్న మార్కొనక
    పల్కకయుండఁగవచ్చునే కడుం
దగ మొదలెత్తిపోవఁ బగఁ
    దీర్పఁగవచ్చినఁ గ్రౌర్యమొందు నే
మిగతిఁ దలంచినం బగకు మే
    లిమి లేమి ధ్రువంబు కేశవా!

అవతారిక.—శ్రీకృష్ణుని రాయబారిగాఁ బంపునపుడు ఆతనితో ధర్మరాజు పలికినపలుకు లివి. ఈవాక్యములకుఁ బూర్వము "పెనఁకువ, గాని యుపాయమునఁ బగఱఁగడ దేర్చుధృతిం, బూనినఁజు సెప్పఁడు డెం, దానం జేయిపెట్టుకొని యతఁడె నిద్రించున్." అనియు, "పగయ కలిగెనేని పామున్నయింటిలో నున్న యట్లకాక... పలవదధిక దీర్ఘవైరివృత్తి." అనియుఁ జెప్పినాఁడు. అధిక దీర్ఘవైరివృత్తి గూడదన్నపుడు పగయడఁగించు టొనరాదా యనుప్రశ్నమున కవకాశము గలుగుచున్నది. దానికి సమాధానముగా పగ యడఁగించుట మంచిదేయని చెప్పుచు పగయడఁగించు సామాన్యసాధనములను, వాని యందలి దోషములను ఇందుఁ జెప్పుచున్నాఁడు.

పగ=వైరము, అడఁగించుట=శాంతిపఱచుట, నశింపఁజేయుట, ఎంతయు=మిగుల, శుభంబు=శ్రేయస్కరము. అది లెస్స = (పగ అడఁగింపఁగలిగినచో) నది శ్రేష్ఠము. అంతకంటె మంచి దున్నదా? దీనివలన ధర్మరాజునకుఁ బగ నణఁచుటలో నున్న యాత్యాదరమును, అణఁగించుట కష్టమను భావమును సూచింపఁ బడుచున్నవి. ['విషస్య విషమౌషధ' మన్నట్లు పగచేతనే పగ నణఁపరాదా యంటే] పగం బగయడఁగునే=పగచేత పగశాంతింపదు.

పగ లోపల రాజుచున్నచో నేనాటికైనను దనకో, శత్రువునకో చావు దప్పదని హృదయము. [పోనీ యూర కుండరాదా. పగదానియంతటది యదియే నశించునంటే] పగ = (శత్రుస్మరణమువలనఁ గలుగు) మానసిక తాపము, మనోవ్యథ, కొన్నన్ = పొందినపుడు, మార్కొనక = పల్కక యుండఁగ వచ్చునే = శత్రువుపై దండెత్తిపోక యూర కుండ శక్యమా? ఎదుర్కొనక, బదులాడక యుండవచ్చునా అనియుఁ జెప్పవచ్చును. [ఊరకుండుట శక్యముగా నపుడు శత్రువును సమూలనాశము సేయరాదా యంటె చేని] కడున్ = మిగుల, తెగ = శత్రుపక్షము, మొదలెత్తి పోవన్ = ఉన్మూలితమగునట్లు, వేళ్లు పెల్లగిల్లి పోవునట్లు, (మొదలెత్తున కీయర్థమున శ్రీనాథుని నైషధప్రయోగము ౬ ఆ. ౭ పద్యము.

“ధరణిపుఁ జక్కికట్టెదురఁ దా
మరసాక్షికిఁ జేష్టనష్టతం
బొరసెను నోనురాగ పరి
పూర్తి నొకించుక సేపు నిర్భర,
స్మరశర పుంఖసంఘటిత
మద్భరణప్రమదాగరుస్ఫుటా
స్ఫురదనిలావతారమున
బోరనఁ దా మొదలెత్తెనో యనన్.”

పగఁ దీర్పఁగవచ్చినన్ = పగ నణఁగింపఁ బూనినచో, క్రౌర్యమెందున్ = క్రూరత్వము గలుగును. ఏమిగతిఁ దలంచినన్ = ఏవిధముగా నాలోచించినను, పగవు మేలిమి లేమి ధ్రువంబు = పగగలిగియున్నచో క్షేమము లేదు హానియే సిద్ధపగుట నిశ్చయము.

అనఁగా పగచేతనే పగనణఁపఁబూనినచో నేనాటి కైనను తనకో శత్రువునకో చావు తప్పదు.

ఊరకుండుమన్న మానసికతాపము బాధించు చున్నది. అది చావుకంటె నెక్కుడుబాధ. శత్రువును సమూలనాశము చేయుదమన్న నది క్రూరకృత్య మగు. కావున పగవలన హానియేకాని మంచిలేదు. అని చెప్పి ముందుపద్యమున “కావున శాంతిఁ బొందుటయు కర్జము తానది యట్టులుండె” అని చెప్పుచున్నాఁడు ధర్మరాజు.

దీనికి మూలమయిన సంస్కృత భారతభాగము (ఉద్యో. ౭౨ అ.) చూచినచో తిక్కనసోమయాజి భావము తేటపడును.

“నచాపి వైరం వైరేణ కేశవవ్యుపశామ్యతి,
హవిషాగ్నిర్యథాకృష్ణ! భూయఏవాభివర్ధతే.

కృష్ణా! పగచేత పగ అణఁగదు. ఆజ్యముచేత అగ్ని అణఁగక మరంత మండునట్లు పగ అణఁగక మరంత పెరుగును.

అతోన్యథా నాస్తి శాంతిర్నిత్య మంతరమంతతః,
అంతరంలిప్సమానానా మయం దోషో నిరంతరః.

ఏరికైనను ఛిద్ర మపరిహార్యము. కావున తనకో, శత్రువునకో చావు గలుగకుండఁగా శాంతి కలుగదు. ఛిద్రములు వెదకువారికి నాశదోషము తప్పదు.

పౌరుషే యోహిబలవా నాధిః హృదయబాధనః,
తస్యత్యాగేనహిశాంతి ర్మరణేనాపివాభవేత్.

హృదయబాధకమైన మనోవ్యాధి విడిచినచో శాంతి గలుగును. లేదా మరణమున శాంతి గలుగును.

అథవా మూలఘాతేన ద్విషతాం మధుసూదన,
ఫలనిర్వృత్తి రిద్ధా స్యా త్తన్నృశంసతరం భవేత్.”

లేదా శత్రువులను సమూలనాశము చేసినచో శాంతి కలుగును. అది మిగులఁ గ్రూరము.

పై శ్లోకముల తాత్పర్యమును అన్వయభేదము తో నొకపద్యమున నిమిడ్చిన తిక్కనసోమయాజి ప్రావీణ్య మెంతయుఁ బ్రశంసనీయము. ఈ పద్యమునకు భారతము లక్ష్మీపతి సోమయాజిగారు రచించిన వ్యాఖ్య ప్రభాకరశాస్త్రిగారు భారతిలో నెత్తిచూపినారు. చదువువారి కనువుగ నుండునట్లు ఇచ్చట వ్రాయుచున్నాను.

నేను పనిచేయుచున్న శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యస్థానమందున్న ప్రతిలో నున్నరీతిని వ్రాయుచున్నాను.

“పగను అణచివేయుట శుభము. ౧. అది మంచి ది. ౨. పగచేత పగ అడఁగునా. 3. పగగన్న దుఃఖము

రాగా (ఇక్కడ "పగగొన్న దుఃఖమురాఁగా" అని ప్రభాకరశాస్త్రిగారు దిద్దిరి.) యుద్ధము సేయక, విసిదించక, ఉండవచ్చునా. ౪. కడుఁ మిక్కిలిన్ని మొదలు తెగ - మూలచ్ఛేదముగా ఎత్తిపోవ - దండెత్తిపోయినా పగదీర్పఁగవచ్చినా క్రౌర్యము వచ్చును. ౫. ఏలాగు విచారించినా (ఇట 'విచారించిన' అని ప్రభాకరశాస్త్రిగారు దిద్దిరి.) పగకు మంచిలేదు. ధ్రువంబు నిశ్చయము."

ప్రభాకరశాస్త్రిగారు ఈవ్యాఖ్య యిచ్చి "ఈ టీక యస్వరసమని నాతలంపు" అని వ్రాసినారు. "అది మంచిది, దుఃఖమురాఁగా" అనుభాగముతక్క మిగిలినది శాస్త్రిగారు గ్రహించినారు. "మొదలు తెగ" అనుచోట 'కడుఁ-తెగ-మొదలెత్తిపోవఁ......' అని సముదాయముమీఁదవ్రాసి తెగ, మొదలు అనువాని యర్థము, నన్వయమును స్పష్టపఱపరైరి. ఇట్లు చెప్పుటకంటె శాస్త్రిగారి వ్యాఖ్యగూడ నిచ్చుట మంచిదని తోఁచుచున్నది. (పత్రికానిర్వాహకులు మన్నింతురు గాక.) "ధర్మరాజు శాంతిఁబొందుటయె కర్జమని యిందు నిరూపించుచున్నాఁడు. పగచేఁ బగయణఁగించుకొనరాదనుచున్నాఁడు. ఉభయపక్షములును బగవీడి శాంతి పొసఁగియుండఁగోరుచున్నాఁడు. రాయబార మరుగు కృష్ణునితోఁ జెప్పుచున్నాఁడు: పగ-అడఁగించుట-ఎంతయు-శుభంబు=వైరము రూపుమాపుట మిక్కిలి శ్రేయస్కరము. అది=అవైరము, పగన్=వైరముచేత (స్వపక్షము వైర మూనియుండఁగా), అడఁగునే = అడంగదు గదా! వైరముపోవలె ననఁగా, ముందు స్వపక్షము వైరము వీడవలెను. స్వపక్షము వైరము పూని యున్నప్పుడు అనివార్యముగాఁ బరపక్షముగూడ వైరము పూనవలసిన దగును. కావునఁ బరపక్షము వైరము లేకున్నను స్వపక్షము వైరము పూనియుండఁగా వైరము పెరుగునే కాని నశింపదు. అట్లే పగ=పరపక్షము-శత్రుపక్షము, పగగొన్నన్=వైర మూనియున్నప్పుడు, మార్కొనక సల్కక యుండఁగవచ్చునే=ఎదుర్కొనక, బదులాడక, స్వపక్షము వైరము వీడియుండఁ గుదురదు. స్వపక్షము వైరమూనినఁ బరపక్షమును వైరమూన వలసివచ్చును. కాన యీ రెండువిధములందును శాంతి చేకూరదు. ఇఁక-రెండుపక్షములును వైరముఁబూని, కడున్-తెగ-మొదలెత్తిపోవన్-పగఁదీర్పఁగవచ్చినన్= స్వపక్షము పరపక్షముమీఁదికి దండెత్తిపోయినను, పరపక్షము స్వపక్షముమీఁదికి దండెత్తివచ్చినను, పరస్పరము యుద్ధముసాగి, ఇరుపక్షములలో, ఒకపక్షమో అడఁగారి, పగపోయి శాంతి కల్గినఁ గల్గవచ్చును. కాని దాన క్రౌర్యమెందున్ = హింసారూపమయిన క్రౌర్య మేర్పడును. కావున సర్వవిధములను పగ పనికిమాలినది అని పదార్థము." అని వ్రాసి వివరణము వ్రాయుచు స్వపక్షపరపక్షములం దున్న పగ కలిమి పగలేముల యందు గురులఘుభావము లారోపించి ఛందస్సులోనికి దింపి తుదికత్యుత్కృష్టపద్యము సంపాదించిరి.

వీరియర్థమున "లెస్స" దేనితో నన్వయించునో, అర్థమేమిటో చెప్పలేదు. అది వాక్యాలంకారము గాన ప్రభాకరశాస్త్రిగారు వ్యాఖ్యలో నియ్యలేదనుకొనెద మన్న నది తిక్కనసోమయాజి ఫక్కిగాదు. అణఁగునే యనుదానితో నన్వయించినచో సరసార్థము రాదు. మఱియు, స్వపక్షము దండె పోఁగా, పరపక్షము దండెత్తిరాఁగా అని యన్వయించుటకుఁ బదసామగ్రి లేదు. అది సంస్కృతభారత భావానుసారమును గాదు. ప్రభాకరశాస్త్రిగారు రస్వరసమని తలఁచిన లక్ష్మీపతి సోమయాజిగారి టీకలో ఇదే యర్థమున్నది. అది తిక్కనసోమయాజిగారి భావమయియుండదని నా యభిప్రాయము.

ఈసంవత్సరపు స్కూలుఫైనలు టెక్స్టులో పగ యడఁగించు టెంతయు శుభం; బదిలెస్స; అని సెమికోలను గుర్తులు పెట్టి ముద్రించిరనియు, అసుర్తులు సరసార్థభంజకములనియు వ్రాసి "పగయడఁగించు టెంతయు శుభంబు; అదిలెస్స; అని వేఱుచేసినచో యగును. అది సోమయాజుల ఫక్కి కాదు" అని ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిరి. "అది లెస్స" అనిచెప్పుట పాడినపాట గాదు. ధర్మరాజునకు శాంతియందుగల యత్యాదరమును పగ యణఁగించుటయందలి కష్టమును సూచించుచున్నది. అదిగాక శుభము అన్నపదముకంటె లెస్స యనుపదమున

విశేషార్థ మున్నదిగదా. ఈపదభేదముతోఁ జెప్పినది మరలఁ జెప్పుట సందర్భానుసారముగా నుణ్ణమే. అట్టివి తిక్కనసోమయాజికవిత్వమున లేకపోలేదు. ఉద్యోగ- 3 ఆ. ౭౨. పద్యమునఁ క. ఒడఁబఱచి......పొంది పొసఁగియుం, డెడి నట్టితెలుఁగు సేయుట, గడుమే లది గౌరవము సుఖంబును చేయుఁగ." అట్టి తెలుఁగుసేయుట కడుమేలు. అది = అట్టితెలుఁగుసేయుట, గౌరవమును సుఖంబును జేయును. ఈరెండువాక్యముల నెంత భావభేదమున్నది? ఇట్టివి యింకను గలవు.

మఱియుఁ 'పగఁదీర్పఁగవచ్చిన' అనుచోట "పగదీర్పఁదలంచిన" అన్నపాఠము పై టెక్స్టులో మార్చినారని వ్రాసి 'తలంచిన' అన్నపాఠము సరిగాదు. నేఁజూచిన తాళపత్రప్రతులలో లేదు. అది తిక్కనగారి తెలుఁగును గాదు. ఏలనఁగా, 'తీర్పఁదలంచిన గ్రౌర్యమెుందు నే మిగతిఁ దలంచిన' అని మరలనదేపదము వచ్చుచున్నది. రెండుమార్లొకేపదము దగ్గఱదగ్గఱఁగా నీతీరునఁ బ్రయోగించుట సరసరచన గాదు అని వ్రాసినారు. ఆంధ్రసాహిత్యపరిషత్కార్యస్థానమునుండి నేను తెప్పించిన పాఠములలో 'తలంచిన' అనుపాఠ మొక తాళపత్రగ్రంథమున నున్నట్లున్నది.

ఆపాఠమును గైకొనినయెడల నీపద్యము సర్థము ప్రభాకరశాస్త్రిగారు చెప్పిన స్వపక్షపరపక్షముల రాకపోకల యన్వయమున సరిపడకపోవచ్చును. రెండుమార్లొకేపదము దగ్గఱదగ్గఱ గావచ్చుట విరసమే యైనచో నట్టిదోషము మనము గ్రహించినపాఠమున 'వచ్చిన' అనుచోటఁగూడఁ బట్టునేమో? పాఠభేదప్రసంగములోనికి దిగినచో, త్రోవ, తెన్ను కనఁబడదు. ఒక్కొకపాఠమున నొక్కొకసౌరస్యముండును. "పగయుడఁగించు కొంతయు నెపంబిడి లెస్స" అని యొక ప్రతిలో నున్నది. ఏదైన నెపము కల్పించి పగ యుడఁగించుట మంచిది. ఏలః పగపగచే నడఁగదుగాన...... అనిన సరసముగానే యున్నది. దీని కేమిగాని కీర్తిశేషులయిన తం. శేషప్పెరుమాళ్లయ్యగారు సర్వతోముఖ పాండిత్యముతో బహుగ్రంథశోధనముగావించి భారతాది గ్రంథములు ప్రకటించియుండకున్నచో మనము మహారణ్యమధ్యమం దుండియుందుము. ఆ మహామహావుని యెడల నాంధ్రలోకము కృతజ్ఞతఁ జూపఁదగును.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యస్థాన గ్రంథసంఖ్య 2644.

"పగయుడఁగించు [1]కొంతయు ను
దంబ్బది [2]లెస్సయుడంగునే పగఁ
[3]బగవగ గొన్ని [4]మార్కొనక
పల్కకయుండఁగవచ్చునే కడుఁ
[5]దగ మొదలెత్తిపోవ బగ
దీర్పక యుండిన [6]గార్యమెుందు నే
మిగతి [7]దలంచ్పినం బగకు
[8]మేలిమి లేమిధృవంబు కేశవా.

1. "కొంతయు నెపంబిడి" మఱొకప్రతి. 2. (క) "లెస్సయుడంగునేని యప్పగ" (చ) "లెస్సయుడంగునే పగఁ" (ట) "లెస్సయుడంగునేనియుఁ" 3. "పగఱ గొనంగమార్కొనక" 4. (క) "మార్కొనంగబల్కనము" (చ) మార్కొనకపల్కగ" 5. "తెగవడినెత్తిపోవ" 6. "క్రౌర్యమెుందు" 7. (క) "దలంచిచూచినను" (చ) "జరించినంబగకు" 8. (క) "మేలిమిలేదు" (చ) "మేలిమియౌట"

అచ్చుప్రతులలోఁగూడఁ గొన్ని పాఠభేదములున్నవి. గ్రంథవిస్తరభీతిచే వ్రాయుట మానినాఁడను. పాఠకమహాశయులారా! నేను వ్రాయుటకును మీరు చదువుటకు నిదే యొక్కనరైన:. వినోదవిమర్శమందు రెండవపద్యముగు తుదిరాజ్యంబన్న దానిలో పాఠభేదములెన్నోయున్నవి. పెరుమాళ్లయ్యగారు ప్రకటించిన పాఠమునకుఁ బ్రభాకరశాస్త్రిగారు వ్రాసినదే సమంజసార్థము, సుప్రసిద్ధము. విమర్శములో మూఁడవపద్యమునందున్న క్రొమ్ముడి, క్రుమ్ముడి అనుపదముల పాఠములు, వాని వ్యుత్పత్తులు మరొక చిన్నవ్యాసమున భారతిలోనే ప్రకటింపఁదలంతు.

గిరికుమారీ!

చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి గారు

పరమోదగ్రత పూనముద్ర నిడియున్ బంచాగ్ని మధ్యన్ దప
స్స్ఫురణన్ రాజిలు శైలరాజతనయన్ జూడన్ మదిన్ గోరి శూ
లి; రహిన్ వృద్ధమహీసురాకృతిని శైలేశాత్మజాతాతపః
పరిపాకోజ్జ్వల వన్యభూమి కరుగన్ వాంఛించి సన్నద్ధుఁడై.

నుదుటందున్ దడఁ బుట్టఁగన్ ముఖమునందున్ దేజమున్ దోఁప నె
క్కుడు మాంద్యంబు లభింప దృష్టికి మదిన్ గోపంబు రెట్టింప ని
ల్కడఁ దప్పన్ నడుమున్ వడంక నడుగుల్ దార్మారుఁజెందన్ బలం
బుడుగన్ దండము నూఁది శంకరుఁడు వృద్ధుండోయనన్ వచ్చెడిన్.

ఇటులు వేంచేయు శివుని వీక్షించి గౌరి-వృద్ధుఁడంచునుఁ దలపోసి వినయమొప్ప
నర్ఘ్యపాద్యాదివిధులచే నర్చనంబు,-సలిపి కూర్చుండ నియమింపఁ బలికె ముసలి.

ఎవ్వతెవీవు నీదు కులమెయ్యది? నీ తలిదండ్రు లెవ్వరో
జవ్వని! యిట్టులుంట సరసంబె! ప్రచండపు టెండ నీదు మే
నివ్విధి వేఁపఁ బాడియె యిసీ పెరవారలు నీదు సేఁతకున్
నవ్వరె, యాటపాటల ననారత మింతటఁ బ్రొద్దుఁ బుచ్చుమా!

తపముసాలించుబాల! కుందనమువంటిఁ, మేనుకసిగంద నీరీతి మెలఁగనేల?
నంచుఁ బలికెడి వృద్ధువాక్యములు వినుచు, గౌరి యిట్లాడె వినయంబుఁ గడలుకొనఁగ.

తప్పటడుగులువైచు నందనునిఁ గాంచి-యొసఁగిచేయూత సాయమింపెసఁగఁ జేయు
తండ్రిగతి సాయమొనరింపఁదగును మీర, లట్లొనర్పక నిటువల్క-నగునె తండ్రి!

పలుకు లిఁకేల? తండ్రి హిమవంతుఁడు, మేనక తల్లిగాదె; ని
ర్మలచరితా, భువిన్ "గిరికుమారి!" యటంచు సతంబు లోకులున్
బిలుతురు నన్ను, నారదుని ప్రేరణచే గిరి కల్లుఁడౌటకే
నెలమిఁ దపంబొనర్ప మదినెంచితి శంకరుఁగోరి నిచ్చలున్.

దురితవ్రాతలతాలవిత్రము, మునిస్తోమాభి వంద్యమ్ము, దు
ర్భరసంసారకరాళవార్ధితరణోపాయమ్ము సత్సంపదా

కరమున్ జ్ఞాననిధిప్రదాన, మవివేకధ్వాంతసూర్యోదయం
బరవిందాక్షనుతమ్ము శూలధర పాదాంభోజ మే నెంచెదన్.

అనుచు బాలేందుమౌళి పాదారవింద-సుందరయుగమ్ముఁ జిత్తంబు నందసేర్చి
భక్తి నిగుడంగఁ బార్వతి పలికినట్టి-పలుకులాలించి కపటోక్తిఁ బలికె ముసలి.

"ఎంతటి వెఱ్ఱిదానవో యిసీ! విషభక్షకుఁ డాభవుండు, నీ
గొంతుకఁ గోయ నెంచె మునికుంజరుఁ డోలలితాంగి! బాపురే!
సుంతయు నీవెఱుంగ విది జుట్టుకు జుట్టుకు ముళ్ళువెట్టి తా
వింతలుఁ జూచు నారదుఁడు వెంగలి, నీగురువయ్యె నే కటా!

అతివ! క్రొమ్మావి కెంజిగురాకుఁ బోని,-తేనియలుఁ జిల్కు నీమోవి నాని గరళ
కంఠుఁ డూర్పుల వాతెఱఁ గమలినటులు, జేయకుండునె నామాట చెవినిఁబడునె!

పొట్టకుఁ గూడులేక విసమున్ భుజియించు టదేమి లెస్స; తా
గుట్ట వసించుఁ గట్టుకొనగుడ్డయు లేమి మదేభ చర్మమున్
పుట్టముఁగట్టు భూతగణముల్ దనుఁగొల్వ నొకప్డు పుట్టముల్
గట్టఁగ లేమి సిగ్గరి దిగంబరియై తిరుగాడుఁ గోమలీ!

బూడిదఁబూయు దేహమునఁ బూయఁబటీరము లేదె, హారముల్
వేడుకఁ బూన లేవె; మెడ వ్రేలెడుఁ బన్నగపంక్తి యింతి! నీ
కీడగు జోడుగాదు లభియించెడి దేమిఁక "జోగిజోగియున్
గూడిన బూదెరాలెన"ని కోవిదులాడెడి పల్కు కల్లయే!

నిక్కము దాపనేల? తరుణీమణి! గంగనుఁ బెండ్లియాడెఁ; దా
నెక్కడు గష్టమంది నివసించుటకే నిలులేమి నెత్తిపై
కెక్కియుఁ దాండవింపఁ దొడఁగెన్ జదలేరు; తలంప నీవుఁ బె
న్మక్కువఁ జంకనెక్కుమిఁక మా నుడు లేటికి దూరు నీచెవిన్

రమణీ! కోపముఁజెందవేని హితమున్ రవ్వంత యాలింపు, ని
క్కము దాఁపన్ బనియేటికిన్ "భవతి భిక్షాం దేహి" యంచున్ గపా
లముఁ గేలన్ ధరియించి భైక్షుకునిలీలన్ శూలి యింటింటికిన్
భ్రమణంబున్ దగసల్పు, నట్టిధవునిన్ వాంఛించితే! యింతకున్.

చెలియరో! చెప్పఁబూనినది చెప్పితిఁగాని మఱొక్కమాట నీ
చెలువుఁడు నల్లరాయి, యిఁకఁ జెప్పెడిదేమి గళంబునంద యా
శిల ధరియించి కాపుర మిసీ! యెటు సేసెదొ నీకు భర్త నే
నెలమినిఁగూర్తు"నంచు వచియించినఁ బార్వతిపల్కె నల్కతోన్.

చూడిదఁ బాయుఁగాక, విసముల్ భుజియించునుఁగాక పాముల
వేడుకఁబూనుఁగాక మురిపెంబునకై జనుఁగాక, బూచుల
గూడి చరించుఁగాక, మదకుంజర చర్మముఁ దాల్చుగాక; యా
చూడిదఁ బాయురుద్రుఁడె ధవుం డిది నిక్కము నిక్క మింతకున్.

అమలచరిత్ర! చంద్రిక హిమాంశునిఁ బాసినఁ బాయుఁగాక; దు
ర్విమలత ఛాయ, భాస్కరుని వీడిన వీడును గాక; మించు మే
ఘమునుఁ దొఱంగినన్ దొఱఁగుఁగాక; మదీయ మనోగతుల్ల స
ద్విమలచరిత్రు శంకరుని వీడఁగ నేర్తునె వేయి సెప్పినన్.

బిరబిర గౌరి యీగతినిఁ బిట్టలుకన్ వచియించి రోషవి
స్ఫురదరుణ ప్రభల్ వఱలు మోమొకవంకకుఁ ద్రిప్ప; మోవిపై
దరహసితంబు నింపెసఁగఁ "దన్వి శిలన్ మెడ గట్టుకొమ్ము నే
నరిగెద"నంచు రుద్రుఁడు ముదంబున మెల్లనసాగు చంతలోన్

నెఱిమేన జీరాడు కరిచర్మపరిధాన మరుదార నిజకీర్తి నలిశయిల్ల;
సరసంపు పంజ కెంజాయ తళ్కులమించు ఘనజటాజూట సంగతి దలిర్ప;
ఘనసార పంకసంకలితాంగ సౌందర్య మనఘ విభూతిచే నినుమడింప;
బాలచంద్ర ప్రభాభాసమానాంగియై నిర్ఝరాపగ పాళి నెగడుచుండ;
క్రోాల భయలీల బూచులమూక లెగయ-నాగసంతతి మేనఁ దాండవమునల్ప;
రంకెలను వేసెడి బసవరాజునెక్కి,శంకరుఁడుఁ దోఁపఁ గన్గొని చకితయగుచు.

కరచంచన్మణి కంకణప్రకర నిక్వాణంబు సంధిల్ల, దు
ర్భరవక్షోజ యుగంబుఁ బెల్లదర; గాత్రక్షోభ మేపార; బి
త్తరిచూపుల్ నిగుడన్ ద్రపాస్ఫురణ ముగ్ధత్వంబుఁ బాటించి గౌ
రి, రహిన్ బ్రక్కకునేగె రుద్రుఁడు "కుమారీ!" యంచు డాయంజనన్.

పదునేనవశతాబ్దమందలి వాఙ్మయము

యస్. శ్రీకంఠశాస్త్రిగారు, యం.ఏ.

౧. ప్రథమఘట్టము ౧౩౦౦-౧౩౯౯

దాక్షిణాత్య రాజకీయచరిత్రయందు పదునేనవశతాబ్ద మెంత విఖ్యాతి గాంచి యున్నదో, సాహిత్యాది కలాకౌశల చరిత్రయందు నదేరీతిగా ముఖ్యస్థలార్హమైన దనుటకు సందేహము లేదు. ప్రాచీనభారత సంస్కృతిరక్షణార్థము విద్యారణ్యులచే విసర్జింపబడిన విజయనగర సామ్రాజ్య మొక శతాబ్దకాలమున నౌత్తరేయుల హావళి దప్పించియు నాసేతుకృష్ణా పర్యంతమును రాజ్యమును విస్తరించియు, నేకఛత్రముగ బ్రవర్ధిలుచుండెను. ఇమ్మడి హరిహరరాయని కాలమునందే దేవభాషయందునే కాక దేశభాషలందును విస్తార మగు వాఙ్మయము బయలుదేరుచుండెను. ఏతన్నిదర్శనముగ శిలాలేఖనములందును, ఇతరగ్రంథములందును గీర్తింపబడిన కవులను భాష్యకారులనుమాపవచ్చును. హరిహరుని కాలమునందు బ్రకటింపబడిన వేదభాష్యము నామమాత్రముగ సాయణాచార్యులచే రచియింపబడె నని ఖ్యాతి గాంచినను, నారాయణ వాజపేయయాజి, పండరిదీక్షిత, పెద్దవిద్యావల్లభ, నరహరి సోమయాజి, మంత్రసిద్ధి ఇత్యాది మహోపాధ్యాయులు, ఘనపాఠులు నగువారిచే వ్రాయబడెననియు, హరిహరునికి "వేదభాష్యప్రకాశకః" "రాజకల్యాణ శరశ్శేఖరః" "సిద్ధసారస్వతేత్యాది బిరుదావళీవిభూషితః" ఇత్యాది బిరుదములు గల్గెననియు శాసనములచే దెలియును. హరిహరు నాస్థానమునందు ముఖ్యులగు కవులు మంగరస, డిండిమ, చెన్నుభట్ట, ఇరుగప్పదండనాథ, చౌండపాచార్య, విద్యారణ్య, నరహరి త్రియంబక, క్రియాశక్త్యాదులు గాక హరిహరునికిగూడ "రాజవ్యాస", "రాజవాల్మీకి" బిరుదు లుండుటచే తానును కవిత్వము చెప్పగలవాడని యూహింపవచ్చును. ఈతనికాలమునందు సామ్రాజ్యము దోరసముద్రము, చంద్రగిరి, ములువాయి, తంజి, మంగళూరు, బారకూరు, తెరకణాంబి ఇత్యాది పట్టణముల పర్యంతము వ్యాపించియుండెనని తెలియవచ్చుటచే నింతవిస్తారమగురాజ్యమునం దపారవాఙ్మయము బయలుదేరె నను టాశ్చర్యము గాదు.

ఈ శతాబ్దపు వాఙ్మయ చరిత్రమును నాల్గుఘట్టములుగ విభజింపవచ్చును. క్రీ. శ. ౧౪౦౦-౧౪౨౫ వరకు హరిహరుని మరణానంతరము విప్లవము గల్గెనని బోధపడుటచే, రాజ్యమునందు శాంతి సుఖములులేక వాఙ్మయము క్షీణించెనని చెప్పవలయును. క్రీ. శ. ౧౪౨౫-౧౪౪౬ వఱకు ఇమ్మడి దేవరాయనికాలమునం దత్యుచ్చస్థితి

బాంచె ననవలెను. క్రీ. శ. ౧౪౪౬-౧౪౬౫ వరకును, మల్లికార్జునుని రాజ్యకాలమునందు ముసల్మానులహావళిచేతను, సంతర్భేదములచేతను, విరూపాక్షునిద్రోహముచేతను రాజకీయ పరిస్థితి లెస్సగ లేకుండినను వెనుకటి ఘట్టమునందు బయలుదేరిన వాఙ్మయప్రవాహము క్షీణింపకపోయినను అత్యంతాభివృద్ధి చెందలేదు. క్రీ. శ. ౧౪౮౬-౧౫౦౦ వఱకు సాళువనరసింహుని రాజ్యకాలమునందును తత్పూర్వము బాహ్యాభ్యంతరములచే రాజ్యమునందు శాంతి లేకపోవుటవలన ఇమ్మడిదేవరాయని కాలమునందున్న యత్యున్నతావస్థనుండి సాహిత్యప్రవాహము శోషించిపోయెను.

ప్రథమభాగమందు ముఖ్యముగ నిమ్మడిబుక్క దేవరాయ, దేవరాయ, విజయరాయుల కాలములం దెట్లు సారస్వతము ప్రవర్థిల్లెనో సూచింపబడును. వెనుకటి ఘట్టమగు హరిహరుని కాలమున వాఙ్మయమునకును, ఇమ్మడి దేవరాయనికాలము వాఙ్మయమునకును బోల్చి చూడ గణనీయులగుకవు లెవరును లేరని చెప్పవలెను. తత్కాలీనవిజయనగరచరిత్రము విశదముగా నెవరిచేతను వ్రాయబడకుండినను, రాజకీయస్థితిని బరీక్షించుట సాహిత్యవిచారణావశ్యక మగుటచే సూక్ష్మముగా సూచింపబడును. హరిహరు ననంతరము నిమ్మడి దేవరాయనికాలమువరకు విరూపాక్ష, ఇమ్మడి బుక్క, దేవరాయ, విజయదేవరాయలు క్రమముగా రాజ్యపాలనముచేసిరని శిలాలేఖనముల వలన దెలియుచున్నది. ప్రథమవిరూపాక్షుడు కొన్నిదినములుమాత్రమే సింహాసనము నాక్రమించి సోదరు డగు ఇమ్మడిబుక్కనిచే బరాజితుడయ్యెను. క్రీ. శ. ౧౪౦౬ నందు ఇమ్మడి బుక్కడు గతించినందున ప్రథమదేవరాయడు సింహాసనము నధిష్ఠించెను. తన్నందనుండగు విజయుడు క్రీ.శ. ౧౪౧౩-౧౪౧౯ వఱకు రాజ్య మేలెనని శాసనము లుద్ఘోషించుచున్నవి.

రాజకీయాంతఃస్థితి ఈరీతి నుండగ, బాహ్యోపద్రవములును లేకపోలేదు. బహామని సుల్తాను డగు ఫిరోజ్ షహా మతావేశమున కాఫరులపై ప్రతివర్షము జిహాద్ చేసెద నని ప్రతిజ్ఞ చేసి ఇరువదినాలుగు దండయాత్రలు గావించెనని "బుర్హాన్-ఇ-మాసీర్" (Burhan-i-Masir) అను గ్రంథము చెప్పుచున్నది. ప్రతివర్షము ముప్పదిరెండులక్షలు టంకముల కప్పమును విజయనగరమువారు చెల్లించుచుండిరనుమాట యెంత విశ్వసనీయమో తెలియదు. పూర్వనిర్దిష్టగ్రంథమునందే ఫిరోజుని చరమావస్థయందు బూనిన దండయాత్రలు నిష్ఫలములయ్యెనని తేలుచుండును. ప్రథమదేవరాయనికాలమునందే ఆంతరికద్రోహ మధికముగ నుండెనని కన్నడకవియగు మధురునిచే వ్రాయబడిన శాసనమొకటి చెప్పును. (South Indian Inscriptions, Vol.IV.) దేవరాయడు తత్సన్నిహితాపాయమును మంత్రియగు లక్ష్మణామాత్యునిసహాయముచే దప్పించుకొనెను.

ప్ర. స్వామిద్రోహర్ కెలంబర్ మసగిమ పెద బా
ల్గిఱిండు చండప్రతాపో
ద్దామశ్రీదేవభూవల్లభన గృహమహా
ద్వార మం ముత్తె మత్తిం
న్నెమా తే మాతినింమున్న రుబితరుబి నూ
రంకమంస్వామికార్య
క్కెమొందు ర్వేళ్వ రుత్సాహమనఘటదం
లోకదోళ్ లక్షణాంకం.

ఈకాలమునందు ముఖ్యమయిన కవులు కన్నడమున మధుర, మల్లణ, అభినవచంద్ర, కవిమల్ల, దేపరాజ లక్ష్మీధరామాత్యులు; సంస్కృతమునందు శోణాద్రిడిండిమ, నరహరి, చౌండపాచార్య, విష్ణుసూరి, సాయణాచార్య మాధవాదులు; తెలుఁగున ననంతామాత్యుడు, రావిపాటి త్రిపురాంతకుడు. ప్రథమ దేవరాయుడు సాహిత్యాభిమాని యగుటచే "విజయ విద్యాదేవరాయ"డను పేరుగాంచెను. ఇమ్మడి బుక్కనికాలమునందును, ఈతని కాలమునందును కవులకును, రాజమంత్రులకును నన్యోన్యసంబంధము గల్గియుండెననుటకు నిదర్శనము లనేకముగా నున్నవి. వైదికమతోద్ధారకుండును, కర్ణాటకరాజ్య ప్రతిష్ఠాపనాచార్యుండును నగు శ్రీవిద్యారణ్యులయొక్క సోదరియగుసింగాంబకు పుత్రుండే ప్రథమ దేవరాయని యమాత్యుడును, మధురకవిపోషకుండునునగు లక్ష్మణామాత్యుఁడు. బుక్కనికాలమునందు ముహూర్తదీపిక రచించిన విష్ణుసూరి మాధవసూరి పుత్రుండును, మల్లపమండలాధీశ సభాసదుండును నయియుండెను.

శ్రీమాన్మల్లపభూపః స జయతి జగతీ
భూషణీ భూతధామా
పారావారావగాఢక్షితిధర శిఖర
ప్రస్ఫుర త్కీర్తిపూరః;
కింబ్రూమోఽస్య ప్రతాపం నరపతిచరితా
ద్రీంద్ర రక్షాతిదక్షః
శ్రీభర్తుర్వ్యాసుభూమి ర్వితరతి జలధి
ర్యస్య రత్నాని నిత్యమ్.

ఇదియుగాక కన్నడమున "సొబగినసోనె" యను గ్రంథమును రచించిన దేవరాజు కుమారకంపని నందనుం డని తెలియవచ్చుచుండును. శోణాద్రిడిండిముడు కుల కవిగా నుండెను. ఇమ్మడిబుక్కని కుమారుడగు వీరభూపతికాలమునం దుండిన చౌండపాచార్యుడు బుక్కని "యునబుక్క భూపాలస్య రాజవ్యాసవాల్మీకేః కర్మ బ్రహ్మధ్వనీనస్య" యని సంబోధించియున్నాడు. ఇట్లు పోషకులకు పోషితులకు నెంత యన్యోన్యసంబంధ ముండెనని తోచుచుండును. రాజవ్యాసేత్యాది బిరుదులు హరిహరునికులమునం దేయుండినను ఇమ్మడిబుక్కాదులుగూడ తమ సాహిత్యాభిరుచిచే తద్బిరుదములను ధరించియుండిరి. ఈ కాలమునందు శోణాద్రి డిండిమకవికిని, లక్షణకవి బిరుదాంకితుండగు కవిమల్లునకును వాగ్వాదము నడిచెననియు మల్లన యోడిపోయెననియు డిండిమని "కవిమల్లగల్లతాడనపటు" అను బిరుదుచే తెలియును. ఈకవిమల్లుడు మన్మథవిజయగ్రంథకర్తయగుమల్లుడో మఱియొకడో తెలియ లేదు. ఏతద్గ్రంథము శృంగారరసాధిష్ఠితమని తెలియుట

యేకాక దేవరాయడు కూడ "అమరుక"మును కన్నడభాషలో రచించెను. ఈకవులందుముఖ్యముగా మధురుడే యున్నతస్థానార్హు డనబడును. హరిహరుని దండనాథు డగు ముద్దప ఆజ్ఞానుసారముగా ధర్మనాథపురాణమును కన్నడభాషయందు రచించినను, దేవరాయని మంత్రి యగు లక్ష్మణామాత్యపోషితుం డయి తత్ప్రశంసాత్మకమగు శాసనమును రచించెనని చూపబడినది. విజయనగరసామ్రాజ్యమునందు జైనమత సంప్రదాయస్థులగు కవులందు నానార్థరత్నమాలా కర్తయగు ఇరుగప్ప దండనాథుడును, ధర్మనాథ పురాణకర్తయగు మధురుడును ముఖ్యులు. లక్ష్మణామాత్యుడును కవిత్వపటిమ గలవాడని క్రింది పద్యములు వ్యక్తపఱచుచున్నవి.

మ.వి. గణనామాత్రమె దేవరాయనరనా
థాస్థానదోళ్ మానవా
గ్రణిగళ్ త్రైనెతె విచారిపాగళు పథా
సంశుద్ధియిం బుద్ధియిం
గుణదిం గౌరవదిం పొదల్దికె సెవ ము
ద్రామాత్య యౌగంధరా
యణ చాణక్య సుమంత్రరొళ్దెసెగె వం
దం మంత్రిలక్ష్మీధరం.

పొగళర్ పొంపుళివోద పెంపిన యశో
లక్ష్మీధరం బల్లవ
ర్బగె గొళ్వింపిన సొంపువెత్త కవితా
లక్ష్మీధరం రాజని
తిగె నేర్పాద మహాప్రధానపదవీ
లక్ష్మీధరం ధాత్రియోళ్
నెగల్దిం నిర్మలరామచంద్రతనయం
సన్మంత్రిలక్ష్మీధరం.

స్వామిద్రోహర్ కెలంబర్ మసగిమసెద బా
ళ్గొండు చండప్రతాపో
ద్దామశ్రీదేవ భూవల్లభనగృహామహా
ద్వారమం ముత్తిమత్తిం
స్నేమా తేమాత్తినింమున్ను రుబితరుబినూ
రంకమం స్వామికార్య
క్కా-మెందు ర్వేళ్వరుత్సాహమనధటదం
లోకదొళ్ లక్ష్మణాంకం.

శాసనములను రచియించినకవు లనేకులలో దావణగెరె శాసనమునురచించిన బాయణాచార్యుడును, దేవరాజమిశ్రుడును ముఖ్యులు. దేవరాజమిశ్రు డాస్థానకవిగా నుండి, దేవరాయనిపుత్రుడగు రామచంద్రు డుదయగిరిరాజ్యము నేలుచు చెన్నుభట్టునకు దానమొసగినప్పుడు తచ్ఛాసనమును రచించెను. ఈ చెన్నుభట్ట ప్రాయః సర్వజ్ఞవిష్ణుతనయుడును, దర్క-భాష్యకారుడునునయియుండవచ్చును. ఈకాలమునందే మాధ్వగురువులు, స్మార్తగురువులు ననేకగ్రంథములను రచించిరి. ఇంతేకాక వాగ్వాదములుకూడ జరిగెనని తెలియవచ్చును. పరివ్రాజకాచార్యులగు ఆనందసరస్వతీతీర్థశ్రీపాదులు, తచ్ఛిష్యులగు అమృతేంద్రతీర్థ, అమృతప్రజ్ఞ, నారాయణగిర్యాచార్యులు శాసనములం దుద్ఘోషింపబడియున్నారు. సమకాలీనులగు మాధ్వాచార్యులు, అక్షోభ్యతీర్థకరసంజాతులు టీకాచార్యులునగు జయతీర్థశ్రీ

పాదాచార్యులు, సాయనమాధవులతో వాగ్వాదము చేసిరనియు, తద్వాగ్వాదమునందు జయతీర్థులు జయమొందిరని మాధ్వులు, మాధవాచార్యులే గెలిచిరని స్మార్తులు చెప్పుదురు. ఇదేవిధముగ నక్షోభ్యులు,

అసినా తత్త్వమసినా పరజీవ ప్రభేదినా,
విద్యారణ్యమహారణ్య మక్షోభ్యముని
రచ్ఛినత్;
అక్షోభ్యంక్షోభయామాస విద్యారణ్య
మహామతిః.

విద్యారణ్యులతో వాదముచేసి గెల్చిరో లేదో తెలియుట దుస్సాధ్యమయినది.

సర్వదర్శనసంగ్రహ కర్తయగు మాధవుడు సాయణాచార్యుల ద్వితీయపుత్రుండని యు, సంగీతసాహిత్యకలాప్రవీణుడనియు తెలియును.

తత్సంవ్యంజయ కంపణవ్యసనినః
స్సంగీతశాస్త్రే తవ
ప్రౌఢిం మాయణ గద్యపద్యరచనా
పాండిత్య మున్ముద్రయ;
శిష్టాం దర్శయ సింగణ క్రమజటా
చర్చాసు వేదే ష్వితి
స్వాన్ పుత్రా నుపలాలయన్ గృహగతః
సమ్మోదతే సాయణః.

ఇదేకాలమునందు విజయనగరరాజులకు కులగురువులగు క్రియాశక్త్యాచార్యులందు త్రియంబక క్రియాశక్తిగురువులు కంపరాయచరితను వ్రాసిన గంగాదేవికిని, 'సాబగినసోన' కర్తయగు దేవరాజునకును, విజయభూపతికిని పరమగురువులయి యుండిరని తెలియును. దేవరాజు త్య్రింబకాచార్యులచేఁ గన్నడ శుకవిత్వమును నేర్చెనని చెప్పుటచే ఇతడు దేవభాషయందేకాక దేశభాషయందును పాండిత్యము గలవాడని తెలుచున్నది. ఈ త్య్రింబకక్రియాశక్త్యాచార్యుల యనుమతిచే, విజయభూపతి శక ౧౩౩౨ వికృతి సంవత్సరమునందు తమ గురువుల నామాంకితముగా క్రియాశక్తిపుర మను అగ్రహారమును గట్టించి దానముచేసెనని త్రియంబకాభిజ్ఞాముద్రాంకిత మగు తామ్రశాసన మొకటి చెప్పుచున్నది.

సింహావలోకనంబుగా నీకాలమును బరీక్షించిన నొకడైన యుద్దామకవి బయల్దేరక యుండుట కనేకకారణము లగపడును. సాహిత్యసముద్రమునందు తరంగముల నిమ్నోన్నతస్థితులకు రాజకీయవాతావరణమేమూల కారణము. రాజవిప్లవముల చేతనో లేక యితర కారణములచేతనో ఈ సాహిత్యచరిత్రఘట్టము చ్ఛస్థానార్హము గాకపోయినను, రాబోవు ఇమ్మడి దేవరాయకాలిక సాహిత్యమునకు పీఠికారూపముగ నుండుటవలనను వెనుకటి ఘట్టమునందు నుద్భవించిన సాయణమాధవ, వేదాంతదేశిక, అక్షోభ్యతీర్థాదుల వాగ్వాద ప్రతిధ్వనులు ప్రతిబింబితము లయి యుండుట వలనను ఈకాలము ప్రాశస్త్యార్హ మయినది.

౨. ద్వితీయఘట్టము ౧౪౧౯-౧౪౪౬

బాహ్యోపద్రవకారణములచే సంకుచితమయిన విజయనగరసామ్రాజ్యము ఇమ్మడి

ప్రౌఢదేవరాయడు సింహాసనారోహణము గావించిన దినమునుండి ప్రవర్థిల్లసాగెను. మహామ్మదీయ పక్షపాతియగు ఫెరిష్టయను చరిత్రకారుడు విజయనగరమువారు బహామనీ చక్రవర్తులచే పరాజితులయి కప్పము చెల్లించుచుండిరని వ్రాసినది విశ్వసనీయముకాదని శాసనములు, యితర చరిత్రకారులు చెప్పుచుండుటవలనను దేవరాయని సమర ప్రాబల్యము నూహింపవచ్చును. ఏతత్కాలమునందే విజయనగరమునందు ప్రవాసము చేసిన. అబ్దుర్ రజాక్ అను మహామ్మదీయుని వ్రాతలందును, శ్రీకృష్ణదేవరాయల యనంతరము చరిత్ర వ్రాసిన న్యూనిజ్ అను పోర్చుగీస్‌వానివలనను ప్రౌఢదేవరాయఁడు ప్రబలచక్రవర్తి యని బోధపడును. ఈకాలమునందు కర్ణాటక సామ్రాజ్యము సింహళద్వీపము, తుత్తుకుడి, పెగ్గు, తెన్నాసిరమ్, బర్మా మొదలయిన ద్వీపాంతర దేశములను లోబఱుచుకొని యుండుటే కాక, క్రీ. శ. ౧౪౨౨ సంవత్సరమునందు దేవరాయడు దన దండనాయకుడగు లక్కణామాత్యుని గోలకొండమీాద దాడిపంపి తద్దుర్గమును సాధించి యనేకులను కారాగారబద్ధుల గావించెనని తెలియును. ఇదిగాక రాజమహేంద్రవర రెడ్డిరాజ్యమునందు దురాచారప్రవర్తకుడగు రాచమరెడ్డిని కొండవీడు నగరమునుండి వెడలగొట్టి గజపతిరాజులను, అల్లాడరెడ్డి మొదలయినవారలను వశపఱచుకొని సమస్త రాజ్యమునందును సుఖము శాంతి యుప్పొంగుచుండువిధమున రాజ్యపాలనము చేసెను.

యేవాఙ్మయమయిన సభ్యచ్ఛ్రియస్థితి బొందుటకు దేశమునందు శాంతిసుఖము లవశ్యమని సర్వదేశీయ సాహిత్యచరిత్రలు చాటుచున్నవి. జనులకు విరామ మధికమగుకొలది లలితకళాపరిశ్రమ హెచ్చును. అందులకు ఈకాలమునందుండిన వాతావరణము సామ్రాజ్యపరిస్థితియు, వాఙ్మయప్రపంచమునందును, కళాలోకమందును నవనవోన్మేష మగు ప్రతిభావ్యాపారమునకు బహ్వనుకూలముగనుండెను. యేకాదశ ద్వాదశశతాబ్దములందు చాళుక్యకాలచూరి రాజులకాలమున బసవేశ్వర, చెన్నబసవేశ్వర, యేకాంతదరామయ్యాదులచే బ్రతిపాదింపబడిన నూతన వీరశైవమత ప్రవాహ ముల్లోలకల్లోలముగా దక్షిణ భారతఖండమునంతయు నావరించుకొని మతసంప్రదాయములందేకాక వాఙ్మయప్రపంచమునందును పెక్కుమార్పులు గావించెను. పదుమూఁడు పదునాల్గుశతాబ్దులందు ఈ వీరశైవోత్సాహమను సముద్రతరంగములు దిగిపోవదొడగెను. దీనికి పదునాల్గవశతాబ్దియందు వీరవైష్ణవ,స్మార్త మాధ్వమతముల ప్రసిద్ధపురుషులయిన వేదాంతదేశిక, అక్షోభ్యతీర్థ జయతీర్థ, సాయణ, విద్యారణ్య, విద్యాశంకర, కాశీవిలాస, త్రియంబకవిలాస క్రియాశక్త్యాదులే కారణముగ నుండవచ్చును. ఏమయినను పదునేనవ శతాబ్దమునందు వీరశైవమతము పునరుత్సాహముతో దేవరాయని సభాస్థానమునుండి బయలుదేరి దేశభాషలందు నూతనావేశమును గావించెను.

ప్రౌఢదేవరాయని వైభవమును, నైశ్వర్యమును గాంచినవారందరు నాతడింద్రసమానుడని ప్రశంసించియున్నారు. చెన్నబసవపురాణమునందు ఇంద్రుడే ఈశ్వరాజ్ఞానుసారముగా వీరశైవమతమును విస్తరించుటకు ప్రౌఢదేవరాయడని యవతరించెనని చెప్పియున్నది. మఱియు ప్రమథగణంబు లతనియాస్థానమునందు నూటొక్క విరక్తులుగా జనియించిరి. వారలలో ముఖ్యులు: మహాలింగదేవుడు, తోంటద సిద్ధలింగార్య, లక్కణదండనాథ, జక్కణ, కుమారబంకనాథ, చామరస, కల్లుమఠప్రభుదేవ, కరస్థళవీరణ్ణ, కరస్థళనాగిదేవ, శ్రీగిరీంద్ర, మగ్గెయమాయిదేవ, గురుబసవ, బత్తలేశ్వర ఇత్యాదులు. క్రీ. శ. ౧౪౧౯ శాసన మొకటి దేవరాయని పరమశైవాగమసంపన్నుడనుటచేతను, అతనిగురువు కాశ్మీరశివాచారకర్మఠుడగు చంద్రభూషణ క్రియాశక్తి యయినందునను, స్నేహితాప్తసచివు లగు లక్కణజక్కణాదులు పరమవీరమాహేశ్వరాచారపరులగుటచేతను దేవరాయడు వీరశైవమతాభిమాని యని మన మూహింపవచ్చును. ఇట్లు వీరశైవులకు రాజప్రోత్సాహమే కాక, మహామాండలికులు, మంత్రివర్యులునయిన లక్కణ చామరసాదులు వీరశైవు లగుటచేత అత్యంత ప్రాముఖ్యముగల్గెను అయినను దేవరాయడు వైష్ణవాదిమతములను బాధింపక సన్నిటియందు నభిమాన ముంచియుండెను. అతని వైష్ణవ గురువగు కందాళపెద్ది యనువాడు శ్రీరామాయణపఠనము చేయుచుండెను. కాక దేవరాయడే హంపియందు జీర్ణమయియుండు హజారరామస్వామి దేవాలయమును గట్టించెనని యొక్క శాసనము చెప్పుచుండును. మఱియు రామచరిత్రాత్మకమగు "మహానాటక సుధానిధి" యను కావ్యమును కూడ ప్రాయః ప్రౌఢదేవరాయడే రచించియుండవచ్చును. అయినను వీరశైవమతమే యతిప్రాబల్యమును గాంచెననుట నిర్వివాదాంశము.

ఈవిరక్తులందు ముఖ్యులయినవారిచరిత్ర సంపూర్ణముగా వ్రాయుటకు వీలులేనందున క్రింద సంక్షేపముగా సూచింపబడును. కల్యాణదుడనియు, ప్రభువనియు బిరుదుగాంచిన మగ్గెయమాయిదేవుడు వీరశైవులకు నరకబాధ లేదని వాదించి విజయనగరమునందు ఛాయారహితమగు స్తంభమును స్థాపించెనట. కన్నడమునందు శతకత్రయమని వ్యవహరింపబడు శివాధవ, శివావల్లభ, ఐపురీశ్వర శతకములను రచించి, సంస్కృతమునందును గురుశిష్యసంవాదరూప మగు "విశేషార్థప్రకాశక" మను గ్రంథమును వ్రాసెనని తెలియవచ్చుచున్నది.

శ్రీమద్వైపురసోమేశ

లింగాయా లింగరూపిణే
లింగాంగైక్యస్వలింగాయ
నమస్తే లింగమూర్తయే.

నమశ్శబ్ద ముమా సాక్షాద్
శివశబ్దః శివః స్వయమ్

అయ శబ్ద స్తయో ర్యోగః
సోమతత్త్వ ముపాస్మహే.

*   *   *   *

అతః పరం ప్రవక్ష్యామి
విశేషార్థప్రకాశకమ్,
శివసిద్ధాంత తంత్రోక్తం
సంవాదం గురుశిష్యయోః.

స్వానుభూతి విభవావగాహినా
మాయిదేవవిభునా మహాత్మనా;
(శ్రీ) శివానుభవసూత్రముత్తరం
తంత్రముక్త మితి శోభనం పరమ్.

ఇతి (శ్రీ) శివసిద్ధాంతతంత్రే విశేషార్థ ప్రకాశకే గురుశిష్య సంవాదే.................. అవసానవిధిర్నామ పంచమాధికరణమ్.

ఈతని యితరగ్రంథములు ప్రభుగీత, షట్‌స్థల గద్యము; మఱియు మాయిదేవవచనము, యేకోత్తర శతస్థలషట్పది ఇత్యాదులు. మఱి యొక విరక్తుడు వీరశైవమత స్థాపనాచార్యుడని ఖ్యాతిగాంచిన గురుబసవడు సప్తకావ్యము(?)లనబడు మనోవిజయ కావ్యము, వృషభగీత, సద్గురురహస్యము, స్వరూపామృతము, శివయోగాంగ భూషణము అను గ్రంథములను రచించెను.

లక్ష్మణామాత్యుడు ప్రసిద్ధ దండనాయకుండే కాక; కావ్యనాయకుండు నయియుండెను. ఇతని ప్రోత్సాహముచే ననేక వీరశైవ గ్రంథములు వ్రాయబడెనని సాహిత్యచరిత్రయందు చెప్పబడినది. తానుగూడ (ప్రాయః కుమార బంకనాథాదుల సహాయముచేత) "శివతత్త్వ చింతామణి" యను గ్రంథమును రచించి యున్నాడు. దానియందు

ధరె గధికమూరు రా
యరగండన ప్రతిమ
బిరుదాంక గజవేంట
కార దేవేంద్ర భూ
వరన మహదైశ్వర్య శరధిచంద్రోదయ ను
దార కరుణాధారను
నిరుపమిత సప్తాంగ
రాజ్యవర్ధన కళా
ధర నమలకీర్తియుత
లక్కణ్ణ దండేశ.


యని చెప్పుకొని యున్నాడు. ఇతని లౌకిక వ్యవహారము లపారముగ నుండుట వలన నిక్కడ విస్తరించుటకు వీలు లేకపోయినను ఉత్తరదేశీయులగు గోలకొండ మహమ్మదీయులను, దాక్షిణాత్యులగు సింహళద్వీపవాసులను జయించుటే కాక ముఖవాగిలందు రాజ ప్రతినిధిగానుండి స్వనామాంకితం బగు వరహాములను ప్రచురించెననుటచే ఈతని ప్రాముఖ్యము తెలియును.

జక్కణాచార్యు డను విరక్తాగ్రేసరుడు దేవరాయని ప్రధానిగానుండెను. హరిహరుని కాలమునందే మంత్రిగా నుండెనని యొక శాసనమువలన తెలియుటచే కడు వృద్ధుడయి యుండవచ్చునని యూహింపవచ్చును. గుబ్బి మల్లణార్యకృతమగు వీరశైవామృత పురాణ

బర్మా వెండిపని



చిత్రము 3.



చిత్రము ౪.

మునం దితడు వీరశైవగ్రంథ రచనార్థముగ నపారసంఖ్యముగ వరహాములను వెచ్చముచేసె నని చెప్పబడినది. 'నూరొండుస్థల'మను గ్రంథము నురచించి 'భక్తభాండారి'యను బిరుదువహించెను. తత్కారణమునం గుమార బంకనాథ, మహాలింగదేవులను కవు లితనికి సహాయము చేసిరని తెలియవచ్చుచున్నది. జక్కణాచార్యుడు ప్రౌఢదేవునికి వీరశైవమతోపదేశము చేసి లింగాంగిగా జేసెనని ప్రౌఢదేవరకావ్యమను గ్రంథము చెప్పుచున్నది. తదనంతరము జక్కణార్యుడు చామరసునికి మంత్రిత్వము నిప్పించి ఇహలౌకికవ్యవహారములను వదలెను. ఈ జక్కన తెలుగునందు విక్రమార్కచరిత్రమును రచించిన జక్కనకంటె భిన్నుడని యూహింపవలెను.

దేవరాయమహారాయ ధీవిధేయ
మంత్రివల్లభ చామనామాత్యదత్త
చామరఛత్త్ర శిబికాదిసకలభాగ్య
చిహ్నముల నొప్పె జన్నయసిద్ధ మంత్రి.

పై పేర్కొనబడిన చామయామాత్యుడు సాహిత్యచరిత్రయం దొక్క ముఖ్యపురుషుడు. గురురాజచారిత్రమునందును భైరవేశ్వర కావ్యకథాసూత్రరత్నాకరేత్యాది గ్రంథములందును గీర్తింపబడియున్నాడు. ఈతని ముఖ్య గ్రంథమగు ప్రభులింగలీలయొక్క రచన విషయకముగా ననేకకథలు చెప్పబడినవి. ఈ గ్రంథము చేత నితనికి నన్యమతకోలాహల, 'వీరశైవాచార సారోద్ధార' యను బిరుదులేకాక, మంత్రిత్వముగల్గెను. ఈ గ్రంథమును వ్రాసిన యత్యల్ప కాలమున పిడుపర్తిసోమనచే దెలుగుభాషయందును, శివప్రకాశ దేశికునిచే దమిళమునందును భాషాంతరీకరింపబడెను.

హరిహరుని కాలమునందు మాధ్వ శ్రీవైష్ణవ స్మార్తమతానుయాయులగు అక్షోభ్యతీర్థ వేదాంతదేశికసాయణమాధవుల వాగ్వాదములెట్టి సాహిత్యమునందు బ్రతిబింబితములయ్యెనో అదేరీతిగా నీకాలమునందు వీరశైవ వీరవైష్ణవులసంస్పర్థచే వాఙ్మయము నందును నూతనగ్రంథములు బయల్దేరదొడగెను. అయితే మతసంబంధస్పర్థయేకాక సాహిత్యలోకము నందును కవులు సార్వభౌమత్వమును బొందుటకు యత్నించిరనుట కుదాహరణము లనేకములుగలవు. ఇదంతయు బరిశీలించిన తాత్కాలికవాఙ్మయపరిస్థితి దృగ్గోచరమగును. ప్రథమోదాహరణముగ మతసంబంధమగు జక్కన ముకుందపెద్దులవాగ్వాదములబరిశీలించెదము. పూర్వనిర్దిష్టమగు సిద్ధాదృశ్య కవికృత ప్రౌఢదేవర కావ్యమున నీకథ విశదీకరింపబడినది.

ఛప్పన్న దేశదొళగిదకె సమవాదపుర
విప్పదే దుర్లభవెనుత్తె బుధరిందె నుతి
గొప్పి రాజిసువ విద్యానగరవాళువం
[ప్రౌఢభూవరచంద్రను.
కప్పంగొరళన భక్త జక్కణాచార్యజన
దొప్పినలి మంత్రితనమం నడిసు తిరలు మ
ల్లిప్పరా కందాళపెద్దయాచార్య రెం
[తెంబవైష్ణవగురుగళు.

జనపంగె. నవమాస భారత వబోధిసుత
లను నయది మెరవణిగెయం మాడి సుఖ
[మిరలు
మనసిజారియభక్తజక్కణాచార్యనదు
[నోడితన్నయచిత్తది.

ఘనవీరశైవక్క ముఖ్యవిప్రగ్గుగుత్తొందు
మెనె సాంప్రదాయకశ్రేష్ఠనాద కుమార
కను బంకనాథనెం దెంబగురుపదవనె
[నెలెగొళిసుతె.

ప్రమథగణప్రభుదేవ పేళ్దవచనంగళిగె
క్రమదియేకోత్తరశతస్థళద సూత్రగళ
రమణీయమాగివర్ణక పుస్తకగళిందె
[వ్యాఖ్యానగళ మాడుతే
ధరెయొళచ్చరియెనిసి మెరెయిసిదరిరుళియే
[కోత్తరశతస్థళవనూ.

వైష్ణవాచార్యుడగు ముకుందపెద్దియు నవమాసములు భారతమును ప్రౌఢదేవునికి బోధించి తదనంతరము విజయనగరవీథులందు రాజచిహ్నసహితముగా మెరవణి చేసెనట: తత్ప్రతీకారముగా జక్కణాచార్యుడు అల్లమప్రభుకృతైకోత్తరశతస్థలసూత్రములకు వర్ణకక్రమముగా వ్యాఖ్యానమును రచించి రాత్రియందుత్సాహముతో దద్గ్రంథమును మెరవణి చేయుగా నది చూచి కందాళపెద్ది "యేమి యీ డంబరము! యెవరయిన చనిపోయిరా లేక యెవరిదయిన జన్మోత్సవమా" యని రాజాస్థానమునందు మరునటిదినము హాస్యముచేయుగా, జక్కణాచార్యుడు భక్త్యంగన ముక్తిశిశువును ప్రసవించెనని చెప్పి యల్లమసూత్రములకు వైష్ణవు డుచితార్థము చెప్పలేకపోవుటచే, దేవరాయునిచే ప్రార్థితుడై జక్కణార్యుడే శివశరణులకథలను బోధింపదొడగెను. ఇంతలో చామనామాత్యుడు మృతజనులచరిత్రయగు మహాభారతముకంటె నుత్కృష్టము, నక్షయము నగు వీరమాహేశ్వరుడగు నల్లమప్రభు చరిత్రను ప్రభులింగలీలకావ్యముగ నొక పక్షముదినములఅవధిలో రచించెదనని పూనుకొని, వీరభద్రుని ప్రసాదప్రాబల్యముచే దినమొకటికి నూటపదొకొండుపద్యముల మేరగా ఏకాదశదినములలో ముగించి దేవరాయని కొప్పగించెను. తద్గ్రంథతత్త్వమును వైష్ణవులు దెలియక ఖిన్నులయియుండ జక్కణార్యుడే బోధింపగా దేవరాయుడు శైవమతదూషకులను వెళ్లడించి, జక్కన్నకు రత్నాభరణములను రుద్రకంకణములను ఒసంగుటయేకాక చామయ్యకును మంత్రితనమిచ్చె నట. ఇట్లు వీరశైవ వైష్ణవమతములు స్పర్థించుటచేత నపారవాఙ్మయమునకు కారణమయ్యెను.

ఈకాలమునందు వీరశైవమతమునకు, వైష్ణవమతమునకు నుండిన వైషమ్యము వీరశైవస్మార్తమతములందు గానరాదు. కావున చామరస కుమారవ్యాసులవాదము, శ్రీనాథ డిండిమభట్టులవాదము, సాహిత్యచరిత్రకే చేరును.

ప్రౌఢదేవరాయుడు చామరసునకు, నతని బావమఱదియగు కుమారవ్యాసునకు కన్నడ

మున భారతమును రచియింప నాజ్ఞాపించెను. ఇద్దరుకవులును వ్రాసి తీసికొనిపోయి రాజుముం దిడినప్పుడు రసజ్ఞులు చామయభారతపు తాళపత్రములను బిడుక రక్తము స్రవించినందున తద్గ్రంథమే యుత్కృష్టమని తీర్మానించిరి. కుమారవ్యాసుడు ఖిన్నుడయి యాగ్రంథమును గాల్చి బూడిదచేసిపూసికొనవలెను; లేకున్న ఆత్మహత్యచేసికొనెద నని తలంపగ నతనిభార్య యన్నయగు చామరసునిగ్రంథమును దొంగిలించి కాల్చివేసెనట. చామరసుడు తద్వృత్తాంతము విని యమర్త్యులగు అల్లమాదులచరిత్రను ప్రభులింగలీలగా రచించెను. దేవరాయ డావృత్తాంతము నంతయు నాకర్ణించి కుమారవ్యాసునికి కనకాభిషేకము చేసెదనను ప్రతిజ్ఞ మాని, చామరసునికే తన్మర్యాద గావించెనని వీరశైవగ్రంథములగు సిద్ధనంజేశగురురాజచారిత్రమునందును, శంకరకవికృత చోరబసవచరిత్రయందును చెప్పబడినది.

కుమారవ్యాసుడు స్మార్తుడును వీరనారాయణభక్తుడును నయియుండెనని గదుగుభారతమున చెప్పబడియుండుటచే వీరశైవులతో సంబంధము గావించియుండెననుట సందేహాస్పదము. ఆంధ్రదేశమునందు పోతనభాగవత మెంత సర్వజనాదరణీయముగ నున్నదో కర్ణాటకమునందు గదుగుభారతము నంత ఖ్యాతిజెందియున్నది. అతిపాండిత్యమును ఛందోలంకారవ్యాకరణనియమములకు గౌరవమును జూపకపోయినను, ఇతనికి కవిత్వధాటి నిరర్గళముగ ప్రవహించి సమయోచితసందర్భసంసూక్తులచే నిబిడీకృతమయినది. ఈయాశుకవిత్వపటిమచేతనే పదిపర్వముల నత్యల్పకాలముననే రచించెను.

శ్రీనాథ డిండిమభట్టుల వాగ్వాదము సాహిత్యచరిత్రయందు ముఖ్యస్థానార్హ మయినది. అరుణగిరినాథ డిండిముడు దేవరాయనికి ప్రీతిపాత్రుడై 'ముల్లండ్రై' యను గ్రామమును దేవరాయపురమను నామాంకితంబుగ నగ్రహారముగావించి యనుభవించెనని యొకశాసనమువలన దెలియుచున్నది. వంశపరంపరగా డిండిములవారు విజయనగరసభాపతులును, శాసనకర్తలును, కవిసార్వభౌమ బిరుదాంకితులును విద్యానాథులును అయియుండిరనియరుణగిరినాథకృతమగు"విభాగరత్నమాల"చెప్పును. ప్రాయః తద్గ్రంథోక్తమగు 'మూలాండ' యను గ్రామము శాసనమునందుచెప్పిన 'ముల్లంద్రై' యయి యుండవచ్చును.

మూలాండవాస్తవ్య మహాజనానాం
కాలాంతరేపి స్వకులావగత్యై;
వేలాం ఖలాబ్ధే స్సు వివేకపత్రో
మూలాంసుహ్యాత్క్యంతగతాం స్సృజామి.

అరుణగిరినాథకృతమగు సోమవల్లి యోగానంద ప్రహసనము హాస్యరస ప్రాధాన్యమగు నేకాంకదృశ్యము. తద్గ్రంథమునందు స్వవిషయము నిట్లు చెప్పుకొనియున్నాడు.

పూర్వం పూరితచేతసః శిఖముఖే
శర్వాదభూ ద్య స్తతః

శౌరేః శ్రీవపుషః సరోజజనుషః
పశ్చాత్సుతా కామినః;
స్వారాజా స్తదనంతరం మునివధూ
జారాదపి ప్రోద్ధత
శ్చండాంశో ర్బడబాదృతాత్ సదిశతు
శ్రేయాంసి హాస్యోరసః.

నాంద్యంతే సూత్రధారః (పరితోవ లోక్య) అత్రఖలు నిరంకుశ కితవనికృత్తమధూచ్ఛిష్టయష్ట్యాకృష్ట బాహుమూలరోమసవ్యథ లజ్జిత కుపిత బాలవిధవాజన కోలాహల ముఖరితదిఙ్ముఖే మహోత్సవే:—..............
(విమృశ్య)అస్తిఖలు నరేంద్రాగ్రహార నాయక మణేః సామవేదసాంయాత్రికస్య అష్ట భాషా కవితా సామ్రాజ్యాభిషిక్తస్య, బల్లాళరాయ కటకకవికుల గర్వపర్వతపవేః నాగనకవి నాగకేసరిణ, శ్రీకవిప్రభోః పౌత్రః, పుత్రః శ్రీ రాజనాథ దేశికస్య బ్రహ్మాండభాండ పిచండ మండలిత విజయడిండిమరవ చండిమ్నః శ్రీ కంఠాగమశిఖండ మండనమణేః శ్రీ డిండిమ ప్రభోః దౌహిత్రః శ్రీ మదభిరామనాయికా స్తనంధయః సభాపతి భట్టారకాచార్య భాగినేయః శ్రీడిండిమ కవి సార్వభౌమ ఇతి ప్రథిత బిరుదనామా సరస్వతీప్రసాదలబ్ధ కవితాసనాథః శ్రీమా నరుణగిరినాథః తేన కృతేన సోమవల్లీ యోగానందనామ్నా ప్రహసనేన సభాని యోగ మనుతిష్ఠామి.

అంత్యమున—

కాలాంభోదా యువానో
ఝులఝులనినదైః పూరితాశావకాశైః,
పాథోవర్షాభిజాతై
ర్విదధతు వసుధా ముల్ల సత్సస్యగర్భామ్;
....................స్వయమురసిముఖే
వ్యాహార్ద సామరస్యమ్,
దీర్ఘాయుర్దేవరాజో
ప్యవతు వసుమతీ చక్ర మాచంద్రతారమ్.

శ్రీనాథుడు వినుకొండవల్ల భామాత్యుని సహాయముచేత రెడ్ల రాజ్యమునుండి విజయనగరమునకు వచ్చి రాజాస్థానమును బ్రవేశింప బ్రయత్నించి భగ్నమనోరథుఁడై బహు దినములు కష్టపడేనపు కర్ణాటక రాజ్యలక్ష్మిని సంబోధించిన పద్యము చెప్పుచున్నది:

కుల్లాయుంచితిఁ గోకసుట్టితి మహా
కూర్పాసముం దొడ్గితిఁ
వెల్లుల్లిఁ దిలపిష్టముఁ దినవితిఁ
విశ్వస్తవడ్డింపఁగాఁ
జల్లాయంబలి ద్రావితిఁ రుచులు దో
సంబంచుఁ బోనాడితిఁ
తల్లీ, కన్నడరాజ్యలక్ష్మి, దయలే
దా నేను శ్రీనాథుఁడఁ.

తుదకు అతడు రాజకుల గురువు లగు చంద్రభూషణక్రియాశక్త్యాచార్యులసహాయమువలన డిండిమకవిని వాగ్వాదమునం దోడించి యతని కంచుఢక్కను బగులగొట్టి, కవి సార్వభౌమ బిరుదు నొందె ననియు, ప్రౌఢదేవరాయఁడు దన ముత్యాలశాలయందు గనకాభిషేకమును గావించె ననియుఁ దెలియుచున్నది.

దీనారటంకాలఁ దీర్థమాడించితి
    దక్షిణాధీశుముత్యాలశాల
....
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి
    గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తిరాయలయొద్దఁ
    బాదుకొల్పితి సార్వభౌమబిరుద

మఱియు,

కర్ణాటక్షితినాథహాటకసభా
    గారాంతరాకల్పిత
స్వర్ణస్నానజగత్పవిత్రకవిరాట్

అని సంబోధించుకొనియున్నాడు. శ్రీనాథుని శిష్యుడగు దగ్గుబల్లిదుగ్గయ్య "కవిసార్వభౌము డై కర్ణాటవిభుచేత కనకరత్నాభిషేక ములు గనిన శ్రీనాథసుకవి" యని ప్రశంసించి యున్నాడు

ఈ వాదము లన్నియు నాకాలము నందు నూతనోత్సాహ ముత్పన్న మయి యుండెననియు చూపుచున్నవి. ఆ సేతు కృష్ణాపర్యంతము నుండిన సామ్రాజ్యమున నింక వాఙ్మయసమూహము గల్గుటాశ్చర్యావహము గా దని తలంచినను వెనుకటిఘట్టమునకుఁబోల్చిచూచిన తారతమ్య మగపడును. వీరశైవ వైష్ణవకవులే ప్రముఖులుగా గానవచ్చినను అన్యమతావలంబులు నుండిరి. జైనదండనాథు డగు ఇరుగప్ప కడు వృద్ధుడయినను క్రీ. శ. ౧౪౨౨-వ సం. నందు శ్రవణబెళ్గొళమున పండితార్యశ్రుతమునియను నాతనికి దానమొసంగె నని యొక్క శాసనము వలన దెలియును. విఖ్యాతుడగు నేమిచంద్ర సిద్ధాంతికుడు దేవరాయని యాస్థానమునందు తార్కికులనెల్ల వాగ్వాదమునం దోడించి జయపత్రమును బడసెనని దెరకణాంబిబొమ్మరసు చెప్పియున్నాడు.

మండలేశ్వరప్రౌఢరాయన
కండు తత్సభయల్లి రంజిప
తండతండదవాదివిద్యానుగళ మదదుళిదు.
కొండుజయపత్రవను భూగె ప్ర
చండతార్కికరత్నసద్గుణ
మండనాంగగె నేమిచంద్రగె శిరవ మొగ్గి
    [సెను.

వీరుగాక భాస్కరకవి పెనుకొండయం దుండు శాంతీశ్వరబస్తియందు క్రీ. శ. ౧౪౨౪ సం. న 'జీవంధరచరితె'యను కావ్యమును వ్రాసెను. జినదేవణ్ణయనువాడు 'శ్రేణికచరితె'ను వ్రాసెను. ప్రాయశః ఈకాలమునం దనేకగ్రంథములను రచించిన జైనకవి కల్యాణకీర్తియనువాడు క్రీ. శ. ౧౪౩౯ యందు జ్ఞానచంద్రాభ్యుదయ కామనకథె, యనుప్రేక్షె, జినస్తుతి, తత్త్వభేదాష్టకేత్యాదిగ్రంథములను వ్రాసెను.

జైనులు మతవిషయకముగా బుక్క రాయ వైష్ణవులతో సంధిచేసిననాటినుండి బాధపడకపోయినను వీరశైవ వైష్ణవ మతము లట్లు భక్తిరసప్రధానము గాకపోవుటచే సామాన్యజనాదరణీయము గాక క్షీణించుచుండెను. మునుపటికాలమున దేశవ్యాపారమంత

యు ముక్కాలుపాలు జైనవణిజులచే నడచుచుండి, విజయనగరకాలమునందు వీరశైవుల పాలాయెను. ఆర్థికసహాయ మిట్లుండుటవలనను, వీరశైవులు రాజకీయాధికారములం దగ్రస్థానములనొందుటవలనను వీరశైవవాఙ్మయమే తల యెత్తుకొనెను. లక్కణామాత్యుడు గ్రంథకర్తలకు లక్షవరహములుమేరగా సహాయము చేయుచుండె నట. గుబ్బిమల్లణార్యుడు "లక్కణదణ్ణాయకులు భండారిజక్కప్ప (జక్కణ) కల్లెహాద కేతిసెట్టి వీరందరు లక్షసంఖ్య విత్తము వెచ్చముచేసి గ్రంథముల వ్రాసినది హెచ్చుగాదు. నిస్పృహుండుగా కావ్యము వ్రాసిన మల్లణార్యునిభాగ్యమే భాగ్యము"ని యన్నాడు.

సింహావలోకనక్రమంబున నీయర్ధశతాబ్ద వాఙ్మయమును బరీక్షించిన ననేకనూత్నభావములు తోచును. విజయనగర సంస్థాపన సమయమునందు బూనిన యనేక ప్రతిజ్ఞలం దొకటయిన దేశభాషోద్ధరణము పూర్ణ ఫలము నందుట కొక శతాబ్దము గావలసి వచ్చెను. మాధవమంత్రి యభిప్రాయముగా "యేషాంతు హీనజాతీనాం పురాణే ష్వనధికారః తేషామపి స్వదేశభాషాయైవ తత్త్వవిద్యాయా మధికారః" యనుట హైందవసంస్కృతి చరిత్రయం దొక ముఖ్యఘట్టసూచకమయినది. దేవభాషయం దేపామరులకును దత్త్వబోధన విహితమని విధించకపోయినను స్వదేశభాషయందైన నధికారముగలదని యొప్పుకొనుట సంస్కరణ పురోగమనమును చూపును! రాజకీయచరిత్రయందు విజయనగరము వెనుకటి సామ్రాజ్యములవలె జానపదస్థితినిమాని "నాగరికసామ్రాజ్యము" (City state) చూపువిధమున నీ సాహిత్యప్రపంచము నందును నూతన భావపథమును ద్రొక్కినది. దాక్షిణాత్య చరిత్రయందదివఱకు నేచక్రాధిపత్యము నింతస్వవిశిష్టత్వమును బొందలేదు. చోళచాళుక్యహోయసళసామ్రాజ్యములు ప్రాయః కర్ణాటక ద్రవిడదేశములందే ప్రబలముగ నుండుటవలన జనసంస్పర్శకంతయవకాశముకలుగలేదు. విజయనగరము నామమాత్రముగా కర్ణాటకరాజ్యమనబడినను దాక్షిణాత్యభాషలనుపయోగించు జనులందరు సామ్రాజ్యమునకు జేరినవారగుటచేతను, వారి సుఖసంపదభివృద్ధియే చక్రవర్తులధ్యేయ మయియుండినందునను ఆయా భాషలకును ప్రోత్సాహము నిచ్చుచుండెను. కావున ద్రవిడభాషాప్రవీణులు నార్యభాషావిదులు పరస్పరవాదసంఘట్టమునందు కుతూహలము పడుటాశ్చర్యము గాదు. ఈ సంఘట్టన ఫలము ముందటిఘట్టమున వ్యక్తమగును.

ద్రావిడభాషలకు నార్యభాషలకు నిట్లు పరస్పరమైత్రి గల్గజేయుట దేవరాయనిధ్యేయమయియుండెను. అయుపారమహిమాస్పదుండును, విఖ్యాతైశ్వర్యవంతుండును సర్వసారస్వతమకరందమధువ్రతాయమాన మానసుండును నైన యీరసికతల్లజుని ప్రోత్సాహ ఫలము సంస్కృతాంధ్ర ద్రవిడ కర్ణాటక వాఙ్మయచరిత్రలం దుద్ఘోషింప నర్హమయినది.

సంక్షిప్తసమరము

(పాండవవిజయము)

విన్నకోట వెంకటరత్నశర్మ గారు

౧

సైంధవుం డొక్కనాఁడు మదాంధుండై,
ధర్మమూర్తులు కుటీరంబునన్ లేనిసమయంబుఁ గాంచి:

౨

వారల గృహమ్మునం జొర, వారిజాక్షి
వారిజదళాన శీతలవారి నొసఁగి
'అన్న! మనయింట సేమమేనా?' యటన్న
నతఁడు దుష్టప్రసంగమ్ము నందుఁ జొచ్చి

౩

పాండవుల దూషణ మొనర్చి, స్వబల వైభ
వంబు నూరింత లెచ్చుగాఁ బాకి, 'తన్ మ
నోజకేళిఁ దేల్పు' మని, 'వినూత్న భూష
ణాంబరము లిత్తు' నని పల్క నా సుశీల

౪

'పోర! మూర్ఖావతంస, నీబుద్ధి తెలిసి
వచ్చె నిటువంటి పలుకులు పలుకఁ బోకు
మ న్మనోవిభుల పరాక్రమ మ్మెఱుంగ
వుర! నిలిచ చేని, అనుభవంబును లభించు!'

౫

సారపరమపతివ్రతాచారధీర
ద్రుపద రాట్పుత్రి పల్కు పల్కునకు సలిగి
పాలఁతి మైబట్టి స్యందనమ్మునన పెట్టి
వెలఁది గొల్లుమనన్ మనోవిభులు వచ్చి

౬

అతని త్రుళ్ళడఁగింపగా, నా యజాత
శాత్రవుం డపారకృపారసమ్ము నించి
వాని విడిపించె; నప్ప రాభవదవాగ్ని
భుగ్న హృదయుఁ జేసెను సైంధవుని గరంబు

౭

గురుబలంబుల కారుణ్యగురుత కతనఁ
గురుబలంబుల హృదయాలు కూలిపోవఁ
బరమ శస్త్రాస్త్ర వివిధసంపత్తు లాది
కీడులం దెన్నియే నొసఁగూడె మేళ్ళు

౮

తీరె, తీరనివనవాస దీక్ష; తీర
నున్న దజ్ఞాతవాసమహోగ్ర దీక్ష
ఎలమి మీపాల గోపాలకృష్ణమూర్తి
గలఁడు, మనవాఁడు కొంత శాంతిలఁగవలయు

౯

అనుచు భీముని సమ్ముఖంబునన ధర్మ
పుత్రునిన్ బ్రేమమీఱ ధౌమ్యులు వచింప
'మీ కటాక్షంబు మాకు శోభాకరంబు
సాధుజనగణ్య! భూమి నిర్జరవరేణ్య!

౧౦

కాననమ్ము దహింపఁగాఁగల దవాగ్ని
ఆకులం బిందెపోలెఁ దా నడఁగు నెట్లు
మానవతి మానరక్షణంబ యగు నెట్లు
అనుచు శంకింతు మానసంబున మహాత్మ!'

౧౧

తమ్మిచెలికాని మనుమఁ డీదారివలికి
ఎలమి భక్తిపూర్వక నమస్కృతు లొనర్చె
సేవికాకృత్య ధర్మముల్ చెప్పి కొన్ని
వారి విడనాడనుండ సప్పార్థివుండు

౧౨

అగ్నిహోత్రంబు ధౌమ్యుల కప్పగించి
ప్రబల శస్త్రసమితిఁ గళేబరమునందుఁ
గట్టి, నుతిపెట్టి, పెట్టి నగమ్ముపైన
విరటు కొలువున కిష్టులై వెలయుచుండ

౧౩

రాచదేవేరితమ్ముండు కీచకుండు
ద్రుపద తనయను గోరి తుందుడు కొనర్ప
వాని ప్రాఁగరెల్ల నణఁచి, అ వ్వాయుసుతుఁడు
నెరియఁ బొలియించె గుప్తభంగిని నెసంగి

౧౪

దీన దుర్యోధనుఁడు బుద్ధినూని, విరటు
ప్రోల ధర్మాత్ము లుండు రంబుధి వెలసి (?)
వారి అజ్ఞాతభంగి రభాసొనర్చి
ముప్పతిప్పలు పెట్టి సమ్మోద మొంద

౧౫

విరటు గోవ్రాతముంబట్టె, భీష్మ, ద్రోణ
కర్ణ వీరాదిసహితుఁడై కడఁగివచ్చి
నాఁటి కొకనాఁడుముందె అజ్ఞాతవాస
మంతరించె నటంచుఁ దా నరయఁబోక!

౧౬

అట బృహన్నల నిజరూప మవధరించి
నిజభుజోద్దండ గరిమ కన్పింపఁజేసి
వెలయు గాండీవరవము విన్పింపఁజేసి
వారిజాక్షుని దన మనసారఁ దలఁచి

౧౭

గురుపదంబుల శస్త్రపుం గుసుములు గూర్చి
కురుపదంబుల నపుడు గగ్గోలొనర్చె
బాహ్మపాత్రిక కుష్ణీషములను జేర్చి
విరటుపుత్రుఁడు కరము నివ్వెర వడంగ
నాలమందల మరలించె నా క్షణమున!

౧౮

ఎల్లరకు వీరిచందంబు తెల్లమయ్యె,
సజ్జనావళి హృదయాలు చల్లనయ్యె
అంత విరటుని కభిమన్యుఁ డల్లుఁడయ్యె
గ్రుడ్డివాని పుత్రుని గుండె గుటుకు మనియె!

౧౯

నంద నందనుఁ డప్పు డానందవారిఁ
గార్చె! కుంతీమహాదేవి కరము హర్ష
మందె, నుత్తరాసతి సిగ్గునందె; మారు
తాత్మజుండును నైదంత లయ్యె నంత

౨౦

గడచి గట్టెక్కినార మిక్కాలమునకుఁ
దావకానుగ్రహము! పెదతండ్రిగారు
మామకార్థార్థమొసఁగి, కుమారులబలెఁ
బ్రీతి వీక్షించుటే పదివేలు మాకు!

౨౧

ఇందులకు నిష్టపడరైతిరేని, లేని
పద మొసంగుట కైదూళ్ళవఱకునైన
జీవనోపాధి కలుగంగఁ జేసెదేనిఁ
జాలు; నెత్తురన్నముఁ దినఁజాలఁ దండ్రి!

౨౨

గడచిపోయిన గొడవలు గడచిపోయె
దానిఁ ద్రవ్వంగ నేటి కోధరణినాథ!
బిడ్డ వినకున్న, నీవు చెప్పి వినిపించి
తేని యెల్లరకును సేమమేకదయ్య!

౨౩

అనుచుఁ దనవాక్యములుగాఁగ మనవి చేయు
మనుచు శ్రీకృష్ణభగవాను ననిచె ధర్మ
రాజతండును రాయబార మ్మొనర్పఁ
గరము నుత్సాహమంది అక్కడకుఁబోయి

౨౪

ధర్మజుని వాక్యలందునఁ దనరు నతు
శాలఁ బూసలగ్రుచ్చినట్లు వచియించె
గాని చెవిఁబెట్టునట్లుగాఁ గానఁబడమిఁ
దావచించెను స్వాతంత్ర్యతాపథంబు!

౨౫

కొడుకుఁ గర్ణముఖ్యులుమాత్రె కూర్పువార
లా? సహోదరుని కుమార్లలంతివార
లా? స్వతంత్రించి యైదూళ్ళ నైన నీయఁ
జాలవా? కురుక్షయమె నీ సమ్మతంబా?

౨౬

అనిన దుర్యోధనాదు లత్యంత రోష
భూషిత కషాయులై, విరాట్పురుషురూపు
మాపు యత్నమ్మొనర్ప నమ్మాయలాఁడు
అంబరం బంత విశ్వ రూపంబుఁ జూపి

౨౭

గ్రుడ్డికిం గన్ను లిచ్చెఁ గన్గొనఁగ నచట
హర్షముం జెందినారు భీష్మాదు లెల్లఁ
బోవఁ బోవుచు శ్రీకృష్ణమూర్తి కర్ణుఁ
బిలిచి యేకాంతమునను దాఁ బలికె నిట్లు

౨౮

బావ! రాధేయుఁడవుగావు నీవు; పాండు
నృపతి నీతండ్రి, తల్లి కుంతీలలామ!
చెలఁగు చతురబ్ధివేష్టితక్షితికిఁ బట్ట
భద్రుఁడవగుము! చేరు మప్పాండుసుతుల!

౨౯

కృష్ణ, ఎవరికూడును భుజియింపుచుంటి
జీవమిడి వారి ఋణముఁ దీర్చెదనుగాక!
సర్వ మెఱుఁగుదు నీదారిఁ జను మటన్నఁ
బోయి పార్థసారథి యయ్యె మోహారమున!

౩౦

ఇరు తెగలు సిద్ధమయ్యె సంగర మొనర్ప
నాత్మ నశియింపదనుచు నిత్యమ్మటంచు
గానఁబడు నెల్ల భగవదధీన మనుచు
గీత లుపదేశ మొనరించె కృష్ణమూర్తి

౩౧

గురులకడ ధర్మసుతుఁడు గైకొనియె నాజ్ఞ
శస్త్రముల రాపిడులు హెచ్చె సమరభూమి
గ్రీష్మభానుప్రతాపుఁడై భీష్ముఁ డలర
నప్పు డడ్డువడె శిఖండియను ఘనుండు!

౩౨

కెంపు గనుఁగవఁ దళుకొత్తి క్రేళ్ళువారి
తురగముల నేనుఁగులను నెత్తుటను దేల్పఁ
బిఱికిపందలు పొంచి, గన్మొఱఁగులోనఁ
గూలిచిరి పాపము కిరీటికొడుకు నంత!

౩౩

యమసుతుం డార్చె ఘోరద్రోణానలమ్ము
నరుఁడు రాధేయుని పస నణంచె; గ్రూర
మతుల దుశ్శాసనుల గదాహతిని గొట్టి
భీమసేనుండు తనపొట్టఁ బెట్టుకొనియె

౩౪

ప్రబల యోధానుయోధు లీభంగిఁ గ్రుంగ
గడమవారలగొడవలు దడవనేల?
రహిఁ గురుక్షేత్రమున రుధిరస్రవంతి
విధవయిల్లాండ్ర వాకిళ్ల విరిగిపాఱె!

౩౫

ఉత్తరాగర్భమొండె అభ్యుదయమొందెఁ
జక్రి సత్కరుణావిశేషముకతాన!
దక్కఁగల యుపపాండవుల్ ధరణిఁబడిరి
బాడబుని తీవ్రకోపాగ్ని వశతఁ జిక్కి

౩౬

ధర్మసుతునకు రాజ్యపుం ధర్మమర్మ
ముల నెఱింగించి భీష్ముండు పుడమిఁబాసె
మహితసన్మార్గవర్తివంశమునఁ బుట్టి
పాండుతనయులు సన్మార్గవర్తులైరి

౩౭

తమ్ములంగూడి అశ్వమేధ మ్మొనర్చె
భూమిసురులకు ధనధాన్యముల నొసంగి
హృదయపంకేరుహముల శ్రీకృష్ణుఁ జేర్చి
ప్రజల సేవించె నంత ధర్మప్రభుండు!

౩౮

అభ్రగంగాప్రవాహంబునందుఁ గర్ణ
గోచరుండయ్యె నొక్కండు; గోవధూటి
నోచుకొన్నట్టినోముల ఫలమనంగ
నృత్యమొనరించుచున్ గొరటాలలోన!

అనుమానపిశాచము

దినవహి సత్యనారాయణ గారు

౧

—వదినా! చూచితివా స్త్రీల కెంత సాహసమో?


—ఆశ్చర్య మేమి మనోహరం? ప్రేమ ప్రభావమే అట్టిది. అ దెంతటి కార్యముల నైన చేయించును.

మనోహరరావు మందహాసమొనర్చెను. కృష్ణవేణి యాతని క్రేగంటజూచెను.

అప్పుడే యింటకాలిడిన శ్యామలరావు చెవుల నీమాటలు పడెను. తమ్ముడు మంచముమీాద పరుండి నవల చదువుచుండుటగాని, సమీాపమున గూర్చుని తనభార్య ఆలకించుచుండుటగాని యాతనికి క్రొత్త కాదు. కాని యామె నోట వెలువడిన మాటలు, ఆ క్రేగంటి చూపు, తమ్ముని మొగమందలి యా మందహాసరేఖ—ఆతని మనమునకు కష్ట



అప్పుడే యింటకాలిడిన శ్యామలరావు చెవుల నీమాటలు పడెను.



ఆ క్రేగంటిచూపు, తమ్ముని మొగమందలి యా మందహాసరేఖ—

ముతో చెను కష్టమే కాదు. హృదయమును మానపిశాచగ్రస్త మయ్యెను. తీయ నున్న కండువా తిరిగి సర్దుకొని వెంటనే వీథిగుమ్మము వైపునకు మరలెను.

కృష్ణవేణి తొందరగ లేచి

—ఫలహారము చేయరా? అనెను.

—చేయుట కేమిలే మరల వత్తునని శ్యామలరావు వెడలిపోయెను.

మనోహరరావు మంచముమీద నుండి లేచి చదువుచున్న నవలనుమూసి బల్లమీద నుంచి గోడకు తగిలించియున్న "టెన్నీసు బేటు" తీసికొని

—వదినా! బంతిఆటకు వేళయైనది. పోయివత్తు నని యిల్లు వెడలెను.

కృష్ణవేణి మనస్సు పరిపరివిధముల పోదొడగెను. భర్తమోహము కళదప్పి యుండగ చూచినది ఆమె యీనాడే. ఇంటికి వచ్చుట తోడనే నవ్వుచు పల్కరించుట, పేరు పెట్టి పిల్చుట, ఆహేళనలు ఏమియు నేడు కాన రావు— "సేవకవృత్తి కడు నీచమైనది. పై యధికారులేమైన పనికేమొ? లేనా, వారి ప్రాణ మిత్రులలో నెవ్వరికేని ఏ యాపదయు వాటి ల్లదు కదా?"—అని యెన్నియో కుశంకల జేసికొనుచు ఆలోచించుచుండును గాని యేమి యు నిశ్చయింప నేరకున్నది.

శ్యామలరావునకు రాజమహేంద్ర వరమున తాలూకా కచ్చేరిలో పని. నెల కొక యేబదిరూపాయల నిత్తురు. మనోహరరా వా తని పినతండ్రి కుమారుడు. వారలకు భూవసతి చాల తక్కువ. పై దక్షత లేదు. మొదటి నుండియు అన్నగారిసహాయమువలననే చదువు కొనుచున్నాడు. ప్రస్తుతము మనోహరరావు ఆర్ట్సుకాలేజీలో బి. ఎ. క్లాసులో చదువు చున్నాడు. మొదట కొన్ని దినములు హాస్టలులో నుండువాడు. అన్నగారి కీయూరు బదలీ అయి వారిచ్చటికి వచ్చిననాటినుండియు వారి యొద్దనే యుంటున్నాడు. భూవసతి చాల తక్కువయగుటచేతను, కావలసినవా రందఱు వారల చిన్నతనములోన నేమరణించుటచేతను శ్యామలరావునకు ఉద్యోగములో ప్రవేశించు వరకు పెండ్లి కాలేదు. మనోహరరావు ఇంకను అవివాహితుడు. కృష్ణవేణి కాపురమునకు వచ్చి యిప్పటి కెన్నో నెలలు కాలేదు. వారి పుట్టినిల్లు కాకినాడ. అచ్చట గవర్నమెంటు బాలికాపాఠశాలలో ఆరవతరగతివరకు చదివినది. ప్రకృతపు విద్యావతులగు క్రొత్త కోడండ్రకువలెనే నవలలచదువుట ఆమెకు నొక వ్యసనము. అందుచే మనోహరరావు వదినెగారికి కావలయు పుస్తకములను స్నేహితుల యొద్దనుండియో, గ్రంథాలయములనుండియో తెచ్చి యిచ్చుచుండును. ఇచ్చుటయే కాదు; ఆమె వినోదార్థము ఆమెకు తఱచు చదివి వినిపించు చుండును. తాను చదువుచుండుటకన్న మఱది చదివి వినుపించుచుండుటలో కృష్ణవేణి కొక విధమగు ఆనందము కల్గుచున్న మాట మాత్రము వాస్తవము.

౨

దాంపత్యజీవిత మందలి సుఖమునకు మూలాధారము అన్యోన్య ప్రేమ. ఆ ప్రేమ దంపతులలో నెవ్వరియం దణుమాత్రము జంకి నను [illegible] గార్హస్థ్యజీవనమున సుఖ మనుమాట కల్ల.



అచ్చట నున్న మెట్లపై నొంటరిగ కూర్చుని యాలో చింప దొడగెను__

శ్యామలరావు తిన్నగా గోదావరి గట్టు నకుపోయి అచ్చటనున్న మెట్లపై నొంటరిగ కూర్చుని యాలోచింప దొడగెను___'అకటా! స్త్రీహృదయము దుర్గ్రాహ్యము కదా! కృష్ణవేణీ! నీవు నన్ను హృత్పూర్వకముగ ప్రేమించు చుంటివని పొరపడితి నే! ఎంతపని చేసితివి? నీ యాచిరునగవు,ఆహావభావ ప్రకటన-అంతయు కృత్రిమమా! "అంగన నమ్మరాదు" అను పెద్దల సుద్దులయం దెంత సత్యము కలదు. మనోహరమా యిట్టిపని కొడిగట్టుట! నాకు భృత్యుడై చరియించుచుండువాడే! నే నన్ను దైవమువలె చూచు నాతమ్ముడు!___కాదు___కాదు___నేనే పొరపడితిని. వదినా మఱదులు గదా! వారలయందు పరియాచకము సహజమే! దాన్నికై అనుమానించు చున్నా నేమి? పెద్ద నిట్టూర్పుపుచ్చి___ అనుమానమే కాదు. నిజము. ముమ్మాటికిని నిజము. ఆ చూపులు ప్రణయసూచకములు. అందు గూఢార్థ మవశ్య మున్నది. ఇంతవరకు నా లేదోష మొనర్చ కున్నను త్వరలో నొనర్పనున్నా రని వారల చూపులు, వారల నవ్వులు తెలియజేయు చున్నవి___నన్ను నేనే దూషించుకొనవలెను. లేకున్న నింత చనవు వారల కెవ్వ రిమ్మని చెప్పిరి?'

సూర్యుడు గ్రుంకెను. జారసమాగమ కాంక్షిత యగు గొతవిూసతి శీతకరు కరస్పర్శనమున కులుకుచుండెను. దక్షిణానిలుడు వారల తట్టుచు హెచ్చరించుచుండెను. కాలమహిమను ప్రేక్షకులకుగూడ వారి చెయిదములు మోదావహములుగ నున్నవి. కాని చంద్రాగమమున పరుగెత్తుకొని వచ్చి నిశాకాంత శ్యామలరావు హృదయగహ్వరమున దాగెనేమో యనునటు లాతని హృదయము తమోభాజనమై యున్నది.

'నే నిప్పు డేమి చేయవలెను? ఈ ఆలోచనలో నొక్కొక్కమా రాతనిమో మెత్త వాలును. ఒక్కొక్కపరి మొగము చిట్లించును. మఱియొకసారి "అబ్బా"యని పెద్ద నిట్టూర్పు పుచ్చును. ఆతని మనఃక్షేత్రమున కోపము, అసహ్యత, సంతాపము నొండొంటితో కలహించుచున్నవి. ఆముఖలక్షణములు తజ్జన్యములే. భార్య ననుమానించుచున్న వాని హృదయబాధ మనము తేలికగ తెలిసికొనజాలము. ఇంటిగుట్టుబయటబడరాదు ఇదియే మాత్రము వెల్లడించినను పెద్ద యల్లరి యగును. ఇంతకును ఇందలి సత్యము నాకును బోధపడలేదు. మాతమ్మునితో— "ఇంటియొద్ద నీకు చదువు చక్కగ జరుగదు. పరీక్షలు సమీపించుచున్నవి. నీవు పోయి హాస్టలులో నుండుము"ని చెప్పెదను. వాడు నామాట కెదురాడడు. నాకు వీరిలక్షణముల నింకను పరీక్షింప నవకాశమును చిక్కును. ఇదమిత్థమని నిశ్చయించుటకును వీలగును.'

అనుకొనుచు లేచి యింటికి వచ్చెను.

* * * *

తానును, తమ్ముడును భోజనమునకు కూర్చునిరి. భార్య నేమియు పల్కరింపలేదు. ఆమె కారణము నూహింపలేక సంకోచించుచు మెల్లగ వడ్డించుచున్నది. ఇంత శ్యామలరావు తమ్మునివైపునకు దిరిగి

'మనోహరం! పరీక్షకు గట్టితివిగదా! ఇక మీ పరీక్ష లెన్ని దినము లున్నవి?'

'—నిండా మూడు నెలలులేవు.'

'సమీపమునకు వచ్చినవే. నా కొకటి తోచుచున్నది. నీకిక్కడ చదువు జరుగదు. అదిగాక హాస్టలులో నున్న విద్యార్థులతో కలసి చదువవచ్చును. ఏదో గట్టిగా పట్టుబడితే యీసంవత్సరము నెగ్గవచ్చును. మన కష్టములును గట్టెక్కును.'

'నేను నక్కడకు వెళ్లుచు విద్యార్థులతో కలసి చదువవలెననియే అనుకొనుచున్నాను.'

'అక్కడకు నిక్కడకు తిరుగుచున్న కాలము వ్యర్థాగా పోవును. హాస్టలులోనే యేల యుండరాదు?'

'అబ్బే, అంతఅవసరము లేదు.'

'మఱొకవిధముగ ననుకొనకుము. అందు కగువ్యయము నేను భరింతును. ఈబంతియాటలనుమాని అక్కడ నేయుండి గట్టిగ చదువుము.'

'రేపే నీ పుస్తకములను వానిని తీసికొని హాస్టలులోనకు వెళ్లియుండుము.'

మనోహర మెదురు చెప్పలేదు. మరునాడాతడు తన సామానును తీసికొని హాస్టలులో ప్రవేశించెను.

3

రెండుదినములు గడచినవి. భర్తకోపమే మాత్రమును శాంతింపలేదు. సాయంకాలముల యింటికి ఫలహారమునకు వచ్చుట గూడ శ్యామలరావు మానినాడు. మానవతి యగు

స్త్రీ భర్తకొట్టినను, తిట్టినను సహించునుగాని పతివిముఖతను మాత్రము భరింపజాలదు.

రాత్రి తొమ్మిదిగంట లయినది. కృష్ణవేణి భర్తపాదముల నొత్తుచు

'ఎందుకండి ఈకోపము? నేనేమి తప్పు జేసినాను?'

భర్త మాటాడలేదు.

'ఏమండీ! నామీద ఒట్టు. నాతప్పేమి?'

'అవును నీ తప్పేమి?'

'అయ్యో! అంతకోపమునకు నేనేమిచేసితిని? ఏదేని తెలియక చేసిన చెప్పరాదా? దోషమున్న దిద్దుకొందును.'

'దోషమున్న దిద్దుకొందువు! కాదూ? అవును నీదోషమేమి? మీకిద్దఱకు చనువిచ్చినందులకు నాదే దోషము.'

భర్త అనుమానకారణము స్ఫురించెను. స్ఫురించుటయేకాదు. ఆమె హృదయముపై నది యొకగొడ్డలి పెట్టువలె పడెను. ఆమె వెక్కివెక్కి యేడ్చుచు పతిపాదములపై వ్రాలి "అయ్యో! ఎంత పొరపడితిరి?" ఆతని నాపుత్రుని వలె.........

'ఛీ! ఛీ! నోరుమూయుము. ఈబుడిబుడి దుఃఖముల కేమి? నేనేమి గ్రుడ్డివాడ ననుకొనుచున్నావా? మీ చూపులు, మీ నవ్వులు గ్రహింపలే దనుకొనుచున్నావా? స్త్రీల విశ్వసించుటయేదోషము—పో!పో!' యనికాలితో నొకత్రోపు త్రోసెను.

ఆయబల నిశ్చేష్ట యయ్యెను.

'భర్తకుకాని దానినయినతర్వాత నాకెందుకీబ్రతుకు! గోదావరిలో మునిగి ప్రాణము గోల్పోవుదును.'

కాని ఆపె కాపురమునకు వచ్చి కొలది దినములే యయ్యెను. భర్తతో గూడి అనన్య సుఖాంబుధి నోలలాడవలె నని యెంతో యాశించినది. నిజము తెలియకమానదు. కాలము నానిర్దోషత భర్తకు ప్రకటించి న న్నాతని కృపాదృష్టికి పాత్రురాలిని జేయునను ఆశ యొకటిఆమెను ఆత్మహత్యనుండి వారించుచు వచ్చెను.

దినము లిట్లెన్నియో గడచినవి. శనివార ఆదివారములలో మురదిపచ్చి వెళ్లుచుండెను. కాని భర్త యనుమానము నాతని కడ నామెయెత్తి పల్కలేకుండెను. "నవల నేమైన చదువుదునా?" యన్న "వద్దు. పరీక్ష చదువు పాడుచేసికొనకు"మనియు, లేదా "నాకీరోజున తలనొప్పిగా నున్నది, ఈమారు చదువుదువు గాని" అనియు కృష్ణవేణి మనోహరముతో చెప్పి పంపివేయుచుండును.

అతడువచ్చి వెళ్లుచుండుట పతియనుమానము నెక్కువ చేయుచుండెను.

కొన్ని దినము లయినతర్వాత కృష్ణవేణి యన్నగారు కోర్టుపనిమీద రాజమహేంద్రవరము వచ్చెను. భోజనము లయిన తర్వాత శ్యామలరావు నాతని బిల్చి

'బావా! నన్ను మరల నిక్కడకు బద లాయింతురో తెలియదు. [illegible]పమునకు

వచ్చినాము. మీచెల్లెలి నొకసారి తీసికొని వెళ్లుము. పదిరోజులు వారల తల్లియొద్ద, తమ్ముల వద్దనుండి వచ్చు' ననెను.

నారాయణరావు సంతోషముతో 'సరే' యనెను. కృష్ణవేణి మొగమున సంతోషమును లేదు, దుఃఖమును లేదు. ఏదో మఱచిపోయిన దానివలె అన్నగారివెంట పుట్టినింటికి వెళ్ళెను.

౪

కృష్ణవేణి పుట్టినింటికి వచ్చి యిప్పటి కారునెల లయినది. భర్త కెన్నియో ఉత్తరముల వ్రాసెను కాని యొక్కదానికి నాతని యొద్దనుండి ప్రత్యుత్తరము లేదు. భర్తకు దన యెడ గల్గిన అనుమానమునుగూర్చి మిథ్యాభిమానము తల్లితోనైన జెప్పనీయలేదు. తనంతటదాను ధైర్యముచేసి భర్తకడకు పోవుటకు సాహసింపలేదు. మెల్లగ నామె హృదయమున పతియెడ నొక విధమగు ద్వేషము కలుగ జొచ్చెను. ఇక నిష్టపడామె వచ్చుటకు పోవు తలంపుగూడ కల్గుటలేదు.

మనోహరరావు మరియొక ఆదివారము అన్నగారింటికి వెళ్లెను. వదినెగారు రాలేదు. అన్నగారు వండుకొనుచుండెను.

'అన్నయ్యా! వదిన యెక్కడ?'

'మీవదినా? పుట్టినింటికి వెళ్లినది.'

'మీకేమైన సహాయము సేతునా?'


'నాకేసహాయ మక్కఱలేదు. నీవుపోయి చదువుకొమ్ము. మీవదిన వచ్చినతర్వాత వత్తువుగాని. పాప మామె యింటికడ నొంటరిగ నుండజాలదు.'

మనోహరరావున కన్నగారి మాటతీరు వేఱుగ నున్నటుల బోధపడెను గాని యందలి వ్యంగ్యార్థమును గ్రహింపనేరడయ్యెను.


దినము లనేకములు గడచినవి. మనోహరము పరీక్షలయి యింటికి వచ్చినాడు. వదినగారు రాలేదు. అన్నయ్యవైఖరి మారినది. తన్ను చూచిననే మొగము చిట్లించుకొనుచుండెను. పనిలో సాయపడబోవ 'వ'ద్దని గదుము చుండెను. ఆతని కేమియు బోధపడుటలేదు. ఎంత యాలోచించుచున్నను అన్నగారియందలి మార్పునకు కారణ మాతని బుద్ధికి పొడకట్టలేదు. ఒకనాడు శ్యామలరావు



తమ్ముని పిలిచి—'మనభూములమీది కొక మారు వెళ్లి గతసాలు బకాయి వసూలుచేసి కొని ర'మ్మని చెప్పెను.



చిత్రము ౭.



చిత్రము ౬.

'సరే' నని మనోహర మాతెల్లవార గట్ల బండిలో బయలుదేరి కాకినాడలో దిగి తిన్నగా నీలపెల్లిపోయి అచ్చట రెండురోజులు మకాముచేసి బకాయిలో కొంత వసూలు పెట్టుకొని తిరిగి వచ్చునపుడు వదినగారి పుట్టినింట నాగెను.

లోకమర్యాదలయి స్థాయిపడినతరువాత మనోహరము వదినెగారితో 'వదినా! ఈమారిన్నినాళ్ళు ఆగినారేమి? మాకు వంట బాగుగా నలవాటు కావలెననియా?'

కృష్ణవేణి యొక్క నిట్టూర్పు విడిచెను. మాయమర్మముల నెఱుగజాలని మనోహరి రావున కామె యేమని జవాబు నిచ్చును?

'మీఅన్నగారు కులాసాగానున్నారా?'

'కులాసాగానే యున్నారు. కాని వదినా మీరాలాగున నున్నారేమి? అన్నగారివైఖరి మారినది. మీరు విచారగ్రస్తులయి యున్నారేమి? అన్నయ్య మిమ్మేమైన ననెనా? మీరెన్నడు నిన్ని దినములు పుట్టినింట నుండలేదే! అన్నయ్య మిమ్మువిడచి—'

'ఏమి చెప్పుదును మనోహరము' అని కృష్ణవేణి పెద్దపెట్టున నేడ్చెను.

మనోహరమునకు కన్నులనీరుగ్రమ్మెను. గద్గదస్వరమున—వదినా? ఏమిటది?

'మనోహరం! ఏమి చెప్పుదును?' మీ అన్నయ్య...... మనలను...... సంశ...యించుచున్నారు!'

'అయ్యో! అయ్యో!'

అని గ్రుడ్ల నీరు నింపుకొనుచు మనోహరము గోడకు జేరగిలబడెను. తాను మంచము మీద బరుండి నవల చదువుచుండుట, వదినె గారితో సంభాషణ, అన్నగారువచ్చిఫలహారమైన చేయకుండ వెడలిపోవుట, తన్ను హాస్టలున కంపుట, ఆదృశ్యము లన్నియు నొక్కమారు కన్నుల కగుపడి అన్నగారి ప్రవర్తన మందలి విపరీత పరివర్తనకు కారణ మాతనికి నేడు హృద్గోచర మయ్యెను. కొంచెకవడి యాలోచించి, దుఃఖించిన లాభము లేదనుకొని వదినగారి నోదార్చి—'అమ్మా! వదినా! మీరు దుఃఖింపకుడు. నేను తిరిగి యెల్లుండివచ్చి మిమ్ము నన్నగారియొద్దకు తీసికొని వెళ్లుదును. మీ యందాయనకు సంశయము తొలగిపోవును.



మీ అన్నయ్య...మనలను...సంశ...యించు చున్నారు.

మీరు సుఖులై యుందురు. నామాటనమ్ముడు. ఇప్పటికి నాకు సెలవిండు.' అని వదినగారిపాదములకు నమస్కరించి కృతనిశ్చయత వెలుపు చూపులతో నామె నొక్కపరి నవలోకించి మనోహరము రాజమండ్రీ వచ్చివేసెను.

౫

ఆమరునాటి సాయంకాలము గోదావరీ తీరమున శ్మశానమున కవ్వల నొక యిసుక తిన్నెపై మనోహరరావు తన పైయుత్తరీయము బఱచుకొని పరుండి ఆలోచనలో మునిగెను.

'అకటా! ఎంతపనిజరిగె. అన్నయ్యతో నిక నెట్లు చెప్పగల్గుదును? వారిని చూచున రికే నానోట మాట రాలేదు. అక్కడకును "నేను నిర్దోషిని అన్నయ్యా! వదినెను రక్షింపు"డని కాళ్ళుపట్టుకొంటిని—ప్రత్యుత్తరము లేదే!—ఎంతపని!—వారల దాంపత్యజీవనమునకు నేను వేరుపురుగునైతినా! దైవమా! నాతల్లి నాపసితనముననే పోయె. అక్కచెలియండ్రా లేరు. వదినెగారి చరణములకడజేరి "నాబ్రదుకులో కోమలత్వమను పాఠమునేర్చుకొనదగును" "వల్లె" అని సంతసించితిని. మేమెక్కువ చనువుగ నున్నమాట సత్యము. మేమేమి చదువుచు వచ్చినను లాలసోపహత చేతస్కులము కాలేదే! రామా! రామా! ఆతలంపే మాకు కలుగలేదే! తుదకిట్టి పరిణామమా! "ఊపి లేనిచోట గంటువెట్టు" స్వభావముగల ప్రజ పొరపడిన పొరపడవచ్చునేమొ! కాని నాస్వభావము, మావదినె సచ్ఛీలత పూర్తిగా నెఱిగిన మాయన్నగారా!—రామా!—ఇక విచారించిన లాభములేదు. సర్వసుఖములతో నొప్పవలసిన సంసారమొకటి నామూలమున నేల గూలుచున్నది. వారిరువురి సుఖజీవనమే నేగోరునది—అన్నగారి సంశయనివారణకు నే నీతుచ్ఛప్రాణములనైన బలినిత్తును—ఆత్మహత్య పాపముకాదా! అవుగాక!—నేను జీవించియుండుటవలన నెవ్వరికి లాభము!—అన్నగారి కొకవేళ మాయందు సంశయము తొలగిపోయినను నేను వారి మొగము చూచు టెట్లు?—నన్ను చూచినపుడు ఆ వెనుకటిస్మృతి ఆయనను మాత్రము బాధించుచుండదా!—ఇంతకును నేను బ్రదికి యెవ్వరి కుపకారము! తలిదండ్రులా లేరు. అన్నిటికిని అన్నగారినే నమ్మితిని. వారా విముఖులైరి. నేను నిర్దోషినని గ్రహింతురను కొందు. అయినను నాయందు వారి కానాటి ప్రేమయుండునా! వదినగారిని చూడకుండు టెట్లు? చూచినను స్వచ్ఛహృదయముతో వెనుకటియట్లు ఆమె మోము చూడగల్గుదునా? సంశయము, భయము నన్ను బాధించుచుండదా?—అబ్బా! నాకీజీవితమువలదు—పరమేశ్వరా! ఈదీనుని రక్షింపుము. ఇదియే నాకడసారి ప్రార్థన'—అని యిక నేదో యాలోచనలో మరియొక పదినిముసములు వెచ్చించి లేచి చేతిగడియారమువంక చూచి 'ఇంకను కాకినాడ బండికి సమయమున్నది—వదినెగారిని రేపటిబండిలో తీసికొనివచ్చి వారుభయులు

నొక్కచో గూర్తును. అంతటితో నీప్రపంచ రంగమునుండి యీపాత్ర నిష్క్రమించును.' అని యాలోచించుచు కాలేజీవైపునకు వెళ్లి పోయెను.

*   *   *   *

మరునాడు తొమ్మిదిగంట లయినది. శ్యామలరావు వంట చేసికొనుచుండెను. కష్టించి సుఖింపవచ్చును గాని సుఖించి కష్టింపనేరము. తన యాజ్ఞానువర్తియగు భార్య అడుగులకు మడుగు లొత్తుచు చేసి పెట్టుచుండ హాయిగ భోజనము చేయుచు వచ్చిన శ్యామలరావునకు ప్రొయ్యి యొద్ద ఇప్పుడు చెప్పరాని విసుగు జనించుచున్నది. అదేమొకాని అగ్నిహోత్రుడు స్త్రీల యాహ్వాన మంగీకరించినంతత్వరితముగ మన యాహ్వాన మంగీకరించునట్లు కనబడడు. బుడ్డెడు కిరసనాయిలు పోసినను, పెట్టెడు అగ్గిపుల్లలు తగులబెట్టినను నొక్కొకపరి ఆ హవ్యవాహనుడు ప్రసన్నుడే కాడు. స్వహస్తపాకమున కష్టము దోచుచుండెను. భార్య వ్రాసిన యుత్తరముల మనసుకలిగెను. మనోహరము ప్రవర్తన తిలకించినకొలదియు శ్యామలరావునకు "ఈతడునిర్దోషి. నే నెంత పొరపడితిని" అనిపించుచుండును. కాని ఇక నామె నెట్లు పిలిపింపవలెనో చింతింపలేక కాలయాపన మొనర్చుచుండెను. ఇంతె మనోహరరావు వచ్చి యాతని పాదముల బడెను. శ్యామలరావు హృదయమున జ్ఞానోదయ మయ్యెను. ఆతని హృదయగహ్వరమున జొచ్చిన తమము విడ నారంభించె. ఈనాడట్లు వంటచేసికొనుచు శ్యామలరావు—'కృష్ణవేణి వ్రాసిన యుత్తరములకు పాషాణహృదయములైన ద్రవింపవచ్చు— అయ్యో! నే నింత కఠినహృదయుడనైతినేమి? నా సంశయమే నన్నావేశించినట్లున్నది. కృష్ణవేణీ! నిన్నూరకనే అనుమానించితినా! మనోహరము, నా దక్షిణభుజమనదగు మనోహరము, నిన్న నా పాదములబడి "అన్నయ్యా! వదినను స్వీకరింపుము; మేము నిర్దోషులము" అనివెక్కి వెక్కి యేడువ నాగుండె నీరయ్యెనే కాని "రమ్ము, నాయనా!" అని యాతని కౌగలించుకొననైతినే! ఈపిశాచమును నాహృదయమునుండి పోదోలు టెట్లు?—ఆతడు నిన్న సాయంకాల మెచ్చటకు పోయెనో! ఇంతవరకు భోజనమునకునైన రాలేదు. ఎందులోనైన మునిగి ప్రాణములు గోల్పోవడుగదా! తమ్ముడా! రమ్ము! నిన్ను నే నవమానించిన నాటికి నేటికిగల నీ శరీరస్థితియే నీవు నిర్దోషివని చాటుచున్నది. మీవదినె యుత్తరములు ఆమె ప్రేమ స్వరూపమును వెల్లడించుచున్నవి. నామనసు కొలది దినములనుండి మారుచున్నను ఏలనో! ఇంకను సంపూర్ణముగ నిష్కల్మషహృదయుడ గానేరనైతిని! కాదు, నీవు నిన్న నన్ను పవిత్రహృదయుని జేసితివి. రమ్ము! భోజనమునకు రమ్ము మీవదినను రప్పింతును' అని పిచ్చివానివలె భావములందు నిల్కడలేకయాలోచించుచుండ వీథిగుమ్మముకడ బండి యాగిన చప్పుడు వినబడినది. అంత లేచి శ్యామలరావు వీథిచావడిలోనకు వచ్చెను. మనోహరమును తన భార్య

యు గుమ్మములో కాలిడిరి. శ్యామలరావు వారలజూచి తెల్లబోయెను. కృష్ణవేణి నిశ్చే ష్టయై పతిమోము చూచుచుండెను. ఇట్లు రెండుమూడు లిప్తలకాలమయ్యెనేమొ! గోడ నానుకొని నిల్చియున్న మనోహరరావు గుభా లున నేలగూలెను. రెండుమూడు వాంతు లయినవి. కన్నుల తేలవైచెను. 'తమ్ముడా!' యని శ్యామలరావును, "మనోహరం! మనో హరం!" అని కృష్ణవేణియు నాతని కిరుప్రక్కల జేరి కూర్చుని యాతని మరణయాతన గాంచు చుండ కష్టముపై రెండుచేతుల జోడించి అన్న గారివంక నొకమారును, వదినగారివంక నొక మారును,మనోహరము తనదృష్టుల బఱపెను. మరి పదినిముషములకు మనోహరము కాడు. పట్టికట్టె మిగిలినది.

"అయ్యో! తమ్ముడా! నా యనుమాన పిశాచము నిన్ను కబళించెనా!" యనిశ్యామల రావు వాపోవ జొచ్చెను.

"అయ్యో! మా కొఱకు నీవు బలియై తివా తండ్రీ! ఎంతపనిచేసితివి" యనికృష్ణవేణి యేడ్వ నారంభించె.

* * * *

మనోహరరావు కోటుజేబులో రెండు కాగితములు కనబడినవి. అందులో నొకదాని మీద—కొన్నిదినములనుండి నాకీజీవితముపై నసహ్యము కల్గుచున్నది. కాన కాలేజీ లేబరే టరీలోనుండి పొటేషియమ్ సినైడ్ తెచ్చి మ్రింగి నాప్రాణముల నా చేతులతో త్రుంపు కొంటిని. నా మరణమునకు నేనే కర్తను.

14-10-23 }
రాజమండ్రి } ఇట్లు:
ఖానుఖేల మనోహరరావు.

రెండవదానిపై

పూజ్యులగు అన్నగారి దివ్యపాద పద్మ ముల సన్నిధికి:—మనోహరరావనేక నమ స్కారములు. నన్నుమీరు చిన్ననాటి నుండి యు పెంచి పెద్దవాని జేసితిరి. దానికి కారణాం తరముల యీజన్మమున మీ ఋణము తీర్చు కొనజాలనందులకు చింతిలు చున్నాను. నేను మ. స. వదినెగారిని,మిమ్ములను నా తలిదం డ్రులవలె భావించి పూజించితిని. దానికి దైవమే సాక్షి. తెలియక నేనేమైన చేసిన క్షమింపుడు. పరమపతివ్రతాశిరోమణియగు వదినెగారి పాద పంకేరుహములకు నాభక్తి పూర్వక ప్రణామ ములు.

అన్నయ్యా! ఏమని వ్రాతును. మీరుభ యులు కలతలేని గార్హస్థ్యజీవన సుఖ మనుభ వింతురు గాత యని నాప్రార్థన.

14-10-23 }
రాజమండ్రి } ఇట్లు విధేయుడు:
మ నో హ ర ము.

తలపోఁత

మిన్నికంటి గురునాథశర్మ గారు

నీకుం బెండిలి సేసి నీ తనయులం దెప్పించి ముద్దాడఁగా
నీకున్ సారెకుఁ బంపి నీమగనికి న్నెయ్యంబు నిండింపఁగా
నీకుం గూటికి లేమి లేనిపగిది న్నిత్యం బానర్పంగ నే
నాకాంక్షించితి నే యయయో, యెచట మాయం జైతివే యింతలో.

ని న్నే వేళ స్వజాతిసంఘ మెట కేనిం దోడుకొం చేగునో ?
ని న్నే వేళఁ గఠోర ఘాతుకమృగానీకంబు భ్రమందించునో ?
ని న్నే వేళ ధనుర్ధరుల్ దునుమ నన్వేషింతురో యంచు నే
నున్నాఁడ న్నినుఁ జేర్చి ప్రాణముల నయ్యో, యిప్పు డెం దేగితే.

ఏవాఁడైన మృగవ్యదుర్వ్యసనుఁడై యేతెంచి తేఁ డియ్యెడం
దా వీక్షించి నను న్సభక్తిమెయి నుండంగం దదీయాసిఁ ద్రా
సావేశంబునఁ గాంచి మై గగురుపా టంద న్నను న్వీడి ద
వ్వై వ వెళ్లన్ యతనించు నీ బెదరుచూ పస్మన్మనం బేర్చెడున్.

బెబ్బులికూఁత లెందయిన వీనులసోఁకుడు మై సెమర్పఁగా
గబ్బి కనుంగవం దొరఁగఁగా బెళుకారెడి చూపు దాటు త
బ్బిబ్బయి డెందమెత్తెఱఁగ విన్న దనంబు మొగంబు నిండఁగా
దబ్బున నాయొడిం బడెడి దానవు నీ విపు డెందుఁ బోయితే?

గడ్డము లాగి పైకొనెదు గంతులువైచెదు నేను బట్టఁబో
నడ్డమువత్తు స్నానమునకై చనుచోఁ దడికావిగుడ్డ గ
న్పృష్ట నెలేని నారవయువం గమకింతు కమండలూదకం
బిడ్డ గ్రహింతుగాని యొకయేటికిఁ బో విపు డెందుఁ బోయితే?

నీయందంబును నీవిలాసమును నీనేత్రద్యుతి స్సాయమున్
నీయొయ్యారము నీబెడంగు నడకల్ నీభక్తి నీప్రేమ మే
చాయ న్నేమఱవం దలంచినను నాశక్యంబు గాకుండె నో
రా! యెం దేఁగితి గట్టిగుండెగలదానా, నన్ను వంచింపఁగన్.

నిద్దపుఁజూపులు న్నడక నేరుపులున్ మృదుదేహకాంతులుం
బెద్దయుఁ గాల మేను గని పెంచితిఁ బ్రాణము నిల్పి నీపయిన్
ముద్దులు మూటగట్టు నినుఁబోలినదాని జగానఁ గానకే
వద్దిర మోసగించి యెటకైనను బోయెదవం చెఱుంగమిన్.

నీమృదు దేహకాంతి స్తోమమే యీశ్వర స్వరూపంబు నా ప్రాణమునకు
నీవినిర్మల చంచలావలోకనములె యతిసరాలు నాప్రాణమునకు
నీ యనుత్తమగుణానీక ప్రశంసయె ధ్యానయోగంబు నాప్రాణమునకు
నీయన్నపానాది నిర్మాణకృషియె సమ్యక్తపోవృత్తి నాప్రాణమునకు
నేను నీవ, నీవ నేనయి యుంట జీ-వేశ్వరులకభేద మెఱ్దుకొనుట
యే యటంచు నెంచి తిన్నాళ్లు-నీపోక నరయనైతి బేలనైతి నకట.

నీతో నాటలుపాటలు-నీతో స్నానాన్నపాన నియమవ్రతముల్
నీతో సర్వస్వంబని చేతంబునఁ దలఁచి తిట్లు సేయందగవే?

ఎపుడే నాకు ననిష్టమైన పనులన్ స్వేచ్ఛాప్రవృత్తిం బూన
ర్చి పరీక్షావిధినే గ్రహించి ప్రతిఘూచ్ఛన్నాస్య మందు న్నీవ
ర్ణపుఁ జిన్నెల్ వెడలింపఁగాంచి భయవిభ్రాంతిం దడంబాటు మై
చపలాక్షీ! నను వేఁడికొందు దరహాసం బూను పర్యంతమున్.

నను వీక్షింపక నిల్వలేవు క్షణమైనన్ నేనెదేఁ గైతవం
బునఁ బ్రచ్ఛన్నుఁడఁగా మొగంబు తెళుకుల్ పోవుం; జలార్ద్రింబులోఁ
గనుఁగొల్కుల్, సఖులెన్ని పిల్చినను బల్కంబోవు నేఁ డేవిధం
బునఁ బ్రాణంబుల బిగ్గఁబట్టి చని తీవు న్నిర్దయ స్వాంతవై.

సంగడికాండ్రతోడుతఁ బ్రసంగము లెయ్యవి యేని సల్పుచుం
డంగ నపాంగ పంక్తులను నాపయినిల్పి మదుక్తిపాళికు
ప్పొంగెదు భక్తియో? వినయమో? బలుప్రేముడియో? విలాసమో?
యింగిత మేనెఱుంగ నిపు డేమయిపోయెఁ దదీయవైఖరుల్.

నీమెడ మల్లెపూసరులు నిండుగ నింపితి మధ్యభాగముం
గోమలమాలతీ కుసుమగుచ్ఛములం గయి సేసితిన్ సుమ

స్తోమము గొన్ని యశోఁదలను జొన్పితి నంఘ్రులఁ గొన్ని నిల్పితిం
బ్రేముడి నిన్నుఁ గన్గవ నిరీక్షణసేసితిఁ గర్వు దీరఁగన్.

చేసితి నెన్ని సేవలనో! చెప్పఁగ నేటికిఁ దల్లి దండ్రులం
బాసిన దానవంచు బసిపాప వటంచు సుదర్శనీయవం
చేసిలుఁగుల్ నినుం జెనకనీక తపంబది మూరివోవ వి
శ్వాస విహీనురాల! పలుబాముల పాలయి పెద్దకాలమున్.

నీవందించినఁగాని, త్రావవని పానీయంబు నాహారము
న్నీవే పెట్టినఁగాని మెక్కనని నేనీయంకముం గాని ని
ద్రావేళన్ శయనింపనంచని యజస్రంబుం దపంబూను నీ
వీవేళ న్ననువీడి యొంటరిగ నెట్లే కాలముం ద్రోయుటల్.

నాకోపంబునకున్ భయంపడెదు, నానై పుణ్యముం జూడఁగా
నాకాంక్షించెదు నాబెడంద కుసుమీయం జూతు నాప్రేముడిం
గైకోఁ బూనెదు నాశ్రమంబునకు శోకం బాత్మలోఁ గందు నా
కేకాలంబు నిరోగతం దలఁతు నిన్నే మర్వఁగా నేర్తునే!

సమయంబుం గనిపెట్టి మెట్టులలో కాషాయాంబరంబైన ని
త్యము పారాయణచేయు గ్రంథమయినం దర్భాసనంబైన దం
డమునైన న్విల సత్కమండలమునైనన్ డాచి నావేఁడికో
లుమెయిుం బొంగి యొసంగు నిన్మఱువ నెట్లు న్నేరఁగా నయ్యెదన్.

ఎమ్మెయి నేను ధైర్యము వహింపఁ దలంచిన నే నిమేష కా
లమ్మునసో గబుక్కునఁ దలంపునఁ జేరి చురుక్కన న్మనో
బ్జమ్మును ప్రక్కలించెదవు బాపురె! యింకెటు నీవియోగ భా
రమ్ము సహింతు దుర్బలతర ఛదహృత్సరసీజ కర్ణికన్.

నెట్టన కాలికి బలపము, గట్టుకొని తొరంగి నిసువుకంట న్వర్తిం
బెట్టుకొని యహర్నిశముం, గట్టా, గాలించి నిన్నుఁ గానం గానన్.

చిఱుచిఱుంగాండ్ర చిత్తరపుంజూపులఁ జూచెదు నిల్చి ముందల
న్మరిపెము గుల్కు తళ్కు జిగిబుగ్గ గనంబడ నోరవా కిటం
బెరసి యడంగి యొంటి కనుబెళ్కులఁ జోపెదవౌర! యిన్ని వై
ఖరులఁ జెలంగి యాడుచుఁ బెకల్చితి మద్ధృ దయాలవాలమున్.

ఇమ్ముగ నాలుబిడ్డలపయిం గల దీర్ఘ బలిష్ఠ మోహ పా
శమ్ము విరాగ మానస నిశాత కుఠార కఠోరధార చే
నమ్మెయిఁ ద్రుంచి తుత్తునియలై తొరఁగ న్మునినైన నాకునుం
గ్రమ్మె భవద్వియోగ భవగాఢతర వ్యథ యేమిచోద్యమో?

నా చెడ్డబుద్ధి "ఛీ, ఛీ వాచంయములకు నిదేమి వైఖరి తగద
య్యా! చెడెద"వనియుఁ ద్రుటిలో వైచును దుర్భరవియోగబాధాంబునిధిన్.

తీయనివస్తు వేదయినఁ దెచ్చి ప్రియంబున నీకొసంగఁబో
డాయవు కైకొన న్మతి యెడందఁ దలంతువు తాఁ భుజింప క
య్యో; యితఁడెప్డు నాకొసఁగుచుండు నఁటంచును నే భుజించి నీ
కై యొసఁగన్ భుజింతు చపలాక్షి! యివన్నియు మర్వ శక్యమే?

కూడదు కూడ దీవగపు కూళలత్రోవను బోకుమయ్య, కా
పాడుము హానివృత్తి నిలువాసి ముముక్షుత వచ్చినట్టి నీ
వేడ? పునఃప్రపంచ విషయేచ్ఛ యదేడ? యొకింత వెన్కకుం
జూడుము మొద్దు డింపియును జూతువె దుంగను మోయ వెండియున్.

అనియుం దలంతును; మఱియుం జింతింతును.

పరులకుఁ జెప్పి యేడ్వ నొకపాటి వ్యథాభరమైనఁ దగ్గునం
చరసిన నోయి వెఱ్ఱిభరతా, జడదారికి చేటిత్రోవ యూ
ర, ఋషికిఁ జింతలా? యిహాపరంబుల కేటికి దూరమయ్యె దం
దురో? యని సిగ్గుఁ జెందుదును దోఁపదు నా కిఁక నేమిసేయుదున్.

శిశిరాంతము

తేకుమళ్ల రామచంద్రరావు గారు, బి. ఏ., (ఆనర్సు)

బంగాళాఖాతమునకు దక్షిణముననున్న సుధాంబరద్వీపము ఆంధ్రసామ్రాజ్యమునందలి ద్వీపములలో నొక్కటి. హిందూశాంతమహాసముద్రప్రాంత దేశములకు బోవు పెద్దపెద్దయోడల కీ సుధాంబరము ముఖ్యమగు రేవు. ఆద్వీపవాసులు వర్ణమున నల్లనివారైనను చూచుట కందముగనే యుండిరి. వారికి మంత్రములపైనను మాయపైనను పిచ్చినమ్మకము మిక్కుటము.

"ఆంధ్రమాత" యను నోడ యాంధ్రదేశమునుండి బయలుదేరి యొకనాఁటిసాయంతన సమయమున సుధాంబరము చేరెను. ఆయోడ నాయకుఁడగు నాగస్తంభుఁడు సుధాంబరద్వీపముపై నడుగిడి అచ్చటి సస్యములవంకను, సౌధములవంకను, అచ్చటచ్చట నెగురుచున్న యాంధ్రసామ్రాజ్యపతాకములవంకను చూడసాగెను. చూడఁజూడ నొకవిధమగు తృప్తియు, సంతసమును నాగస్తంభుని హృదయసీమ నాక్రమించుకొనసాగెను. కూనూర వర్తకసంఘమువారి కొలువున నాగస్తంభుఁ డోడ నాయకుఁ డగుటచే వారిచ్చు నుపకారవేతనమును తీసికొనుచు తన యోడలపని యైనపిమ్మట జీవితశేషమును గడుపుటకు సౌందర్యరాశియగు సుధాంబర మాతనికి నచ్చినది. ఆద్వీపమున నొక చక్కనియిల్లు కట్టుకొని, దానిచుట్టును సౌరభమును వెదచల్లు పూలతోఁటను నాటించి భూలోకమున స్వర్గసుఖముల ననుభవించుతలంపే మనుజున కానంద మొసఁగదు? నాగస్తంభుఁడు రేవునకుఁ బరిసరముననున్న ప్రదేశమును గలయఁజూచెను: అచ్చటి కృష్ణవర్ణులను, తెల్లగోధుమరంగుగల యాంధ్రులను, వృక్షరాజములను, సౌధాదులను అతఁడు విలోకించెను.

నాగస్తంభుఁ డనాగతవిధాతయే యైనచో సుధాంబరమునకుఁ బోయి యుండెడివాఁడు కాఁడు. ఆతని కాలోచనలతోఁ బ్రొద్దుపుచ్చుటకు కాలము లేదు. పీడకలలు, పిచ్చినమ్మకములు, భీకరరాత్రులు వన నేమియో నాతఁ డెఱుఁగఁడు. ఇదియే యాతని కథలోని విశేషమునకుఁ గారణము.

రేవు చేరుటతోడనే కూనూరవర్తకసంఘము వారి సుధాంబరమునందలి ప్రతినిధియగు బింబగుప్తునకు కనుపడవలసి యుండుటచే నాతఁ డుండు ప్రదేశమునకు నాగస్తంభుఁడు బారితీసెను. నాగస్తంభునివలె నాతఁడును దన స్వస్థలమగు నాంధ్రదేశమును విడచి సామ్రాజ్యభాగములగు దూర ద్వీపములందు నివాస మేర్పరచుకొన్నవాఁడు. వారిరువురును, కబురులు చెప్పుకొనుటలో సుధాంబరమునందలి విశేషములు బైటపడసాగెను కాని నాగస్తంభుఁ డేలనో వానిని వినుచున్నట్లు లేదు. కాని తమవర్తకసంఘమువారిదేయైన "గౌతమి" యనునోడ వారముదినములు కందరద్వీపమున నాగిపోయినదనియు, మరునాఁడు సుధాంబరము చేరుననియు వార్త వచ్చినదని బింబగుప్తుఁడు చెప్పునప్పటికి నాగస్తంభుఁడు పరధ్యానాధీనమై యుండిన మానసమును సావధాన మొనరించెను.

"ఆయోడ నాయకు నెఱుఁగుదువా?"

ఎఱుఁగనని యర్థము వచ్చునట్లు నాగస్తంభుఁడు తలపంకించెను,

"మరచితిని; నీవు కూనూర వర్తకసంఘమున క్రొత్తగ ప్రవేశించితివికదా? 'గౌతమి'కి నాయకుఁడశ్వనీపుత్రుఁడు. నీవలెనే యాతనికిని దాదాపు పిరువది యొనిమిదేండ్లుండును. ఆతనితో చిన్ననాటినుండియు పెరిగిన మాధవి మిగుల రూపవతి. ఆమె యాతనికి ప్రధానము చేయఁబడి చాల కాలమైనను ఏకారణముచేతనో యశ్వనీపుత్రుఁ డింతవఱకు వివాహముమాట తలపెట్టలేదు. ఆరూపవతి యొవ్వరితోడను జోక్యము గలిగించుకొనకుండ నీద్వీపముననే నివసించియున్నది. ఇచ్చటివిశేషములలో నిదిముఖ్యమైనది."

సంధ్యాసమయము సమీపించుచుండగా నాగస్తంభుఁడు బింబగుప్తునితో సుధాంబరపు వీధులగుండ నడచు

చుండెను. త్రోవలో నింటికేగుచున్న మాధరిని వారు కలిసికొనిరి. బింబగుప్తుఁ డా స్త్రీపురుషుల నొకరికొకరి నెఱుకపరచెను. వారొక యరగడియసేపు సంభాషించిరి కాని యామెమాత్ర మంతగ మాటలాడలేదు. ఆ యరగడియలో నామెతండ్రియు తాతలును నోడల నాయకులనియు, నామె తల్లిదండ్రులు పరలోకగతులైనప్పుడామె చిన్నబాలికయగుటచే నశ్వనీపుత్రునితల్లి పెంచెననియు, నాయవ్వ యవసానకాలమున మాధరిని, అశ్వనీపుత్రునిఁ దనకడకుఁ బిలచి వివాహము గండని చెప్పెననియు నాగస్తంభుఁడు తెలిసికొనెను.

ఇంతలో మాధరి నివసించినగృహము సమీపించెను. ఆయింటిచుట్టునున్న తోఁటలోని వృక్షాగ్రములు శిరములను పంకించి చల్లటి గాలిని వీచుచుండెను. మాధరి నాగస్తంభునివంక దృష్టి సారించెను. సాంధ్యమందానిల పరిష్వంగమున నాగస్తంభుని యొడలు పులకించెను. సుధాంబరద్వీపము నెట్లు మనఃపూర్తిగ ప్రేమించెనో మాధరినిగూడ నాగస్తంభుఁ డట్లేమనఃపూర్తిగ ప్రేమించెను.

"నేను నివసించు గృహమిదియే. లోనికివచ్చి కూర్చుందురా?"

"నేను శీఘ్రముగఁ బోవలసిన పనియున్నది. నాగస్తంభుఁడు నీయాతిథ్యము నంగీకరించునని సెలవుగొని బింబగుప్తుఁడు వెడలిపోయెను.

వా రిరువురు గృహద్వారముకడ కరిగిరి.

"తలుపు తెరువఁబోవునపుడెల్ల నా కొకవిధమగు భయము గలుగుచుండును. దయ్యములపై నాయతిథికి నమ్మక మున్నదా?"

"దయ్యములా? లేదు."

మాధరి తలుపు తెరచెను. లోపలనంతటను గాఢాంధకారము నిండియుండెను. "చెకుముకి యెక్కడ పెట్టితినో" యనుమాట లామె భయకంపితమగు స్వనముతో నుచ్చరించెను.

ఇంతలో చెకుముకిని కొట్టి నిప్పుచేసి మాధరిదీపికను వెలిగించెను. ఆదీపకళికాకాంతిలో భయోత్పాతముచే పాలిపోయిన ముఖపద్మముతో, కంపించుచున్న తనూలతతో నామె నిలిచియుండెను.

"మాధరీ, మనమిరువురము దప్ప నింకెవ్వరు నిక్కడ లేరే; ఏల భయపడెదవు?"

ఆమె యేమియు ప్రత్యుత్తర మిచ్చుస్థితిలో లేకుండెను. "నిజమే కాని___" యనుచు నామె యొక తలుపు తెరచెను. ఆవలి గదియం దొక పందిరి మంచమును దానిచుట్టు నొక దోమ తెరయుఁ గానవచ్చెను. "ఈగదిలోనే నేను పరుందును. రాత్రులం దీ తలుపును తీసియుంతును. ఇచ్చట నీదీపము బాగుగ వెలుఁగుచునే యుండును. అశ్వనీపుత్రుఁడు నెల కొకసారి యిచ్చటికి వచ్చుచుండును. తక్కినసమయములం దెల్ల పుమను,నిచ్చటికనేక యోజనములదూరముననున్న కంచర ద్వీపముకడనుండును; కాని యప్పుడప్పు డాతఁ డా బల్లను పట్టుకొని తదేక దృష్టితో నావంకఁ జూచుచుండును".

"అతనికి వివాహము కాలేదు గదా?"

"లేదు. ఆతఁడు కనఁబడుటతోడనే నేను లేచియాతని సమీపింతును; కాని యాతఁడెందును కనుపింపఁడు."

నాగస్తంభున కేమి యాలోచనతోఁచినదో కాని యాతఁడు తలపంకించెను. ఆతని నేత్రయుగళమునందు కనికరమును ప్రేమయు వెల్లివిరియుచుండెను.

మాధరి యాతనివంకఁ జూచెను. "నాగోడలతో నాయతిథి హృదయశాంతికి భంగము గలిగించితిని కాఁబోలు. నేఁటియుదయముననే తోఁటలోని ద్రాక్షపండ్లరసమును తీసితిని. అది కొంచెము తెత్తునా?"

"వలదు. వలదు. నేనుపోవుటకు వేళయైనది."

"లేదు. ఇప్పుడ స్తమానముదాటి యారుగడియలైన కాలేదే."

నాగస్తంభుఁడు మారుమాటాడక ఆసనాసీనుఁ డయ్యెను. ద్రాక్షరసము తెచ్చుటకు మాధరి లోని కరిగినప్పు డాతఁడు దశదిశలకును తనదృష్టిని సారించెను. ఆ గృహమునకు సుఖము దూరమని యాతఁడు గ్రహించెను.

మాధరి ద్రాక్షారసమును గొనితెచ్చెను. ఆమె యతిథి దేనిముసమున వెడలిపోయి తనను భయము వాతఁబడవేయునో యని యామె తత్తరపడుచుండుటచేఁగాఁబోలు నామె నడకయు, మాటలును, చేఁతలును ఆమనోభావమునే ప్రకటించుచుండెను. తోఁటలోని ద్రాక్షతీఁగ లొకదానికొకటి యల్లుకొన్నట్లు వారిరువురి దృష్టు లొకదానినొకటి పెనవైచికొనియుండెను.

"మాధరీ, నేను ప్రపంచమున నంతటను తిరిగితిని. కాని దయ్యముల నెచ్చటను చూడలేదు."

"నాయూహలు—నామనస్సు—"

నాగస్తంభుఁడామెవంక ఏకదృష్టితోఁ జూచుచుండెను.

"అశ్వనీపుత్రా!"

"మాధరీ, వణకిపోయెద వేమి! భయములేదు. ఏమున్నది?"

ఇట్లనుచు నాగస్తంభుఁడామె చేతి నందుకొనెను

ద్వారముకడ నింతవఱకును నిలచిన యొక్క యాకృతి బల్లకడ కరుదెంచెను.

"అశ్వనీపుత్రా!"

"నేనిప్పుడు వత్తునని, పాపము, మీకు తెలియదు."

ఈమాటలు వినునప్పటికి నాగస్తంభునకు సంశయవిచ్ఛేద మయ్యెను. నిజముగ నశ్వనీపుత్రుఁడే యచ్చట నిలిచెనని యాతఁడు రూఢిచేసికొనెను

అశ్వనీపుత్రుఁడు మొదట నాగస్తంభునివంకఁ జూచెను. తరువాత మాధరివంకఁ జూచెను. పిమ్మట తెరచియున్న పడకటింటివంకఁ జూచెను. ముఖమున నొక వికృత చిరునగవుతో "నేను మీకు దిగ్భ్రమ కలిగించినా" ననెను.

నాగస్తంభుఁ డించుక చలించెను. ఆచిరునగవున కర్థ మేమి?

"తమ నామాక్షరము లెవ్వి?"

"నాగస్తంభుఁడు."

అశ్వనీపుత్రుఁడు తనవలెనే దూఁగారవర్తక సంఘచిహ్నములుగల వస్త్రములను ధరించిన నాగస్తంభునివంకఁ జూచెను. అంతటితో నాగస్తంభుఁడు లేచి నిలువఁబడెను. మాధరియు వర్ణవిహీనమగు వదనముతో, చేతనాహీనమగు శరీరముతో నాసనముపై నొకమూటవలె గూర్చుండెను. నాగస్తంభుఁ డాప్రదేశమును విడచి తనయోడకుఁ బోయెను.

నాగస్తంభుఁడు రేవుచేరునప్పటికి 'గౌతమి' రేవులో నుండెను. అశ్వనీపుత్రుని హృదయమునందలి యూహలిప్పుడు నాగస్తంభునకు ద్యోతకములగుచుండెను. మూఢమతి కనుమానమే యాహారము. ఆతఁడు మాధరి నన్యాయముగ నవకతవక ప్రశ్న లడుగుచుగాఁబోలు. ఆమె పాలిపోయిన వదన మా క్రూరుని మనోవీథి నావంతయు కరుణ జనింపఁ జేయఁజాలదు కాఁబోలు. ఇట్లాలోచించుచు చేయునదిలేక నాగస్తంభుఁడు తనరెండు పిడికిళ్లతోను జుట్టుపీకికొనెను. నోరెత్తుటకిసుమంతయు నశ్వనీపుత్రుఁ డెడమీయ నప్పుడు నాగస్తంభుఁ డేమి చేసియుండఁగలఁడు?

ప్రాతస్సంధ్యాకాలమున నాగస్తంభుఁ డోడదిగి యూర ప్రవేశించి, మాధరీగృహద్వారముకడ నిలిచి యూహాసముద్రములో మునిఁగిపోయెను. కాని అతని కెవ్వరును కనఁబడలేదు, ఆతనికేమియు వినఁబడలేదు.

'ఆంధ్రమాత' సుధాంబరమును విడచి సముద్రయాన మారంభించెను. మఱల మూఁడు మాసములవఱకు నాగస్తంభుఁడాద్వీపమునకుఁ బోలేదుకాని యామూఁడు మాసములలో మాధరి యాతని హృదయమున స్థిరనివాసమేర్పరచుకొనెను. ఆమె జీవితము విచారకరముగ పరిణమించినదని యాతఁడు తెలిసికొనెను. సుధాంబరములో నాగస్తంభుఁడు మఱల బింబగుప్తుని కలసికొనెను. 'గౌతమి' మూఁడు దినముల క్రిందట సుధాంబరమును విడచెననియు, అశ్వనీపుత్రుఁడు క్రోధోద్రేకుఁ డయ్యెననియు, మాధరి జ్వరబాధ ననుభవించుచున్నదనియు, ఆద్వీపవాసులగు కృష్ణవర్ణులందరు నాయిల్లు దయ్యముల కొంపయని యందడుగిడకున్నారనియు బింబగుప్తుఁ డాతనికి తెలిపెను.

"మాధరి కేమాత్రము సుఖము లేదని నాకు తోచుచున్నది."

నాగస్తంభుఁ డీమాటకుఁ బ్రత్యుత్తర మీయక లేచి నిలచెను.

"నీవెప్పుడైన దయ్యమును చూచితివా?" యని బింబసుప్తుఁ డడిగెను.

"లేదు. నీవో?"

"ఈ దయ్యములగోడపదే మాధరిని మరణము పాలుచేయుచున్నట్లున్నది."

"ఇప్పు డామె కెవరు సాయము చేయుచున్నారు?"

"మనవర్తకసంఘపు టారోగ్యాధికారి భార్య."

నాగస్తంభుఁడు మాధరిపక్కయొద్ద నాసనాసీనుఁ డయ్యెను. అతనికన్నులామె ముఖమునుండి మఱలలేదు. "మాధరి యొక్కమారు కన్నులు తెరచిన చాలును. నే నామెను ప్రేమించుచున్నానని చెప్పవలెను. ఆమె కిది తెలియకున్న నీక నెట్లు?"

ఆమె యుచ్ఛ్వాసనిశ్వాసములతో నామెపైకప్పిన దుప్పటికూడ కదలియతికోమలమై కన్పడుచుండెను. కాని నాగస్తంభుఁ డీయందచందముల నవలోకించుట లేదు. అతని హృదయమున గాటమగు ప్రేమకుఁ దప్ప మఱొక యూహకుఁ జోటు లేదు.

ఆమె కన్నులు తెరచి నాగస్తంభుని జూచెను. ఆమె యధరపల్లవముల మందారుణరోచులు మందహాసరోచులలో లీనమై పోయెను. ఆమె దృక్కోమలికలు నాగస్తంభుని చూడ్కులతోఁ గలయికఁ జెందెను. ఉత్తరక్షణముననే యామెకన్నులు మూఁతలు పడెను. కాని యామె యర్థమును నాగస్తంభుఁడు గ్రహింపక పోలేదు. మాధరి హృదయపూర్వకముగ తనప్రేమ సామ్రాజ్యమునకు నాగస్తంభుని పట్టభద్రు నొనర్చినది. నాగస్తంభుఁడు చివాలున వంగి యామె పెదవులను ముద్దిడుకొనెను.

ఇంతదనుక మఱచిన సంగతులు నాగస్తంభున కిప్పుడు జ్ఞప్తికి రాఁజొచ్చినవి. అశ్వినీపుత్రునితల్లి యవసానకాలమున నశ్వినీపుత్రుఁడు చేసిన వాగ్దానమునకు విరుద్ధముగ కందరద్వీపమున బిలవతియను సంకరజాతి స్త్రీతో నాతఁడు కాలముపుచ్చుచున్న సంగతి కొలఁది కాలముక్రిందట నాగస్తంభునకుఁ దెలియవచ్చెను.

నాగస్తంభుఁడు మాధరిముఖమువంక నొకసారి దృష్టిమఱలించెను. ఆమెవదనము మందహాససుందరమై యుండెను. నాగస్తంభుని హృదయమున విద్యుచ్ఛక్తివలె నొక్కయూహ జనించెను.

"మాధరి యిఁకభయపడుటలేదు. దాని హృదయమున ప్రేమకు తప్ప నింకొకటికి చోటు లేదు."

వైద్యుఁ డరుదెంచెను. "రోగి నిద్రించుచున్నది. జ్వరము పోయినది."

'ఆంధ్రమాత' మఱల సుధాంబరమునువిడచి వెడలి పోయెను. నాగస్తంభుఁ డశ్వినీపుత్రుని దుష్కృత్యములను దలపోసి మాధరి నాతఁడు బలాత్కరించి వివాహ మగునని వగచుచుండెను. ఎట్లున్నను చిన్ననాఁడే యశ్వినీ పుత్రునకు ప్రధానమైనందున మాధరిని చూడనొల్లక సుధాంబరమునకు వచ్చినప్పు డెల్ల తొందరగ నవసరములగు పనులను చక్కబెట్టుకొని నాగస్తంభుఁడు వెడలిపోవుచుండెను. కాని యొకనాఁడు సుధాంబరమున 'కాంధ్రమాత' వచ్చినప్పు డోడలోని యుద్యోగి యగు వృషభదత్తుఁడు మాధరిచే తన కీయఁబడిన యొక యుత్తరమును నాగస్తంభున కిచ్చి యిట్లనెను.

"అశ్వినీపుత్రుని మీరు కలసికొని దీనిని స్వయముగ నిండని మాధరియను నామె వేఁడుకొన్నది."

నాగస్తంభుఁడు దాని నందుకొనెను. దానిపై నశ్వినీపుత్రుని పేరును, 'గౌతమి' పేరును వ్రాయఁబడి యుండెను.

'ఆంధ్రమాత'యు 'గౌతమి'యు నొక రేవునఁ గలిసికొనెను. మాధరి వ్రాసిన యుత్తరమును తీసికొని నాగస్తంభుఁడు 'గౌతమి' లోని కరిగి యశ్వినీపుత్రుని సమీపించెను.

"నీవు మాధరి వ్రాసిన యొకయుత్తరమును తెచ్చినావు."

అశ్వినీపుత్రుఁ డుత్తరముకొఱకు చేతులు చాప లేదు. చేతులను వీపువెనుక కట్టివైచికొని యొకవిధమగు వివశపు చిరునగవుతో నిట్లనెను.

"నాకు బోధపడినది. మీరనుకొన్న పని కవాంతరములు కల్పింపఁజాలక పోలేదు."

అతికష్టంబుతో నాగస్తంభుఁడు కోపము నణచికొని మఱల యుత్తరము నాతని కీయబోయెను.

"నీవే చదువుకొనుము. నీకొఱకే యిది వ్రాయఁబడిన"దని యశ్వినీపుత్రుఁడు వికారహాసము చేసెను.

"నీకు మతిభ్రమము గలిగిన ట్లున్నది. నీవన్నమాటకు నీతల పదునాఱు చెక్కలు చేసినను పాపము లేదు."

"నీ తల! ఎక్కడ నున్నావో జ్ఞప్తికి రానిమ్ము"

నాగస్తంభుఁడు పిడికిలితో నశ్వినీపుత్రుని గడ్డముపై నొక్కపోటు పొడిచెను. దానితో నాతఁడు వెనుకకుఁ బడిపోయి యొక యడ్డకొయ్యను పట్టుకొని తూలుచు మసకబారిన కన్నులతో నాగస్తంభుని వంకఁ జూడసాగెను. ఇంతలో సంకరవనితయగు బిలవతి ప్రవేశించి కారణ మేమని యడిగెను. నాగస్తంభుఁ డామెవంకకుఁ జూచి మారుమాటాడక వెడలిపోయెను. అతఁడు వెనుకకుఁ దిరిగి, బిలవతి తన రెండుచేతుల నశ్వినీపుత్రుని చంకల క్రిందఁ జొనిపి యాతని లేవనెత్తుటను చూచెను. మూఁడు నాలుగు దినములవఱకు నశ్వినీపుత్రుఁడు లేవనే లేదు.

అశ్వినీపుత్రునకు బిలవతికిని గల యన్యోన్య సంబంధమునుగూర్చియు నా సంకరజాతివనిత యెల్లప్పు డోడలో నుండుటను గూర్చియు న రక్తసంఘమువారి కెఱుక పరుపవలెనని వృషభదత్తుఁడు నాగస్తంభునితో ననెను. కాని, యట్లు చేయవద్దని నాగస్తంభుఁ డానవెట్టెను.

"కాని యాతఁడు సంకరజాతివాఁడేమో యని నా యనుమానము."

"నిజముగా?"

"ఆతఁడు పగలెల్ల నల్లమందుమత్తులోఁ బడి యుండును. ఆతఁ డోడనాయకత్వమున కేమాత్రమును దగఁడు."

కూపదూరవ రక్తసంఘపు టధ్యక్షుఁ డోడలను, రేవుపట్టణములందలి కార్యస్థానములను సంవత్సరమున కొకసారి పరీక్షింపవలసియుండెను. ఆపరీక్షార్థమై యే కారణముననో కాని నాగస్తంభుని యోడలోనే పోవ నాతఁడు నిశ్చయించుకొనెను. ఎప్పుడు సుధాంబరము చేరుదుమా యని తొందరపడుచున్న నాగస్తంభున కీవార్త పిడుగై మీఁదఁ బడెను. ఈనూతనపరిస్థితులలో 'నాంధ్రమాత'కన్న "గౌతమి"యే సుధాంబరమునకు ముందుగఁ బోవుననుటకు సందియము లేదు. నాగస్తంభుని చిరాకునకు మేర లేదు. తనశక్తిసామర్థ్యములపై నాధారపడుట నేర్చిన నాఁటినుండియు తన్ను రక్షించుమని యే యపరశక్తిని ధ్యానించుట మానెనో యాభగవంతుని నేఁడు నాగస్తంభుఁడు "తండ్రీ, నేను సుధాంబరము చేరువఱకు మాధరిని కాపాడు"మని ప్రార్థించెను.

'ఆంధ్రమాత' రేవునుండి బైలుపడునప్పటికి 'గౌతమి' నర్థసముద్ర సంగమస్థానమును దాఁటి మనోవేగముతో వెడలిపోయెను. నాగస్తంభుఁడు ముండ్లపొదపై నున్న ట్లుండెను. అతనికి మనస్సు మనస్సులో లేదు. అశ్వినీపుత్రుఁడు మాధరిని కలసికొన్నట్లును, యామె తన్ను ద్వేషించుచున్నందున నాయబలను ముడివేసికొన్నట్లును నింక నిట్టిస్వప్నములు రేయుంబవ ల్లాతని హృదయాగ్ని రగులుచుండెను.

నలువది దినములు గడచినవి. 'ఆంధ్రమాత' బంగాళాఖాతమును దాటి హిందూమహాసముద్రమునఁ బ్రవేశించెను. నాగస్తంభుఁ డిక నోపికపట్టఁజాలకపోయెను. అధ్యక్షునికడ కాతఁడరిగి "త్రోవలో నెక్కడ నాగక యేకాయెకిని సుధాంబరము చేరుకొందమా!" యని యడిగెను.

అధ్యక్షుఁ డీ యుపపాదనను నిరాకరించి యింక నాలుగైదుద్వీపముల మీఁదుగ పోనుద్దేశించితినని తెలి

"నీకేమి కావలసివచ్చితి"వని నాగస్తంభుఁడు ప్రశ్నించెను.

నిజముగ నశ్వినీపుత్రుఁడే యచ్చట నిలచెననియు, దయ్యము గాదనియు నాగస్తంభుఁడు నిశ్చయించెను. అశ్వినీపుత్రుఁ డొక్కయడుగు ముందునకు వైచెను. సముద్రపటము నందుకొనుటకు చేయిచాచెను. కాని నాగస్తంభుఁ డాతని స్పృశింపఁబోవ నాతఁ డదృశ్యుఁ డయ్యెను. ఓడలో నన్నిమూలల దీపములు వెలుఁగుచుండెను. అశ్వినీపుత్రుఁ డెక్కడ?"

నాగస్తంభుఁడు వృషభదత్తునికొఱకు కబురంపెను. అతనితో సంగతుల నన్నిటిని చెప్పెను. ఆయుద్యోగి ముఖము నాగస్తంభుని శత్రువులపై కోపముచే నెఱ్ఱబారెను.

"ఇట్టివి జరుగుచుండుట యసాధారణము గాదు. దుర్మార్గులను పిరికిపందలు తమశత్రువులపై నిట్లే పగ తీర్చుకొందురు."

"'గౌతమి' యీపాటికి సుధాంబరము చేరియే యుండును...?"

"బహుశః చేరియుండుననుకొందును. అశ్వినీపుత్రుని యొడలంతయు నీటితోను, రక్తముతోను తడిసియుండెను కదా! గౌతమి కేమైన ముప్పు వాటిల్లినదేమో!"

నాగస్తంభుఁడు ద్వారమువంకఁ జూచెను. తలుపు తెరువఁబడెను. దీపకళిక కాంతిలో నశ్వినీపుత్రుని శరీరము మాడువలె నగుపడెను. అతఁ డించుమించుగ వస్త్రహీనుఁడై యుండెను. అతనిజుట్టు జడలుకట్టుకొని యుండెను. సలిలధారలా జుట్టులోనుండి ముఖముమీఁదికిని, చెక్కిళ్లమీఁదికిని, భుజములమీఁదికిని జారుచుండెను. అతఁ డేమియు మాటలాడలేదు.

"సముద్రపటము కావలెను కాఁబోలు, ఏదీ?"

ఇంతలో నడుగుల చప్పుడు వినఁబడెను. అవ్యక్తి చిటుకలో మటుమాయమయ్యెను.

సేవకుఁడు మామిడిపండ్లను దెచ్చి నాగస్తంభుని ముందుంచెను.

"ఆయన యెవరో క్రొత్తమనుష్యుఁడు మీకీపండ్ల నిమ్మని పంపినాఁడు."

"ఆయన యెవరు?"

"కాలఁదిగ వస్త్రములను ధరించి జడలుకట్టిన జుట్టులోనుండి కాఱుచున్న నీటిని తుడిచికొనుచు నచ్చట నిలచిన పురుషుఁడు."

"ఈ నిశిరాత్రివేళ నీ కేమియు పనిలేదా? పోయి పరుండుము."

సేవకుఁ డసంతృప్తితో వెడలిపోయెను.

ఉషఃకాలమున నొక పెద్దతుపాను సముద్రము నల్లకల్లోలము గావించుచుండెను. తెల్లవారిన రెండు గడియలకాతుపానెటువచ్చిన దటు సమసిపోయెను. కాని జీమూతమాలిక లభ్రపదమున నింకను వ్రేలాడుచునే యుండెను. హిందూ మహాసముద్రతోయములు శాంతములై యచంచలములై యుండెను.

ఉదయమున నైదుగడియ లయ్యెను. వృషభదత్తుఁడు నాగస్తంభుని గదిలోని కరుదెంచి కూర్చుండెను. నిముసములో నాతనిముఖము వెలవెల బోయెను. "తలుపు"—

అశ్వినీపుత్రుఁ డీసారి గదిలోనికి నడచివచ్చెను. అతనిదేహ మిప్పుడు తడిగను, రక్తమయముగను లేదు. అతఁడు నిలచిన ప్రదేశమున నీటిమడుగు కాలేదు. కాని యాతఁడు చూచుట కసహ్యుఁడుగ, జ్వరపీడితునివలె నుండెను. అతఁడుసముద్రపటమువంకకు చేతులు చాచెను. వృషభదత్తుఁడు దిటువుచేసి లేచునప్పటి కశ్వినీపుత్రుఁ డదృశ్యుఁ డయ్యెను.

నాగస్తంభుఁడు సముద్రపటమువంకకుఁజూచెను. ఆపటమున సముద్రమధ్యమున నొక క్రొత్త యెఱ్ఱనిచుక్క యుండెను. "ఇదెక్కడినుండి వచ్చినది?"

"గౌతమి యీప్రదేశమున మునిగి యుండునా?"

ఆ యెఱ్ఱచుక్క వృషభదత్తుని వ్రేలికి తగిలెను.

"తడిగానున్నదా?"

"ఇది రక్తబిందువు."

అధ్యక్షుఁడు మధ్యాహ్ననిద్రానంతరమున లేచెను. తామ్రద్వీపముకడ నుండవలసిన యోడ మహాసముద్ర మధ్యమమున నుండుటచూచి కారణమేమని నాగ స్తంభు నడిగెను.

"'గౌతమి' కేదో విపత్తు సంభవించినది."

"మహాసముద్రమునంతయు వెదకింప నాయకుని తలంపు కాబోలు! 'గౌతమి' కేకీడును గలుగదు. అశ్వినీ పుత్రుఁ డితరులవలె పిచ్చినమ్మకములతో ప్రొద్దుపుచ్చు మందబుద్ధి కాఁడు."

నాగ స్తంభుఁడు కోపప్రకంపిత గాత్రుఁడయ్యెను.

"ఈ యోడకు సేనధికారిని. ఇతరుల కింద జోక్యము లేదు."

"నీ నాయకులను కారాగార బద్ధులను చేయఁ గలను."

"ప్రయత్నింపవచ్చును."

అధ్యక్షుని మాటవిని నాగ స్తంభుని బంధించువాఁ డెవ్వఁడు 'నాంధ్రమాత'యందు దగుపడ లేదు. అధ్యక్షుఁడు లజ్జావనత వదనుఁడయ్యెను.

పటమున నెత్తుటిచుక్క కనఁబడిన ప్రదేశమున సముద్రతరంగములపై నొక పడవయూఁగులాడుచుండెను. 'ఆంధ్రమాత' యాపడవను సమీపించెను. అందిరువురు సేవకులును, రోగపీడితుఁడైన యశ్వినీపుత్రుఁడును బిలవతియు జీవములతో నుండిరి. అశ్వినీపుత్రునిలోనికిఁ గొంపోయి పరుండఁబెట్టిరి. 'గౌతమి'లో నగ్ని పుట్టుటచే నాయోడ మునిఁగెనని బిలవతి చెప్పెను.

అధ్యక్షుఁడు నాగ స్తంభునిదిక్కు మొగమయ్యెను. "ఇదంతయు నాయకున కెట్లు తెలిసినది?"

"కొన్ని సంగతులు తెలియకనే తెలియుచుండును. వానిలో నిది యొకటి."

బిలవతి సంభాషణ నందుకొనెను. "ఇంతకంటె చిత్రములైన విషయములే జరిగినవి"

"అనగా?"

మంత్రగాని ముఖము చూచిన నెట్టియేవగింపు గలుగునో బిలవతిముఖము చూచిన నట్టి యేవగింపే కలుగుటలో నాశ్చర్యము లేదు. చేతి నశ్వినీ పుత్రుని వంకకుఁ జాపుచు "ఆనాయకుఁ డదుగో"యని యామె పలికెను.

అశ్వినీపుత్రుఁ డేకాంతముగ నాగ స్తంభునితో మాటలాడ గోరినట్లతిబలహీనమగు స్వనముతో తెలియఁ బరచెను. ఇతరులు వెడలిపోయిరి. అశ్వినీపుత్రుఁ డొక వికృతహాస మొనర్చుచు స్మృతితప్పిపోయెను.

నాగ స్తంభుఁ డచ్చటనే నిలచెను. అతని మనస్సునం దెప్పుడొక క్రొత్త యాలోచన యంకురించెను. "బిలవతియే యశ్వినీపుత్రునిపై ప్రేమచే నాతని జీవింపజేసినది. ఎటులైన మిత్రభేదము గలిగించినచో నశ్వినీపుత్రుఁడు మరణించుటయే కాక నావిూదికిని మాధరివిూదికిని దాడికివచ్చుచున్న యాకృతులు సంహారమగును."

నాగ స్తంభుఁడు బిలవతి మున్నగువా రున్నచోటికేగెను. "ఇఁక గొన్ని దినములలో సుధాంబరము చేరుదుముగదా? నీవేమి చేయుదువు?"

"ఏమో, నాకు తెలియదు. అశ్వినీ పుత్రునకుఁ దెలియును."


"నీకును అతనికి సంబంధమేమి?"

"నన్ను విడచి యశ్వినీ పుత్రుఁ డెచ్చటికి పోఁగలఁడు?"


"అతని యింటికిఁగూడ పోఁజాలడా? అచ్చట నశ్వినీపుత్రునింట నాతనికి ప్రధానమైన మాధరియున్నది. అతఁ డామెను చాలమారులు చూచుట నీకెఱుక లేదా? నీవచ్చటకుఁబోయిన నామె యూరకుండునా?"

బిలవతిముఖమున కోపచిహ్నములు బయలుదేరెను. "ఎంతదురాత్ముఁడు! ఎంతటి మోసగాఁడు!" అనుచు బిలవతి యచ్చోటు వాసెను. ఒక విగడియ నేపొగి నాగ స్తంభుఁ డామెను వెంబడించెను.

అశ్వినీపుత్రుఁడు కన్నులు తెరచికొనియుండెను. బిలవతిని చూచుటతోడనే యాతని నేత్రగోళములం



చిత్రము ౭.



చిత్రము ౮.

ము భయచిహ్నములు తోఁచెను. బిలవతి యాతని కెదురుగ నిలచెను. ఆతనిముఖము మృత్యుదేవతవాతఁ బడబోవు వాని ముఖమువలె నుండెను.

అగ్న్యత్మున కేమియు బోధపడలేదు. ఆతని ముఖము భయకంపితమై యుండెను.

అశ్వనీపుత్రుఁడు క్రుంగిపోవుచుండెను. "అయ్యో, వద్దు, ఆగు" మని యాతఁ డనెను.

ఎవ రేమిచేయఁగలరు? బిలవతియే యాతని జీవింపఁ జేసినది. బిలవతియే యాతని నిప్పుడు జీవహీనునిఁ జేయుచున్నది. నాగ స్తంభుఁ డేమి చేయఁగలఁడు?

"అయ్యో, వద్దు, ఆపుఁ" డను అశ్వనీపుత్రుని మాట గాలిలో కలిసిపోయెను. నాగ స్తంభుఁడు బిలవతి నొక్క లాగు లాగెను. ఆ క్షణముననే యశ్వనీపుత్రుఁడు చనిపోయెను.

'ఆంధ్రమాత' 'సుధాంబరద్వీపమును' చేరెను. అచ్చటి వృక్షరాజములును, పచ్చికబయళ్లును మనోహరములుగ నుండెను.

తనసదనము చుట్టునున్న సుందరారామమున మాధరి నిలచియుండెను. నాగ స్తంభుఁ డామెను సమీపించెను. "మాధరీ! యుత్తరమున నేమి వ్రాసితివి?"

"నేను భయపడుట లేదనియు, నాయెడ సౌష్ఠవమును నిరోధింప యత్నింతు ననియు, ఆతని దగ్గరకు చేర నీయఁజాల ననియు వ్రాసితిని."

ఆమె వదన మా ప్రభాతారంభమునవలె తెల్లనై యుండెను. బాలసూర్యుని నూత్న కిరణములతో నల్లుకొన్న ద్రాక్షాలవలీ నికుంజముల చిరునీడ లామెకు గొడుగులు పట్టుచుండెను. నాగ స్తంభుఁ డామె చేతిని పట్టుకొనెను. "మాధరీ నేటికి వసంతోదయ మైనది."

మతము

విద్వాన్ దూసి రామమూర్తిశాస్త్రిగారు

ఐహికాముష్మికములలో నైహికంబు
శాశ్వతం బది గాదని జార విడిచి
సర్వ సౌఖ్యముల్ సమకూర్ప క్షమమును నక్ష
యంబు నాముష్మికమె యని యార్యు లెల్ల
కూర్మి నాముష్మికంబునె కోరి సర్వ
దా తదాప్త్యుపాయంబును దడవి తడవి
చిట్టచివరకు నెంచిరి పట్టుఁగొమ్మ
జీవ తత్త్వప్రాప్తికని తమ హృదయములను.

* * * *

వేదయుగమున నొక వింత వేషమూని
భరతఖండంబునను గానఁబడియు నంత
నుపనిషత్కాలమున దాని నుజ్జగించి
సర్వమోహనరూపంబు సంగ్రహించి
యెల్ల కలుషములకును బుట్టి నిల్లునైన
కరము జడదారులకుఁ గట్టు కంబమైన
యార్యభూమిని వ్యాపించి యతులమైన,
భారతీయుల మన్ననఁ బడసినావు.

* * * *

ఒక్కఁడైనను నీశ్వరుఁ డక్కజముగ
భువి ననేకంబులగు రూపములను దాల్చి
జగము నలరించి విలసిల్లు చాడ్పుమీఱ
బౌద్ధ జైనాది యుగములఁ బలు రకంబు
లయిన రూపంబులను దాల్చి యార్యతతికి
భిన్న రుచిఁ గల్గఁజేసి త భిన్నమయ్యు
తన్నుఁ గట్టంగఁ ద్రాళ్లను దానె తెచ్చి
కొంటె పక్కట భావిని గంటమూని

* * * *

ఆదిశంకర రామానుజార్య మాధ్వ
పుత్రులం గని భారత భూమి కుండు
కర్మభూమి నామము సార్థకముగఁ జేసి

నీ యశశ్చంద్రికల నెఱి నింపినావు
విశ్వరూపంబుఁ జూపుచు విశ్వమెల్ల
నేఁచుచున్నావు నేఁడు మఱింత రేఁగి
యన్నదమ్ములలో భేద మావహిల్లఁ
జాడియే వారి నిడుముల పాలుసేయ.

లలి నయస్కాంత మినుమును లాఁగుకరణి
నరులనెల్లను వేగ నీ దరికి లాఁగి
కమిచి వెన్నెల సంద్రముఁ గలఁచు రీతి
నొక్కచోఁ గలఁచెదు మన ముక్కు మీఱి
మలయ పవన శరచ్చంద్రములను బోలి
కొన్ని వేళల నలరింతు కూర్మిమీఱ
నెండ సూర్యోపలమ్ము మండించు భాతి
నొక్కచో మార్తు స్వాంతము నక్కజముగ

* * * *

పర్వు సమ్మోహనాస్త్రంబు భాతి నైంద్ర
జాలికునిరీతి విశ్వమ్ము జాలిమాలి
యవశముగఁ జేయ నిదమిత్థ మని నిజంబు
నిర్ణయింపంగ నేరక నీతిమాలి
భారతీయైకమత్యమ్ము పాడగుటకుఁ
బరులు తమపైని దండెత్తి వచ్చుటకును
జక్రవర్తి సమూహమ్ము చచ్చుటకును
నీవ కారణమని యంద్రు కోవిదులును

* * * *

దేశములనెల్లఁ ద్రిమ్మరి దీక్షపూని
నీదు నైజంపు నాకృతి నిఖిలలోక
హర్ష సంధానశక్తి నహార్య వైభ
వమ్ము వేసమ్ము మహిమమ్ము నమ్మఁ దెల్పి
భారతీయుల కవ్యాజభక్తిఁ గల్గఁ
జేయు నీపుత్రకులు దివి చేరినారు;
నిన్నుఁ దెల్పెడి ధర్మనిర్ణేత లకట!
దివిని జేరుటఁ దర్శనముల్ భువిని లేమి

తగినవారలు ధనకాంక్షఁ దవిలి తమదు
కృత్యము మఱచి కరము కుక్షింభరులయి
కాలమంతయు సుఖముగాఁ గడుపుచుంట
నీకు మా కిట్టి దుర్దశ నేఁడుగల్గె.

* * * *

కాల పరిణామవశమునఁ గల్గి రకట
మతమనఁగ నేమొ యెఱుఁగని మానవులును
మతము హితము లేదిది వట్టి మాయ యంచు
మతమన నసహ్యపడి మందు మాన్యమతులు
మనమతము బాగులే దన్య మతము కరము
జనుల కుపయోగకరమని చాటువారు
నైహికసుఖంబె శాశ్వత మనెడివారు
గురుల మించిన శిష్యులు కోట్లకొలఁది.

వేదవేదాంతవర్ణిత విమలరూప!
తమదు కృత్యము మఱచిన యమలమతులు
నీ వనఁగ నెట్టిదానవో యెఱుఁగనట్టి
యజ్ఞులే నిన్నుఁ దెల్పుదు రది యశక్య
ముట్టికెగురంగ లేనమ్మ యూర్ధ్వలోక
మునకు నెట్లెగురంగఁజాలునుఁ? స్థిరముగ
నింక లోకమ్మునం దకలంకగౌర
వమ్ము నార్యులచే నందు వాంఛ నీకుఁ
గల్గె నేనింక నినుఁ దెల్పఁ గల్గు సుతుల
నీదు కలరూ పెఱింగిన నిపుణమతుల
మతము ధర్మము నెలకొల్ప మహి నొసర్పు
మఱియు వీడుము నీదగు మాయరూపు.

* * * *

కలిబలంబున గంగను గలిసినట్టి
కర్మధర్మజాతంబును గాచి యతుల
తత్త్వవిజ్ఞానధనమును దయ నొసంగి
ప్రజల దేశంబు రక్షింపుఁ భవ్యరూప!

కామాక్షిని అందకత్తెలలో మొదటిదానిని గా లెక్కపెట్టవలసిన దేను. అందులోనూ నూత్నయౌవనమేమో, నవ్వినప్పుడామె ముఖం మూడుపంతులు విడ్డ మల్లెపువులాగుంటుంది. బరువుబరువుగా మడతలు తూగి పాదాలమీద నటిస్తూన్న పట్టుచీరతో, చివురుమీద నీటిబొట్టులాగా మెఱ్ఱన్ని వేలిని వజ్రపుపొడి ఉంగరంతో, వదులుగా వ్రేలి వెనుకనుండి చెక్కిళ్లిటూ అటూ ముద్దు పెట్టుకుంటూన్న జడలోని మల్లెదండతో, పిరుదులు చుట్టివచ్చిన పయ్యెదచెరగులోని జాల్తాపులో ఉయ్యాలా ఊగుతూందా అన్నట్టు ఆచిన్న నడుంమీద తూగుతూన్న ఆ శరీర భారం మోస్తూన్న నడకతో కామాక్షి సుందరమ్మ దగ్గరకువచ్చి కూర్చుంది. విడుతూన్న పువ్వు ప్రక్కనున్న ఫలవంతమై వాడిపోయిన పువ్వులాగు కామాక్షి ప్రక్కను సుందరమ్మ కనబడుతూంది. సుందరమ్మ అరవైయేళ్ల పెద్ద. ఆరితేరిన నాయిక. సంసార వ్యాపారాలలో గురుత్వం వహించి కామాక్షిని తీర్చి దిద్దేది. అలా ఒయ్యారంగా తన్ను చేరవచ్చిన మనుమరాలిని చూచి సుందరమ్మ తనలో "గర్వం త్రోవలో గతకలు లావు. నూత్న ప్రణయగర్వం అద్దంలో నీడలాగు కామాక్షి ముఖంమీద యెలా ప్రతిఫలిస్తూందో! అప్పుడే యీామె ప్రణయం తారాజువ్వలాగు అంతరిక్షాన్న యెగురతూందే! ఇంకా క్రొత్త కాదూ! నాచిన్నతనంలో ఇలాగు నేనెగిరి పడ్డపాళ్లనోన్న వున్నాయి; అవి ఒక్కొక్కటే కామాక్షికి చెప్పాలి." అనుకొని క్రీగంటను కామాక్షిని చూచి నవ్వుతూ "ఏం మనుమరాలా! యీ హృదయం మహా వికాసంగా కనబడుతున్నావే? మా మనుమడేమేనా నూత్నాలంకారాలు తెచ్చేడా యేమిటి?" అన్నాది సుందరమ్మ. అవ్వ అలా అడగగానే కామాక్షి ముఖం యెఱ్ఱపడ్డాది. కొంచెం వణుకుతూన్న కంఠస్వరంతో "అవ్వా! నీకు వలె



"విడుతూన్న పువ్వుప్రక్కనున్న.........సుందరమ్మ కనబడుతూంది"

నాకుకూడా మంచి పురుషుడే లభించినట్లు నీతో చెప్పడానికి వచ్చేను. నువ్వు చెప్పినట్లు పురుషుడే స్త్రీకి వివిధాలంకారాలున్నా, అందులోనూ నా కథానాయకుడు నీ నాయకుడు లాగుకాక, మంచి రూపసి సుమా! అవ్వా!" కామాక్షి అలా అనగానే సుందరమ్మ త్రుళ్లిపడ్డది. "ఏమన్నావు? కామా?" అని గద్దించి కామాక్షి నడిగింది. "మా తాతను నాకు తెలియకలా అన్నాను. అయితే అవ్వా! అత డందగాడేనా?" అని కామాక్షి ప్రశ్నించింది. సుందరమ్మ ఆ ప్రశ్నవిని కళ్లు విశాలంగా విప్పి కామాక్షిని చూస్తూ "అమ్మకచెల్ల! వాని వికచాంబకముల్ శతపత్ర జైత్రముల్!" చారెడేసి కన్నే కామా! మన్నె దొరలాగాయన మొక్కడుంటే అక్కడల్లా వెలుగేనే! ఆజానుబాహువే! కమ్మచ్చున దీసిన ట్లాశరీరసౌందర్యం అంతా తీర్చి ఉండేది! అలా అని మార్దవానికి లోపం లేదుసుమా! ఆ విశాలవక్షంమీద నే నిలా తల వాల్చేసరికి నా ప్రాణాలన్నీ నాముఖం అనే పడవలో యెక్కడకో ప్రయాణం చేస్తూన్నట్టుండేది నాకు! ఆవక్షం పాలసముద్రంలా గిలా మిలమిల లాడిపోయేది. ఆతని వెచ్చని యూర్పులు నాకన్ను తెరచాపలను ఇలా ఇట్టే ముందుకు వంచేసరికి నా మొగం పడవలో నా ప్రాణాలయిదూ ఒక్కటయిపోయిన ట్టనిపించేది. అ దెక్కడదీ! ఆ లాలిత్యానికీ యిప్పటివాళ్ల లాలిత్యాలకీ యెంతో భేదం వుంది. నేను గాలికౌగిటిలో నలిగిన మొగ్గలాగు మీ తాతగారి కౌగిటిలో క్రొత్త శోభను పొందేదాన్ని" అనే సరికి కామాక్షి నవ్వుకుంటూ "కావచ్చును గాని, అవ్వా! నాగరికత అంటే యేమిటో యెరుగని ఆ రోజుల్లో మా తాత కంత సున్నితం యెలా వచ్చింది? నీవంటే ఆడుదానివి, ఆ మీద కావ్యాలూ గట్రా చదువుకున్నావు కాబట్టి యే వరూధిని లాగో తైతక్కలాడేదాన వనుకుందాం. కాని మా తాత మాటేమిటి? ఇప్పటి లాలిత్యం ఇప్పటి సున్నితం, ఇప్పటివిలాసాలూ ఆరోజుల్లో యెలావచ్చేయి?" అన్నది. "లాలిత్య విషయంలో మీ తాతనుమించిన చేయి లేదనుకుంటాను. ఒకనాడు నా కాయన మనుచరిత్రం పాఠం చెబుతున్నారు. "వదనప్రభూతలావణ్యాంబుసంభూత" అనేపద్యం ఆయన ధన్యాసీ రాగంతో చదివేసరికి అప్పటి ఆయనముఖవిలాసం చూచి నిలువు నీరయిపోయేను. అప్పు డాయన మూర్తీభవించిన పెద్దన్న పద్యంలాగే కనబడ్డారు! చెప్పకేమి? ఆ కాస్తసేపయినా వరూధినిలాగు నేను దూరంగా నిలబడలేక పోయినాను సుమా! కామా! అయితే అందులో ఒకరహస్యం వుంది చెప్తాను విను. ప్రణయవిషయంలో మగవాడిమాట అటుండనీ. ఆడుదిగానీ ఒకతీక్ష్ణమైన చూపు వాడిమీద ప్రసరించిందా అంటే దానితో వాడు చెల్లాచెదరై పోవలిసిందేను. దానిచూపులో యేదో వుం దనుకుంటాడు. ఆ చూపట్టే త్రాగేస్తామంటాడు. అందులో యేదో లాలిత్యం ఉం దనుకుంటాడు. మైమరచి పోతాడు.

వా డల్పసంతోషి. కామా! ఆడుదుందే, పురుషుని కౌగిటిలో విరహవేదన నటిస్తుంది. అనురాగంలో అనుమానం కలిపేస్తుంది. స్వర్గసుఖంలో అసంతృప్తి ప్రకటిస్తుంది. మల్లెపువ్వు వాసనలో మంటలు చూస్తుంది. కోకిల పాటతో కోలవర్షం కురుస్తూం దంటుంది. పురుషు డెంత మంచివాడయినా సరే ఆడుదానికిమాత్రం యేదో అనుమానం కొట్లాడుతూ వుంటుంది. ఈ సందర్భంలో నాకో చిన్నకథ జ్ఞాపకం వచ్చింది చెప్తాను విను.

నేను క్రొత్తగా కాపురానికి వెళ్లిన రోజులవి. మీ తాతగారి నాయనమ్మ యింట్లో మాకు సంరక్షణ కుండేది. . నాకు అత్తగారి బాధలేదు. ఓ! నేనారోజుల్లో యెలావుండేదా న్ననుకున్నావు! కామా! నన్ను చూడడానికి రెండుకళ్లు చాల వనేవారు మీ తాతగారు. నేనూ అలాగే వుండేదాన్ని. ఒకనాడు తారనై తక్కులూ తార్లూ చూపించేదాన్ని. ఒకనాడు యామినీపూర్ణతిలకనై ప్రణయ వ్యాసాలు రచించేదాన్ని. ఒకనాడు సుభద్రనై శుశ్రూషలో మునిగిపోయేదాన్ని. ఒకనాడు హైమవతినై తపస్సు నటించేదాన్ని. ఇంకొకనాడు వరూధినినై వలపు ద్రిమ్మరించేదాన్ని. నా వేషాలకు హద్దుండేది కాదు. మీ తాతగారు మాత్రం యెప్పుడూ ఒకలాగే వుండేవారు. ఆయన వలపులోతు యెప్పుడూ ఒక్కలాగే వుండేది. ఒరదీసిన కత్తిలాగు నా వలపిలా మిలమిల లాడుతూ వుండేది.

ఇలాంటి సమయంలో ఒకమాటు మంచి తమాషా అయింది. అది తలుచుకుంటే నాకే నవ్వువస్తూం దే కామా! ఆకథ నీకుపాఠంలాగ వుంటుంది చెప్తాను విను.

ఆనాడు పౌర్ణమి. తెల్లవారుజామున నాలుగుగంటల వేళయింది కాబోలు. పెరటి వెనుక కాపురమున్న మంగలివెంక డప్పుడే లేచి నన్నాయి పాడుతున్నాడు. రాగం చెవిలో చల్లగా పడుతూంది. నాకు నిద్ర బాగానే తెలివివచ్చింది గాని పాట వింటూ అలా కళ్లు మూ సు కు నే ప డు కు న్నా ను. వాడు పాడుతూన్న రాగం చక్రవాకమో, నాదనామక్రియో తెలిసింది కాదు. ఆరాగ మేదో పోల్చుకోడానికి కొంతసేపు తంటాలు పడ్డాను గాని నాకేమీ అందింది కాదు. మీ తాత గారు సంగీతవిద్వాంసుఁడు సుమా! ఆయన పాడితే యిలా కిన్నరలు మ్రోగేవి! కామా! సంగీతశాస్త్రం కూడా చాలా బాగా చదువు కున్నారే. నా కిప్పు డున్న యీ సంగీత జ్ఞానం ఆయన ప్రసాదమే. కొన్నాళ్లు నాకన్ని రాగాలూ ఒక్కలాగే వినిపించేవి. తెల్లవాళ్ల మొగాలలాగు పోలిక తెలిసేది కాదు. అప్పు డప్పుడే రాగాలు పోలిక పట్టడానికి ప్రయత్నం చేస్తున్నాను. అందుచేత అలా కళ్లు మూసుకునే 'అదేరాగమండీ?' అన్నాను. ఇంకా నిద్రలో వున్నారు గాబోలు జబాబు లేదని కళ్లువిప్పేను. కిటికీలోనుండి వెన్నెల మంచంమీద పడుతూంది. ఆవెన్నెలలో మీ తాతగారి విగ్రహం కనబడలేదు. పరుపు

మీద దుప్పటీ, ఆయనకట్టుకున్న పంచ, ఆమీద ఆయన శరీరచ్ఛాయ, ఇవన్నీ వెన్నెలలో కలిసిపోయా యనుకొని కళ్లు విశాలంగా విప్పి చూసేను. ఆయన నాకు కనబడలేదు. ఒక్కసారి నాకు ఒళ్లంతా జల్లుమన్నాది. ఇంకా అనుమానం తీరక మంచమంతా తడిమి చూచేను. ఆయన లేరు! ఎక్కడికి వెళ్లేరా అని అటూ యిటూ చూసేను. తలుపు తీసుకుని యివతలకువచ్చి చూసేను. వీథితలుపు గడియతీసి తలుపుదగ్గరా చేరవెట్టివుంది. అది చూడగానే నాకు కొండశిఖరంనుండి క్రిందపడ్డట్టనిపించింది. కాళ్లలోనుండీ వణుకువచ్చింది. ఒళ్లంతా చిటచిటా మండింది. అంతలో అప్రయత్నంగా కళ్లనుండి నీళ్లు జలజలా రాలేయి. నిశ్చేష్టనై అలా నిలబడిపోయాను. చేయూతకు గడ్డిపోచయినాలేక పెద్ద జలప్రవాహంలో కొట్టుకొనిపోతూ న్నట్టనిపించింది. మీతాతగా రెప్పుడూ అలాంటి సమయంలో యిల్లు కదలడం మామూలు లేదు. పున్నమ రేయి! పండువెన్నెల! తెల్లవారుజాము! నవ యౌవనంలో వున్న అందగాడు! ఒంటిగా అలాంటి సమయంలో కంట పడ్డట్టయినా యే ఆడుది ముఖం పెడపెట్టుకుంటుందనుకున్నాను. నాహృదయం కరగబోసి ప్రణయ ముద్రలో అచ్చుపోసుకున్న నా మన్మథ విగ్రహం అలా అందరి చూపుల్లోనూ, చేతుల్లోనూ నలిగిపోతే నేను చూడగలనా? ఇలాంటి ఆలోచనలన్నీ నామనస్సులో సంచరించేసరికి కామా! ఇక నాకు శరీరంపయిని స్పృహా తప్పిపోయింది.

తెల్లవారింది. అరుణోదయ ప్రభలు క్రమంగా వెలవెల బారుతున్నాయి. నేను కూడా తెలివితెచ్చుకుని తెల్లబోయేను. చప్పున గదిలోకివెళ్లి నిలువుటద్దం దగ్గర నిలబడ్డాను. చెదరివున్న నా ముంగురులలో నా ముఖం మాయమయిపోతే బాగుండు ననిపించింది. నా నీడమీద నాకు మితిలేని జాలికలిగింది. కన్నీటి ధారలతో పైటచెరగంతా తడిసి పోయింది. తిరిగి పైకివచ్చి నిలబడ్డాను. ఆ ఉదయ మంద మారుతాలలో విషజ్వాల లెగిసేయి. నానిట్టూర్పులలో నిప్పుకణా లెగిరేయి. కళ్లనుండి క్రాగుతూన్న జలధారలు కారేయి. అలా యేడ్చి



"అలా యేడ్చియేడ్చి కన్నులు విప్పేసరికి యెదుట మీ తాతగారు నిలబడ్డారు."

యేడ్చి కన్నులు విప్పేసరికి యెదుట మీతాత గారు నిలబడ్డారు. ఆ పెదవిమీద యెగురుతూన్న

చిఱునవ్వు రేఖ నాహృదయాన్ని శూలంలాగు తాకింది. నేను చూడలేక తల వంచుకున్నాను. నీదేవూరని యైనా అడగకుండా మీతాతగారు పడకగదిలోకి వెళ్లి శాలూ చిలుక్కొయ్యను తగిలించి పైకి వచ్చేరు. అప్పుడే ప్రాతస్నానం చేసేరు. క్రొత్తగ కనుబొమలనడుమ కుంకుమ రేఖ ఒకటి పెట్టుకున్నారు. ఆ రేఖ ఆడుదాని వ్రేలితో తీర్చి దిద్దినట్టు మహాఅందంగా కనిపించింది. ఆ కుంకుమ రేఖాకాంతులలో నేను మరింత వాడిపోయేను. మీతాతగారు మూడో కన్ను తెరుస్తున్నారనుకున్నాను. నన్నూ, నాముఖవిలాసాలూ ఆయన అట్టే యెగాదిగా చూచి చిన్ననవ్వు నవ్వుకొని వెళ్లి వీథిఅరుగు మీద కూర్చున్నారు. తిరిగీ నా ఒంటరితనం నన్ను బాధించడం మొదలుపెట్టింది. ఆయన నాయెదుట నిలబడితే మహాసముద్రంలో పడ్డట్టయింది. ఆయన నాయెదుట లేకపోతే పెను చీకటిలో పడ్డట్టయింది.

ఆ ఒకరోజునే కాదు. ఇలా ప్రతిరోజూ నాతో చెప్పకుండా యే రెండుజాముల రాత్రిదాకో వీథిలోకి వెళ్లిపోయేవారు. మీతాతగారు. ఇంట్లో వున్నప్పుడయినా మనసు విప్పి మాటలాడనైనా మాటలాడేవారు కారు. నాకు క్రమక్రమంగా బెంగ లావయిపోయి కర్పూరంముక్కలాగు చిక్కిపోయేను. నేను కూడా మీతాతగారితో కలివిడిగా మాటలాడడం మానేశాను. జ్ఞానంలేకుండా గృహకృత్యాలు నిర్వహించుకుంటూ మూగదానినై పెదవి కదపకుండా అంటీ అంటనట్టు ఆయన పరిచర్య చేసుకుంటూ అలా కొన్నాళ్లు మనలేసరికి నేను వేదాంతినిగా మారిపోయినట్టనిపించింది. స్వర్గంగాని నరకంగాని వ్యక్తి చెప్పు చేతలలోనే వుంది సుమా కామూ!


ఇంతలో దసరా వచ్చింది. మామూలుగా నన్ను పంపమని మావాళ్లు కబురు పంపేరు. మీతాతగారు "పండుగకు మీవాళ్లింటికి వెళతావా?" అని నన్నడిగేరు. నాకుకూడా జీవన విధానంమీద విసుగుపుట్టింది. కొద్దిరోజులయి నా తల్లి చాటున కొంత సేద దేరుదామనుకొని వెళ్లడాని కొప్పుకొన్నాను. మీభోజనంమాట యేమిటనేనా అడక్కుండా బయల్దేరేను. పుట్టినింటికి వెళ్లేను. బండీలోకూర్చున్నది మొదలు నాకళ్ల యెదుట జారుజారు శాలూ వల్లెవాటుతో చిరునవ్వు మొగంతో మీతాతగారూ, ఆయన సమీపానో, సందిటిలోనో నవ్వుతూన్న ఒక స్త్రీవ్యక్తి తాండవం ఆడుతూ వుండేవారు. ఆయననుండి దూరమైనకొలదీ నాకు వ్యథ లావయిపోయింది. ఏలాగో దసరా యేడు రోజులు గడిపేను. విను కామూ! ఈకథ తమాషా అంతా యిక్కడే వుంది. తలుచుకుంటే నాకు నవ్వు వస్తూంది.

ఆవేళ విజయదశమి. ఉదయాన్న లేచిన దగ్గరనుంచీ మీతాతగారూ ఆ స్త్రీవ్యక్తి తప్ప నాకు మరేమీ కనబడలేదు. ఆ విగ్రహాలు నాకు కనబడ్డప్పుడల్లా నా కళ్లనుండి నిప్పులు రాలేవి. ఇంతలో నాకుకొంచెం జ్ఞానోదయం అయింది. నేనిలా యేల బాధపడాలి?

ఆయనను తన ప్రవర్తనకు తగిన సమాధానం చెప్పండని యేల ఆయనను మొల కొంగులో చెయ్యివేసి నిలబెట్టకూడదూ?

నాకీ భయం యెందుకూ ? ఆయనను ఇలాటి సమయంలో విడిచివుండడం ఆయన య్యా అపక తవక ప్రవర్తనకు చేయూత యివ్వడం అవుతుంది. నేను కాలికి కాలు కట్టుకుని కూర్చుంటే ఆయన యేం చెయ్యగలరు? నే నిలా దూరంగావుంటే లాభంలేదు. అని ఆలోచించుకుని ఆ వెంటనే మీ తాతగారి దగ్గరకు ప్రయాణం అయ్యేను. మా అమ్మా, యిరుగుపొరుగులవాళ్లూ కూడా పండుగపూట వెళ్లిపోవద్దన్నారు. నాకు వెళ్లిపోకతీరదని చెప్పి బయల్దేరేను.

రాత్రి యేడున్నర లేక యెనిమిదిగంటలు అయి యుంటుంది. మాయింటి గుమ్మందగ్గర నాబండీ నిలబడ్డది. వీధి అరుగుమీద మంగళ తూర్యాలు వాగుతున్నాయి. గుమ్మాన్న మామిడితోరణం క్రిందపసుపూ బొట్లూ వున్నాయి. లోపల ముత్తయిదువలు బ్రాహ్మణులు కూడా వున్నారు. నాకేమీ తెలిసింది కాదు. నన్ను పుట్టింటి కంపకంపెట్టి మీ తాతగారు శోభనాలతో కులుకుతున్నారని నాకొడలు మండింది. లోపలకు వెళ్లకుండా గిరుస తిరిగి వెళ్లి ఊరిబావిలో పడిపోదా మనుకున్నాను. ఆయనతో క్రొత్తభార్యతో సుఖంగా కాపురం చేసికొండని చెప్పి మరీ చావ నిశ్చయించుకొని నట్టింటికి వెళ్లేను. ఇరుగు పొరుగు వాళ్లందరూ నట్టింట క్రిక్కిరిసి వున్నారు. మహాలక్ష్మి పీటపూలతో కలకలలాడుతూంది. ఎదుట పీటమీద పొరుగు సీతన్న గారి సుబ్బమ్మ పదిపండ్రెండేండ్లపిల్ల కలకలలాడుతూ కూర్చుంది. అక్కడ పళ్లెంలో పళ్లూ, పసుపూ, చీరా, రవికెల గుడ్డా అన్నీ వున్నాయి. ఆ పిల్ల కెదురుగా పీటమీద మీ తాతగారు కూర్చున్నారు ఆయన ప్రక్కను గడ్డలింగమూర్తి యేమిటో



"ఎదుట పీటమీద పొరుగుసీతన్న గారిసుబ్బమ్మ పదిపండ్రెండేండ్లపిల్ల కలకలలాడుతూకూర్చుంది"

చదువుతూ కూర్చున్నాడు.ఇవన్నీ చూసేసరికి కామూ! నాకు కండ్లు పగిలినట్లనిపించింది. అంతా అంధకారం అయిపోయింది. వీరావేశం యెత్తినట్లు నా కాడలు కంపించింది. చెమట శరీరాన్ని యేరులై పారింది. అంతట నేను మేఘగర్జనంలాటి కంఠస్వరంతో గట్టిగా కేకవేసి పెరటి నూతివైపు పరుగెత్తేను. ఆ తరువాత యేమయిందో నాకు తెలియలేదు.

నేను తిరిగి కళ్లు విప్పేసరికి మంచంమీాద పండుకొని వున్నాను. మీా తాతగారు విసనకర్రతో నాకు విసురుతున్నారు. ఆయన నన్ను చూడగానే నాకు తిరిగీ కళ్లు మూతలు పడ్డాయి. వణుకుతూన్న కంఠంతో ఆయన "సుందరం! నే ననుకున్నట్టే అయిం"దన్నారు. నేను మాటాడలేదు. నా తలమీాద పన్నీరు చిలికి తడిగానంచాతో నాకన్నులాయన మెల్లిగా తుడిచేరు. నేను దిగ్గున లేచి మంచంమీాద కూర్చుండి "ఏమిటిది" అని అడిగేను. ఆయన నవ్వుతూ "శ్రీవిద్యోపాసన బాల ఉపదేశం పొందాను. నవరాత్రోత్సవం చేస్తున్నాను. ఇది కడపటిరాత్రి కాబట్టి కన్యకాపూజ చేస్తున్నాను. ఇవన్నీ నీకు ముందుగా చెపితే బెడిసికొడుతుందీ వద్దంటావని నీకు చెప్పేను కాను. నీకు తెలియకుండా చేద్దామనుకున్నాను గాని సాగిందికాదు" అన్నారు. నేను కళ్లు విశాలంగా విప్పి 'నిజమేనా?' అని మీా తాతగారిని



"మీా తాతగారిని కౌగలించుకోబోయెను.'
'ఆఁ! దీక్ష!' అని ఆయన వారించేరు"

కౌగలించుకోబోయెను. "ఆఁ! దీక్ష!" అని ఆయన వారించేరు.

· బాగుందా, కామూ! ఇందుకే మనవాళ్లు భార్యాభర్తలు ఒకరిదగ్గర ఒకరు మనస్సులు దాచుకోకూడ దంటారు. నీవెప్పుడూ యేసంగతీ కూడా మా మనుమని యెదుట దాచకుమా! కామూ!" అని సుందరమ్మ చెప్పేసరికి ఆ మాటలు కామాక్షి విని "అయితే అవ్వా! సుబ్బమ్మవ్వ నీ సవతా?" అని విరగబడి నవ్వింది.

శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ గారు

శ్రీ రమానాథ పాద రాజీవ చింత-నామృతాస్వాదనహృదయ ప్రమత్తుఁ
డతుల భాగవతోత్తముఁ డయిన బ్రహ్మ-మానససుతుండు నారద మౌనివరుఁడు
విశ్వరక్షకు గోలోక విష్ణుఁ జూడ-నేగుదెంచెడు తఱిని మధ్యే పథమున
దుష్ట వన్యమృగాకులావిష్ట భీక-రోరగాన్విత ఘోర కాంతార భూమి

నొక్క భూరుహచ్ఛాయ రేయుంబవల్లు-తనువు గృశియింప శల్యగతంబు గాఁగ
ప్రాణములు కేవలము వాయుభక్షణమున-ఘోరతమమహా తపస్సు కఠోరవృత్తిఁ
జేయుచుండెడు నొకయోగి శేఖరుండు-అత్తమున సంయమీంద్రుతో ననియె నిట్లు.

విమల కరుణాళు గోలోక విష్ణుఁగూర్చి-నిరతిమతి భక్తితోఁ దీవ్రనిష్ఠ ఘోర
మగు తపము సేయుచుంటి మహాత్మ భక్త-వత్సలుని చిత్తమందు రవంత యేని
దాసునకుఁ దావు గలదో? నాతప్పిదముల-సైఁచునో హరి కరుణారస హృదయమున
ఇంక నెన్నఁడు శ్రీగోకులేశ్వరుండు-తన యనూన కృపా సుధాధారఁ జిలికి
కాచి రక్షించునో యెఱుఁగంగఁ గోరి-నాఁడ ననుచునుగో లోకనాథుతోఁడ
నామనవిగా మునీంద్ర! విన్నప-మొనర్చు మనిన సమ్మతినొంది బ్రహ్మర్షి తమతి
పరమభాగవతోత్తముం డరుగుచుండ-ననతిదూరంబునందె మహాప్రమోద
వీచిఁ దోఁగుచు నున్మత్తు వితము సతము-జ్ఞాన పత్రిని ద్రావెడి శాంతిరాముఁ
డబ్జసంభవసూతి కిట్లనియె; "పూజనము భజన లేని నాదు గన్నాయి తడియు
నేమొ? గోలోకమున నిందిరేశుఁ గాంచి-యడుగుమీ, నారదా!" యన నబ్బురమున
నల్లె; యని యంతఁ జని భగవానునిఁగని-భక్తిగదురంగ సాష్టాంగ వందనములఁ
జేసి వినతులొనర్చి యాసిద్ధయోగి,-శాంతిరాముఁడు పలికిన సరణినెల్ల
విన్నవించెను గోలోక విష్ణుతోఁడ.

సంయమీంద్రుదు వచస్సుల సాంతముగను-వినెడు తఱి హాని శాంతిరాముని గురించి
చెప్ప; నాక్షణ మందె యచ్చెరువు గాఁగ-శౌరి కన్దోయినుండి యవారిగాఁగ
బాష్పవర్షముఁ గురియఁ గృపావిభూతిఁ-బల్కె నిట్టులువత్స ప్రపంచమందు

అమరావతి శిల్ప చిత్రములు



౧. శుద్ధోదనుని సభ



౨. మాయాదేవి, శుద్ధోదనులు

"అదా యిదా అని అడిగితే గడ్డనీ, చెత్తనీ, తుక్కునీ, మాకరాలు పోయారు గాని ఫలానా వండమని చెప్పారా?"

"ఇంకేమీ లేదూ వండటానికి?"

"ఏం తెచ్చి పెట్టారూ మీ రింట్లో?"

"పెండలం యేమైపోయిందీ?"

"దాని మొఖం మండేరి. రుచా పచా? ఇంతకీ పెండలం పెండలం అనడమేగాని శెల్ల మేదీ?"

"ఆవ పెట్టరాదూ?"

"మీ కేం చెబుతారు. పదిరోజుల కిందట మా తమ్ముడు వచ్చినప్పుడు నాలుగు ముక్కలు వేయిద్దా మని యిస్తే తరిగాను. ఇంకా పోలేదు దురదలు. ఎక్కడో రాక్షసి పెండలం తెచ్చారు."

"దొడ్లో తోటకూర వుంది కాదూ?"

"ఛా! చీడ పట్టలేదూ?"

"కాడలో?"

"ముదిరిపోలేదూ?"

"పప్పుపులుసు వండరాదూ?"

"రెండు పులుసు లెందుకూ?"

"వుల్లిపాయలు మానేస్తే"

"మీ కేం, చెబుతారు"

"నీకూ నాకూ గూడా పనికివచ్చేది ఆసేకా లుండగా—"

"ఏం వున్నాయూ? కాకరకాయ చేదూ. దొండకాయ విషం. పొట్లకాయ గబ్బు. వంకాయ పైత్యం. కంద వేడి. అరటికాయ అరగదు. బీరకాయ మొఖం మొత్తింది. ఆనపకాయ నిరుచప్పన. గుమ్మడికాయ పడదు ఏం అట్టే పెట్టారూ వండడానికి? ఎంతసేపూ పెండలమూ పప్పుపులుసూ. దానిమొఖం కాల్చెయ్య. పెండలం దురదగదా? పప్పుపులుసులో వొక్క వుల్లిపాయ ఐనా అడ్డం వెయ్యనివ్వరు కదా?"

"............"

"పీటమీద కూచుని అంతా జపం చేసుకుంటారు. మీ కెక్కడ దాపరించాయమ్మ యీతిట్లూ యీతిమ్మలునూ?"

"రేపట్నుంచి నేను వొండుకుంటాను నువ్వు కూచుని తిను"

"వో! ఇంతకంటేనా? మూడో మేలు"

౭

"చాప వేస్తున్నా రెందుకూ?"

"వొక్కకునుకు........"

"దుకాణం మీదకి వెళ్ళరూ?"

"క్షణంలో లేవనూ?"

"అన్నం పెట్టేదాకా నిలవనిచ్చారుకారు. నాలుగు మెతుకులూ వొంటపట్టేటప్పటికి పెద్దమ్మ ఆవహించింది"

"నువ్వు పెట్టిన పంచభక్ష్యపరమాన్నాలూ తినేటప్పటికి"

"ఇలాంటిమొఖాలికే అలాంటివి"

"..............."

"రాత్రి తెల్లవార్లూ నిద్రపోవచ్చు. వేషాలు వెయ్యక దుకాణం మీదికి వెళ్ళండి"

"శంభులింగం భోజనం చెయ్యాలా?"

"మీకు మల్లే గోళ్ళుగిల్లుకుంటూ కూచోవలను ఈపాటికి దుకాణం తెరుస్తాడు వెళ్ళండి"

"వెళ్లి తిండి తిను. నువ్వు లేచాటప్పటికి నేనూ లేస్తాను"

"దానికీ దీనికీ సమ్మంధం యేమిటో?"

"నీ నగల వుబలాటమే నా నాకష్టమూ సుఖమూ చూడడం వుందా?"

"కుంగ లెత్తేనా దూలాలెత్తేనా? పొద్దుం పిల్చుకుంటూ కూచోడమే కాదూ అక్కడ?"

"..................."

"లేవరేం?"

"..................."

"వినపడదూ?"

"..................."

"మిమ్మల్నే. ఏమండోయ్! ఇలా చూడండీ"

"..................."

"పడుకోవద్దు. ఇదే చెప్పడం"

"..... ...."

"మానరు కామా? వెళ్లరూ"

"ఇంత మొండి కెత్తితే యెలాగమ్మా వేగడం"

"......................"

"ఇంతేనా యింతకంటె యేమేనా చేస్తారా? ఇదిగో ఓయ్! నల్లరాయీ! ఏమండోయ్! మిమ్మల్నే. వెళ్లనని చెప్పడానికేనా నోరులేదూ?"

"..................."

"నాకు జవాబు చెప్పకుండా యెలా నిద్రపోతారో చూస్తా కాదూ? మొండివాడు రాజుకంటె బలవంతుడుట. పెళ్లామనీ, బిడ్డలనీ, అప్పటనీ, ముప్పటనీ, మంచనీ, చెడ్డనీ యేమేనా తెలుస్తేనా? పెళ్లాడగానే సరా? వెర్రివాడికి పెళ్లాం వొస్తే గిల్లిగిల్లి చంపాడుట. మా నాన్న వొద్దుమొర్రో అంటూంటే మాఅమ్మ తగలపెట్టిందీ సమ్మంధం. అనుక్షణమూ దాని జీవానికి పడి యేడుస్తూనే వున్నాను నేను. రామరామా! చెల్లంకొట్టిన రాయిలాగ పలక్కపోతే యింకేమిటి చెయ్యడం? అసలీవంశమే యిలాంటిదీ. తాతముత్తాతల దగ్గర్నుంచీ వస్తోందిట పెళ్ళాన్ని యేడ్పించడం యీదిక్కుమాలిన యింటో. లోకంలో అనేకమంది వున్నారుగాని యింత కొయ్యతనం యెక్కడా లేదూ. చెవిటివాడి ముందర శంఖం వూదితే దాన్ని కొరకడానికి నీతరమా నీయబ్బ తరమా అన్నట్టుంది యీసహవాసం. అమ్మో! సిగ్గు బిడియమూ లేకపోతే సరి. ఎన్నన్నా దున్నపోతుమీద వాన కురిసినట్లే"

"వోసి నీయిల్లు—"

"మీయిల్లే. మీబతుకే. అదేదో మీకే"

"నోరు మూస్తావా మయ్యవా?"

"మీచేతు లేదేవుడికి మీరు కట్టుకున్నారూ?"

"..................."

"ఇప్పుడేనా లేవండి మించిపోలేదు"

"పడుకోనివ్వవూ?"

"కంటి చేయించరూ?"

"..................."

"నామాట వినండి. ఇవాళా రేపూ కష్టపడితే కంటె అయిపోతుంది. తరవాత మీయిష్టం వచ్చినంత సేపు నిద్రపోవచ్చు. మళ్లీ శిస్తులు వచ్చేదాకా దావుగల్లీకోసం తొందర పెట్టను. వేసంగిలో పుస్తెల వాను చేయిస్తానని మీనోటితో మీరేఅన్నారు కాదా? పదిరోజులాలస్యమైనా దానికోసం తొందరపెట్టను. లేవండి"

"వొక్కక్షణం నిద్రపోకపోతే తలనొప్పివస్తుందే"

"మళ్లీ అదే మాట"

"వూరికే పడుకున్నానని పేరూ. నువ్వుఅన్నం తిని వచ్చాటప్పటికి యిక్కడ వుంటే అడుగు"

"మీరు వెళ్లాకే తింటాను నేను అన్నం"

"వోసి నీపట్టుదల—"

"అమ్మో మీమొండితనం—"

"నన్ను వేపుకుని తినకు. నీకంతేనా పుణ్యంవుంటుంది. ఇంటోకి వెళ్లు"

"నాపుణ్యం బుగ్గయింది కనకనే మీయింటో పడ్డాను. నాకిలాంటి రోగం వుండడంచేతనే నెత్తిమీద పెట్టుకునేవాళ్లు యెందరు వచ్చినా మాఅమ్మ వాళ్లనందర్నీ కాదని నాగొంతు కోసింది. అసలు పెళ్లిలోనే శోత పుట్టింది నాకు; పాడుంబుర్రా, పిలకజుట్టూ చూశాటప్పటికీ"

"..................."

"మీకే చెప్పడం, వినపడదూ?

"..................."

"అయింది. ఇక దీపాలు పెట్టాకే కళ్లుతెరవడం. కుంభకర్ణుడి అంశ అంతా పట్టింది. 'మంచి మనిషితో

మాటా, మంచి పశువు కోడబ్బా' అన్నారు. మనిషి జన్మం యెత్తగానే సరా?"

"ఇందాకణ్ణుంచి చూస్తున్నాను. వొక్కటే ఆస్తరుగానే తోడేస్తున్నావు పేగులు. నాకక్కడ దాపరించావే నీమొగం కాలా......దుకాణంమీదే పడుకుంటాను వెళ్లి. తన్నుకు చావు"

"నాకేం చచ్చేదాకా మా. మా కుటుంబ్లో అర్ధాయుష్యులెవరూ లేరు. మమ్మల్నన్నవా ళ్లెవళ్లూ ముందుకు రాలేదు. ఇదిగో చెబుతున్నాను. అప్పలమ్మని పంపి కనుక్కుంటాను. అక్కడేనా సరే నిద్రపోయారంటే రాత్రి మీరు వండుకోవలసిందే అన్నం, వెళ్ళండి. మీవేషాలు సాగనిస్తా ననుకున్నారు పాపం"

౫

"కంటి పని కట్టిపెట్టించారా యేమిటి?"

"అలా అన్నావేం?"

"అప్పుడే వచ్చారేం?"

"రాకూడదూ?"

"అడక్కూడదూ?"

"మంచినీళ్లనా తాగవద్దంటే?"

"మొదటే అలాగ చెప్పరాదూ?"

"ఇంతట్లో యేం మించిపోయిందీ?"

"వొక్క క్షణం వూరుకుంటే సరీ తెలుసును."

"ఏడిశావు."

"ఏమిటీ! మహా చురుగ్గా వుంది యివాళ వ్యవహారం"

"చాలించు. కప్పెన్ని మంచినీళ్లు పట్టుకొనిరా"

"చూచోండి కాస్సేపు"

"ఏం? వర్జ్యం వచ్చిందా యేమిటి?"

"వర్జ్యం వుంటే మీరే బాధపడతారు కడుపునొప్పితో నాకేం?"

"మరి యింకెందుకూ ఆలస్యం"

"వొక్క క్షణం చూచోండి"

"కంకం అరుకుపోయి యింటికి వస్తే చూచోమంటా వేమిటే?"

"అప్పలమ్మ రావాలి"

"నా మంచినీళ్లకీ అప్పలమ్మకీ సమ్బంధం యేమిటే?"

"అంతేనా"

"అదేమిటే నీ మొఖం మం—"

"మాటలు మిగిలా రంటే వూరుకోను. మీ రక్కడ మూడుని నిద్రపోయారో లేదో తెలవకుండా మంచినీళ్లిలా యిస్తా ననుకున్నారూ? దిగండి సుద్రం"

"వోసి నీబతుక్కూలా! యింత మొండి కొత్తేమిటే యివాళా? దెయ్యం పట్టిందా యేమిటే?"

"దెయ్యమో భూతమో మిమ్మల్నే పట్టింది. మీరీవేళ బండ కత్తితే నేను మొండికత్తనా? గోళ్లు గిల్లుకుంటూ దుకాణం మీద కూచోడానికే మీ కంత కష్టమైతే చాకిరీ అంతా చెయ్యడానికి నాకెంత కష్టంగా వుండనూ? మీరు నా బతుక్కూలా లంటే నేను మీ సిగ్గు చిమడా లననూ?"

"నువ్వే యివ్వా లన్న మాట యేమిటి? నేనే తెచ్చుకుంటాను వెళ్లి"

"తెచ్చుకోండి నాకేం భయమా? పొయ్యిగూడా అలికేస్తే సంతోషిస్తాను. చివరి కలాగా అది మీమీదే పడుతుంది యివాళ. ఇదిగో. దుకాణం మీదకి వెళ్లి వచ్చిన గుడ్డలతో ముట్టుకుంటారు కామోసు, నిండు బిందె. మళ్లీ ఆచారానికి పట్ట పగ్గాలుండవు. ముట్టుకోండి. నాకేం? రాత్రికి అవే మంచినీళ్లు......మాతికి వెళ్లారు. కావాలి శాస్తి. పరుగెత్తలేక బలాదూ రన్నట్లు కోపం అంతా చేదమీద చూపిస్తున్నారు. నాకేం! పగిలిపోతే పుచ్చినట్లు తామే తెచ్చుకుంటారు మళ్లీ నీ. ఈసీమ గక్కడికి వెళ్లిందో గంటయింది వెళ్లి......"

*   *   *   *

"సిగ్గు లేకపోతే సరీ నవ్వడానికి"

"చేతగాని పని చేసుకున్నందుకు మీరు సిగ్గు పడాలి గాని నాకేం?"

"పాసుతోంది అంద్రబ్బ. ఎందు కెందు కని వూరుకుంటూంటే స త్రెక్కుతున్నావు"

"కాళ్ల కింద దెబ్బ రానేద్దా మని వుంది కాబోను పాపం. అబ్బో! మీ తాతలు దిగి రావాలి. ఇంక రెండేళ్లు పోనివ్వండి అబ్బాయి నవ్వగిస్తాను"

"వాణ్ణి కూడా పాడుచేస్తావు నువ్వు. కాస్త నిర్భాగ్యు డున్నాడు. అప్పుడే పుల్లిపాయలు మప్పేశావు"

"మీ నోట్లో శని వున్నాడు కనక తినడానికి మీకు యోగం లేదు. వాడి కేం? పుల్లిపాయలు కాక పోతే నల్లవుద్దరి తినండి మీరు నా కేం? శుభం అంటూ పిల్లాణ్ణి తిట్టుకుంటా రేమిటే? పాడునోరూ. పెళ్లి పందిట్లో కూచుని తద్దినమ్మంత్రా లేకరువు పెట్టే రకం. మా నాన్న పేరుపెట్టా నని యీ వుక్రోషం అంతానూ. రానివ్వండి మా నాన్నని చెబుతానూ"

"దిక్కున్న చోట చెప్పుకో"

"ఏమిటే! ఏం చూసుకునీ ఆ భిరవసా యివాళ? కొసుడ్లలో వండుతా నుండండి. యీ రాత్రిమీరు వండు కుంటే వచ్చి ముట్టుకుంటాను కూడాను. అదిక్కెమిటో అప్పుడుగాని తెలవదు. తొందర పడకండి. హో! ముక్కు బారెడు చేసుకుంటేనూ మూతి ముడుచుకుంటేనూ నాకు భయంలేదు. వెళ్లండి వుద్ధరిస్తారా యేమిటి?"

౬

"తలుపు తలుపు"

"..........."

"ఏం చేస్తున్నావు, వినపడదూ?"

"..........."

"హోయ్ ఇదిగో నిన్నే. ఎక్కడు న్నావు?"

"..........."

"ఇంటో వుందా యెక్కడి కేనా వెళ్లిందా? కోపం వస్తే వొళ్లు మండచెట్టు కుంటుంది. మడి కట్టు కుందో లేదో. అనాచారరోగం వచ్చి పడిందిగాని అమ్మ తంలా వుంటుంది యేం వండినానూ. కోపం రానంత సేపూ ప్రాణం యిస్తుంది కాని ఆ మంచి మాత్రం యెంతో సేపు వుండదు. కోపం యెలా వస్తుందో, యెందుకు వస్తుందో, యెప్పుడు వస్తుందో తెలవకుండా వచ్చి గజగజ లాడిం చేస్తుంది......ఎక్కడు న్నావూ? వినపడదూ? హోయ్! లోపలే వుంది గొళ్లెం. యేం చేస్తూ వుందోగానీ అబ్బాయీ"

"..........."

"నాయనా"

"......"

"బుల్లేడా!"

"......"

"కుర్రాడా!"

"......"

"రామచంద్రం!"

"......"

"దిక్కు మాలిన కర్మం కోపమా వినబడక పోవ డమా. ఏం—చే—స్తు—న్నా—వూ?"

"ఎందుకా బొబ్బలూ?"

"తలుపు తియ్యి, ఎక్కడికి పోయావూ?"

"ఎవళ్లతో టేనా లేచి పోయా ననుకున్నా రా యేమిటి?"

"ఏం చేస్తున్నా వంటే యేమి టా దిక్కుమాలిన గొడవా?"

"మాట్లాడితే దిక్కుమాలడ మేమిటే? పలక్క పోతే కాస్సేపు అరుగుమీద కూచోకూడదూ? అయి తే అయింది మడికట్టుకోం కి త్వరగాను"

"ఏం?

"ఏం యేమిటి?

"ఏ మంటున్నాను"

"తెలిసింది, ఏం యేమిటి?

"నేను మడి కట్టుకోవడం యెందుకూ?"

"ఇందాకానే చెప్పాను"

"అంతే?"

"ఒక్క దెబ్బని"

"నిద్రపోవడం నిజమే. కాని శంభులింగం పని మానలేదు. నమ్ము"

"కనక గొడవలు పెంచక తొరగా వంట కానివ్వండి. వినండి"

"నిజం చెప్పినా నమ్మవూ?"

"నిజాని కెక్కడికి? అన్నివిధాల బతిమాలినా మీరు వినగలిగేరా?"

"బుద్ధి తక్కువ వచ్చింది. నేను నిద్రపోయినా అతను పని మానలేదు"

"మీరు చూశారా?"

"మేలుకున్నంతసేపూ—"

"సరే. అప్పుడుకూడా కళ్లు మూసుకుపోవాలా యేమిటి? పోనీ యెంతసేపు నిద్రపోయారో చెప్పండి"

"క్షణం. అరగంట కంటే యెక్కువ లేదు"

"దానికి శిక్ష మీరు రెండుగంటలు పొడుం పీల్చకుండా వుంటారా?"

"చంపే వన్నమాట"

"ఏం? అంత నొప్పిగా వుందా? ఇందాకా నే నెంత బాధపడ్డానో. వొళ్లు మండుకుపోయిందే. కాస్తే నా బాధ తెలిసిందా మీకు? నయాన్నీ భయాన్నీ—ఎంత చిలక్కి చెప్పినట్లు చెప్పినా గిజా అన్నారు గాని విన్నారా?"

"అలా అనుకోకు. కొంచెం శాంతించు. వుండి వుండి వొక్కొక్కమాటు చర్రుమంటూ వుంటావు; గాని లేకపోతే నీయంత మంచిది లేదు. దిక్కుమాలిన ఆచారం దగ్గిర వస్తోంది నీకూ నాకూ జగడం"

"ఆచారం దిక్కుమాలిందని తెలిసివుండీన్నీ అనంటే అలా—కడుపు మాడ్చుకుంటా రెందుకూ?"

"స్మార్తమ్ముక్కలు చెప్పుకోవడంచేత అలా అలవాటైపోయింది. మీనాన్న యింగ్లీషు చెప్పించక పోయె. నాకు మరో వృత్తి చేతకాకపోయె"

"ఈయిల్లు తెగనమ్ముకొని సుందరంగారి వూరు పోదాం పదండి. వాళ్ల యింటిపక్క నున్న డాబా అమ్మకానికి వచ్చిందిట. సుందరాన్ని బతిమాలి తన బట్టల వర్తకంలో మీకు వాటా యిప్పిస్తాను పదండి"

"నువ్వంతదానవు కాదని కాదు. ముందు సంగతి అలా వుంచు. నేనునిన్ను తిట్టినా—ఆ తిట్లు హృదయం లోనుంచికాదు—ఏదో వొళ్లు మండి—నాదీ తొటాకు మంటే. వొక్క క్షణం నిద్ర పోయాను; గాని నువ్వు కంటి పెట్టుకుని కళకళ్లాడుతూ—నువ్వందంగా వుంటే అది నాకు ముచ్చట కాదూ? నామాట విను. నన్నే డ్పించకు"

"ఈ నక్కవినయాల కేం లెండి. నాతిక్క మీకు తెలిసిందే. వంటచేస్తారా, పొడుంకాయ నాచేతి కిస్తారా? రెండే పద్ధతులు."

"తప్పదూ?"

"ఊహుఁ"

"అయితే పొడుంకాయ పుచ్చుకో"

"తెండి"

"నువ్వు వంట చేశాటప్పటికి నేను చెరువుకి వెళ్లి సంధ్యావందనం—"

"కట్టిపెట్టండి. నమ్మం కదలడానికి వల్లకాదు. వీధిగుమ్మంకూడా తొక్కి చూడనివ్వను. మడి కట్టు కున్న తరవాత చేసుకోవచ్చు జపా లన్నీనీ"

"అంత అనుమానం—"

"అనుమానం కాకపోతే యేమనుకున్నారూ? కదిలే రంటే మాట దక్కదు"

"సరే మరీ. వంట అయినాక యిస్తావా పొడుం కాయా?"

"భోజనా లయితే గాని యివ్వను"

"ప్రాణాలు కొరికేశా వన్నమాట. అయితే మరి కానియ్యి"

"వూరికే కూచోడం యెందుకూ? దొండపాదుకి నాలుగు బిందెల నీళ్ళు పొయ్యండి"

"..............."

"లేవ లేం? నీళ్ళు పోస్తానే వ్రతం చెడను"

"తోడతానులే. నువ్వు వెళ్లి మడికట్టుకో"

"ఇంటోకి రండి తలుపు వేస్తాను"

"కోపం వస్తే వొళ్ళు తెలవదు. పట్టు వొస్తే ముందూ వెనకా చూడవు. తోచినంత పనీ చేసి తీర తావు. ఈ కళంకం వొక్కటే లేకపోతేనా— మరి నీ యిష్టప్రకారమే నడుచుకుంటాను పద"

"అలా దారికి రండి"

౧౦

"ఈ పూటేనా యేమేనా చెయ్యకపోతే తినడం యెలాగో చెప్పు నువ్వు"

"చెయ్య డానికి తీరుబడి యేదీ? దీపాలుపెట్టే దాకా మడికట్టుకోవడం యెవరో లేలకపోయె. అన్నం వార్చేటప్పటి కింత రాత్రయింది. ఏ కూరేనా చేద్దా మంటే—"

"పెసరపప్పు పచ్చడేనా చెయ్యరాదూ?"

"లేందే"

"కందిపప్పో?"

"ఎంతసేపటికీ నలగదు బాబూ"

"పోనీ మజ్జిగేనా పోగచకూడదూ?"

"నిన్న నయింది కాదూ?"

"ఇప్పు డేం తిన మంటావో చెప్పు కోప్పడక"

"వింటారా?"

"..............."

"చెప్ప మని మిడుతూ మిడుతూ అలా చూస్తా రేం మరీ? ఆ స్తేరీ యిలా చెప్పడమే మని యెగిరిపడక బాగా ఆలోచించుకోండి"

"..................."

"ఝాము రాత్రయింది. సగం వూరు మాటుమ ణిగిం దప్పుడే. ఇక మీరు వీథిలోకి వెళ్లనూ వెళ్లరు. మన యింటికి కవరూ రానూరారూ. ఇంతట్లో అమాం తంగా బ్రాహ్మణ్యం పోదు. కాస్త పులుసు—"

"ఉల్లిపాయల పులు సే?"

"చేదా? ఏప్పుడూ రావంత రుచి వచ్చిం దివాళ. జిహ్వ కెందుకు చంపుకుంటారూ? నాలుగు తిమలపాకు లిస్తాను వేసుకోండి యివాళకి. గప్ చిప్. తెల్లారేటప్పటికి యేమీ వుండదు. నామాట వినండి"

"..................."

"ఏమంటారు? వెయ్యనా?"

"ముందు పీక పిసికేసి తరవాత వెయ్యి"

"ఎంత సరసంగా వుం దీమాటా? తింటే తినండి లేకపోతే మానండి. నన్నేం వుద్ధరిస్తారా? చెప్పినకొద్దీ మరీనీ. నాకోటీ మీకోటీ నేను చెయ్యలేను. దిక్కు మాలిన వ్రతాలు పట్టి కడుపు కాల్చుకోవడం నాచేత కాదు. చల్లేనా కావాలా అక్కర్లేదా? పొద్దున్న పద కొండింటికి తిన్న మెతుకులు. నాకాక లేస్తాంది. తొర గా తెమల్చండి"

"పొద్దున్న మూడు అరటిపళ్లు తెచ్చాను. అవ్వే నా పడెయ్యి విస్తట్లో"

"కూచున్నాయి"

"ఏం చేశావూ?"

"మూడుగంటలవేళ కడుపులో చురచుర లాడితే అబ్బాయీ నేనూ నోట్లో వేసుకున్నాం. అట్టే పెట్టమని చెప్ప లేకపోయారూ మరీ?

"పెరుగుందా?"

"ఇందాకా అబ్బాయికి వడ్డిస్తూ వుంటే అంట చెయ్యి తగిలింది"

"పోనీ పాలు పట్టుకురా"

"ఇంకా దాలి మీద పెట్టలేదు. పచ్చివి పని కొస్తాయా?"

"యింతసేపటిదాకా యెందుకు పెట్టావు కాదూ?"

"కారణం చెబితే మాత్రం యిప్పుడు మీకు పాలు వస్తాయా?"

"పోనీ చల్ల పుల్లగా వుంటుం దేమో నిమ్మ కాయేనా అక్కట్టెపెట్టావా?"

"వుప్మాలోకే చాలింది కాదూ"

"ఎందుకు చేశావూ వుప్మా?"

"సుందరంగారియింట్లోవున్నన్నాళ్లూ పొద్దున్నా మధ్యాహ్నం కూడా కాఫీవుప్మాలు పుచ్చుకొని అలవా టైతే పూరికే సంపనా?"

"ఎంతసేప్తూ నువ్వూ నీవాళ్లేగాని నామాట మాడనక్కర్లేదూ?"

"మేం యేదిపడితే అది తింటాం. అంచేత మా కన్నీ వస్తాయి. నేనమ్మా మహా చదివి గుట్టలు పెట్టానని అది పనికిరా దిది పల్లకా దని ముక్కు మూసుకు కూచుంటే మీ కెలా వస్తాయీ? పైగా యేమీ— అన్నమేనా సరిగా పెట్టడం లేదని నన్ను యాగీ చెయ్యడమా? ఏదీ, నేను చేసిన వన్నీ తినండీ. మీ క్షేమేనా లోటు జరుగుతుం దేమోనూ"

"మాలకూడు తిన మంటావా?"

"వుల్లిపాయ మాలకూడా. బంగాళాదుంపలు కిరస్తానీవాళ్ల వా? కేబేజీ చెడిపోయిందా? గోంగూర పచ్చడిలో లెక్క రెండు వెల్లుల్లిరేకలు పడేస్తే బ్రాహ్మ ణ్యం బుగ్గయిపోతుందా? వుప్మా తింటే దేవతార్చన దెక్కడుతుందా? కాఫీ పుచ్చుకుంటే జంధ్యాలు మైలడి పోతాయా? దిక్కుమాలిన ఆవుపేడ ముట్టుకోలేక విస్త రంటలు తీసినచో పసుపునీళ్లతో కడిగితే అనాచారమా?

"నీకు పుణ్యంవుంటుంది కాని మాట్లాడక చల్లేనా మరికాస్త పొయ్యి"

"మరి కాస్త కాకపోతే అంతా పోసుకోండీ. మా నాన్న ధర్మమా అని నిక్షేపం లాటి గేదివుంది కదా?"

"పూటకి మానెడుపాలకి తక్కువ యివ్వదు పాపం. నాకుమాత్రం ప్రతీపూటా పెరుగు—"

"పాలికాపాడు గుగ్గిళ్ళు వేసి దానికి పెట్టడానికి వల్ల కాకపోయె. ఎక్కడ చావనండీ?"

"వాడిచేత వేయించడం మా నేవా?"

"మీరు చెప్పినట్లల్లా వింటే మట్టి కొట్టుకు పోవాలి. మజ్జిగ చాలా, యింకా స్త పొయ్యనా?"

"గిన్ని యిక్కడ పెట్టు"

"అలాగే పెడతాను పోసుకోండి. నా కా కలి దహించుకు పోతోంది. వడ్డించుకుంటాను బాబు నేనూ"

"ముష్టియ్యేళ్లు నిండాయి. ఇంకాకంచం పెట్టుకు తినలేదాలా?"

"పింగాణీ పళ్లా లింతకంటే బాగుంటాయి,ఎప్పటి కప్పుడే మరిచిపోతున్నాను. ఈ మాటు సుందరం చేత తెప్పించుకోవాలి"

"దొరసానిలాగ పీగ రెట్టుకూడా కాల్చు"

"మీ పొడుం కంటేనా తప్పా అదీ?"

౧౧

"ఏపీ యిందాకా తమలపాకు లిస్తా నన్నావు లెక్క అయిదాకులూ వొక చెక్కా తెచ్చిపెట్టూ"

"పులుసు వేసుకుంటే యిస్తా నన్నాను కాని తీరి కూచుంటేనా?"

"పులుసుకీ తాంబూలానికీ సంబంధం యేమిటి?"

"అంతానూ. కాకపోతే మాత్రం ద్వాదశీపూటా తాంబూలం యేమిటీ మీకూ?"

"పగలు రెండు ఝాములకే వెళ్లిపోయింది ద్వాదశి"

"పంచాంగం చూసుకుని వచ్చారు కాబోసు సిద్ధంగాను. మీ బ్రాహ్మణ్యం పాడుచేసిన పాపం నా కెందుకూ? ఇక అమావాస్య వెళ్లాకే మీకు తాంబూ లాలు. ఆకు లెన్నో లేవు బాబూ ఇవాళ. మీ కిస్తే సుందరంగారి యింటికి వెళ్లేదాకా నాకు చాలవు"

"నాకు లేకుండా నీకు రోజూ తాంబూలం యేమిటో?"

"మీ పాదముకీ నా తాంబూలానికీ చెల్లా"

"ఏడిపినట్టుగానే వుంది. తాంబూలం తెమ్మంటే దున్నపోతులాగ అలా పడుకుంటావేం?"

"తెల్లవార్లూ కూచుని తిట్టుకోండి"

"అమ్మాయిని వుయ్యాలలో పడుకోబెట్టావా లేదేమిటి?"

"ఎక్కడైతే యేమి? నాకు నిద్ర వొస్తోంది నన్ను మాట్లాడించకండీ యింక"

"ఏం యివాళ యింత పెందలాడే నిద్రా?"

"ప-గ-లు-ని-ద్ర-పో-లే-ద్"

ప్రత్యక్ష లీల

విద్వాన్ కోపల్లె శివకామేశ్వరరావు గారు

నీ పదభక్తి కంటకవనీ పథిఁ బొనరించునో సుమ
ప్రాపకహానో యెంతటి త్వరన్ నినువేఁడిన నేమి తెల్ప క
ట్లా పరువంపుఁ జిర్ణగవులందలి మాధురి కానఁగోల్పు దా
హా! పరువెత్తనేర నిఁక నామృగతృష్ణలవెంట మానినీ!

దీనతావార్ధి తితీర్షుల కీమణిసేతువు మార్గసంధాత యగును
దృష్టాతమోభిభిదిషుల కీచాంద్రమస జ్యోత్స్న నిస్త్రింశసరణిఁదాల్చు
నీహాతపన విసహిష్ణుల కీయంబుజము శిశిరశిశిరచ్ఛాయ లొసఁగు
నార్తియామాత్రి జిహాసుల కీసహస్రమయూఖుఁ డుదయ భాస్వరతఁ గూర్చు
ననుచు భవదీయ మృదులపాద నఖమణి మ-యూఖశీతలచ్ఛాయామోదమోప బృంహి
త సుఖసేవాపరత దరిద్రాణ దుఃఖుఁ-డ నగు దంచుఁ దలఁపఁ గన్పడ విది తగునో.

అదియేమో యటులన్ దిరస్కరణ విద్యానైల్యమున్ జూపుచు
న్నది నీహాసవిలాస; మంబువులిటుల్ హాలాహలంబౌనో; యిం
త దురంతవ్యథ నిక్కమున్నదో భవద్దాస్యంబునన్ గోర్కె చి
చ్చెదఁదాఁగొల్పఁగ నోక్కొ కన్పడదు; నీ యీలీల కర్థంబెదో.

వల; దేలా నన్నిట్టి-ప్పాలఁ బెట్టెదవు తరుణీ, విముగ్ధేక్షణ శృం
ఖలలన్ బూవుల హార-మ్ములటంచు మెడఁ దవిలించి పోరివుచ్చెదవా?

లాలనతోడి మెల్పు పదిలంబుగఁ బల్కిన నోరి ముత్తెముల్
గాలునో, నీవచస్సుమమరంద పిపాసకు నారు లెన్నడున్
బోలదో, నన్నువంటి జడబుద్ధులె నీకయి యాలపింత్రో, లే
దా లవ మైన నీ హృదయ మార్ద్రము కాదో యెఱుంగఁ జెప్పుమా.

దూరదూరస్థితవయి నీతోడిదాన-ననుచు నాసఁగొల్పెదు చెయ్వులటులుసూపి
లలన, నామనీషా నిర్మలత హరించి- యానిరంతరధ్వాంత గూహితునిఁ జేతె!
పూవునుండి యొండుపూవు దరియు తెమ్మె-రలఁ ద్వదీయమూర్తి రాణమెసఁగుఁ
గాని, కాల్నిలుపవో కటఁ గాంత, స్వైరిణ్య-పాంగవిద్ధబుద్ధి నైతి నేమొ.

భయమగుచున్న దయ్యెయె యభాగ్యుఁడ ధర్మువు వీడి తొక్క ని
ర్భయము ప్రతిష్ఠ యామె యనురాగ కటాక్షలతాలతాగ్రమై
న యెడ లభించునన్ పలుకు నాయెడ సార్థకమయ్యె నంచు; నీ
చెయిఁగొని యున్న త న్విడచి, చేతుల కందక కానుపింతువా!

ఆ చిఱునవ్వు మాటుఁ గొని యయ్యవె నాయెదపూవుఁ జింప నో
హో చనుదెంచె నీకనులనుండి శిలీముఖ పంక్తు; లింత బా
ధాచణమైన నీవలపు దక్కినఁజాలు నటంచు ముందుగా
నా చెయి సాగెడున్ వెతఁ బెనంగొని యుండఁగఁబోలు మాధురుల్.

వ్యోమవధ

భోగరాజు నారాయణమూర్తి గారు

(ఏకాంక నాటకము)

పాత్రలు

పురుషులు	స్త్రీలు
కృష్ణుఁడు	యమున
బలరాముఁడు	శారద
వ్యోముఁడు—(కృష్ణునిజంపుటకుఁ గంసునిచేఁ బంపఁబడిన రాక్షసుఁడు)	మల్లిక
	మధుర
శ్రీదాముఁడు—గోపబాలురలో ముఖ్యుఁడు.	గోపికలు

1 వ రంగము

[ప్రదేశము- బృందావనము; ప్రవేశము- వ్యోముఁడు]

వ్యోముఁడు

ఆహా! నే నెంత యదృష్టవంతుఁడను? మా కేశి బావ కృష్ణునిచేఁ జంపఁబడుట నాపుణ్యము ఫలించుట. అతఁడు తురగాకారమున నొక్కమారు కృష్ణునిపైఁ బడుట వట్టి యవివేకము. రాక్షస మాయాప్రభావంబెల్లఁ బ్రకటించిమోసపుచ్చి యాబలరామకృష్ణులఁ దుదముట్టింపవలసియుండెను. నేనట్లే కావించి మా కంస మహారాజు మెప్పువడసెదంగాక! ప్రభువును నేనర్థించు పారితోషికము లీబృందావనమును వ్రేపల్లెయు. గోపికాసామ్రాజ్యమునకెల్ల నేనే పట్టభద్రుఁడనై యిందున్న సుందరాంగన లందఱితో నమందభోగము లనుభవించుమహాభాగ్యము నాజాతకమునసుండఁబట్టి యే కేశికడ తేరినాడు.........ఏమిది? కేశింజంపి యింత సేపైనను గృష్ణుని జాడ లెందును గానరావేమి?

(తెరలో)

ఇవిగో జాడలు! శారదా! మల్లికా! మధురా! ఇవిగో యశోదకొడుకు పరుగిడిన యడుగుల జాడలు! రండు! రండు!

[ప్రవేశము—నేలనడుగులజాడలఁ బరికించుచు యమున—శారద—మల్లిక— మధుర.]

యమున

సీ. "ఈచరణంబులే యిందునిభానన!
సనకాది మునియోగ సరణినొప్పు

శారద

యీపాదతలములే మెలనాఁగ! శ్రుతి వధూ
సీమంతవీథులఁ జెన్నుమిగులు

మల్లిక

యాపదాబ్జంబులే యిభకులోత్తమయాన!
పాలేటి రాచూలి పట్టుఁగొమ్మ

మధుర

లీసుందరాంఘ్రులే యిందీవరేక్షణ!
ముక్తికాంతా మనోమోహనమ్ము

యమున

లీయడుగుల రజమె యింతి! బ్రహ్మేశాది
దివిజవరులు పాళి దిశలఁ దాల్తు;

శారద

రఖిలలోకజాల మాక్రమించుచు మున్ను
బలి నడంచె నివియె పద్మనయన!"

వ్యోముఁడు

(తనలో) ఇందుకే మోహము గ్రుడ్డిదందురు. ఆనల్లని వికారాకారముపై వీరికిట్టి మోహావికార మెట్లు జనించినదో నాకు నవ్వు వచ్చుచున్నది.

మల్లిక

యమునా! ఇం కెంతని వెదుకఁ గలము? నంద నంద వియోగానల దందహ్యమాన మానసులమై యెట్టులో నగమురాత్రి గడపఁ గలిగితిమి. ఇంక నీనిశాశేషమును గడపుటకు సాధన మాలోచించి చెప్పుము.

యమున

మల్లికా! నాకొక్క యుపాయము దోఁచుచున్నదే. ఇ య్యమునాతటినీ తటలతాకుటీరముల మనము నలుపురమును గృష్ణలీలాప్రదర్శనము గావింతుమేని మన మెఱుఁగకుండ నిట్టె తెల్లవారును.

అందఱు

బాగున్నదే! బాగున్నదే. ఔనౌను.

శారద

బాగున్నది కాని నాటకప్రయోగము మిక్కిలి కష్టసాధ్యము. ఇంతకు మనప్రయోగమును జూచి యానందించువా రెవ్వరు?

వ్యోముఁడు

(నవ్వుచు) నే నున్నాఁడను గానా?

మల్లిక

చూచువారా?

ఉ. ఆవులు లేళ్లు నీ వన వి
హంగచయంబులుఁ బ్రేక్షకావళుల్
గావె యహర్నిశల్ తెరలు
గా నెసఁగన్ దెరలెత్తిదించువా
రావనజాప్తశీతకరులై చెలు
వొందఁగ నాట్యశాల బృం
దావనసీమగా మనము
నాటకమాడుద మంబుజాననా!

మధుర

మల్లికా! ఎంతచక్కఁగాఁ జెప్పితివే. నిజముగాఁ గృష్ణవేషమును వేయుటకు నీవే తగినదానవు.

యమున

వల్లకాదు. నాయకవేషమును నేనుదీసికొందును.

మధుర

యమునా! సంగీతమున మల్లికకున్న పాండిత్యము నీకు లేదే. రసభంగము చేయక నా మాట విను.

శారద

మధురా! నాటకమునకు సంగీతమే ముఖ్యమని యవివేకుల మతము. విస్ఫుటవాక్కు, రసాభినయము లేని రాగాలాపము నాటక లక్షణము కాదు.

మల్లిక

అబ్బా; ఎందు కీవివాదము? యమునా! కృష్ణవేషమును నీవే ధరింపుము నా కక్కర లేదు.

వ్యోముఁడు

(తనలో నవ్వుచు) మీలో మీ కేల తగవులాడెదరు; కృష్ణవేషమును నేనే తాల్చి మీ యందఱిచే నాటకమాడించెదను తొందరపడకుఁడు.

శారద

మల్లికా! నాటకమేదో నిశ్చయింపక పాత్రధారణము నెట్లు నిర్ణయింపవచ్చును?

మధుర

ఔను—నిజమే. కృష్ణుని జన్మమునుండియుఁ బ్రారంభింతమా?

శారద

అబ్బా! కష్టమే. ఆమహామహుని జన్మరహస్యము లెవ్వ రెఱుఁగుదురు? గొప్పకై తెలియని దానిని బూనుకొనుట కంటెఁ దెలిసినది కొంచెమే యయినను రసవంతముగఁ బ్రదర్శించుట మంచిది.

మల్లిక

పోనిమ్ము. శారదా! పూతనం జంపుటయు శకటాసురుం గూలఁదన్నుటయుఁ దృణావర్తునిఁ బరిమార్చుటయు మున్నగు కృష్ణ లీలలు ప్రయోగార్హములు కావా?

శారద

కావనుగాని సామాజికుల సామర్థ్యమునుబట్టి నాటకమును నిర్ణయించుకొన వలయునుగాని పెద్ద పఱుగులు పఱువెత్తరాదు. ప్రస్తుతము మనమున్న వారము నలువురమే. వలసినన్ని పాత్రలులేక కథ............

యమున

అబ్బా! ఈవిమర్శనము చాలించి కథయేదో నీవే చెప్పరాదా?

శారద

మహేంద్రగర్వభంగమను పేర శ్రీకృష్ణుని గోవర్ధనోద్ధారణకథావిధానము ప్రదర్శనార్హమని నాయుద్దేశము.

అందఱు

(అంగీకారసూచకముగఁ దలలూఁపుచున్నారు)

మల్లిక

శారదా! కృష్ణవేషమును నీవే యుంచుకొని తక్కిన పాత్రల నిర్ణయింపుము.

శారద

నిర్ణయించుట కేమున్నది? ముఖ్యమైన పాత్రలు కృష్ణుఁడు, దేవేంద్రుఁడు. నీవు దేవేంద్రుఁడవు కమ్ము. మధురయు, యమునయు నవసరోచితముగఁ దక్కినవాని నభినయింతురు.

మల్లిక

సరే! యింకఁ బ్రారంభింతము. మీరు దూరముగఁ బొండు.

(తక్కిన ముప్వురు నిష్క్రమింతురు)

మల్లిక

(ముందుకువచ్చి) ఏమి యీకృష్ణుని కండకావరము? గోపాలక ప్రముఖులైన నందాదులందఱు నా యనుగ్రహమును బడయ నింద్రయాగంబాచరింప సమకట్టియుండ, నీ దుష్టగోపాలకుండు దురుపదేశములతో వారి ప్రయత్నములు వారించి, నాయాగమునకు భంగము గలిగించి నన్నెంత పరిభవించినాఁడు? ఈ కూళతనంపు గొల్లకొలంబునకెల్ల నేనిప్పుడే ప్రళయంబు గల్పించెద. (ప్రక్కకుఁజూచి) ప్రళయకాల ప్రవర్తకంబులైన యో సంవర్తక మేఘంబులారా! మీ రిటురండు.

[నల్లని ముసుఁగులతో మధురయు, యమునయుఁ జెరియొక ప్రక్కనుండి ప్రవేశింతురు.]

ఇద్దఱు

విజయోస్తు, విజయోస్తు మహేంద్రా! ఏమి యాజ్ఞ?

మల్లిక

ఓమహామేఘంబులారా! విధివశమున నాకిప్పుడు గొప్ప పరాభవము సంభవించినది

మ "పెరుగుల్ నేతులు ద్రావి క్రొవ్వి భువినా
భీరుల్ మదాభీరులై
గిరిసంఘాత కఠోర పత్ర దళన
క్రీడా సమారంభ దు
ర్భర దంభోళిధరుం బురందరు
ననుం బాటించి పూజింప క
గ్గిరికిం బూజలు చేసి పోయి
రిదెపో కృష్ణుండు ప్రేరేపఁగన్.

ఇద్దఱు

ఆహాహా! ఎంతసాహసము! ఎంతసాహసము!

మల్లిక

కావున మీరు సత్వరంబుగ నేగి నిజస్వరూపములతో నా ప్రేపల్లెపై నెల్లకడలఁ దాండవమాడుచు నుద్దండ దిగ్వేదండ తుండ నిభాఖండ వారి ధారాపాతంబులఁ బోతరించిన గోకుల వ్రాతమునెల్ల నిర్మూలముగావించి రండు. ఐరావతముపై నేనును మీ వెను వెంటనే బయలుదేరెదను పొండు.

ఇద్దఱు

చిత్తము, దేవా! చిత్తము. (నిష్క్రమింతురు.)

(మల్లిక తలయూపుచు సగర్వముగా నిష్క్రమించును)

వ్యోముఁడు

ఈనాటకములో నేనుఁగూడ నొక యంతర్నాటకమును బ్రయోగింతునా? బలరామకృష్ణులు రాకమునుపే నేనును గోపాలక వేషముదాల్చి యీగోపికల మోసపుచ్చి యీకొండ గుహలో దాఁచివేసెదను. రామకృష్ణులనుసూక్ష్మముగాఁ గడతేర్చుట కిదియొక సాధనమగును. గోపికల వెదకు మిషపై మెల్లగాఁ వారి నెచ్చటికేనిం దీనికొనిపోయి యొక్కొక్కని నాకస్మికముగఁ దుదముట్టింపవచ్చును. ఎంతమంచి యుపాయము స్ఫురించినది? నావంటి బలవంతుఁడైన బుద్ధిమంతున కేకార్యము సాధ్యముగాదు? అదిగో! కృష్ణవేషమును బ్రకటించుటకై శారదవచ్చుచున్నది. ఇంక నేనును నా వేషమును దాల్చి

నానాటకమునుగూడ నారంభించెదను. (నిష్క్రమించును)

[ప్రవేశము శారద]

శారద

అబ్బబ్బా! ఈమేఘాడంబరమెంత భయంకరముగనున్నది? (ఆకసమును జూచుచు) ఏమియీ మెఱుపులు! ఈ ఝంఝామారుతము లోకము నెత్తుకొనిపోవునాయేమి! ప్రపంచమును ముంచివేయుచుండిన యీవడగండ్ల వానవలన నేమి కడగండ్లు మూడునోకదా? ఈమహోపద్రవమునకుఁ గారణ మేమైయుండును? (ఆలోచించి) తెలిసినది! తెలిసినది! ఓరీ మదాంధా! మహేంద్రా! తొందరపడకుము! నీకుగర్వభంగముకాఁగలదు.

(తెరలో) కృష్ణా! రక్షింపుము! రక్షింపుము.

శారద

(తిరిగిచూచి) అయ్యయ్యో! ఈమహావర్షపాతంబునఁ జిక్కి గోపికలును, గోపాలురును భయాతిశయంబున నన్ను శరణు చొచ్చుచున్నవారు. ఇప్పు డీగోవర్ధనగిరి నాకేలందాల్చి మదాంధుఁడైన జంభారి యొనరించిన మోసమునుండి వీరిని రక్షింపవలయు. (ముందుకేగి) ఓగోపికా గోపాలక రత్నములారా! మీరందఱుఁ బరుగుపరుగున మీ మీగోగణంబులతోవచ్చి యీపర్వతముక్రింద నిర్భయముగనుండుఁడు. (కొంచెమూరకుండి) అయ్యయ్యో రారేల? ఈమహాపర్వతము మీపై జారవిడిచెదనేమో యని జడియుచున్నారా?

శా. బాలుం డీతఁడు కొండ దొడ్డది మహా
భారంబు సైరింపఁగాఁ
జాలండోయని దీనిక్రింద నిలువన్
శంకింపఁగాఁ బోలఁదీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరా
చక్రంబు పైఁబడ్డ నా
కేలల్లాడదు బంధులార! నిలుఁ డీ
క్రిందన్ వినోదంబునన్."

[ప్రవేశము- గోపాలక రూపముతో వ్యాసముఁడు.]

వ్యాసముఁడు

అమ్మా! శారదా! శ్రీకృష్ణుఁ డీ సమీపమున గోపాలురతోఁ గ్రీడించుచు మీయందఱిని వెదకి తోడుకొని రమ్మని నన్నంపెను

శారద

ఆఁ-కృష్ణుఁడా? ఎచ్చటనున్నాఁడు? యమునా! మల్లికా! మధురా! కృష్ణుఁడే కృష్ణుఁడే!

[ముగ్గురు పరుగునఁ బ్రవేశింతురు]

(ఆతురతతో) ఏఁడీ? ఏఁడీ? కృష్ణుఁ డెక్కడ? అంతభాగ్యమున్నదా?

వ్యాసముఁడు

ఈపర్వత సమీపమున సెలయేటియొడ్డున నిసుక తిన్నెలపై గోపాలురతోఁ గ్రీడించుచున్నాఁడు. నావెంట రండు.

[గోపికలు వ్యాసునివెంట సంభ్రమముతో నిష్క్రమింతురు]

2-వ రంగము.

[ప్రదేశము - బృందావనము - ప్రవేశము - కృష్ణుఁడు, బలరాముఁడు, శ్రీదాముఁడు, మఱి కొందఱు గోపాలురు.]

శ్రీదాముఁడు

కృష్ణా! బలరామా! గోపికలజాడల నరసి తక్కిన మన గోపాలకులెల్లరును వచ్చువఱకు మన మిచ్చట విశ్రమింతము.

బలరాముఁడు

కృష్ణా! శ్రీదాముఁడు చెప్పినట్లు చేయుటకంటె మనకేమి కర్తవ్యమున్నది?

(అందఱు కూర్చుందురు.)

కృష్ణుఁడు

అన్నయ్యా! ఈ నిండువెన్నెలలో నీ యిసుక తిన్నెపై విశ్రమించి నంతనే ప్రాణము లెంత హాయిగ నున్నవి?

బలరాముఁడు

సోదరా! సాయంకాలము నుండియు నీబృందావన భూపరిసంచారమున నిక్కిలి స్రుక్కియుండుట యేకాక యందుపైఁగలిగిన కేశిదానవ వధోద్యోగము నీకింతటి శ్రమకుఁగారణమైనది.

సీ. క్రూరపలలాశి కేశినిఁ గూలనేసి
జగములకు మేలుగూర్చిన జాణవనుచు
శీతలోపచారంబుల శీతకరుఁడు
నిన్నుఁ గడుభక్తిఁ గొల్చుచు నున్నవాఁడు.

కృష్ణుఁడు

అన్నయ్యా! నిజముగా నా కేశిదానవుఁడు దేవ దానవ మానవ లోకములకెల్ల మహా భయంకరుఁడు.

ఉ. భీకర వత్స దానవునిఁ బీచ మ
డంచితి నాబకాసురుం
దాకివధింపఁ గంటి యమునంగల
కాళియుఁ బారఁదోలితిన్
ఆకొను సింగమట్లు వృషభా
సురుఁగూల్చితిఁగాని వీరిలోఁ
బ్రాకట ధైర్య శౌర్య బలరా
శినిఁ గేశిని మెచ్చితిం జుమీ.

బలరాముఁడు

కృష్ణా! అప్పుడప్పుడు నారదుఁడువచ్చి కంస సందర్భ ప్రసంగమునఁ గేశింగూర్చి ప్రసంగించు చుండుట నీకు జ్ఞాపకమున్నదా?

కృష్ణుఁడు

అయ్యా! లేకేమి? జగద్భయంకరుండైన కేశి మాట యటుండ నారద ప్రసంగమువలన మఱి యొకవిశేషమిప్పుడు నాకుజ్ఞప్తికివచ్చుచున్నది.

ఉ. కంసుని సేనలో గణన
గాంచిన వాఁడఁట! సాధుదేవతా
హింసల నద్వితీయుఁడఁట!
యెల్లవిధంబులఁ గేశి దానవో
త్తంసున కీడు జోడునఁట!
తద్రణభీముని వ్యోముఁ గూడ నా
కంసుఁడు పంపకుండుటకుఁ
గారణమేమొ యెఱుంగ నగ్రజా!

బలరాముఁడు

ఔను. ఆవ్యోమాసురుఁడు గూడఁ బ్రబలమాయా బలుండనియే వినుచున్నాము. అంత్యకాలము సమీపించినంతనే కంసప్రేరితుఁడై వాఁడును రాఁగలఁడు. తొందరయేల?

శ్రీదాముఁడు

ఆహా! నాఁటి దండకారణ్యమునందుఁ బోలె నేఁడు బృందావనమునందు రక్కసులు ప్రవేశించుచున్నారు. రామా! కృష్ణా! రామలక్ష్మణులంబోలె ధనుర్ధరులై మీ రింక నిరంతరము నప్రమత్తులరై యుండవలయును.

బలరాముఁడు

కృష్ణా! కాలమెంతలో మారినదోయీ!

సీ. సమద దానవ భుజా శాఖ లెక్కుటగాని
 చెట్లెక్కి నాటలు చెల్లవింక
వీరదానవకోటిఁ బారఁ దోలుటగాని
 పసులఁ దోలుచునుంట పొసఁగదింక
అసురపంక్తులఁబట్టి యాడించుటయె కాని
 చలిదిపంక్తులయాట సాగదింక
జయసూచకంబైన శంఖారవము గాని
 పిల్లఁగ్రోవిరవంబు చెల్లదింక
సంగరోచితవేషభాషలును గాని
గొల్లవేషంబు లీపైని గూడవింక
కదనరంగ విహారముల్ గాని మనకు
వనవిహారంబు లీపైని దనర వింక.

కృష్ణుఁడు

అన్నయ్యా! మీరు సెలవిచ్చినది నిజము. మన బాల్యక్రీడా వినోదము లెంతలోఁ గట్టిపెట్టవలసివచ్చినది!

గీ. బాల్య యౌవనాదికములో ప్రాయములవి
 మెఱిక లున్నవి తుట్టున నెగురఁగలవు;
 ఎగుర రెక్కలు నడువఁ గాళ్లేని లేక
 యకట! పీడించుచుండు వార్ధక మొకండె.

(అని మెల్లఁగా బలరాముని ప్రక్క మేను వాల్చును.)

బలరాముఁడు

కృష్ణా! నీ బాల్యక్రీడ లన్నింటిమాట కేమిగాని, పిల్లనగ్రోవి నల్లన పెదవుల కడం జేర్చి యందు నీవు పాడుచుండు బ్రహ్మగంధర్వగీతము మాత్రము మా కెప్పటికిని మఱపునకు రాదు. ఎంత విన్నను దనివి తీఱదు.

శ్రీదాముఁడు

బలరామా! కృష్ణున కిప్పు డించుక నిద్రపట్టినట్లు తోఁచుచున్నది. మన మాతనికి నిద్రాభంగము గాకుండ—

బలరాముఁడు

ఔను. దూరముగ నుండియే మాటాడుకొందము.

(శ్రీదాముఁడు-బలరాముఁడు దూరముగఁ గూర్చుందురు)

బలరాముఁడు

శ్రీదామా! ఈకమ్మ తెమ్మెరలును, బికాలాపములును వేకువం బ్రకటించుచున్నవి.

మ. కలనన్ దైత్యుల నుక్కడంచుచు జగ
 త్కల్యాణ సంధానుఁడై
 పలు భంగుల్ విహరించు కృష్ణునియెడం
 భక్తిం బ్రదర్శించుచున్

గలకంఠమ్ముల జోలఁ బాడుటకు నా
జ్ఞాపించి ప్రత్యూషశీ
తల మందానిలుఁ డాత్మహస్తములతోఁ
దానిట్టు జోకొట్టెడున్.

శ్రీదాముఁడు

ఔను. అందుచేత నే కృష్ణున కింతలో నింత గాఢమైన నిద్ర పట్టినది. (ప్రక్కకుఁ జూచి) మిత్రమా! మన మంపిన గోపాలకులలో నొక్కఁడు మాత్రమే వచ్చుచున్నాఁడు. తక్కిన వారెక్కడ నున్నారో? గోపికలు గానరాలేదు కాఁబోలు!

[ప్రవేశము-వ్యోముఁడు.]

బలరాముఁడు

ఓయీ! గోపికలు కానరాలేదా? తక్కిన మన వారందఱు నెక్కడ నున్నారు?

వ్యోముఁడు

అయ్యా! ఏమని చెప్పఁగలను? ఈ బృందావన మంతయు వెదకివెదకి వేసరితిమి. గోపికల జాడలేదు. పాపము మన గోపాలకు లెల్లరుఁ జింతించుచు నొకచోఁ జతికిలఁబడి మిమ్ముఁ దోడుకొని రమ్మని నన్నంపినారు.

బలరాముఁడు

సరియే కాని యంతవిచారింపవలసిన పని యేమి? వారు ప్రేపల్లెకుఁ బోయియుందురు. నీవుపోయి వారిని విచారింపవలదని చెప్పుము. కృష్ణుఁడు మేల్కాని నంతనే మేము గూడ వచ్చుచున్నాము.

వ్యోముఁడు

వారందఱు మీ కొఱకత్యాతురతతో నెదురు చూచుచుందురు. కృష్ణుఁడు మేల్కొనువరకు నే నిందుండెదను. మీరైన నేగి వారినిఁ గలిసికొనుఁడు.

శ్రీదాముఁడు

వలదు. వలదు. బలరామా! రాక్షస సంచారము ప్రబలమైయున్న యీ దినములలో మనము కృష్ణు నొంటరిగా విడిచిపోరాదు.

కృష్ణుఁడు

(త్రుళ్లిపడి లేచి) ఓరోరి దానవాధమా! వ్యోమా! ఇంకెచ్చటికిఁ బోఁగలవురా? (అని తటాలున వచ్చి వ్యోమునిఁ బట్టుకొనును)

బలరాముఁడు

ఆఁ-ఆఁ-కృష్ణా! అదేమి,అదేమి. ఇప్పుడు వ్యోముఁ డెచ్చటనుండి వచ్చినాఁడు? నీవు నిద్రలోఁ గల గంటివా యేమి?

వ్యోముఁడు

(తనలో) కొంపతీసి నన్నితఁడు పోల్చుకొనలేదుకదా?

కృష్ణుఁడు

(వ్యోముని విడిచి) అన్నయ్యా! వ్యోముఁడీ ప్రాంతమునకు రాలేదా?

బలరాముఁడు

లేదు. లేదు. వ్యోమునిం గూర్చి ప్రసంగించుచు నీవు నిద్రించుటచేత నీకట్టి కలవచ్చిన దేమోకాని యిప్పుడు వచ్చినవాఁడు మన గోపాలుఁడు గాని వ్యోముఁడుగాఁడు.

కృష్ణుఁడు

ఆలాగునా? అట్లైనఁ గలగంటిఁ గాఁబోలు!

వ్యోముఁడు

(తనలో) అమ్మయ్యా, ఇప్పటికి నాగుండె కుదుటఁబడినది. ఇంక నా ప్రయత్నము కొనసాగినట్లె. (ప్రకాశముగా) కృష్ణా! నీకేమి కల వచ్చినది?

కృష్ణుఁడు

వ్యోమాసురుఁడువచ్చి మన బృందావనమునఁ బ్రవేశించి గోపికలనెల్ల నొక కొండ గుహలో దాఁచివేసినాఁడట!

వ్యోముఁడు

(కోపముతో) ఆఁ- ఆఁ- దుర్మార్గుఁడు! దుర్మార్గుఁడు! ఎంతసాహసము చేసినాఁడు?తరువాత?

కృష్ణుఁడు

(నవ్వుచు) అట్లుదాచివేసి గోపాలక వేషముతో నన్నుఁ గడతేర్చుటకై మెల్లఁగా నిచ్చటకు వచ్చినాఁడఁట!

వ్యోముఁడు

అహ్హా హ్హా హ్హా! రా క్ష సు లు కామరూపులు కదా? తరువాత, తరువాత?

కృష్ణుఁడు

వచ్చినంతనే యమ్మాయగోపాలుఁడువ్యోముఁడని నేను గ్రహించి—

వ్యోముఁడు

(భయాశ్చర్యములతో) ఆఁ?—

కృష్ణుఁడు

తటాలున నిట్లు వాని నడుమును బట్టి, (అని వ్యోముని నడుముపట్టి)యిట్లుగిరగిరఁద్రిప్పి(అని వ్యోముని గిరదిరం ద్రిప్పి) కడకీరీతి నేలం గూలనేసితినఁట! (అని వ్యోముని నేలగూలవేయును)

శ్రీదాముఁడు-బలరాముఁడు

(నేలఁగూలిన వ్యోమునిఁజూచి, గుండెలుబాదుకొనుచు) ఏమి యాశ్చర్యము? ఎంత భీకర స్వరూపము?

కృష్ణుఁడు

అన్నయ్యా! వీడెవఁడో యిప్పుడైన గ్రహింపఁ గలిగితిరా?

బలరాముఁడు

కృష్ణా! ఈమాయగోపాలకుఁడు దుష్టదానవుఁడని నీవెట్లు గ్రహింపఁగలిగితివోయి! సర్వజ్ఞుఁడవగు నీవెఱుఁగని దేమున్నది? ఎంత గొప్ప గండము గడచినది?

శ్రీదాముఁడు

సామాన్య గండమా? నిజముగా నీ రాత్రివంటి రాత్రి యిదివఱ కెన్నఁడును సంఘటిల్ల లేదు. (చేతులుమోడ్చి) వాసుదేవా! నీవు మహాయోగీశ్వరేశ్వరుండవు. భక్తత్రాణ పరాయణుండైన పరమేశ్వరుండవు.

"మ. గురుపాఠీనమవై జలగ్రహమవై
కోలంబవై శ్రీనృకే
సరివై భిక్షుఁడవై హయాననుఁడవై
క్ష్మాదేవతా భర్తవై
ధరణీనాథుఁడవై దయాగుణగణో
దారుండవై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెద నిలా
భారంబు వారింపవే"

కృష్ణా! దుష్టభంజనమును శిష్టరంజనమును గావింపనుద్దేశింపఁబడిన నీయవతారకలనవలన సకలజగంబులకుఁ గల్యాణంబు లగుఁగాక!

కృష్ణుఁడు

శ్రీదామా! అట్లే యగుఁగాక!

ప్రభు ఋణము

అరవిల్లి నరసింహాచార్యులు గారు, బి. ఏ. (సారస్వతసమాజము)

(గీతమాలిక)

౧

కాలపురుష ధనుర్ముక్తకాండవితతి - రక్తసిక్తాంగుఁడై గ్రహరాజు పశ్చి
మాద్రిఁ దలదాచుకొనుటకై యరుగుచుండె - కాని యీ ఘనుఁ డట్టులు గాక, కదన
రంగమున ఖడ్గసన్నిధిఁ బ్రభువుకొఱకు - మేను వాల్చెను—సామంతుఁడైన నేమి!
తనువుదాల్చిన యట్టిపాత్రమ్ము, మూర్తి-దాల్చు ప్రభుభక్తి—యీతఁడే దైవసముఁడు.

౨

పన్హాళాదుర్గము శివాజిప్రభువు విడచి - వచ్చు టేగతి నెఱిఁగె నెవ్వర మెఱుఁగము!
ఎదురుగాఁ బోయి స్వాగతమిచ్చె నంత - (బీజపుర సేన లణఁగెను పేరులేక
అడుగు తడబడు తొందర పడఁగ నేల) - 'జయ మహారాజ' యని మేము సందడింప
నాపి సేనాధిపతిఁ బ్రియమారఁ బిలిచి - తండ్రి! శ్రీబాజి ప్రభువును దనయుకన్న
ప్రియముతోఁ జూచి కంటిని ఱెప్ప వోలె - కాచితివి నీ ఋణముఁ దీర్చఁగలనె చెపుమ!

సిద్ది బల్లాలు సేనలఁ జేర్చి ముట్టడించి కోట బందీలఁ గావించ వారి
యాగడ మణంచి యవకాశ మబ్బఁజేసి - శ్రమపడితిరయ్య, నీవు, వీరాగ్రగణ్యు
లైన యీమహారాష్ట్ర సైన్యాళి: యింక - రాజగడమున కొంత విశ్రాంతిఁ గొనఁగ
రమ్మనఁగఁ గేలుమోడ్చి, 'విశ్రాంతిప్రజల - కొనఁగనిండు ప్రభూ : శత్రు విసరములను
పరగణా వెళ్లఁగొట్టి మీ పాదపద్మ - సేవ కరుదెంచు నీవృద్ధ సేవకుం డ'
టంచు సర్థోక్తి నవ్వడి యాలకించి - 'వారె వెన్నాడివచ్చుచున్నారు వైరు
లడ్డగించెద నేను మీ రాఁగరాదు - కోటఁ జేరుఁడు: తెలుపుఁడు కొమ్ము నూఁది
క్షేమమును: తామసించినఁ జిక్కు-వచ్చు' - నన్నఁ బ్రభువేగ తిన్నన—అంతలోన
బీజపుర సేన లరుదెంచె రోజుకొనుచు.

౩

'త్వరపడుఁడు లోయ నరికట్టి తాకుఁ డరుల-ప్రాణముల నిచ్చి రాజుఁ గాపాడఁదగిన
తరుణమిది మన దేహముల్ ధన్యములుగ - శ్రీభవాని యనుగ్రహించెడును నేఁడు

౪

పొడుపుఁడీ నెట్టుఁడీ వెన్క— కడుగు కదుపఁ - బోకుఁడీ రక్తమును ధారవోసి రాజుఁ
బ్రజల దేశముఁ బ్రోవుఁడీ రక్తధారఁ - గఱఁకుఁదనమును వీడదు ఖడ్గ: మొక్క-
శ్రీశివాధిపు సేవకు చేత ఖడ్గ-ముండ మీఁశక్యపరాని? పోకుండ నిలుపుఁ
డామెడ సెబాసు! ప్రాణాల కాసపడెడి - యోధుఁడున్నె శివప్రభునోలగమున.

౫

చూడుఁ డటు శత్రువుల్ తలసూపలేక - విరిగి పరువెత్తుచున్నారు విడువరాదు
దారి: ప్రభువును బట్ట మీ తరము గాదు - ఎవఁడు! మీ నాయకుం డాతఁ డేలరాఁడు
తన గుడారము వీడి:—శాత్రవ కళేబ-రముల దారిని గప్పుడీ ప్రభుఋణమ్ము
దీర్పుఁడు జయ భవాని! యేతీరునైన - అడ్డుపడుఁ డయ్య, చిరయశం బందుఁడయ్య.

౬

దారి యేల యొసంగ! శాత్రవకఠోర - కంఠరవములు క్రొత్తలా కరమునందు
ఖడ్గముండఁగ మీ రేగగలరె సింహ-మెన్ని హరిణంబులకు లొంగు నెంతసంఖ్య
యున్న మాకేమి? బెదురు మాయూర లేద'-టంచు గంభీర రవమున నరిహృదయ వి
దారణముఁగఁ బల్కుచు రక్తధార లొలుక - నెల్లెడలఁ దానయై మమ్ము హెచ్చరించి
శాత్రవావళి గుండెలు జార చిత్ర-గతులను జరించి మేమెన్నిగతుల వేఁడ
నిలిచి శ్రమదీర్చికొనకుండ నృపుని క్షేమ-సూచక ధ్వాన మాలించి 'శూరులార,
శ్రీశివప్రభుక్షేమంబు శృంగనాద-మునను దెల్పిరి మనవారు: మనకె జయము
ధన్యజీవిని: మన కుల దైవమైన - శ్రీ శివప్రభుక్షేమంబు చెవులఁబడియె'
ననుచు ధర వ్రాలి ప్రాణంబు లట్టె విడచె.

౭

చెదరి పరువెత్తెడి విపక్షసేనలన్ని - తిరిగ నాతఁడు పడువెన్క తెగువఁజూప
కాని మన వీరు లీధీరుకాయ మరుల - పాలుగా నిచ్చగింపక ప్రాణములను
నరకుగొనకుండఁ బోరి దుస్సహగతి రణ-మున నెదుర్కొని తెచ్చి రీయనఘుకోటఁ
జేరవచ్చితి మదె శివాజీప్రభుండు-గాంచుచున్నాఁడు కన్నీరుగార్చు ప్రభువు
నూరడింపుఁడు: దేవ! మేమోపినంత - చేసితిమి స్వామిభారమ్ము మోసి యతని
ఋణముఁ దీర్చితి మింక మా కేమివలయు! - ప్రభుఋణము దీర్చికొనఁగ నెవ్వరికివశము?

అరసున్న

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

(ఆంధ్రభాషావతారమునుండి)

తెలుఁగుభాషకుఁ దోడిభాషలగు ద్రవిడ కర్ణాటములందుఁగాని,ప్రకృతులగుసంస్కృత ప్రాకృతభాషలందుఁగానియరసున్న లేదు గదా! అట్టిచో నిది తెలుఁగున నెప్పుడుపుట్టినది? ఎట్లు పుట్టినది? భాషాలక్షణములను బరిశీలించుచుఁ బూర్వపూర్వకాలమునకుఁ బోనుపోను ద్రవిడ కర్ణాటాంధ్రభాషల భేదము తక్కువతక్కువై మూఁడు నొక్కటిగానే యున్న కాలముగూడ నొకప్పు డుండుటను మనము గుర్తింపఁగలము. ఈమూఁడుభాషలకును కాలము కడవను కడవను భిన్నభిన్నరూపములు పెంపొందె ననుటకుఁ బ్రబల సాధనములను బ్రకరణాంతరమునఁ జెప్పితిని. ఇట్లు పరిశీలింపఁగా నన్నయకుఁ బూర్వకాలమున నీయరసున్న యున్నదనుట కాధారము నాకుఁ గానరాకున్నది. నన్నయాదులనాళ్లనుండియే యరసున్న వెలయఁజొచ్చినట్టు వారి గ్రంథములఁబట్టి గుర్తింపనగుచున్నది. సహజముగాఁ బదమందున్న ఒక యక్షరమునకో కొన్ని యక్షరములకో ఆదేశమై వచ్చినదిగాని నాసిక్యహల్లు ఇతరహల్లుతో సంయుక్తమయినప్పు డేర్పడిన హల్ ద్విత్వము శిథిలముకాఁగా నందలి శిథిలానునాసికమే యరసున్నగా నన్నయాదులకాలమున నుండి మాఱెనని చెప్పఁదగును. దీని కించుక వివృతి:—

ద్రవిడ కర్ణాటభాషలలో సంయుక్త హల్లులు పూర్వాక్షరమునకు గురుత్వమును గల్పింపకుండఁ బెక్కులు గలవు. అట్టివానిలో పెక్కింటి ద్విత్వము తెలుఁగుఁదనము వేర్పడి యేర్పడిననాఁటికి మాసిపోయినది. తెగల్గుం నెగల్గుం ఇత్యాదులు తెగడు౯, నెగడు౯ - ఇత్యాదిరూపములఁ బడసినవి. హల్ ద్విత్వములో ద్వితీయహల్లు లోపించినప్పు డిట్టిరూపము లేర్పడినవి. మొదటిహల్లు లోపింపఁగా నేఁటి మన యరసున్నయైనది. మెఱుమ్=మెఱుపు. దీనిమీఁద బహువచనప్రత్యయ మగు 'కళ్' గలయఁగా 'మెఱుమ్గళ్' అయ్యెను. 'కళ్' ప్రత్యయమే తెలుఁగుఁదనమునుబడయునాఁటికిఁ బెక్కుశబ్దములమీఁద 'గులు' గాను, 'గలు' గాను'కులు' గాను 'కలు'గాను మాఱి, తొలి యక్షరములగు 'గు' 'గ' 'కు' 'క'లు ప్రాతిపదికమునఁగలసి బహువచనప్రత్యయముగా, 'లు' మాత్రమే మిగిలెను. అడుగులు, నుడుగులు, గొడుగులు, వెలఁగలు, ఈఁగలు, కొలఁకులు, వలఁకులు, చిలుకలు, ఎలుకలు ప్రభృతు లిట్టివే. క్రమముగా మెఱుమ్గళ్, మెఱుమ్గుళ్, మెఱుమ్గుళు మెఱుమ్గులు అనురూపము లేర్పడెను. ఇక్కడ వికల్పముగా శిథిలద్విత్వ మేర్పడుటచే మకారమును ఊఁది పలుకుట, తేల్చిపలుకుట యను భేదముచే రెండు రూపము లేర్పడినవి.

ప్రాకృత సంప్రదాయమునుబట్టి వర్గానునాసిక ములకు సున్నపెట్టుట యేర్పడఁగా మెఱుంగులు అనురూపమేర్పడెను. ద్విత్వము శిథిలము కానప్పుడు ప్రాయికముగా 'మెఱుంగ్గులు'అను లిపియును శిథిలమయినప్పుడు 'మెఱుంగులు' అను లిపియును ఉండెను. లిపిలో అరసున్న న్రాఁత మున్నూ ఱేండ్లకుముందు లేనేలేదు. ఈబహువచనరూపమునుండి ప్రత్యయావయవమగు 'గు' ప్రాతిపదికమునఁ జేరఁగా మెఱుంగు, మెఱుఁగు అని యేకవచన రూపములు పుట్టెను. నన్నయనాఁటి కీపరిణామము ప్రబలమయి శిథిలద్విత్వమను వ్యవహారము శిథిలము కాఁజొచ్చినది. ప్రాకృత సంప్రదాయము చొప్పున వర్గానునాసికము తొలిహల్లుగాఁగల సంయుక్తాక్షరములందు అనునాసికమునకు బదులు సున్న నుంచు సంప్రదాయము పెంపొందఁజొచ్చినది. కర్ణాటకభాషలోఁగొన్ని శబ్దముల ద్విత్వమునకు నిత్యముగాను గొన్నింటికి వైకల్పికముగాను శైథిల్యముగలదు. అట్టి పదములు మన తెల్గుఁదనమును బొందునాటికిఁ, గొన్ని యశిథిలద్విత్వములుగానే నిలిచినవి. కొన్నింట ద్విత్వములోపించి మొదటిదో, రెండవదో ఏదో ఒకహల్లే నిలచినది. కొన్నింట ద్విత్వము విడఁబడి నడుమ నచ్చుగూడినది. కొన్నింట నాసిక్యముగాని తొలిహల్లులోపించి తత్ స్థానమున నాసిక్యహల్లేర్పడినది. కర్ణాటకశిథిల ద్విత్వములకును దెలుఁగు శిథిలద్విత్వములకును, గొన్ని భేదములు గలవు.

మీఁదఁ జేర్కొన్న పదములలో వెలఁగలు, ఈఁగలు, కొలఁకులు, వలఁకులు అనువానిలో నిట్లే అరసున్నలు పుట్టినవి. వెలఁగచెట్టునకు అఱవమున 'వెలమ్' అని పేరు. 'వెలమ్‌గళ్' నుండి వెలఁగలు వచ్చెను. ఈఁగలు - ఈపదములో 'ఈ' ప్రాతిపదికము, -కళ్ ప్రత్యయము, కలసి పరిణామములఁ బొంది తెలుఁగుఁదనము వచ్చునాఁటికి ఈఁగలు బహువచనరూపముగాను, ఈఁగ ఏకవచన రూపముగాను నయ్యెను. అఱవమున ఈఁగకుఁ బేరు 'ఈ' అనియే. బహువచనమున నది ఈగళ్ అగును. కాని యిందు శిథిలద్విత్వతల్లోపాదిక మేదియు లేదుగదా 'ఈఁగలు' అని తెలుఁగున నరసున్న యెట్లు వచ్చెను? అని ఆక్షేపము తోఁచును. పరిశీలింపఁగా నిందు శిథిలద్విత్వము కలదని యేర్పడును. మక్షికకు 'ఈ' అను పేరు అది చేయు ధ్వనిని బట్టి వచ్చెను. దానిధ్వనియగు ఈకారము యచ్చులలోనిదగు తాలుజన్య మయిన ఈ మాత్రమే కాదు. ఈ ఈకారము ప్రధానముగా నాసిక్యముగూడ నగును. ఒక రేదేని చెప్పుచున్నప్పుడు వినువారు 'ఊఁకొట్టుట'లో ఊకారముకూడ నిట్లే ఓష్ఠ్యము మాత్రమే కాక నాసిక్యముగూడ నగును. ఈఁగల ధ్వనిని, ఊఁకొట్టుటను నుచ్చరించునప్పుడు ముక్కుతో నుచ్చరింపవలసి యుండును. ముక్కు మూసికొని వీని నుచ్చరింపఁ గుదురదు. కావున ఈఁగలధ్వనిలోని ఈకారమునకును ఊఁకొట్టుటలోని ఊకారమునకును అంతమునఁగల నాసి

క్యధ్వని గళ్ పరమయినప్పుడు కవర్గాను నాసికమగు ఙ్ గా వినవచ్చును. అప్పుడు ఈఙ్ గళ్ ఊఙ్ కొట్టు పదములు వచ్చును. పూర్వోక్తవిధమున నివి వికల్పముగా శిథిలద్విత్వములై యను నాసికస్థానమున సున్నలఁబొంది ఈంగలు,ఊంకొట్టు-ఈఁగలు,ఊఁకొట్టురూపములఁ బడసినవి.

కొంతకాలమునకు దీర్ఘముమీఁది సున్న నూఁదిపలుకుట మాని తేలఁబలుకుటే నిలిచెను. కాలక్రమమున ఈంగలు ఊంకొట్టురూపములు పోయి ఈఁగలు, ఊఁకొట్టు రూపములే నేటికి మిగిలినవి. తేపటికాలమున నిఁక నీయరసున్నలుగూడ నంతరింపనున్నవి. నన్నయకుఁబూర్వకాలమునను, నించుక తర్వాతి కాలమునను గూడ నేఁటి యర్ధానుస్వారము అనునాసిక సంయుక్తాక్షరముగా నుండుటను నాసంయుక్తాక్షరము పూర్వాక్షరమునకు గురుత్వమును గూర్చక శిథిలముగా నుండుటను బెక్కు శాసనములు నిరూపించు చున్నవి. నన్నయకుఁ బూర్వపుశాసనములలో శ్రీసోమశేఖర శర్మగారు ప్రకటించిన పండరంగ శాసనమందును, శ్రీరామయ్యపంతులుగారు ప్రకటించిన యుద్ధమల్ల శాసనమందును, నీతీరును జూడవచ్చును. నన్నయకుఁ దర్వాతివానిలో దక్షిణ హిందూ దేశ శాసనసంచయము 4 వాల్యూంలో ననేక పద్యశాసనము లిట్టితీరులవి గలవు. మాదిరి కొకటి రెండుపద్యములఁ జూపుచున్నాఁడను.

క్రీ. 1065 వ నాఁటి శాసనము:—

గీ. సకల వసుమతీశ మకుటలసద్రత్న
కిరణరుచి విరాజి చరణుఙ్డయిన

క్రీ. 1128 వ నాఁటి శాసనము:—

క. సూరి కవిస్తుతు ఙ్డనఘుండు
చారుచతుర్థాన్వయాబ్ధిచంద్రుఙ్డు గులని
స్తారకుఙ్డు సుజననిధి రిపు
వారణగజరిపుఙ్డు బుద్ధవర్మ జనించెను.

ఈ పై పద్యమున అనునాసికసంయుక్త హల్లు ఒకచోట ననునాసికస్థానమున సున్నతో నుండుట గానగును. ఇది యనునాసికములు సున్నలుగా లిపిలో మార్పుచెందుచున్న కాలము. సున్నలుంచుట యింకనుఁ బ్రబలముగా లేదు. స్తుతుఙ్ణు అనియున్న విధమునఁ గాక, తర్వాత 'అనఘుండు, అని 'ఙ్డు'కు బదులు 'ండు' ఉన్నది.

నేను మీఁదఁ జేర్కొన్నవిధమునఁ దెలుఁగునఁ గల యరసున్నలు ప్రాయికముగా సంయుక్తహల్లోపమువలన నేర్పడినవిగాఁ గుదురుచున్నవి. అరసున్నలు గల శబ్దముల నిఁక నీవిధమున సమన్వయించి చూచెదను.

ప్రొఫెసరు శేషగిరిశాస్త్రిగారు పూర్వము 'అర్ధానుస్వారమునుగూర్చి యొక గ్రంథము రచించి ప్రకటించిరి. పదియేనేండ్లకు ముందు నేను దానిని చూచితిని. ఇటీవల నాకది యెక్కడను గానరాలేదు. దీనిని నేను వ్రాయుటలోఁ బూర్వమెప్పుడో యాగ్రంథము చదువుటవలనఁ గలిగిన జ్ఞానవాసన యేమేని పనిచేసియుండవచ్చును. కాని వారిగ్రంథమున అర్ధానుస్వారము పుట్టుటకు నే నిప్పుడు చెప్పిన ప్రక్రియయున్నట్టులేదు. అక్షర లోప

స్థానీయముగా అరసున్న వచ్చెనని వారు వ్రాసి యుందురని స్మరించుచున్నాను. ద్విత్వశైథిల్యాదికమును వారు గుర్తించియుండరు. ఆంధ్రశబ్దతత్త్వమని వారు ప్రకటించిన వేటొక గ్రంథమిప్పుడు నేఁజూచితిని. అందు వారు కొలఁకులు మొదలగు శబ్దరూపములు 'కళ్' ప్రత్యయము కలయుటచేత నేర్పడినవని నిరూపించిరి. బహుకాలమునకుఁ బూర్వము వారు కొంత ప్రశస్త పరిశోధనము నెఱపి గ్రంథములఁ బ్రకటించిరి. కాని వానిమీఁద నింక నెంతో మంచి పరిశోధనము పెంపొందవలసి యున్నది. వారి గ్రంథములకుఁ బునర్ముద్రణమేని లేదు.

ప్రేమోపాసన

కె. అన్నమరాజశర్మ గారు

రాధికాకృష్ణు లనుట ధరాతలంబు-నిండెనే కాని నామీఁద నెనరులేదు
నీదు నిర్మల ప్రణయాబ్ధి నీఁదఁగోరు-భక్తురాలిని వెతపెట్టఁ బాడి యగునో?

దివిజమోహన! హృదయమందిరము నందు-నీ మనోహరమూర్తిని నిలుపనిమ్ము
ఆత్మ నైవేద్య మర్పించి యాహరహమ్ము-విరహాకర్పూర గుళికను వేల్చుకొఱకు.

రాధ నపరాధముం జేసి నాథ! యిట్టి-కట్టడి విరాలి జీవంబు గడుపుచుంటి
తావకీనాంఘ్రి రజమింత తనకెనేని-నాగృహంబె నిజంబుగా నాక మగును!

మందహాసాంకురంబులఁ గందళించు-వదనముం గాంచఁ దహతహం పడుచునున్న
అబలనగు నన్ను శిక్షింప నగునె? వలపు-శరములం బూని వనమాలి! కరుణమాలి.

నా కపోలంబు లంటి యనర్గళముగ-నిర్గమించెడి కన్నీళ్ల నీదు చరణ
కమలములఁ బోసి ప్రీతిమై కడుగఁ దలఁచి-స్మృతిపథంబున నిన్ బ్రతిష్ఠించి కొంటి.

ముగ్ధహృదయను నన్ను సమ్మోహవార్ధి-భంగములఁ ద్రోసిపోవఁగ బ్రతుకఁగలనె
రమణ! నీ దివ్యనామామృతముల నెమ్మి-నెడఁదఁ దలఁచుచుఁ బ్రాణమ్ము విడుతుఁగాక!

సముద్రగుప్తశాసనము - కళింగచరిత్ర

బుర్రా శేషగిరిరావుగారు (ఆంధ్రభారతీ తీర్థప్రధాని)

సముద్రగుప్త చక్రవర్తి శాసనములో జేర్పాన బడిన దాక్షిణాత్యదిగ్విజయములు మూడు వంతులు కళింగములోనివే యనియు, నాచక్రవర్తి బహుశః కళింగమును దాటియుండనే లేదనియు హిందూదేశచరిత్ర విమర్శకుల నవీనాభిప్రాయము. దీనికి శాసనమందలి "కౌరాలకమంట రాజ", "కాంచేయక విష్ణుగోప" యను సర్వచనములు ప్రతిబంధకములుగా నున్నవని కొందరందురు. "కౌరాలక" అను దానిని "కైరలక"అని దిద్ది చదువవలెననియు, అట్లు చదివినచో నది కేరళదేశీయప్రభువని సమన్వయించవచ్చుననియు, "కంచి" యను నది పల్లవరాజధానిగా దక్షిణాపథమందు ప్రసిద్ధిగాంచినదగుటచేత "కాంచేయక" యనుటచేనా పట్టణాధీశ్వరుడని సమన్వయమనియు నీ శాసనమును మొదట ప్రచురించిన ఫ్లీటుమహాశయులు క్రీ. శె. 1888 సం. వ్రాసిరి. అప్పటినుండి నేటివరకు ననగా నీ 40 సంవత్సరములును ఈ సమన్వయమే సరియని శాసనపరిశోధకులము తలచుచు వచ్చితిమి కాని సముద్రగుప్తుడు కళింగమును దాటి కంచి, కేరళము వరకును పోలేదనుటకు సరిపడు సమన్వయము కళింగమందలి గ్రామనామములలో కొంత యీమధ్య కనుపడినది. పరిశోధకుల విమర్శనార్థము భారతికి మండనాయమానముగ ప్రకటింప సాహసించుచున్నాను.

"కౌరాలక" అను శాసనములోని యసలు పాఠమునే గ్రహించినయెడల దానినుండి "కురాల"అనుపదము లభ్యమగును. "కురాల" అనగా "కురాలయ"మని నాయూహ. "కేరళ" యను నది "కేరాల" యను దాని హ్రస్వరూపమనియు, "కేరాల" యనునది "కేరాలయ" (చేరాలయ) యను దాని హ్రస్వరూపమనియు సులభగ్రాహ్యము. ఇట్లే దేవళ< దేవాల*< దేవాలయ అని రూపనిష్పత్తి కేర (చేర) జాతిస్థానము "కేరాళ" (కేరళ)మైనట్లే "కురు" జాతిస్థానము "కౌరాలయ" లేక "కౌరాల" మగును. ఇందు విపరీతపరిణామ మేమియు లేదు. అయిననో నిక "కురు" జాతినిలయములు కళింగమందున్నచో వాటినుండి "కురురాజ్య"ము కళింగమం దుండినట్లును దాని కధిపతియగు మంటరాజు "కౌరాలక మంటరాజనియు" సిద్ధించును.

---

* కళింగమందు కురుజాతిస్థానములగు గ్రామములు నేటికిని కొన్ని కనబడుచున్నవి. పూర్వము ప్రసిద్ధిగాకూడ నుండెను.

పూర్వపు విజయనగర (కళింగ) మహారాజుల స్తోత్రపద్యములలో నొకదానియందు దాప్రభుని ప్రతాపముచే "కురుగౌడల నాపదపుట్టె నాగరా పెటపెటలాడె" అని యొక పాగడ్త కలదు. అప్పటి కళింగమందు కురు, గౌడలను తెగలవారు కొంత ప్రతిభావంతులై యుండురని తోచును. ఇక కురుజాతిస్థానములగు గ్రామముల విస్తర మిట్లున్నది:—

విశాఖపట్టణముజిల్లా

పార్వతీపురం తాలూకా-కురుపాం.
బొబ్బిలి-విస్సంకటకం ఏజన్సీ-కురుపూటి.
గుణుపురం ఏ. కురుగూడ. కురుశిలగుడ, కురుశిలి.
జయపురం ఏ. కురుకుట్టి, కురుకుట్టిగుడ.
కొరాపుట్టి ఏ. కురుమల.
మల్కనగిరి ఏ. కురుకుండి, కురుకుంటిపల్లి
నవరంగపురం ఏ. కురుశెల్ల, కురుసుకకు, కురుపా.
పాడ్వా ఏ. కురుదేలు.
రాయిగడ ఏ. కురుబోయి, కురుగులమడ, కురుకటి, కురుకుట్టిగొల్ల.

గంజాముజిల్లా

అస్కా-తాలూకా-కుర్లంగి, కుర్లా.
బరంపురం తా. కురుపల్లి.
గుంమూరు తా. కుర్లంగి, కురులము.
పర్లాకిమిడి తా. కుర్లండ.
బల్లిగుడ ఏ. కురుతిల్లి, కురుగడ.
పర్లాకిమిడి ఏ. కురుగుబ్బ.
రామగిరి ఏ. కురుబ, కురుసు, కురుము, కురుతల.
ఉదయగిరి ఏ. కురుకుట్ట, కురుమింగియ.

ఈ గ్రామములలో మొత్తముపైని గంజాం మండలములో 6 న్ను విశాఖపట్టణ మండలములో 1 న్ను వెరశి 7 గ్రామములు తప్ప మిగిలినవన్నియు ఏజన్సీప్రాంతమందే ఉండుటచేత నీ కళింగాంతర్భూతమగు కురురాజ్యము సముద్రగుప్తశాసనములో జేర్కొనబడిన మహాకాంతార రాజ్యమువలె వన్యరాజ్యము (Forest Kingdom) గా నుండియుండునని యూహించుట కవకాశము కనబడుచున్నది. ఇట్టి కురురాజ్యము నేలియుండిన మంటరాజేంద్రుని "కౌరాలకమంటరాజ"ని నిర్వచించుటలో శాసనలేఖరి పొరపాటుగా వ్రాయలేదనియే నా నమ్మకము.

ఇట్లే "కాంచేయక" యనునదియు కళింగమందలి గ్రామనామములచే సమన్వయమగుచున్నది. ఎట్లనగా,

గంజాములో

అస్కా-తాలూకా-కంచిపల్లి, కంచిఖండి.
ఛత్రపురం తా. కాంచీపురము.
సూరద తా. కంచర్యసు.
టెక్కలి తా. కంచివూరు.

అను గ్రామనామములు అన్నియు పల్లవునాటిలో కనబడుచుండుటచేత నీ కాంచీపురరాజ్యము పల్లవురాజ్యమే యన దగియున్నది. ఇట్లు కళింగమందు కౌరాలక కాంచేయక రాజ్యము లంతర్భాగములుగా వర్ధిల్లుచుండి క్రీ. శ. 4 శతాబ్దమధ్యమున సముద్రగుప్తుని దాడికి లోనైయుండును. ఈ సమన్వయ మీ శాసనమునుగూర్చి డూ్బ్రాయిలుపండితులు చేసిన వ్యాఖ్యానమును బలపరచుచున్నది.

శ్రీదక్షిణామూర్తిస్తోత్రము*

సుబ్రహ్మణ్య భాగవతులు గారు

మౌనవ్యాఖ్యా ప్రకటితపరబ్రహ్మతత్త్వం యువానం
వర్షిష్ఠాంతే వసదృషిగణై రావృతం బ్రహ్మనిష్ఠైః;
ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్ర మానందమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే.

వేనల్ వృద్ధులు బ్రహ్మనిష్ఠులగు శిష్యుల్ చేరగా మౌనమే
వ్యాఖ్యానంబుగ బ్రహ్మతత్త్వమును దెల్పన్ చిన్నయై చేత చి
న్ముద్రం గైకొని మోమున న్ముదముతో నానందచిన్మూర్తి స్వా
త్మారాముండగు సద్గురూత్తముని గొల్తున్ దక్షిణామూర్తినిన్.

విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం
పశ్య న్నాత్మని మాయయా బహిరి వోద్భూతం యథా నిద్రయా;
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.

తనలో నద్దములో పురంబువలె గాంచంబోలు విశ్వంబు నా
త్మను వీక్షించుచు మాయచే బయట నిద్రం జూచుచందాన, నె
వ్వడు జ్ఞానంబున స్వాత్మ నద్వయముగా సాక్షాత్కరించున్; నమ
స్కృతి గావించెద నాగురూత్తమునకున్ శ్రీదక్షిణామూర్తికిన్.

బీజస్యాంత రివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునః
మాయాకల్పిత దేశకాలకలనా వైచిత్ర్యచిత్రీకృతమ్;
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యః స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.

మును బీజంబున మొక్కచందమున మార్పుల్ లేకయున్ మాయచే
తను కల్పించిన దేశకాలబహుచిత్రంబౌ ప్రపంచంబు నె
వ్వడు యోగీంద్రుని గారడీనివలెనే యాడించు స్వేచ్ఛన్; నమ
స్కృతి గావించెద నాగురూత్తమునకున్ శ్రీదక్షిణామూర్తికిన్.

---

* ఈ పద్యములు యతిప్రాసలు పాటింపక వ్రాసినవి. ఇట్టి రచనము లాంధ్రవాఙ్మయాభివృద్ధి కెంతవరకు తోడ్పడగలవో?
—సంపాదకుడు.

యస్యైవస్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే
సాక్షాత్తత్త్వ మసీతి వేదవచసా యోబోధయ త్యాశ్రితాన్;
యత్సాక్షాత్కరణాద్భవే న్నపునరావృత్తి ర్భవాంభోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే.

జడముం బొంది వెలుంగు నెవ్వనిప్రకాశంబే సదాత్మంబు; భ
క్తుల బోధించు నెవండు 'తత్త్వమసి' యంచున్ వేదవాక్యాళి; న
న్వాని సాక్షాత్కృతిచే భవాబ్ధిమరలం జేరంగరాదో; నమ
స్కృతి గావించెద నాగురూత్తమునకున్ (శ్రీ) దక్షిణామూర్తికిన్.

నానాచ్ఛిద్ర ఘటోదరస్థితమహా దీపప్రభాభాస్వరం
జ్ఞానం యస్యతు చక్షురాదికరణ ద్వారా బహి స్స్పందతే;
జానామీతి యమేవభాంతమనుభా త్యేత త్సమస్తం జగత్
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే.

బహురంధ్రంబుల కుండలో వెలుగు దీపజ్యోతిరీతిన్ బహి
ర్గతమౌ నెవ్వని జ్ఞాన మింద్రియములద్వారా; సమస్తంబు నీ
జగమే వెల్గునె వెంటనంటి యెపుడున్ తెలియంగా వెల్గుచుండున్; నమ
స్కృతిగావించెద నా గురూత్తమునకున్ (శ్రీ) దక్షిణామూర్తికిన్.

దేహంప్రాణ మపీంద్రియాణ్యపిచలాం బుద్ధించ శూన్యం విదుః
స్త్రీబాలాంధజడోపమా స్త్వహమితి భ్రాంతా భృశం వాదినః;
మాయాశక్తి విలాసకల్పితమహా వ్యామోహసంహారిణే
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే.

జడబాలాంధులు వోలె భ్రాంతియుతు లీదేహంబొ ప్రాణంబొ చం
చలమౌ బుద్ధియొ శూన్య మింద్రియములో 'నే'నంచు వాదింతు; రె
వ్వడు మాయావృతశక్తిచే గలుగు భ్రాంతిన్ బాపజాలున్; నమ
స్కృతి గావించెద నా గురూత్తమునకున్ (శ్రీ)దక్షిణామూర్తికిన్.

రాహుగ్రస్తదివాకరేందుసదృశో మాయాసమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోపసంహరణతో యోఽభూత్సుషుప్తః పుమాన్;

ప్రాగస్వాప్స మితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే.

కరణంబుల్ పనిమానగా నెవడు రాహుగ్రస్త చంద్రార్క తు
ల్యుడు మాయావరణంబుచేతను సుషుప్తుండైన సన్మాత్రుడా:
మును నిద్రించితినంచు నెవ్వ డెఱుగున్ మేల్కొన్న వేళన్; నమ
స్కృతి కావించెద నాగురూత్తమునకున్ శ్రీదక్షిణామూర్తికిన్.

బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థా స్వపి
వ్యావృత్తా స్వనువర్తమానమహ మిత్యంతస్స్ఫురంతం సదా;
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యోభద్రయా ముద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే.

శిశుతాదుల్ మఱి జాగ్రదాదులటులే యన్యోన్య భిన్నంబులౌ
సకలావస్థల వెంట నంటుచు సదా 'నే'నంచు లోవెల్గుచుః
దెలుపున్ స్వాత్మనెవండు భక్త తతికిన్ చిన్ముద్రచేతన్; నమ
స్కృతి గావించెద నాగురూత్తమునకున్ శ్రీ దక్షిణామూర్తికిన్.

విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబంధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రా ద్యాత్మనా భేదతః
స్వప్నే జాగ్రతివా యఏషపురుషో మాయాపరిభ్రామితః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.

గురువుల్ శిష్యులు, కార్యకారణములున్ స్వస్వామి సంబంధముల్
జనకాదుల్ సుతులంచు భేదములతో మాయాపరిభ్రామితుం
డగు నెవ్వాడు జగంబు గాంచు కలలో మేల్కొన్న వేళన్; నమ
స్కృతి గావించెద నాగురూత్తమునకున్ శ్రీదక్షిణామూర్తికిన్.

భూరంభాం స్యనలోఽనిలోఽంబరమహ ర్నాథో హిమాంశుః పుమా
నిత్యాభాతి చరాచరాత్మకమిదం యస్యైవమూర్త్యష్టకమ్;
నాన్య త్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభోః
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే.

భువి యాకాశము వాయు వగ్ని జలముల్ చంద్రార్కులున్ పూరుషుం
డను విశ్వంబు చరాచరం బెవనికిన్ మూర్త్యష్టకంబో; విచా
రణ గావించిన నేపరాత్పరుని కంటెన్ వేరులేదో; నమ
స్కృతిగావించెద నాగురూత్తమునకున్ శ్రీదక్షిణామూర్తికిన్.

సర్వాత్మత్వ మితి స్ఫుటీకృతమిదం యస్మా దముష్మిన్ స్తవే
తేనాస్య శ్రవణా త్తదర్థమననాత్ ధ్యానాచ్చ సంకీర్తనాత్;
సర్వాత్మత్వ మహావిభూతిసహితం స్యా దీశ్వరత్వం స్వతః
సిద్ధ్యే త్తత్పున రష్టధాపరిణతం చైశ్వర్య మవ్యాహతమ్.

సకలం బాత్మయటంచు నీ స్తవమునన్ స్పష్టంబుగా జెప్పగా
బడుటన్ విన్న తదర్థమున్ దలప ధ్యానింపంగ కీర్తింపగా
సకలాత్మత్వ మహావిభూతి కలితంబౌ నీశ్వరత్వంబు గ
ల్గు తనంతన్ మఱియింక నష్టవిధమౌ నైశ్వర్య మవ్యాహతిన్.

చిత్రంవటతరోర్మూలే వృద్ధాశ్శిష్యా గురు ర్యువా;
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛ్చిన్నసంశయాః.

మఱ్ఱిచెట్టుమొదట చిత్రంబుశిష్యులు-పెద్దవారు గురువు పిన్నవాడు;
గురువుచేయుబోధ మౌనంబు; శిష్యులు-సంశయంబు రహితమైనవారు.

దుర్గతులకు లభించునే స్వర్గసుఖము? పురాణం సూర్యనారాయణతీర్థులుగారు

సాయం సమయమందు మైరుగా బీచిలో నందన సౌఖ్యమ్ము లందవచ్చు
మోటారుపై నెక్కి సీటుగా మఱిమఱీ మఱి పురమ్మెల్లఁ గ్రుమ్మరంగ వచ్చు
దినదిన మ్మొక్కొక్క తెగ యాట బైస్కోపు చిత్రచరిత్ర వీక్షింపవచ్చు
ఒకరి లక్ష్యమ్ము వేఱొకరికి నేమాత్ర నుండ నక్కఱలేక యుండవచ్చు
భూతలస్వర్గ మగు చెన్నపురములోనఁ-గాఁపురమ్మున్న వా రెంత కఠినమైన
తప మొనర్చినవారో కదా! మఱేమి-దుర్గతులకు లభించునే స్వర్గసుఖము?

గృహస్థునిధర్మము

కె. రంగాచార్యులు; యం.ఏ., బి.యల్.

ఆనందుఁడను నే నీ రీతిగ వింటిని:

ఒకప్పుడు కొలియను రాజదేశంబునఁ గక్కరపట్ట మను గ్రామమందుఁ గొలియనులలో భాగవతుఁడు నివసించుచుండెను.

ఆకాలమున ధీగాజానుఁడను కొలియనుఁడు భాగవతునికడకుం జని భక్తిపురస్సరముగఁ బ్రణామంబు లాచరించి యొకప్రక్కకుఁ దిరిగి కూర్చుండెను. అట్లాసీనుండై ధీగాజనుఁడను కొలియనుఁ డీరీతిని భాగవతునితో విన్నవించెను.

"పవిత్రప్రభూ! గృహస్థులుగ మేము పంచేంద్రియవిషయాసక్తులమై కాలము గడుపుచున్నారము. దారాపుత్రాదిసంరక్షణచేఁ బుణ్యాహములగు కార్యముల నొనర్చుటకుఁ దగినయవకాశముఁ గనఁగొనఁజాలకున్నారము. కాశీదేశోద్భవంబగు చందనంబుచేతను, నితర సుగంధిద్రవ్యములచేతను దేహంబులు సుపరిమిళితంబులుగ నొనర్చుచున్నారము. మనోహరంబులగు సువాసనలుకల వివిధపౌరభంబులచేఁ గూర్పఁబడిన మాలలచే దేహంబు లలంకరించుకొనుచున్నారము. పరిమళముగల లేపంబులు దేహంబునఁ బూసికొనుచున్నారము. సువర్ణరజతంబులఁ గలిగి కనకముక్తామణిమయంబులగు నాభరణంబులచే దేహంబుల నలంకరించుకొనుచున్నారము.

ప్రాజ్ఞప్రభూ! గృహస్థులగు మావంటివారికి నిహపరంబుల సుఖప్రదాయకంబగు ధర్మంబుండినదాని మాకనుగ్రహింపుము. అనిన నా మహానుభావుం డిటులు వాక్రుచ్చెను. "వ్యాఘ్రపజ్జుఁడా! ఈనాల్గు ధర్మములను నాచరించిన గృహస్థులీలోకమున ప్రఖ్యాతులయి సంచరించుచుఁ బరమున నానందమయమగు జీవనము ననుభవింతురు. ఈనా ల్గెవ్వియనినః:

1. అభినివేశము, 2. ధనసంరక్షణ, 3. సత్యంబగుమైత్రి, 4. మితవ్యయము.

"ఓవ్యాఘ్రపజ్జుఁడా! అభినివేశమన నేమి? ఈప్రపంచమున గృహస్థుఁడు జీవనార్థము, కృషి, వాణిజ్యము పసుపాలన, ఆయుధశిక్ష, కుంభకారత్వము, కమ్మరిపని, మఱి యేవృత్తి నైనను నవలంబించి యాశిల్పములయం దతికుశలుండై యేతద్వ్యాపారణయందు రక్తుండైయుండి జీవనోపాధిని సంపాదించుకొనుచుఁ గార్యమెద్దానినైన నొనర్చుటకు యుక్తంబగు కాలముకొఱకు వేచియుండి యట్టియుక్తమయిన కాలమునఁ దత్కార్యమును గావించినను, నలసతలేక యుక్తంబగు కాలమున నట్టికార్యమును దా నపేక్షించుచుఁ జేయింపించినను నట్టివాఁ డోవ్యాఘ్రపజ్జుఁడా! వివేకముతో యోచింపుచు నాచరించును. అతిదీర్ఘయత్నంబుచేతను, ననవరతోద్యోగంబుచేతను నిట్టి ధనార్జనయుఁగాని, జయసంపాదనయుఁగాని యభినివేశమని పిలువంబడుచున్నది.

"ఓయీ వ్యాఘ్రపజ్జుఁడా! ధన సంరక్షణ యన నేమి? వ్యాఘ్రపజ్జుఁడా! గృహస్థుఁ డవిరతోద్యమంబుచేతను, భుజాంగశక్తి చేతను, భ్రూదర్శితాధిక స్వేదంబుచేతను, సుచరిత్రంబుచేతను ధనంబు నార్జింపవచ్చును. అప్పు డిటు లాతఁడు చింతింపవలయును. "మదార్జితంబగు నీధనంబును, జోరులవలనను, వహ్నివలనను, జలప్రళయమువలనను, నధికారి భయంబువలనను, మాత్సర్యయుక్తాప్రియబంధువర్గంబు వలనను రక్షించెదను." అతిశ్రమతో నీరీతిగ నార్జింపఁబడిన ధనమును రక్షించుట ధనరక్షణంబని చెప్పఁబడుచున్నది.

వ్యాఘ్రపజ్జుఁడా! సుమిత్రత యన నేమి? ఓయి వ్యాఘ్రపజ్జుఁడా! ఈలోకంబున గృహస్థుఁ డెవ్వండైనను గ్రామంబునందుఁగాని, పల్లెయందుఁగాని వసించుచు ధర్మానుచారియై, సుశిక్షితబుద్ధి యుక్తుండై, యాత్మజ్ఞానసంపన్నుండై, దృఢభక్తియుక్తుండై, లెస్సగ గాథాస్థధర్మముల నాచరింపుచు, దానపరుండై, సర్వశాస్త్రతత్త్వజ్ఞుం

డైయుండు నింకొక కుటుంబితోఁ గాని, వానిపుత్త్రిని తోఁగాని సహవాసంబుఁ గావించి వానితో సంభాషింపుచుండియు, ముచ్చటింపుచుండియు నట్టి గృహస్థుఁడు ధర్మాచరణపరుండై, సుశిక్షితబుద్ధియుక్తుండై, యాత్మజ్ఞానపరాయణుండై, దృఢభక్తియుక్తుండై, శాస్త్రధర్మాచరణశీలుండై, శాస్త్రజ్ఞానసంపన్నుండై పుణ్యంబు నాచరించుచుఁ పాపంబు విసర్జించును. ఓయి, యిదియే సుమిత్రత.

"ఓయి వ్యగ్రపజ్ఞుఁడా! మితవ్యయంబన నేమి? ఓయి! ఈలోకమున వివేకముతో సంచరించుచు, ధనార్జనకష్టంబుల నెఱింగి యార్జితవిత్తవ్యయవిషయికమార్గంబు నెఱిఁగి మితవ్యయియై వ్యయము గావింపఁబడ్డదానికంటె రెండింతలు ధనమును సన్మార్గప్రవర్తనచే నార్జింపుచు నమితవ్యయమును గాని, యత్యల్పవ్యయమును గాని కావింపకుండిన నీరీతిగ నార్జింపఁబడిన ధనంబు నాశంబుఁ జెందక సురక్షితంబగును.

వ్యగ్రపజ్ఞుఁడా! వర్తకుఁడుగాని వానిసేవకుఁడుగాని తుల నుపయోగించి తులాపాత్రమున భారంబునుంచినఁ దత్తులాపాత్రంబు క్రిందఁ గ్రుంగ రెండవతులాపాత్రంబు సమానభార రాహిత్యంబున మీఁదకుం జనుటఁ గనును. ఈరీతిగనే గృహస్థుఁడు ధనార్జనకష్టంబును నమితవ్యయానౌచిత్యంబును విచారించి యాదాయంబును నెఱింగి యాదాయానుసారముగ వ్యయమును గావింపవలయును. తనకుఁ దగినట్లు వ్యయముఁ గావింపుచు ధనమును సంరక్షింపవలయును: ఈరీతిగ గృహస్థుఁ డమితవ్యయమును విసర్జించి మితవ్యయమును గావింపవలయును. అట్లైన వానిధనంబు నాశంబుఁ జెందక సురక్షితంబగును.

ఓయీవ్యగ్రపజ్ఞుఁడా! ఆదాయముకంటె నెక్కుడు ఖర్చొనర్చు గృహస్థు కపిత్థఫలములఁ దినఁగోరి శాఖల నల్లలాడించి పక్వాపక్వఫలంబులఁ బడఁగొట్టి సంచయంబుఁగావించి పక్వఫలముల భుజించి యపక్వఫలంబులఁ బారవేయు మనుజుని బోలియుండును. అట్టి దుర్వ్యయంబును మానవులు నిందింతురు.

వ్యగ్రపజ్ఞుఁడా! గృహస్థుఁ డెవ్వండైనను లోభియై యార్జిత ధనంబును యథాక్రమముగ వ్యయంబుఁ గావింపక మృతిఁజెందినఁ దనజీవితకాలంబున ధనమును సువినియోగము గావింపనందులకు నట్టివాఁడు నిందాపాత్రుండగును.

ఓయి వ్యగ్రపజ్ఞుఁడా! గృహస్థరీతిగ నత్యధిక ధనార్జన కష్టంబులను, నాదాయమును మించిన విత్తవ్యయానౌచిత్యంబును లెస్సగఁ బరిశీలింప వలయును. కుటుంబి "మదార్జిత విత్తంబును నే నమిత వ్యయంబుఁ గావింపక మదపేక్షితార్థంబులకే మితవ్యయంబుఁ గావించెద" నని యోచింప వలయును. ఓయివ్యగ్రపజ్ఞుఁడా! ఏతద్రూపవిత్త వ్యయంబును మితవ్యయంబని చెప్పుదురు.

ఓయీవ్యగ్రపజ్ఞుఁడా! అనవరతోద్యమంబుచే న్యాయోపార్జిత విత్తంబు వినాశంబుఁ జెందుటకు మార్గంబులు నాలు గున్నవి. అవి యెవ్వియనిన?

(1) అధర్మ వ్యభిచారలోలుపత్వము.

(2) సురాపానాసక్తత.

3) ద్యూత క్రీడాసక్తి.

(4) అధార్మిక మిత్ర సహవాసాసక్తి.

"ఓయీ వ్యగ్రపజ్ఞుఁడా! నుసేకు బద్ధ సరోవరంబు చతుఃపార్శ్వ స్రోతస్సులను, జతుర్ముఖంబులను గలిగియుండి చతుఃప్రవేశ మార్గంబులు నరికట్టంబడిన చతుర్ముఖంబుల నుండియు జలప్రవాహ ప్రాకర్ష్యము వృత్తిక తీయంబడి శుభ్రపఱుపఁబడిన జలప్రవాహోనరోధంబుఁ గావింపుటకుఁ బ్రవాళంబు లేకుండిన, సరోవరంబు ప్రవహించి యయ్యది శూన్యంబగును. అటులే యోయీ వ్యగ్రపజ్ఞుఁడా! వ్యభిచారలోలుండును, సురాపాన లగ్న మనస్కుండును, ద్యూతక్రీడా పరాయణుండును, నధార్మిక మిత్రసహవాస ప్రియుండును, నౌన్నత్యములో నుండి యున్నప్పుడు దుష్టులతో సహవాసముఁ జేసి వారితో నతిమైత్రితోఁ గలసి మెలసి యుండునట్టి వానివిత్తంబు క్షయంబు నొందును. వ్యగ్రపజ్ఞుఁడా! అనవరతోద్యోగంబుచే సంపాదిత విత్తంబు సురక్షితంబై వృద్ధింజెందు మార్గంబులు నాలు గున్నవి. అవియెవ్వి యనిన?

(1) అధర్మ వ్యభిచారా సక్తి విరామంబు.

(2) సురాపాన విముఖత.

(3) ద్యూత క్రీడా విరామంబు.

(4) సజ్జన సాంగత్యము.

ఓయీ వ్యగ్గపజ్జుఁడా! సరోవరంబు సునేతు బద్ధంబై చతుఃపోషణ స్రోతస్సులను, జతుర్ముఖము లను గలిగియుండి చతుఃపోషణ ద్వారములనుండి జలప్రవాహ సాకర్ధము మృత్తిక తీసివేయఁ బడియుఁ, జతుర్ముఖంబులును, గప్పివేయఁబడిన మఱియు జలప్రవాహన రోధము గావించు ప్రవాహంబు లేకుండిన సరస్సునందుం డుదకము క్షీణింపక వృద్ధిఁ జెందుటచే సరోవరంబు జలపూరితం బయి యుండును.

ఓయీ వ్యగ్గపజ్జుఁడా! ఈరీతిగనే వ్యభిచార, సురాపాన, ద్యూతక్రీడా, దుష్టజనసహవాస వివర్జితుండైన నరుని ధనంబు వృద్ధిఁ జెందును. ఓయీ వ్యగ్గపజ్జుఁడా! ఈనాలుగు ధర్మంబుల నాచరించుటచే గృహస్థుఁడు ప్రపంచమున సచ్చరితుండై జీవించుచుఁ బరలోకమునను సానంద మయియుండగును.

ఓయి, వ్యగ్గపజ్జుఁడా! ఈనాలుగు ధర్మముల ననుసరించుటచేఁ గుటుంబి పరలోకమున సుజన్మముం గాంచి వైకుంఠానందమును జెందును. ఆనాల్గును నెవ్వియనిన?

(1) భక్తి (2) విద్యాచరణము (3) దానము (4) వివేకము. ఈలోకమున గృహస్థుఁడు భక్తియుక్తుండై యుండిన బుద్ధ భగవానునియొక్క యత్యుత్కృష్ట జ్ఞానమునందు విశ్వాసముఁ గలిగి యుండును. ఈరీతిగ నాలోచింపుము సర్వ విశ్వాస యుక్తుండగును. "బుద్ధ భగవానుఁడు సకల పాప వ్యతిక్రమణంబుఁ గావించినాఁడు. ఆత్మోద్యమంబుచే సమస్తవస్తుకారణ జ్ఞానంబును సమూలముగఁ బొంది నాఁడు. అంతరి యెడలఁ బ్రియముని ల్కుచు మానవకోటిఁగూర్చి యనంతక్షేమ ప్రేరితంబులగు కర్మల నాచరించి నాఁడు. ప్రపంచమును గూర్చి సర్వమును దెలియును. మనుజులఁ బాపంబునుండి మరలించి సత్పథానుసారులుగఁ జేసినాఁడు. దేవమానవులకు నుపదేశకుం డయినాఁడు. ఘనంబులగు చతుర్గుణ తత్త్వములఁ గనుఁగొని యాధర్మముల నితరులకు బోధించెను. వివిధరాగంబుల జయించి కామదహనంబుఁ గావించినాఁడు" ఇటులు జింతించుకొనుచు బుద్ధదేవుని యుత్కృష్టజ్ఞానము నందు విశ్వాస ముంచ వలయును. ఇదియే యో వ్యగ్గపజ్జుఁడా! భక్తియని చెప్పఁబడుచున్నది.

ఓయీ వ్యగ్గపజ్జుఁడా! విద్యాచరణ మన నేమి? ఈలోకమున గృహస్థుఁడు జీవహింసఁ గావింపక, యదత్తంబగు దానిఁ బరిగ్రహింపక, యధార్మిక స్త్రీసంగము లోలుండుగాక, సురాపాన వివర్జితుండై యుండిన యట్టి వానిచర్య విద్యాచరణమని చెప్పఁబడు చున్నది.

ఓయివ్యగ్గపజ్జుఁడా! దాన మన నేమి? ఈలోకమున గృహస్థుఁ డెవ్వండైనను సత్యాధిక కామయుక్తుండై, స్వార్థ పరాయణుండై యితరుల సంపదను గని యసూయఁ జెంది "ఈనాధన మితరులకుఁ జెందకుండునుగాక" అని యూహించునో యట్టిది దానశీలత్వంబు గాదు. ఇతరులఁ గూర్చి జాలిఁబడుచు నితరులకుఁ దనకుఁ గలిగినటు లీయ నిచ్ఛగించియు నితరులు గోరినవి డిచ్చుచు నితరుల తన యైశ్వర్యసహభాగులుగ నొనర్చిన నది వితరణ మని చెప్పఁబడును.

ఓయీ వ్యగ్గపజ్జుఁడా! వివేక మన నేమి? ఈప్రపంచమున గృహస్థుఁ డాధ్యాత్మిక జ్ఞానసంవర్ధనంబును, వర్ధిద్ధియుఁ గాకుండఁగఁ జేయు నజ్ఞానమును బోఁగొట్టుకొని జ్ఞానంబును సంపాదించి యిహమున సమస్తవస్తువులును నశాశ్వతములని దృఢముగ నెఱిఁగియుండి స్కంధ నిర్వాణమును గుఱించి చింతనంబుఁ గావించునో యెయ్యది సమకూర్పఁబడుటవలన మనుజుండు నిర్మింపఁబడుచున్నాఁడో యట్టిదియే వ్యగ్గపజ్జా! వివేకమని పిలువంబడుచున్నది.

ఓయీ వ్యగ్గపజ్జుఁడా! ఈచతుర్గుణ ధర్మంబుల నాచరించిన గృహస్థు లీ రాఁబోవు లోకమున సుజన్మముం బొంది స్వర్గసౌఖ్యములం జెందుదురు.

దారుకుని దైన్యము

బళ్లారి కృష్ణప్ప గారు

తెగువమై రుక్మిణీదేవిని హరియించి ద్వారకానగరంబుఁ జేరు నాఁడు
బలిమిమై బాణుని బాహువు ల్ఛేదించి, మనుమనిఁ దోడ్కొని మఱలునాఁడు
అల్లుని పెండ్లికై యరణంబులను గొని విరటుని వీటికి వెడలునాఁడు.
హితముమై విదురుని యింట వంటలు మెక్కి హాస్తిపురంబున కరుగు నాఁడు
సంభ్రమముతోడ ననువుతో జడిమతోడ-నైపుణంబున నరదంబు నడుపు నన్నుఁ
గాంచి కౌఁగిటఁ జేర్చిన కన్నతండ్రి!, నేలఁ గూలితె శబరుని కోలచేత.?

మాతన్ ప్రీతిగఁ గొల్వనో? జనకునిన్ మన్నింపనో తాతకున్
ఖ్యాతిన్ గూర్పనో ప్రేతలన్ మనుపనో కంసాదులన్ గూల్పనో,
గీతార్థంబు కిరీటికిన్ దెలుపనో కృష్ణాఖ్యతో వెల్గి, యీ
రీతిన్ భూపతిఁబొందఁ గోరితె, మురారీ! దానవారీ! హరీ!

బెడిదమై కప్పిన చెడుగాలివానచే మందలు కొండలం బందునపుడు
మడిసిన బుడుతల మఱలఁ జూడఁ దలంచి దీనమై దేవకి తెలిపినపుడు
నడురేయి దుర్వాసుఁ డిడు మోగిరంబని పాండవాగ్రజునితోఁ బలికినపుడు
బ్రాహ్మణబాలుని బ్రదికింపఁజాలక వెఱచి ఫల్గునుఁ డగ్ని నుఱుకునపుడు
నగవు మోమునఁ దళుకొత్త నగము నెత్తి,-బాలకులఁ దెచ్చి, యన్నంబుఁ జాలనొసఁగి
వెఱపుదీఱిచినట్టి నీవిపులశక్తి-యెందుఁ బోయెను? లోకేశ! యిందిరేశ!

దురితాత్ముఁడు శబరుఁడు, నీ-చరణము హరిణం బటంచు శర మడరించెన్
దెరు విం కెయ్యది? కాలం-బరుదెంచెను దేవ! దేవ! యాపతి యీవే.

శ్రీనృహరీ! హరీ! యనుచుఁ జింతన సేయుచు సంస్మరించుచున్
ధ్యానము సేయుచున్ మఱల దైవము దూఱుచు నిన్నుఁ జీరుచున్
కాననమందె కూలుదును గాని, దురాత్ములఁ గొల్వఁ బోదు నే
జేనెఁడుపొట్టకై మఱుఁగు సీమను గప్పెడు గోఁచిబట్టకై.

ఆ రా ధ న ము

మద్దిపట్ల వేంకటరమణయ్య గారు

అడుగఁదలఁచియు మఱపుచే నుడుగుచుందు - నెన్నిదినముల నుండియో యేను దల్లి!
చెప్పవచ్చునేనియు నాకుఁ జెప్పఁగదవె - యెవరో యీ రీవు మిగులఁ బూజించువారు.
పవలు రే యీవు సేవించు పటము లెవరి? - యింత భక్తికి గుఱియైరి యెవరు వీరు?
కర్ణభూషలు శుభదాయకంబులు నగు - వీరి నామంబు లెయ్యవి? వినఁగ వలతు.
అమ్మ! యేటి కీచిత్రపటాళి ప్రోల - మోముపై మోడ్పుఁ గేల్వట్టి మోకఱింతు?
కన్నులను మూసికొని యేమి కారణమున - నిశ్చలధ్యానలీనవై నిన్నె మఱతు?

మేన నెల్లను బులకలు మేదురముగఁ - గన్నుఁగొలుకుల బాష్పముల్ గడలుకొనఁగ
ఫాలతలమునఁ జెమట ముత్యాలు నిండ - గడియల కొలంది నేటికిఁ గడపె దిచట?

ఎఱిఁగి యెఱుఁగని క్రియలఁ దత్తఱము బెరయఁ - దెలిసి తెలియనిపలుకులం దొలఁకవణఁకు
పలు తలంపుల గఱిడియా స్వాంతమమర - మెలఁగెదవు వీరు వేల్పులా తెలుపు తల్లి!"

అనుచు నౌత్సుక్య కలితుఁడై యడిగినట్టి - యాత్మ నందను అజిత సింహాభిధేయుఁ
జేరఁగాఁ దీసి యశవంతసింహు దేవి - యనియె నీరీతి నాతఁ డూఁకొనుచునుండ.

"తండ్రి! నీచిన్ననాఁటి వృత్తాంతమంత - తలఁపునకు వచ్చునే నోడల్ జలదరించు
గుండియల్ తటతటమంచుఁ గొట్టుకొనును-చెమ్మటలు గ్రమ్ముఁ జిత్తమ్ము బమ్మరించు.

మీ పితలు మహారాజులు మేనుబాయ - అఫగనుస్థానమున నుండి యంత మేము
సకల సైన్యంబుతో నెకాయెకి కుమార! - ఢిల్లికిని వచ్చినాము కడింది వగను—
దుర్గదాసాది సచివులు తోడుతోన - ఆ యలంఘీను దర్శనం బాచరించి
విన్నపము సేసి రత్యంత వినయసరణి - నీకు మార్వారుపై నున్న నిందువాక్కు—
ఏమి చెప్పుదు నంత ఢిల్లీశు నాయు - మేను నెలలేని వెళ్లని కూన నిన్నుఁ
దనకు నప్పగింపంగ నుత్తరువు సేసె; ఎంత కఠినమో యౌరంగు హృదయ మకట!
తన జనానా నతండు నీకు బెనుచునంట - అనుమతింతు వేని తురక వగుట కీవు
దాన మిడునంట పెరిఁగి పెద్దైన వెనుక - పైతృకంబైన నీ మారువారు నీకు—

పారతంత్ర్యంబుచేఁ గల్గుబాధలెల్లఁ - బట్టపవలు లాగునఁ బొడఁగట్టె నాకు;
తాను దన సమస్తంబు భూజానివశము - సేయుమని యున్న దే బానిసీనికొండు?

చెనఁటి తురకకు నిన్నియ్యఁ జేయ్యరాక - జరపుచుండిరి మనవారు సాకు చెప్పి;
మేము తప్పించుకొని పోదుమేమొ యనుచు-భవనమునకుఁ జుట్టు నతండు ఫారయుంచె.
ఎంత చెడ్డ రోజో యది, యొక్క నేమొ - పది గడేలపాటు ప్రొ; ద్దంత వచ్చిపడియె
నవని యూనిన చందాన యవనసేన - మేము వసియించు మహాలు సమీపమునకు—

అంతరంబు సమంబుగా నడుగులిడుచు - వింట నేయి సూర్యులఁ బ్రభవింపఁజేయు
బహువిధాయుధా లూని కాల్బలము వచ్చె-నొకబుజంబు నొకబుజంబు నొరయుచుండ.
టకటక ధ్వను లీనుచుండంగ రథ్య - హేషల కతానఁ బ్రతిశబ్ద మియ్య దిశలు
మోరయార్పులఁ గల్లైముల్ మొరయుచుండ - నల్లనల్ల గుజ్జుపు దళం బరుగుదెంచె—
కోటకడనుండి మనమేడ గోడదాఁక - నొక్కట భటప్రవాహంబు పిక్కటిల్లె;
ఆ పవుఁజుదారున కనుజ్ఞయయ్యె నంట - నిన్ను నన్ను బంధువుల బంధించి తేర.
భూరిఘోరమ్ము సామ్రాజ్యపుః బిపాస - తన గొడుగునీడఁ బరభూమి తనరు దనుకఁ
దలఁపఁగూడని తలఁపులం దలఁపఁజేయు - నలుపఁగూడనిచేఁతలఁ నలుపఁజేయు—

ఋణము తీతెను నాకు నీ కింకననుచు - నక్కున గదించుకొని నిన్ను వెక్కివెక్కి-
యపుడు నే నేడ్చినేడ్చిన కంతు కలదె? - ఇట్టులుండుదు మనుకొంటనే క్షణమ్మె?
కాని రహతూరు శూరశిఖామణు లగు - మన చమూనాథులకు నాప్త మంత్రులకును
జీమకాలంత ధైర్యంబు చెదరలేదు - నిన్ను రక్షించుకార్య వినిశ్చయమున—

ఆ విపత్తు దాఁటుట తెలియంగ రాక - తలఁకు నా వీనుల కమృతధార లగుచు
వినఁబడియె నిట్లు పటురోష భీషణములు - పౌరుషాలాపములు రచ్చపట్టునుండి—
'కునుకు పట్టఁగనీక నన్ గుతిలపఱచు - విషమపు సమస్య యీ త్రుటి విడియెఁ జక్క-
నంధకారంబునందు నల్లాడు నాకు - వెలుఁగు గాన్పించె మ్లేచ్ఛుని వెడఁగుఁజేష్ట—

ఏను జబ్బిపోయితి నంచు నెంచినాఁడొ? - లేరని తలంచెనో రహతూరు లెల్ల?
కన్నుగప్పెనో రాజ్యాశ కాక వీఁడు - దండు బంపునే రాజసంతతిని బట్ట?
చూచెదనుగాక యెవఁడు గెల్చునో' యటంచుఁ-దోయదము భంగి నుఱిమెను దుర్గదాసు
బాహులేయుని కెనవచ్చు బల్లిదుండు - దివిజ గురువున కీడైన ధీయుతుండు—
'ఇట్టి సిబ్బంది యుండి రక్షింపలేమె - ప్రభు కుమారుని దుర్మార్గు బారినుండి?
పెంచితిమి మేను లేలిక పెట్టి పోయు - ఋణము నీఁగెడు మేల్కాల మేగుదెంచె—

ధర్మ నిర్వహణంబుకై తనువు విడుట - కాలిచెంగటఁ బెన్నిధిఁగనుట కాదె?
పోదుగా మన తాతతండ్రులు గమించి - ప్రకటముగఁ జేసినది రాచబాట మనకు—

దలకమాదారి లోకంబు పొగడురీతి - కందము జయంబొ స్వర్గమో కడిమి మెఱసి'
యని వచించెను సాహసోదగ్రుఁ డగుచు - యోధకులభూషణుఁడు రఘునాథభట్టు—

కత్తి చేఁబట్టు నప్పుడే కడకునొత్తె - దేహమందలి ప్రీతిని బాహుజుండు
దాఁచుకొంద మటన్నను దాఁచఁగలమె - ఈశ్వర! యుగాంతపర్యంత మీయొడళ్లు?

శృంఖలలు త్రుంగి స్వేచ్ఛను జెందఁగాక - మాదు సంతతి యేనియు మాన్యలీల;
తన్మహోన్నత పావనస్థానమునకు - మెట్లగుంగాక మాదు నెమ్మేను లన్ని.'

అనియెఁ జంద్రభానుఁ డరిభయంకరుండు. - 'ముద్దుబాలి, యే పోరును బోనఁగకునికి
వ్రేలెడును బ్రక్కఁ బెక్కు దినాలనుండి - కైదువులు కేవలంబు సింగారమగుచు.

బయలుజికి నల్పు నీక ద్విషత్పాటనంబు, - పదును దేఱును దచ్ఛల్యపటలి నొరసి,
పోతరించిన జీబుకు బుద్ధిరాఁగ' - ననియె రణచోరదాస సేనాధిపుండు—

తగవు ధర్మంబు నేయెడఁ దప్పిచనవొ - ఆ యెడను క్షత్రియులు పిల్లులట్టివారు
తగవు ధర్మంబు నేయెడ బెగడు గుడుచు - నాయెడను వ్రేటువడిన సింహములె సుమ్మి.

స్నానసంధ్యాదికము లంత సరగ జరపి, - దేవతార్చావిధానంబు తీర్చి భక్తి,
నసురహర్తకు హరికి సాష్టాంగమెఱఁగి, - చెలఁగి తులసీదళంబును సిగను జెర్వి,

హృదయగతుఁడైన హరి నెఱిఁగించుమాడ్కి - నఱుత వ్రేల సాలగ్రామ మవధరించి,
అఖిల దిక్కులఁ బరిమళం బలమికొనఁగఁ - దనువునిండను పీరచందన మలంది.

వెడఁదఱొమ్మునఁ గవచమ్ము బెడఁగు నింపఁ - బసుపుబట్టలు బంగారు మినలు నెఱపఁ,
గన్నుఁగవ క్షాత్రతేజంబు గడలుకొనఁగ, - సమరదీక్షితు లైన యా శౌర్యధనులు.

చుట్టుఁ బ్రళయంబు చెలరేఁగు పట్టునందు - హాయిగానుండు వటపత్రశాయి చాయఁ
గిలకిలను నవ్వి యాడు నీకెలని కొకరి-వెంట నొకరు వచ్చిరి బిలబిలను దండ్రి!

దరవికస్వర జలజాతదళము లట్లు - విడిసి విడియని నీ లేఁత వ్రేళు లంటి,
ప్రత్తికాయల పగిది నేత్రములు విప్పి - ముగ్ధతను జూచు నీ మ్రోల మోఁకఱించి.

అదియె కడసారి చూపౌట నధిక రక్తి - గట్టిగా నొండొకళ్లను గాఁగిలించి,
ఆయితము చేసి నిల్పిన హయము లెక్కి - వదలి రొక్కుమా ఆ స్వామిభక్తిపరులు.

[సశేషము]

ఆంధ్రలిపి సంస్కారము

పా. ల. నారాయణగారు

మ-రా-రా-శ్రీ, వేటూరి ప్రభాకర శాస్త్రిగారికి

అయ్యా, తాము కడచిన నెల "భారతి"లో "ఆంధ్ర లిపి సంస్కారము"ను గురించి వ్రాయించిన వ్యాసము చదివినాను. ఆనందమైనది. అచ్చుల సంకేతములు విడదీసినంతమాత్రముననే అచ్చులో చాలవరకు వ్యయప్రయాసలు తగ్గిపోవును. మీరు సూచించిన మార్పులు చదివిన మీదట నాకు కొన్ని ఆలోచనలు తట్టినవి. అవి ఈక్రింద రెండు పద్ధతులుగా వ్రాసినాను. ఆలోచింపగోరుతాను. జనానుమోదము పడసి, ఈసంస్కారము పూర్ణముగనో లేక కొంతభాగమో ఆచరణలోనికి వచ్చువరకు మీరు దీనిని వదలక ప్రచారము చేయుచుందురని నమ్ముచున్నాను.

మొదటిపద్ధతి:— ఉచ్చారణయందలి ఒక్కొక ధ్వనికి వ్రాతయందుకూడ ఒకే సంకేతముండుట మంచిది. అనేక సంకేతములుండుట మంచిదికాదు, అనునియమము మీద ఆధారపడియున్నది.

(1) మీరు 16 అచ్చులకు 16 సంకేతము లుంచినారు. బాగున్నదికాని, వర్గములయందలి ద్వితీయ చతుర్థ పంచమాక్షరములకును, శకటరేఫ ళకార షకారములకును ఈ 18 అక్షరములకు బదులు అదివరలో వచ్చిన అక్షరములే నిలువుగీట్ల సహాయముచే ఈఅక్షరము లేర్పడునట్లు చేసినారు. 35 సంకేతములకు బదులు 18 తగ్గి పదునేడే అయినవి. దీనివలన సంకేతముల సంఖ్యతగ్గి కొంతలాభము కలిగినను ఉచ్చారణయందు ఒకధ్వనిగల అక్షరమునకు వ్రాతయందు రెండేసి సంకేతము లుండుటచేత, అచ్చు కూర్చువారు ఒకధ్వనికి రెండుసార్లు రెండు సంకేతములు ఏరి కూర్చవలసివచ్చినది. కలయికలోకూడ ఇట్లే టైపు కొట్టువారు రెండుసార్లు కొట్టవలసి వచ్చినది. పనిలో సులువు కాలేదు. కాలముకూడ ఎక్కువపట్టును. అందుచే ఒకధ్వనికిఒకేసంకేత ముండునట్లు చేయుటమంచిది. అట్లు చేసినయెడల అచ్చుల సంకేతములు 16— హల్లులకు 35— అర్ధానుస్వార, పూర్ణానుస్వారవిసర్గలకు 3—మొత్తము 54 సంకేతములు. ఇంతేకాక ముందు ముందు అన్యభాషా పదములుకూడ తెలుగులో చేర్చుకొనవలసిన అవసరము కలుగును. అందుకు ఇప్పుడు కొన్ని అక్షరములు లోటుగా నున్నవి. ఉదాహరణము:— bat, father అను ఇంగ్లీషుమాటలలోని a f అను ధ్వనులను తెలుపు ఏ. కార ఫ. కారములు— ఖా. ఇదా, గ. ఖ్ గీర్ అను ఉర్దూ పదములలోని ఖ. గ. అను ధ్వనులను తెలుపు ఖకార గకారములు— అను హిందీపదములోని అనుస్వారహల్లును పై తెలుపు సంకేతమొకటి. ఈ 5 ధ్వనులకు 5 సంకేతములు. మొత్తముమీద 59 సంకేతములు. ఇట్లు చేసిన యెడల, ప్రతి ధ్వనికి ప్రత్యేక సంకేత మొక్కటే యుండును. ఈ విషయమై నిర్దుష్టముగా నుండును.

ఇక టైపురైటర్ విషయమై—ఇప్పుడు ఇంగ్లీషు టైప్‌రైటర్ మీద 26 పెద్దక్షరములు, 26 చిన్నక్షరములు, అన్నీ 52అక్షరములున్నవి. తెలుగు టైప్‌రైటర్ మీద 59 ఉండవలసివచ్చును. దానికంటె దీనియందు 7 సంకేతములు ఎక్కువ. అది అంతకష్టముకాదు ఈపక్షములో ఋఋౡౡలు తీసివేసి వాటిపని ఇతరఅక్షరములవలన సరిపెట్టుకొనవచ్చును. అప్పుడు 55 సంకేతములే యగును. మీరు అకారము ప్రత్యేకము ఉండవలెనన్నారు. దానిపని ✓ (తలకట్టే) చేయుచున్నది గనుక, దాని అవసర ముండదు.

(2) మీరు అచ్చుల చిహ్నములు హల్లుల నెత్తి మీద నుండవలెను, హల్లులు మాత్రము పక్క-పక్కనే యుండవలెనని వ్రాసినారు. నెత్తిమీద, క్రింద అక్షరము లుండు పద్ధతి టైపున కంతమాత్రము పనికిరాదు. ఇంగ్లీషులోవలె అచ్చులు, హల్లులు రెండూకూడా పక్క-పక్కనే ఉండవలెను. అప్పుడే బంతిలో అక్షరములెల్ల తీర్చినట్లుండును. అప్పుడే సంస్కరణము వలని సమస్త లాభములు చేకూరును. ఎక్కువస్థల మాక్రమించు కొనునని సంశయింప బనిలేదు. మనువు నిలువులో ఆక్రమించు

కొంచెస్థలం ఇప్పుడు అడ్డంలో ఆక్రమించుకుంటుంది. అదీగాక, హెచ్చుస్థలం ఆక్రమించుకొన్నను, ఈ పద్ధతి వల్ల కలిగే ఎక్కువలాభములను చూచుకొని, ఆకష్టమును సహించవలసినదే. అన్నీలాభము లెప్పుడూ ఉండవు. పనిచేయుకాలము, పడుశ్రమ కలిసివచ్చునప్పుడు కొంచెము ఎక్కువచోటు ఆక్రమించుకొన్నందువల్ల విచారింపవలసిన పనిలేదు.

(3) వీరు ఋ ౠ ఌ ౡ ఙ ఞ ణ న మ య ల వ ష హ, ఈ 14 అక్షరములకు రూపములలో కొన్ని మార్పులు చూపినారు. మనము రూపములు మార్చే అక్షరములు సాధ్యమయినంతవరకు వెనుకటి అక్షరముల పోలిక నిలుపుతే మంచిది. గనుక, వానికి బదులు వరుసగా ౣ, ౣా, ఌ, ౡ, ఙ, ఞ, ణ, ౻, ౻, ౻, ౻, ౻, వా, అని ఉంచుతే కొంచెమెచ్చుతగ్గు మనము ఇది వరలో వాడుకుంటూ ఉన్న సంకేతములే యగును. ఈ తరమువారికి రాబోవుతరములవారికి వెనుకటి గ్రంథములు చదువుటలో కష్టముండదు.

ఇక రెండో పద్ధతి:—ఇది ఒకధ్వనికి అనేక సంకేతములు అంగీకారమయి ఆపద్ధతివలన ఎక్కువలాభ ముంటుందనే పక్షమున సూచించుచున్నాను.

(1) వీరు చెప్పిన నిలువుగీట్లు ఇంకను కొంచె మెక్కువగా వ్యాపింపజేయవచ్చును. ఎట్లనగా, నిలువు గీట్లు హ్రస్వాచ్చులకు తరువాత నుంచి వానిని దీర్ఘాచ్చులను చేయవచ్చును. సాదు హల్లులకు తరువాత నుంచి వత్తు హల్లులుగా చేయవచ్చును. ర,ల,శ,ల తరువాత నుంచి వరుసగా ఱ,శ,ష లనుగా చేయవచ్చును.

(2) వర్గములలో మొదటి అక్షరముల తరువాత, ౭అంకమగాక, ౨ అంకెనుంచి వర్గములలో ౫-వ అక్షరముగా చేయవచ్చును.

(3) నేను కొత్తగా చేర్చవలెనన్న 5 అక్షరములు, ఆయా అక్షరసంకేతముల పక్కన ఒక పూర్ణ విశ్రామ చిహ్నమునుంచి ఏర్పరుచుకొనవచ్చును.

పయిన చెప్పిన మొదటి పద్ధతిప్రకారం
అక్షరమాల

17 అచ్చులు—అ [glyph], ఆ [glyph], ఇ ౨, ఈ [glyph], ఉ [glyph], ఊ [glyph], ఋ [glyph], ౠ [glyph], ఌ ఌ, ౡ ౡ, ఎ [glyph], ఏ [glyph], ఏ [glyph]., ఐ [glyph], ఒ [glyph], ఓ [glyph], ఔ [glyph].

38 హల్లులు—క [glyph], ఖ ఖ, ఖ. ఖ., గ [glyph], గ. [glyph], ఘ ఘ, ఙ ఙ, చ [glyph], ఛ [glyph], జ జ, ఝ ఝ, ఞ ఞ, ట ట, ఠ ఠ, డ డ, ఢ ఢ, ణ ణ, త [glyph], థ [glyph], ద [glyph], ధ [glyph], న [glyph], ప [glyph], ఫ [glyph], ఫ. [glyph]., బ [glyph], భ [glyph], మ [glyph], య [glyph], ర [glyph], ఱ [glyph]., ల [glyph], శ [glyph], వ [glyph], శ [glyph], ష [glyph], స [glyph], హ [glyph].

రెండవ పద్ధతిప్రకారం అక్షరమాల

17 అచ్చులు వరుసగా— [glyph], [glyph]।, ౨, ౨।, [glyph], [glyph]।, [glyph], [glyph]।, ఌ, ఌ।, [glyph], [glyph]।, [glyph]।., ఐ, [glyph], [glyph]।, [glyph].

7 కవర్గు— [glyph], [glyph]।, [glyph]।., [glyph], [glyph], [glyph]।., [glyph]
వరుసగా క, ఖ, ఖ., గ, గ., ఘ, ఙ

5 చవర్గు— [glyph], [glyph]।, జ, జ।, [glyph]
వరుసగా చ, ఛ, జ, ఝ, ఞ.

5 టవర్గు—ట, ట।, డ, డ।, ట౨
వరుసగా ట, ఠ, డ, ఢ, ణ

5 తవర్గు—త, త।, ద, ద।, త౨ వరుసగా
త, థ, ద, ధ, న.

6 పవర్గు—ప, ప।, ప।., బ, బ।, ప౨
వరుసగా ప, ఫ, ఫ., బ, భ, మ

5.   5-   16   -26%

10 మిగిలినవి—ృ, ౘ, ౘ, ౙ, ౙ, ఽ, ౖ, ౕ, ౖ, వా వరుసగా య, ర, ఱల, ళ, వ, శ, ష, స, హ.

ఈ పద్ధతి ప్రకారం అచ్చుసంకేతములు 9, హల్లు సంకేతములు 17 నిలువుగీ టొకటి. అనుస్వార విసర్గలకు 3, మొత్తం సంకేతములు 30.

మాయావిడంబనము

నాదెళ్ల కృష్ణానందం గారు

సృష్టివైచిత్ర్య మెంత విస్పష్టముగను-గనబడుచునున్న గనుచున్న గాని దాని
నిజమెఱింగిన రీతిగా నిమునమైన-నడువడొక్క- డిదేమాయనాటకంబొ.
తాను భూమిపయింబుట్టి జ్ఞానమెఱుగు-నాటి కెన్న డెఱుంగని నాతి వచ్చి
యూరుపేరును లేని కుమారుగనగ-వీరు నావారటంచును గేరు నొకడు.
వాయు వశమున గుమిగూడి వారిదములు-చెదిరి నలుదిక్కులకు బారు చెన్నగాగ
నిట్లువచ్చిన యాల్పుతు లక్లె పూర్వ-సంచితంబున బోవ శోకించు నొకడు.
ఆది తుది లేని కాల వియత్పథమున-లోతు తెలియంగ రాని యీలోక వనధి
మెఱుపుమెఱసిన వ్యవధిలో మేను వాన-చినుకు పరిమాణమని యనుకొన డొకండు.
అమితకాలమునుండి మహాద్భుతముగ-బరిణమించుచు జీవ సంభరిత మగుచు
బ్రళయమొందుచు దోచు ప్రపంచమందు-నేడు బుట్టి యిదెంతను వా డొకండు.
కష్టసుఖములు కోరక కర్మవశత-వచ్చిపోవుట లెఱుగనివా డెవండు
కష్టములు కోరకయెవచ్చు గతిని సుఖము-లొందగా గోరుకొన కూరకుండ డొకడు.
చచ్చువారల గని తాను జత్తుననుచు-దెలిసి తెలియని రీతిగా దిరుగుగాని
చేయి విడుపడు ధనము నార్జించుపట్ల-విసుగుగొన డార్తిగొని యీసు వేడ డొకడు.
మదిని దలచునదొకటి పైమాటయొకటి-చేయగావచ్చు నాటికి జేయుటొకటి
కాని త్రికరణశుద్ధిగా గార్యమొకటి-యిలను జేసిన ధీరుండు గలుగడొకడు.
ఇన్నిటికి మూలమెల్లర నెఱుకబాపి-వింతవింతగ మార్చుచు వివిధమైన
మమతలను కూర్చునట్టిదే మాయ దీని-దెలిసి తిఱిగెడు వా డాదిదేవు డొకడు.

పునర్విమర్శనములు

౧. సూర్యరాయాంధ్ర నిఘంటువు - మచ్చుపదములు

క్రిందటి ఆశ్వయుజమాస 'భారతి'లో నేను వ్రాసిన నిఘంటువు మచ్చుపదముల విమర్శనమును ఖండిస్తూ మ. రా. రా. జయంతి రామయ్యపంతులుగారొక వ్యాసమును వ్రాసినారు. జనులయందు కలుగగల భ్రాంతిని పోగొట్టుటకును తామా ఖండనమును వ్రాసినారట. ఆ భ్రాంతి వీరిఖండనమువల్ల ఎంతవరకు పోయుందో చూడవలసి ఉన్నది.

వారు తమవ్యాసములో నన్ను రెండువిధములుగా అధిక్షేపించినారు: (౧) నేను పండితుడను కానని (౨) నేను గిడుగు రామమూర్తిపంతులుగారి శిష్యుడనని ఈరెండింటివల్లను నాకు ఎట్టి చిన్నతనమున్నూ లేదు. నేను పండితుడను కాను. నిత్య విద్యార్థిని. నాఅభిప్రాయములు పొరపాట్లయితే మరిమరిగా వాటిని సమర్థించుకొనడమునకు పూనుకోను. అవినిజముగా పొరపాట్లయితే సవరించుకొంటాను. నేను గిడుగు రామమూర్తి పంతులుగారి శిష్యుడ ననిపించుకొన్నందుకు గర్వపడుతున్నాను. ఆంధ్రభాషాపరిశోధనమందు ఆంధ్రదేశమునకు వారు పెట్టినది భిక్ష.

శ్రీరామయ్య పంతులుగారు "పుస్తకము మోయుటకు దేహబలమును, కొనుట కర్థబలమును, చదివియుపయోగించుకొనుటకు బుద్ధిబలమును గలవారి నిమిత్తమే యీనిఘంటు వుద్దేశింపఁబడినది గాని యీబలములు లేనివారికొఱకుఁగాదని చెప్పవలసియున్నది" అని నిఘంటుప్రకటనోద్దేశమును సంక్షేపముగా విశదీకరించి ఆంధ్రులను రక్షించినారు. కాని, వారీవాక్యమును కోపసమయములో వ్రాసిఉందురు. పైతమతీర్పును కొంచెము పునర్విచారణమునకు తెత్తురుగాక అని అర్జీ దాఖలు చేసుకొంటున్నాను.

నిఘంటువులో ఎక్కువవిషయమును తక్కువస్థలములో ఎట్లిముడ్చవచ్చునో చూపుతూ నేనుచేసిన సూచనలకు, "ఈమార్గములు మేము యోజింపనివి కావు. యోజించియే మేమవలంబించిన నిఘంటు నిర్మాణపద్ధతికనుకూలములయిన రీతుల ననుసరించినాము" అని వారు ఖండనము వ్రాసినారు. తక్కిన భాషల శాస్త్రీయనిఘంటుకారుల పద్ధతిని నేను సూచించి ఉంటిని. అది సరియైనది కాదనిన్నీ, తామవలంబించిన పద్ధతియే మేలయినదనిన్నీ వారు సమర్థించుకోవలసి ఉండెను. కాని, ఒక్కదమాయింపుతో ఈవిషయమై నేనుచేసిన విమర్శనభాగమును త్రోసివేసినారు. వారినను; మనమేమి చేయగలము?

నేను చేసిన ఆక్షేపములలో అనేకములను విడిచిపెట్టి స్థాలీపులాకన్యాయమునే వ్యాజమున కొన్నిటిని మాత్రమెత్తుకొని ప్రత్యుత్తరమిచ్చినారు. నేనుకూడా ఆ స్థాలీపులాకన్యాయమునేఅనుసరించివారి ఖండనములోని కొన్ని ముఖ్యవిషయములను మాత్రము విమర్శింప బూనుకొన్నాను. ఎక్కువగా వ్రాసి పంతులుగారి ఆగ్రహమునకేల పాత్రుడ కావలెను? "చాలులే చెప్పవచ్చినావు" అని ఏల గద్దించుకోవలెను? అయినా, వారు శోధించిన మెతుకులకంటె ఎక్కువమెతుకులనే పట్టిచూస్తాను.

శ్రీ రామయ్యపంతులుగారు నిఘంటు నిర్మాణపద్ధతి విషయమై ౧౯౧౨వ సం॥రములో వ్రాసినవ్యాసమును, ప్రాచ్యపరిషత్తుకు పంపిన వ్యాసమును నేను చదివియే ఉన్నాను. అందులో వారు గండర్టుగారి మళయాళ నిఘంటువును స్మరించకుండా నేర్పుగా వదలివేసినారనికూడా నాకు తెలుసునుకాని, దాక్షిణాత్య భాషా నిఘంటువులలో నిర్మాణపద్ధతివిషయమున గండ

ట్టుగారి మళయాళ నిఘంటువు అత్యుత్తమమైనది. కాల్డువెల్ దానిని "that truly scientific dictionary" అని తన కంపేరిటివ్ గ్రామరులో మెచ్చుకొన్నాడు. ఇతరులకు కూడా అది అట్లే కనిపిస్తుంది. కిట్టెలు కన్నడ నిఘంటువుకంటె నిర్మాణ పద్ధతి విషయములో అది మేలయినదని చెప్పవలెను. రామయ్యపంతులుగారు కిట్టెలు నుదాహరించినప్పుడు గండర్టునుకూడా ఉపలక్షణముగా గ్రహించినా రనుకొన్నాను. ఎవరయినా అట్లనుకొంటా రను కొంటాను. ఇకమీదనయిన గండర్టు అవలంబించిన విధానములో ఏమైనా మేలున్నదేమో పరిషన్నిఘంటు నిర్మాతలు యోజిస్తా రని తలుస్తాను. "ఓ! మేముదానిని చూచియే వదలియే పెట్టినా"మంటే ఆమాటకు తిరుగే లేదు.

"ఇచ్చిన సంకేతములు విలక్షణముగా ఉండుట" అనే శీర్షిక క్రింద కొన్ని గ్రంథములనుండి ఉదాహరణములు లేవు అనే ఆక్షేపణకు "ప్రయోగబాహుళ్యముగల చోటను, పద్యోదాహరణ మనావశ్యకమని తోచినచోటను గ్రంథనామము, పద్యసంఖ్యయుమాత్ర మీయఁబడిన దని చదువరులు గ్రహింతురుగాక" అని కుండలీకరణము చేసి హెచ్చరించినారు. ఉదాహరణములు లేవని నా యాక్షేపముగాని అంకెలు లేవనికాదు. నిఘంటువులో ఆశ్వాస పద్యసంఖ్యలు నిష్ప్రయోజనములు. ఆయాపుస్తకములను చూచుకొనడమునకు తీరిక లేకకదా నిఘంటువును విప్పడము.?

సంస్కృత శబ్దములవిషయమై "కిట్టెలు, గండర్టు గార్లు తమనిఘంటువులలోనికి అచ్చముగాచేరిన సంస్కృత పదములనే తీసుకొన్నారు" అని నేను వ్రాసిన దానికి "మళయాళ నిఘంటువుమాట యెట్లున్నను కన్నడ నిఘంటువు విషయమయి యీవాక్య మబద్ధము. ఆ నిఘంటువును చక్కగాఁ జూచినవా రట్లనరు. కిట్టెలుగారు Monier Williams నిఘంటువులోనున్న పదముల నించుమించుగా నన్నింటిని గ్రహించినారు," అని ప్రత్యుత్తరము వ్రాసినారు. మళయాళ నిఘంటువుమాట యెట్లున్నదో గండర్టుగారివాక్యములనే ఇక్కడ ఉదాహరిస్తాను.

"To determine the amount of *Sanscrit* words to be received into a Malayalam Dictionary has been a task of even greater difficulty. As this Dictionary is *not* intended for the use of *Sanscrit students*, the rule followed in compiling it has been to include only those words and meanings that were found in *bona fide* Malayalam productions; to sift reduce the enormous mass of mythological and botanical names and synonyms, many of which are confessedly very doubtful; to record merely the principal signification of words confined to poetical usage; and to devote particular attention only to those terms which are generally accepted as fairly 'domiciled' in Malayalam and which have in the course of naturalization received various applications not to be met with in pure Sansckrit (e. g. అధ్యాయం, అవసరం).

"మళయాళనిఘంటువులోనికి సంస్కృతపదములను ఎంతవరకు చేర్చుకొనడము అని నిర్ణయించడము, అంతకంటె (తమిళపదముల నెంతవరకు చేర్చుకొనడము అనేదానికంటె) కష్టమైనది. ఈనిఘంటువు సంస్కృత విద్యార్థుల ఉపయోగముకొరకు కాదుగనుక దీనిని నిర్మించడములో ఈక్రిందిసూత్ర మవలంబింప బడ్డది. అచ్చ మళయాళగ్రంథములలో కనబడే సంస్కృతపదములనే తీసికొనడము; పౌరాణికవిషయములను, వృక్షశాస్త్రవిషయములను (వీటిలో చాలవట్టుకు స్పష్టముగా సందేహాస్పదములు గనుక) వాటిలో ఏవి ముఖ్యములో వాటినే ఉంచి తక్కినవాటిని వదలిపెట్టడము; కేవల పద్యభాషలో వచ్చు సంస్కృతపదముల ప్రధానార్థమును మాత్రమే ఇవ్వడము; మళయాళభాషలో స్థిరవాస మేర్పరచుకొని, అచ్చ సంస్కృతములో లేని అర్థములను పొందిన పదములను గురించి ఎక్కువశ్రద్ధ తీసుకొనడము (ఉదా. అధ్యాయం, అవసరం).

కిట్టెలు తన కన్నడనిఘంటువులో గండర్టుకంటె ఎక్కువ సంస్కృతపదముల నిచ్చినమాట సత్యమే కాని,

"Monier Williams బృహన్నిఘంటువులో నున్న పదముల నించుమించుగా నన్నింటిని గ్రహించినారు" అన్నమాట శుద్ధాబద్ధము. కిట్టెలునిఘంటువులో లేకుండా మానియర్ విలియమ్సు సంస్కృతనిఘంటువులో ఉన్న సంస్కృతపదములు ఎన్నో ఉన్నవి. వాటిపట్టికను ఇచ్చుట చేరుస్తే భారతికి కాగితముఖర్చు ఎక్కువ అవుతుందని మానివేస్తున్నాను. ఈ సంస్కృతపదముల విషయమై కిట్టెలు నిఘంటువు పీఠిక పుట XL VII లో "but write regard to Samskrita......it is not anticipated that in reading certain Kannada classics the want of a Samskrita Dictionary will not be felt occasionally' సంస్కృత విషయమున మాత్రము కొన్ని కన్నడకావ్యములను చదివేటప్పుడు, అప్పుడప్పుడు సంస్కృతనిఘంటువు అవసరముపడదు అని చెప్పవీలు లేదు," అని వ్రాసియున్నాడు. అంటే, కావలసినదానికంటె తక్కువ సంస్కృతపదజాలమునే తీసుకొన్నా డన్నమాట. కాని, నేను కన్నడనిఘంటువును చూడలేదంటారు. కిట్టెలు, గుండర్టు, మానియర్ విలియమ్సు వ్రాసిన నిఘంటువులు నిత్యమూ దగ్గరలేకపోతే నాకు తోచనే తోచదు. "ఆంధ్రభాషాస్వరూపమును, దానికిని సంస్కృతమునకును గలసంబంధమును చక్కగా తెలిసికొనియుండవలసిన నారాయణరావుగారు ఇట్లు వ్రాయుట చిత్రము," అని రామయ్యపంతులుగారు వ్రాసినారు. ఆంధ్రభాషాస్వరూపమును గురించిన్ని, దానికిని సంస్కృతమునకున్న గల సంబంధమును గురించిన్ని నాకు ఎంతో కొంత తెలుసును. కావ్యభాష ఒక్కదానిని చూచి ఆంధ్రభాషాస్వరూపమును నే నేర్పాటు చేసుకోలేను. కావ్యభాష నాకు ఆంధ్రభాష అంతా కాదు. కావ్యభాష సంకుచితమయినది. మిక్కిలీ మిత్రప్రయోజనము గలది. అది జీవద్భాష కాదు. ఒకరీతిగా అది కృతకభాష. దానిని ప్రబంధకవు లెల్లల్లో నిలబెట్టడమునకు ప్రయత్నించినారు. అది సర్వాంగసంపూర్ణమైనది కాదు. నాదృష్టికి ఆంధ్రభాషాస్వరూపము మరొక్కరీతిగా కనబడుతున్నది. ఆస్వరూపములో కావ్యభాష ఒక అంగము మాత్రమే. రామయ్యపంతులుగారికి అదే సంపూర్ణస్వరూపముగా కనబడవచ్చును. అందుచేతనే వారు సంస్కృతమున కెక్కువ ప్రాముఖ్యము నిమ్మంటున్నారు.

ఇక మీరు సమర్థించుకొన్న పదముల అర్థము విషయమై కొంచెము ఆలోచించుదాము.

1. అంకవన్నియ—అనే పదముక్రింద త, అంగపడి, అంగవడి, అని నిఘంటుకారులు వ్రాసినదానిలో 'అంగపడి' అని తమిళములో ద్విత్వరహితముగా పదమధ్యమున పరుషాక్షర ముండుననిన్ని, పరుషముగా ఉండవలెనంటే దానికి ద్విత్వము వస్తుందనిన్ని, ద్విత్వము రానప్పుడు 'ప' అని వ్రాసినా దానిని 'బ'గా ఉచ్చరించవలెననిన్ని నేను వ్రాసినాను. తమిళభాషా పదముల పరుష సరళాక్షరముల ఉచ్చారణమున కిది మూలసూత్రము. ఈ విధి తెలియకపోతే తమిళ శబ్దములను సరిగా ఉచ్చరించలేము. ఆ భాషలో పరుష సరళాక్షరములకు వ్రాతలో ఒక్కటే గురుతుండడముచేత, రెండింటికిన్ని దానికే వాడుకొని, సందర్భోచితముగా ఉచ్చరించుకోవలెను. ఈసంగతి శ్రీరామయ్యపంతులుగారికి తెలియనిదికాదు; కాని, ఎట్లయినా తమ నిఘంటువును సమర్థించుకోవలెనని ఏమేమో వ్రాసినారు. మద్రాసువిద్యాలయమువారి తమిళ నిఘంటువులో రామయ్య పంతులుగారు వ్రాసినట్లు 'అంకపడి' అని ఇంగ్లీషున వ్రాయలేదు. 'అంకపటి' అని ఉన్నది. దానిలోని 'టి'ని మీరు 'డి'గా చదువడము సరియే. 'డి' అని ఎందుకు చదివినారో అందుకోసమే 'ప'నుకూడా 'బ'గా చదువవలసి ఉండెను. ఆకారణము చేతనే, 'అంకపటి'లోని 'అంక'ను 'అంగ' అని మచ్చుపదములలో సరిగానే ఉదాహరించినా, ఖండనములో తిరిగీ 'అంక'అని వ్రాసినారు. తమిళ నిఘంటువును వ్రాసినవారు అక్షరముల స్వరూపమునుబట్టియే ఇంగ్లీషున వ్రాసినారుగాని, వాటి ఉచ్చారణమును బట్టి వ్రాయలేదు. మరి ఒక్కసారి మద్రాసు విశ్వవిద్యాలయ తమిళ నిఘంటువును చూస్తే ఈసంగతి తెలుస్తుంది. ఇంగ్లీషు అక్షరాలతో వ్రాయని తమిళనిఘంటువులలో 'అంకపటి' అనియే ఉంటుంది. దానిని 'అంగబడి'అని చదువుకో

వలెను. ఒక్కప్పుడది ‘అంగవడి’ అనికూడా అవుతుంది. నిఘంటువులు తమ వాదమునకు సహకారులని రామయ్య పంతులుగారనుకొన్నారు కాని, ఐనవి కావు. ద్రావిడ భాషావ్యాకరణమును గాని, కాల్డు వెల్లు కంపేరెటివ్ వ్యాకరణమునుగాని చదువుతే ‘అంగపడి’ అనే ఉచ్చారణము తప్పని తెలుస్తుంది. ద్రావిడభాషా విషయమున వారికి సహాయముచేసినవారు ‘అంగపడి’ అని వ్రాస్తే, అదితప్పు. చెన్నపట్టణములో కొంతమంది అరవ వారిని ‘அங்கபடி’ అని వ్రాసి చదువుమనగా అందరును ‘అంగబడి’ అనే చదివినారు. ఈ ‘బ’కారోచ్చారణమును కొందరు తేలికగా వకారమువలె చేస్తారు. ‘వ’ కారమునకు ప్రత్యేకాక్షర మరవములో ఉన్నది.గనుక ‘அங்கவடி’ అనిన్ని, బకారమునకు అక్షరము లేదు గనుక ‘அங்கபடி’ అనిన్ని, నిఘంటువులలో కనబడుతుంది. అయినా ‘அங்கபடி’ ని ‘అంగబడి’అనియే చదువుకోవలెను.

2. అంగలార్చు—దీనికి ‘గంతులువేయు’ అని వ్యుత్పత్త్యర్థమును వ్రాసి, తరువాత దానినుంచి పుట్టిన ఇతరార్థములను చూపవలసి ఉండెనని నేను సూచించినాను. దీనికి ‘అంగ’అనునది మూలపద మని చెప్పినాను. ‘ఆర్చు’ అనుదానికి ఆర్పుతోగాని దుఃఖముతోగాని సంబంధము లేదని చెప్పినాను. ఆలంకారికమంటే మూలార్థమునకు భిన్నముగా దానినుండి పుట్టినదని నాఅభిప్రాయము. వ్యుత్పత్త్యర్థమును విస్మరించడము నైఘంటుక పద్ధతికి విరుద్ధము; తామేర్పరచుకొన్న విధానమునకున్ను విరుద్ధము.

3. అంగవించు—దీని అర్థము విషయములో కూడా వ్యుత్పత్త్యర్థమునుచూపెట్టకపోవడమనే దోషము పట్టినది. మీదిపద్యములో అంగవించికేని’ అనిన్ని, క్రిందిపద్యములో కదియకయుండడన్’ అనిన్ని ఉన్నంతమాత్రముచేత ‘అంగవించు’ అంటే కదియు అని అర్థము చెప్పడము తగదు. ‘మదము గదురఁజేసి, మదిమోహ మెక్కించి, చూపుఁదీఁగెలందుఁ జుట్టుకొల్పి’ మాటలతో అంగవించికేని అనేమాటను కలిపి చదువుతే ‘కదియు’ కంటే ఎక్కువ అర్థము వస్తుంది’ ఆపద్యమును తిరిగి తామే కొంచెము స్థిమితముగా చదువుకొంటే సందేహము విడిపోతుంది.

4. చేయుక, చేయమి—వీటిలో క, మి, అనేవి వ్యతిరేకార్థకప్రత్యయములనిన్ని, అవి పరమైనప్పుడు ధాతువుతుది ఉత్వమునకు అత్వము ఆదేశముగా వస్తుందనిన్ని అర్థము వచ్చే వాక్యమును నిఘంటుకారులు వ్రాసినారు. ‘అత్వ మొక్కటే వ్యతిరేకార్థబోధక మని నేను వ్రాసినాను. దాని నాక్షేపిస్తూ ‘క, వ’ అనేవి ఏమవుత వని రా. పంతులుగారు ప్రశ్న వేసినారు. అవి విశేషములను కల్పించే భావార్థకప్రత్యయములనిన్ని, వ్యతిరేకార్థముతో వాటికి సంబంధము లేదనిన్ని నాసమాధానము. (పేర్) పేర్మి, (కలు) కల్మి, (పో) పోక, మొదలయినవాటిలో క, మి, లు భావార్థక ప్రత్యయములు. వీటికి వ్యతిరేకార్థము లేదు. ‘పోక’ అనేది వ్యతిరేకక్త్వార్థకముకూడా అవుతుంది. అప్పుడది ‘పోవక’ అనేదాని సంక్షేపరూపము అట్లే ‘రామి’ ‘రాక’ మొదలయినవికూడా సంక్షేపరూపములే. వాటిలో వ్యతిరేకార్థబోధకమయిన ‘అ’ కారము లీనమయి ఉన్నది. అయితే ‘చేయుక’ అనే వ్యతిరేక వ్యతిరేక భావార్థకరూపమే వ్యతిరేకక్త్వార్థక రూప మెట్లవుతుం దని ప్రశ్న రావచ్చును. వ్యతిరేకక్త్వార్థకరూపముయొక్క తత్త్వమదే అని మా సమాధానము.

5. ‘నిల్వరయేని’—అనేదానిలో అకారము అవధారణార్థకమని మామతము. ఇతరస్థలములలో ఇటువంటి సందర్భములలో నన్నయ క్రియలపై అత్వమును అవధారణార్థముననే ఉపయోగించినాడు. ఇచ్చట గణముకొరకే నన్నయ కక్కుర్తి పడినాడని చెప్ప సాహసింపరాదు. సంస్కృతములో ఉన్నదున్నట్లే నన్నయ తెనిగించినాడని చెప్పడమునకున్ను వీలు లేదు. రామయ్య పంతులుగారిచ్చిన ఒక్కశ్లోకపాదమును తెనిగించడములోనే నన్నయ ఎన్నిమార్పులు చేసినాడో చూడండి. “నసాసభాయత్రనసంతి సజ్జనాః”అనేదానిని సరిగా తెనిగించవలెనంటే “ఎచ్చట సజ్జనులు లేరో అది సభకాదు” అని వ్రాయవలసి ఉండెను. కాని నన్నయ ‘అది సభయే

అని మొదట ప్రశ్నించినాడు. "ప్రియంవదంగన్" అని మూలములో లేనిదానిని చేర్చినాడు. 'సంతి' అన్నదానికి 'నిల్వరయేని' అని అన్నాడు. 'సజ్జనాః' అనేపదమునకు 'ఆర్యులు' అన్నారు. ఇది మూలమునకు సరియైన తెలుగుసేత కాదు. అందుచేత 'నిల్వరయేని' అనే దానివల్ల ఒక విశేషార్థమును బోధింపడమునకే నన్నయ 'నిల్వరు' అనే క్రియమీద అవధారణార్థక అకారమునుచేర్చినాడు కాని, కక్కుర్తికోసము కాదు. 'ఆర్యులు లేనిది సభకాదు' అని చెప్పితే సరిపోలేదు. బోడిగా వున్నది.

6. 'అంచుక యించుక'—'ఆడదుగాని మాట లోక యంచుక యించుక వీనులొగ్గినా, యాడినమాటలెల్ల విను నర్మిలితో—' అని పినవీరన్న పద్యము. దీనికి అభిజ్ఞానశాకుంతలములో మూలము "వాచం న మిశ్రయతి యద్యపి మేవచోభిః, కర్ణం దదాత్యభిముఖం మయి భాషమాణే" అనేది. "అంచుకయించుక" అనేదానికి మూలములో సరియైనపద మేదీ లేదు. అయితే, పినవీరన్న దానిని నిరర్థకముగా కక్కుర్తికోసమయిన ఉపయోగించిఉండవలెను, లేదా మూలమునకు మెరుగు తెచ్చుటకైనా ఉపయోగించి ఉండవలెనుకదా. మెరుగుకోసమే వేసినాడని నా యభిప్రాయము. "నాతో కొంచెమైనను మాటలాడదు" చెవులు నిక్కబెట్టుకొని నేనాడినమాటలన్నీ వింటుంది—అని రామయ్యపంతులుగారుచెప్పిన అర్థము విరసముగాను, అస్వారస్యముగాను ఉన్నది. 'అక్కడ కొంచెము ఇక్కడ కొంచెము మాటలాడదు' అని నేను వ్రాయను లేదు; పినవీరన్న అభిప్రాయముకూడా అది కాదు. "ఆడదుగాని మాటలు" అనే దగ్గరవాక్యమును విరుపు చేయవలెను. "నా యాడినమాటలెల్ల ఒక యంచుకయించుక వీనులొగ్గి అర్మిలితో వినున్" అని అన్వయముచేసుకోవలెను. మాటలో మాటకలుపదుగాని అక్కడక్కడ(అప్పుడప్పుడు) చెవులొగ్గి నా మాటలను అర్మిలితో వింటుంది—అని చెప్పడములో కాళిదాసుకంటె పినవీరన్న శృంగారాభినయములో రవంత వ్రాసి చూపించినాడు. మాట్లాడకుండా మొద్దువలె మొగమువేసి అదేచూడడము శృంగారచేష్ట కాదు. విననట్టునటించినా అప్పుడప్పుడు మాటలకు చెవులొగ్గడము శృంగార విలాస మవుతుంది. అందుచేత, రామయ్యపంతులుగారి ఖండనము సరియైనది కాదు.

7. "అంగదట్టము, ఏ. వి. (క. అంగదట్టు)—శరీర ముకప్పు ముసుగుబట్ట—పావడ, గాగర" అని వ్రాసినారు. పైదానిలో "శరీరముకప్పు ముసుగుబట్ట" అనే దానిని వ్యుత్పత్తిగా ఇచ్చినారట. అది అర్థముకాదట. అది వ్యుత్పత్తిఅని తెలుసుకొనడమునకు సంకేత మేమీ ఇవ్వకుండా "ఇదియెంతగట్టి ప్రశ్నయో చదువరులూహింతురు గాక" అని వ్రాసినది ఎంతగట్టి ఖండనయో ఆచదువరులే ఊహింతురుగాక.

8. తక్కినఖండనముకూడా ఈరీతిగానే ఉన్నది. ఈఖండన ఖండనములతో కాలము వ్యర్థముచేసుకొనడము నాకిష్టము లేదు. మాటకు మాట తెగులు, నీటికి నాచు తెగులు. వ్రాసినదానిని సద్భావముతో గ్రహించ నిశ్చయించుకొనని వారితో వాదము పెంచుకొనడము వృథాప్రయాసము. "ఇవన్నీ మేము యోజింపనివికావు. అట్లుండవలెను కావుననే అట్లు వ్రాసినాము. దేహబలము, అర్థబలము, బుద్ధిబలము కల వారికే మానిఘంటు వుద్దేశింపబడినది" అను వాదమునకు దిగినవారికి సమాధానము చెప్పడము కష్టము. అయినా, భాషావిషయములు గనుక రెండుసంగతులు మాత్రము వ్రాసి విరమిస్తాను.

9. "ఏనేడు లగుదెంచె వర్జునుండేగి—యింతకే తెంచు" అనేదానిలో 'అగుదెంచె' అనేదానికి 'ఏనేడు లయినవి, పూర్తి అయినవి' అని రామయ్యపంతులుగా రర్థము చెప్పుచుంటారు. "ఏనేడులు కావచ్చినవి—ఇంకా పూర్తి కాలేదు, కొంచెముకాలములో అవుతవి" అని నేనర్థము చెప్పుకోవలె నన్నాను. "కథా సందర్భమును సంస్కృతాంధ్రభారతములు చూచిన తెలియును" అని రామయ్యపంతులుగారు హెచ్చరించినారు. సంస్కృతభారతమును చూడగా, జటాసురవధపర్వము తరువాత—

స సమానీయ తాన్ సర్వాన్
భ్రాతౄ న్నిత్యబ్రవీ ద్వచః

ద్రౌపద్యా సహితాః కాలే
సంస్మరన్ భ్రాతరం జయమ్;
సమా శ్చుత్రసోఽభిగతాః
శివేన చరతాం వనే;
కృతోద్దేశః సబీభత్సుః
పంచమీ మభిత స్సమామ్.


అనేశ్లోకములు ఉన్నవి. వీటికి తెనుగు ఆంధ్రభారతములోని పద్యములు. ఇందువల్ల ఐదేండ్లు గతించిన వన్న అర్థము వస్తుందేమో పండితు లూహింతురుగాక. ఇదిగాక తమ అర్థమును సమర్థించుకొనెంచి 'అర్జునుఁ డింత కేతెంచున్' అంటే 'ఈపాటికర్జునుఁడు వచ్చియుండును' అని అర్థము వ్రాసినారు. ఇందులో 'ఇంతకు' అనేదానికి 'ఈపాటికి' అని అర్థముచెప్పడ మొక తప్పు. 'ఇంతలో, కొద్దికాలములో' అని చెప్పవలెను. "ఏతెంచున్" అంటే "వచ్చియుండును" అని అర్థము వ్రాయడము రెండో తప్పు. "వస్తాడు" అని కేవలభవిష్యదర్థమును చెప్పవలెను. ఇంగ్లీషులో "He will come presently" అనే దానికిన్ని, "He would (might have come by this time" అనేదానికిన్ని ఎంత అర్థభేద మున్నదో పై రెండర్థములకున్ను అంత భేద మున్నది. 'ఏతెంచున్' అనేదానికి 'వచ్చియుండును' అనే అర్థము నవీనమైనది. నన్నయ ఆ 'would have come' అనే అర్థములో ఆక్రియారూపమును వాడడు. ఆ అర్థమిప్పుడు మనవ్యవహారములో ఉన్నది. చూడండి: "నీవు వాడిని పిలిచినావా?—లేదు.—అయ్యో, ఎందుకు పిలువలేదు? పిలిస్తే వచ్చునే; పోయి పిలువు, వస్తాడు"—ఇక్కడ "వచ్చును" అంటే "వచ్చి ఉండును" అనే అర్థమున్ను 'వస్తాడు' అంటే కేవలభవిష్యదర్థమున్ను ఉన్నవి. ఇప్పటి వ్యావహారికార్థమును నన్నయవాడిన క్రియారూపమునకు రామయ్యపంతులుగారు ముడిపెట్టినారు.

10. "అంత సరోరుహాప్తుఁ డుదయంబగుడెంచె... సత్వరుఁడై చనుదెంచె నొక్కొ—వాఁడ"—ఇందులో అగుదెంచె అనేది "కడచు గతించు" అనే అర్థమునకు ఉదాహరణము కాదట. 'కలదియగు' అనే ఆర్థమునకుదాహరణమట. అట్లయినా సూర్యోదయముఅయినదనేకదా అర్థము; సూర్యోదయముకాలేదని నేనుచేసిన ఆక్షేపము. 'అగుదెంచెన్' అన్నదానితరువాత 'చనుదెంచెన్' అని రూపములో భూతకాలమును తెలియజేసే క్రియ ఉన్నదానికి వర్తమానార్థమునే చెప్పుకోవలెను. 'సత్వరుడై చనుదెంచుచున్నాడో' అన్నట్లుగా సరోరుహాప్తు డుదయింప ప్రారంభిస్తున్నాడు' అని పైదాని కర్థము. ధాతువుపై 'తెంచు' అను ప్రయుక్తమయినప్పుడు దానికి రెండువిధములయిన అర్థభేదములను కలిగిస్తుంది. (1) ధాతువు తెలిపేకార్యము పూర్తికాక కొద్దికాలములో పూర్తి అవుతుందని సూచింపడము (2) ధాతువుతెలిపే కార్యము అభిముఖమగుటను సూచింపడము అగు, అగుదెంచు—అనేజంట మొదటిదానికి ఉదాహరణము. వీఁచు, వీతెంచు—అనేజంట రెండోదాని కుదాహరణము. 'అయ్యెన్' అంటే 'అగుదెంచెన్' అనిన్నీ, 'వీఁచెన్' అంటే 'వీతెంచెన్' అనిన్నీ అర్థము చెప్పరాదు. 'ఏపాటిభాషాజ్ఞానము కలవారూ (ఇట్టి అర్థమును) 'చెప్పరు' అని నేను వ్రాసినదాని అభిప్రాయమిదే.


11. పీఠికలో తాము వ్రాసిన వాక్యములలో కర్త అసమాపకక్రియకువేసి దాని సమాపకక్రియ కర్మణ్యర్థములో వ్రాయడమును గురించి నేనుచేసిన ఆక్షేపము నెత్తుకొని, నామీదనేకాకుండా నాగురువుగారయిన రామమూర్తి పంతులుగారి మీదికికూడా వీకో పెద్ద విద్యయమును కనిపెట్టినట్లు 'ఇదిగో' అని ససంభ్రమముగా నన్నయ తిక్కనలనుంచి నాలుగుదాహరణములు ఇచ్చినారు. నన్నయ తిక్కనల ప్రయోగము లున్న మహోన్నతశైలి ఎట్లు నిర్దుష్టమవుతుందో తెలియరాకున్నది. ఏనాటి పలుకుబడి ఆనాటిదే. అది మారినప్పుడు మారినపలుకుబడినే వాడడము భాషాసంప్రదాయము నన్నయ ప్రయోగ మొకటి తిక్కన ప్రయోగ మొకటి పెద్దనప్రయోగ మొకటి, (తరిగొండ) వెంకమ్మప్రయోగ మొకటి—ఈరీతిగా వివిధకాలముల ప్రయోగములను గుదిగుచ్చి వ్రాసినది అతుకులబొంత అవుతుందిగాని శైలి అనిపించు కోదు.

అయినా, నన్నయ తిక్కన ప్రయోగములలో కర్త అసమాపకక్రియకు సంబంధించియుండగా సమాపక


భూగర్భమునుండి క్రొత్తగ వెలువడిన శిల్పచిత్రములు



౧. త్రవ్వబడుచున్న పహారపుర దేవాలయము. బంగాళమున చాల పురాతన మైనది. బంగాళీ కళలకు, చరిత్రమునకు నిది విలువగల విషయములను సమకూర్చుచున్నది.



౨. నాలందాస్తూపముయొక్క అయిదవ పునర్నిర్మాణ సోపానమార్గమున నున్న బుద్ధునియొక్కయు, బోధిసత్వులయొక్కయు చిత్రములు. ఇవి గచ్చుతో చేయబడినవి.



3. నాలందాస్తూపముయొక్క అయిదవ పునర్నిర్మాణము.

ఇది క్రీ.శ. ౭వ శతాబ్దమున హ్యూయెన్‌త్సాంగ్ వచ్చినపుడు సుప్రసిద్ధవిశ్వవిద్యాలయముగనుండెను.
అది మొదలు ౧౧-వ శతాబ్దమువఱకును పెంపొంది యుండెను.
ఇది ఆఱుమారులు వెవ్వేరు సమయములయందు పునర్నిర్మాణమును గాంచినది.
స్తూపముయొక్క అయిదవ పునర్నిర్మాణము ౧౪౦,౦౦౦ ఘన అడుగుల
ఇటుకకట్టడమును త్రవ్వితీయగా నిది కాన్పించినది.

కొంతస్థలం ఇప్పుడు అడ్డంలో ఆక్రమించుకుంటుంది. అదీగాక, హెచ్చుస్థలం ఆక్రమించుకొన్నను, ఈ పద్ధతి వల్ల కలిగే ఎక్కువలాభములను చూచుకొని, ఈకష్టమును సహించవలసినదే. అన్నీలాభము లెప్పుడూ ఉండవు. పనిచేయుకాలము, పదుశ్రేప కలిసివచ్చునప్పుడు కొంచెము ఎక్కువచోటు ఆక్రమించుకొన్నందువల్ల విచారింపవలసిన పనిలేదు.

(3) వీరు ఋ ౠ ఌ ౡ ఙ ఞ ణ న మ య ల వ ష హ, ఈ 14 అక్షరములకు రూపములలో కొన్ని మార్పులు చూపినారు. మనము రూపములు మార్చే అక్షరములు సాధ్యమయినంతవరకు వెనుకటి అక్షరముల పోలిక నిలుపుతే మంచిది.' గనుక, వానికి బదులు వరుసగా ౠ, ౡ, ఌ, ౡ, ఙ, ఞ, ణ, న, మ, య, ల, వ, ష, హ, అని ఉంచుతే కొంచెమెచ్చుతగ్గు మనము ఇదివరలో వాడుకుంటూఉన్న సంకేతములే యగును. ఈ తరమువారికి రాబోవుతరములవారికి వెనుకటి గ్రంథములు చదువుటలో కష్టముండదు.

ఇక రెండో పద్ధతి:—ఇది ఒకధ్వనికి అనేక సంకేతములు అంగీకారమయి ఆపద్ధతివలన ఎక్కువలాభ ముంటుందనే పక్షమున సూచించుచున్నాను.

(1) వీరు చెప్పిన నిలువుగీట్లు ఇంకను కొంచెమెక్కువగా వ్యాపింపజేయవచ్చును. ఎట్లనగా, నిలువుగీట్లు హ్రస్వాచ్చులకు తరువాత నుంచి వానిని దీర్ఘాచ్చులను చేయవచ్చును. సాదు హల్లులకు తరువాత నుంచి వత్తుహల్లులుగా చేయవచ్చును. ర,ల,శ,ల తరువాత నుంచి వరుసగా ఱ,ళ,ష. లనుగా చేయవచ్చును.

(2) వర్గములలో మొదటి అక్షరముల తరువాత, ౨ అంకెనుగాక, ౫ అంకెనుంచి వర్గములలో ౫-వ అక్షరముగా చేయవచ్చును.

(3) నేను కొత్తగా చేర్చవలెనన్న ౧ అక్షరములు, ఆయా అక్షరసంకేతముల పక్కను ఒక పూర్ణవిశ్రామ చిహ్నమునుంచి ఏర్పరుచుకొనవచ్చును.

పయిన చెప్పిన మొదటి పద్ధతిప్రకారం
అక్షరమాల

17 అచ్చులు—అ ✓, ఆ —; ఇ ౩, ఈ ౩ీ, ఉ ౨, ఊ ౨ా, ఋ ౖ, ౠ ౖా, ఌ ఌ, ౡ ౡ, ఎ —, ఏ —ె, ఐ —ై., ఐ —ై, ఒ ౧ా, ఓ ౧ో, ఔ ౢా.

38 హల్లులు—క ౬—, ఖ ఖ, ఖ. ఖ., గ ౧, గ. ౧., ఘ ఘ, ఙ ఙ, చ ౕ, ఛ ౕ, జ జ, ఝ ఝ, ఞ ఞ, ట ట, ఠ ఠ, డ డ, ఢ ఢ, ణ ణ, త త, థ థ, ద ద, ధ ధ, న న, ప ప, ఫ ఫ, ఫ. ఫ., బ బ, భ భ, మ మ, య య, ర ర, ఱ ఱ., ల ల, శ శ, వ వ, శ శ, ష ష, స స, హ హ.

రెండవ పద్ధతిప్రకారం అక్షరమాల

17 అచ్చులు వరుసగా— ✓, ✓|, ౩, ౩|, ౨, ౨|, ౖ, ౖ|, ఌ, ఌ|, —, —|, —|., ఐ, ౧ా, ౧ా|, ౢా.

7 కవర్గు— ౬—, ౬—|, ౬—|., ౧, ౧, ౧|., ౬—౫
వరుసగా క, ఖ, ఖ., గ, గ., ఘ, ఙ

5 చవర్గు— ౕ, ౕ|, జ, జ|, ౕ౫
వరుసగా చ, ఛ, జ, ఝ, ఞ.

5 టవర్గు— ట, ట|, డ, డ|, ట౫
వరుసగా ట, ఠ, డ, ఢ, ణ

5 తవర్గు— త, త|, ద, ద|, త౫ వరుసగా
త, థ, ద, ధ, న.

6 పవర్గు— ప, ప|, ప|., బ, బ|, ప౫
వరుసగా ప, ఫ, ఫ., బ, భ, మ

10 మిగిలినవి—ఙ, ∪, ∪ǀ, ∩, ∩ǀ, ఽ, ఽ, ఽ', ఽ, వా వరుసగా య, ర, అల, ళ, వ, శ, ష, స, హ.

ఈ పద్ధతి ప్రకారం

అచ్చుసంకేతములు 9, హల్లు సంకేతములు 17 నిలువుగీ టొకటి. అనుస్వార విసర్గలకు 3, మొత్తం సంకేతములు 30.

మాయావిడంబనము

నాదెళ్ల కృష్ణానందం గారు

సృష్టివైచిత్ర్య మెంత విస్పష్టముగను-గనబడుచునున్న గనుచున్నగాని దాని
నిజమెఱింగిన రీతిగా నిముసమైన-నడువడొక్క డిదేమాయనాటకంబొ.
తాను భూమిపయింబుట్టి జ్ఞానమెఱుగు-నాటి కెన్నడెఱుంగని నాతి వచ్చి
యూరుపేరును లేని కుమారుగనగ-వీరు నావారటంచును గేరు నొకడు.
వాయు వశమున గుమిగూడి వారిదములు-చెదిరి నలుదిక్కులకు బారు చెన్నుగాగ
నిట్లువచ్చిన యాల్సుతు లట్లె పూర్వ-సంచితంబున బోవ శోకించు నొకడు.
ఆది తుది లేని కాల వియత్పథమున-లోతు తెలియంగ రాని యీలోక వసధి
మెఱుపుమెఱసిన వ్యవధిలో మేను వాన-చినుకు పరిమాణమని యనుకొన డొకండు.
అమితకాలమునుండి మహాద్భుతముగ-బరిణమించుచు జీవ సంభరిత మగుచు
బ్రళయమొందుచు దోచు ప్రపంచమందు-నేడు బుట్టి యిదెంతను వా డొకండు.
కష్టసుఖములు కోరక కర్మవశత-వచ్చిపోవుట లెఱుగనివా డెవండు
కష్టములు కోరకయెవచ్చు గతిని సుఖము-లొందగా గోరుకొన కూరకుండ డొకడు.
చచ్చువారల గని తాను జత్తుననుచు-దెలిసి తెలియని రీతిగా దిరుగుగాని
చేయి విడుపడు ధనము నార్జించుపట్ల-విసుగుగొన డార్తిగొని యీశు వేడ డొకడు.
మదిని దలచునదొకటి పైమాటయొకటి-చేయగావచ్చు నాటికి జేయుటొకటి
కాని త్రికరణశుద్ధిగా గార్యమొకటి-యిలను జేసిన ధీరుండు గలుగడొకడు.
ఇన్నిటికి మూలమెల్లర నెఱుక బాపి-వింతవింతగ మార్చుచు వివిధమైన
మమతలను కూర్చునట్టిదే మాయ దీని-దెలిసి తిఱిగెడు వా డాదిదేవు డొకడు.

పునర్విమర్శనములు

౧. సూర్యరాయాంధ్ర నిఘంటువు - మచ్చుపదములు

కిందటి ఆశ్వయుజమాస 'భారతి'లో నేను వ్రాసిన నిఘంటువు మచ్చుపదముల విమర్శనమును ఖండిస్తూ మ. రా. రా. జయంతి రామయ్యపంతులుగారొక వ్యాసమును వ్రాసినారు. జనులయందు కలుగగల భ్రాంతిని పోగొట్టడమునకు తామా ఖండనమును వ్రాసినారట. ఆభ్రాంతి వీరిఖండనమువల్ల ఎంతవరకు పోతుందో చూడవలసి ఉన్నది.

వారు తమవ్యాసములో నన్ను రెండువిధములుగా అధిక్షేపించినారు: (౧) నేను పండితుడను కానని (౨) నేను గిడుగు రామమూర్తిపంతులుగారి శిష్యుడనని ఈరెండింటివల్లను నాకు ఎట్టి చిన్నతనమున్ను లేదు. నేను పండితుడను కాను. నిత్య విద్యార్థిని. నాఅభిప్రాయములు పొరపాట్లయితే వెరివెరిగా వాటిని సమర్థించుకొనడమునకు పూనుకోను. అవినిజముగా పొరపాట్లయితే సవరించుకొంటాను. నేను గిడుగు రామమూర్తి పంతులుగారి శిష్యుడ ననిపించుకొన్నందుకు గర్వపడుతున్నాను. ఆంధ్రభాషాపరిశోధనమందు ఆంధ్రదేశమునకు వారు పెట్టినది భిక్ష.

శ్రీరామయ్య పంతులుగారు "పుస్తకము మోయుటకు దేహబలమును, కొనుట కర్థబలమును, చదివియుపయోగించుకొనుటకు బుద్ధిబలమును గలవారి నిమిత్తమే యీనిఘంటు వుద్దేశింపఁబడినది గాని యీబలములు లేనివారికొఱకుఁగాదని చెప్పవలసియున్నది" అని నిఘంటుప్రకటనోద్దేశమును సంక్షేపముగా విశదీకరించి ఆంధ్రులను రక్షించినారు. కాని, వారీవాక్యమును కోపసమయములో వ్రాసిఉందురు. పైతమతీర్పును కొంచెము పునర్విచారణమునకు తెస్తురుగాక అని అర్జీ దాఖలు చేసుకొంటున్నాను.

నిఘంటువులో ఎక్కువవిషయమును తక్కువస్థలములో ఎట్లిముడ్చవచ్చునో చూపుతూ నేనుచేసిన సూచనలకు, "ఈమార్గములు మేము యోజింపనివి కావు. యోజించియే మేమవలంబించిన నిఘంటు నిర్మాణపద్ధతికనుకూలములయిన రీతుల ననుసరించినాము" అని వారు ఖండనము వ్రాసినారు. తక్కిన భాషల శాస్త్రీయనిఘంటుకారుల పద్ధతిని నేను సూచించి ఉంటిని. అది సరియైనది కాదనిన్నీ, తామవలంబించిన పద్ధతియే మేలయినదనిన్నీ వారు సమర్థించుకోవలసి ఉండెను. కాని, ఒక్కదమాయింపులో ఈవిషయమై నేనుచేసిన విమర్శనభాగమును త్రోసివేసినారు. వారినయ; మనమేమి చేయఁగలము?

నేను చేసిన ఆక్షేపములలో అనేకములను విడిచిపెట్టి స్థాలీపులాక న్యాయమనే వ్యాజమున కొన్నిటిని మాత్రే మెత్తుకొని ప్రత్యుత్తరమిచ్చినారు. నేనుకూడా ఆ స్థాలీపులాక న్యాయము నేఅనుసరించివారి ఖండనములోని కొన్ని ముఖ్యవిషయములను మాత్రము విమర్శింప బూనుకొన్నాను. ఎక్కువగా వ్రాసి పంతులుగారి అగ్రహమున కేల పాత్రుడ కావలెను? "చాలులే చెప్పవచ్చినావ"ని ఏల గద్దించుకోవలెను? అయినా, వారు శోధించిన మెతుకులకంటె ఎక్కువ మెతుకులనే పట్టిచూస్తాను.

శ్రీ రామయ్యపంతులుగారు నిఘంటు నిర్మాణపద్ధతి విషయమై ౧౯ ౧౨వ సం॥రములో వ్రాసినవ్యాసమును, ప్రాచ్యపరిషత్తుకు పంపిన వ్యాసమును నేను చదివియే ఉన్నాను. అందులో వారు గండర్టుగారి మళయాళ నిఘంటువును స్మరించకుండా నేర్పుగా వదలివేసినారనికూడా నాకు తెలుసునుకాని, దాక్షిణాత్య భాషా నిఘంటువులలో నిర్మాణపద్ధతివిషయమున గండ

ర్టుగారి మళయాళ నిఘంటువు అత్యుత్తమమైనది. కాల్డువెల్ దానిని "that truly scientific dictionary" అని తన కంపేరటివ్ గ్రామరులో మెచ్చుకొన్నాడు. ఇతరులకు కూడా అది అట్లే కనిపిస్తుంది. కిట్టెలు కన్నడ నిఘంటువుకంటె నిర్మాణ పద్ధతి విషయములో అది మేలయినదని చెప్పవలెను. రామయ్యపంతులుగారు కిట్టెలు నుదాహరించినప్పుడు గండర్టునుకూడా ఉపలక్షణముగా గ్రహించినారనుకొన్నాను. ఎవరయినా అట్లనుకొంటారనుకొంటాను. ఇకమీదనయిన గండర్టు అవలంబించిన విధానములో ఏమైనా మేలున్నదేమో పరిషన్నిఘంటు నిర్మాతలు యోజిస్తారని తలుస్తాను. "ఓ! మేముదానిని చూచితిమి వదలివేసి పెట్టినా"మంటే ఆమాటకు తిరుగే లేదు.

"ఇచ్చిన సంకేతములు విలక్షణముగా ఉండుట" అనే శీర్షిక క్రింద కొన్ని గ్రంథములనుండి ఉదాహరణములు లేవు అనే ఆక్షేపణకు "ప్రయోగ బాహుళ్యముగల చోటను, పద్యోదాహరణ మనావశ్యకమని తోచినచోటను గ్రంథనామము, పద్యసంఖ్యయుమాత్ర మీయఁబడినదని చదువరులు గ్రహింతురుగాక" అని పుండలీకరణము చేసి హెచ్చరించినారు. ఉదాహరణములు లేవని నా యాక్షేపముగాని అంకెలు లేవనికాదు. నిఘంటువులో ఆశ్వాస పద్యసంఖ్యలు నిష్ప్రయోజనములు. ఆయాపుస్తకములను చూచుకొనడమునకు తీరిక లేకకదా నిఘంటువును విప్పడము.?

సంస్కృత శబ్దములవిషయమై "కిట్టెలు, గండర్టు గార్లు తమనిఘంటువులలోనికి అచ్చముగాచేరిన సంస్కృత పదములనే తీసుకొన్నారు" అని నేను వ్రాసిన దానికి "మళయాళ నిఘంటువుమాట యెట్లున్నను కన్నడ నిఘంటువు విషయమయి యీవాక్య మబద్ధము. ఆ నిఘంటువును చక్కఁగాఁ జూచినవారట్లనరు. కిట్టెలుగారు Monier Williams నిఘంటువులోనున్న పదముల నించుమించుగా నన్నింటిని గ్రహించినారు," అని ప్రత్యుత్తరము వ్రాసినారు. మళయాళ నిఘంటువుమాట యెట్లున్నదో గండర్టుగారివాక్యములనే ఇక్కడ ఉదాహరిస్తాను.

"To determine the amount of *Sanscrit* words to be received into a Malayalam Dictionary has been a task of even greater difficulty. As this Dictionary is *not* intended for the use of *Sanscrit students*, the rule followed in compiling it has been to include only those words and meanings that were found in *bona fide* Malayalam productions; to sift reduce the enormous mass cf mythological and botanical names and synonyms, many of which are confessedly very doubtful; to record merely the principal signification of words confined to poetical usage; and to devote particular attention only to those terms which are generally accepted as fairly 'domiciled' in Malayalam and which have in the course of naturalization received various applications not to be met with in pure Sansckrit (e. g. అధ్యాయం, అవసరం).

"...ళయాళనిఘంటువులోనికి సంస్కృతపదములను ఎంతవరకు చేర్చుకొనడము అని నిర్ణయించడము, అంతకంటె (తమిళపదముల నెంతవరకు చేర్చుకొనడము అనేదానికంటె) కష్టమైనది. ఈనిఘంటువు సంస్కృత విద్యార్థుల ఉపయోగముకోసము కాదుగనుక దీనిని నిర్మించడములో ఈక్రిందిసూత్ర మవలంబింప బడ్డది. అచ్చ మళయాళగ్రంథములలో కనబడే సంస్కృతపదములనే తీసికొనడము; పౌరాణికవిషయములను, వృక్షశాస్త్రవిషయములను (వీటిలో చాలమట్టుకు స్పష్టముగా సందేహాస్పదములు గనుక) వాటిలో ఏవి ముఖ్యములో వాటినే ఉంచి తక్కినవాటిని వదలిపెట్టడము; కేవల పద్యభాషలో వచ్చు సంస్కృతపదముల ప్రధానార్థమును మాత్రమే ఇవ్వడము; మళయాళభాషలో పెరవాస మేర్పరచుకొని, అచ్చ సంస్కృతములో లేని అర్థములను పొందిన పదములను గురించి ఎక్కువశ్రద్ధ తీసుకొనడము (ఉదా. అధ్యాయం, అవసరం).

కిట్టెలు తన కన్నడనిఘంటువులో గండర్టుకంటె ఎక్కువ సంస్కృతపదముల నిచ్చినమాట సత్యమే కాని,

"Monier Williams బృహన్నిఘంటువులో నున్న పదముల నించుమించుగా నన్నింటిని గ్రహించినారు" అన్న మాట శుద్ధాబద్ధము. కిట్టెలునిఘంటువులో లేకుండా మానియర్ విలియమ్సు సంస్కృతనిఘంటువులో ఉన్న సంస్కృతపదములు ఎన్నో ఉన్నవి. వాటిపట్టికను ఇచ్చట చేరుస్తే భారతికి కాగితముఖర్చు ఎక్కువ అవుతుందని మానివేస్తున్నాను. ఈ సంస్కృతపదముల విషయమై కిట్టెలు నిఘంటువు పీఠికపుట XL VII లో "but write regard to Samskrita......it is not anticipated that in reading certain Kannada classics the want of a Samskiita Dictionary will not be felt occasionally' సంస్కృతవిషయమున మాత్రము కొన్ని కన్నడకావ్యములను చదివేటప్పుడు, అప్పుడప్పుడు సంస్కృతనిఘంటువు అవసరముపడదు అని చెప్పవీలులేదు," అని వ్రాసియున్నాడు. అంటే, కావలసినదానికంటె తక్కువ సంస్కృతపదజాలమునే తీసుకొన్నాడన్నమాట. కాని, నేను కన్నడనిఘంటువును చూడలేదంటారు. కిట్టెలు, గుండర్టు, మానియర్ విలియమ్సు వ్రాసిన నిఘంటువులు నిత్యమూ దగ్గర లేకపోతే నాకు తోచనే తోచదు. "ఆంధ్రభాషాస్వరూపమును, దానికిని సంస్కృతమునకును గలసంబంధమును చక్కగా తెలిసికొనియుండవలసిన నారాయణరావుగారు ఇట్లు వ్రాయుట చిత్రము," అని రామయ్యపంతులుగారు వ్రాసినారు. ఆంధ్రభాషాస్వరూపమును గురించిన్ని, దానికిని సంస్కృతమునకున్న గలసంబంధమును గురించిన్ని నాకు నెంతో కొంత తెలుసును. కావ్యభాష ఒక్కదానినిచూచి ఆంధ్రభాషాస్వరూపమును నేనేర్పాటు చేసుకోలేను. కావ్యభాష నాకు ఆంధ్రభాష అంతా కాదు. కావ్యభాష సంకుచితమయినది. మిక్కిలీ మితప్రయోజనము గలది. అది జీవద్భాష కాదు. ఒకరీతిగా అది కృతకభాష. దానిని ప్రబంధకవులు రెక్కట్లో నిలబెట్టడమునకు ప్రయత్నించినారు. అది సర్వాంగసంపూర్ణమైనది కాదు. నాదృష్టికి ఆంధ్రభాషాస్వరూపము మరొక్కరీతిగా కనబడుతున్నది. ఆస్వరూపములో కావ్యభాష ఒక అంగము మాత్రమే. రామయ్యపంతులుగారికి అదే సంపూర్ణస్వరూపముగా కనబడవచ్చును. అందుచేతనే వారు సంస్కృతమున కెక్కువ ప్రాముఖ్యము నిమ్ముంటున్నారు.

ఇక వీరు సమర్థించుకొన్న పదముల అర్థము విషయమై కొంచెము ఆలోచించుదాము.

1. అంకవన్నియ—అనే పదముక్రింద త. అంగపడి, అంగవడి, అని నిఘంటుకారులు వ్రాసినదానిలో 'అంగపడి' అని తమిళములో ద్విత్వరహితముగా పదమధ్యమున పరుషాక్షర ముండదనిన్నీ, పరుషముగా ఉండవలెనంటే దానికి ద్విత్వము వస్తుందనిన్నీ, ద్విత్వము రానప్పుడు 'ప' అని వ్రాసినా దానిని 'బ'గా ఉచ్చరించవలెననిన్నీ నేను వ్రాసినాను. తమిళభాషా పదముల పరుష సరళాక్షరముల ఉచ్చారణమున కిది మూలసూత్రము. ఈ విధి తెలియకపోతే తమిళ శబ్దములను సరిగా ఉచ్చరించలేము. ఆ భాషలో పరుష సరళాక్షరములకు వ్రాతలో ఒక్కటే గురుతుండడముచేత, రెండింటికిన్ని దానికే వాడుకొని, సందర్భోచితముగా ఉచ్చరించుకోవలెను. ఈసంగతి శ్రీరామయ్యపంతులుగారికి తెలియనిదికాదు; కాని, ఎట్లయినా తమ నిఘంటువును సమర్థించుకోవలెనని ఏమేమో వ్రాసినారు. మద్రాసువిద్యాలయమువారి తమిళనిఘంటువులో రామయ్య పంతులుగారు వ్రాసినట్లు 'అంకపడి' అని ఇంగ్లీషున వ్రాయలేదు. 'అంకపటి' అని ఉన్నది. దానిలోని 'టి'ని వీరు 'డి'గా చదువడము సరియే. 'డి' అని ఎందుకు చదివినారో అందుకోసమే 'ప'నుకూడా 'బ'గా చదువవలసి ఉండెను. ఆకారణముచేతనే, 'అంకపటి'లోని 'అంక'ను 'అంగ' అని మచ్చుపదములలో సరిగానే ఉదాహరించినా, ఖండనములో తిరిగీ 'అంక'అని వ్రాసినారు. తమిళ నిఘంటువును వ్రాసినవారు అక్షరముల స్వరూపముబట్టియే ఇంగ్లీషున వ్రాసినారుగాని, వాటి ఉచ్చారణమును బట్టి వ్రాయలేదు. మరి ఒక్కసారి మద్రాసు విశ్వవిద్యాలయ తమిళ నిఘంటువును చూస్తే ఈసంగతి తెలుస్తుంది. ఇంగ్లీషు అక్షరాలతో వ్రాయని తమిళనిఘంటువులలో 'అంకపటి' అనియే ఉంటుంది. దానిని 'అంగబడి'అని చదువుకో

వలెను. ఒక్కప్పుడది 'అంగవడి' అనికూడా అవుతుంది. నిఘంటువులు తమ వాదమునకు సహకారులని రామయ్య పంతులుగారనుకొన్నారు కాని, ఐనవి కావు. ద్రావిడ భాషావ్యాకరణమును గాని, కాల్డువెల్లు కంపేరటివ్ వ్యాకరణమునుగాని చదువుతే 'అంగపడి' అనే ఉచ్చారణము తప్పని తెలుస్తుంది. ద్రావిడభాషా విషయమున వారికి సహాయముచేసినవారు 'అంగపడి' అని వ్రాస్తే, అదితప్పు. చెన్నపట్టణములో కొంతమంది అరవ వారిని 'அங்கபடி' అని వ్రాసి చదువుమనగా అందరును 'అంగబడి' అనే చదివినారు. ఈ 'బ'కారోచ్చారణమును కొందరు తేలికగా వకారమువలె చేస్తారు. 'వ' కారమునకు ప్రత్యేకాక్షర మరవములో ఉన్నది.గనుక 'அங்க வடி' అనిన్ని, బకారమునకు అక్షరములేదు గనుక 'அங்கபடி' అనిన్ని, నిఘంటువులలో కనబడుతుంది. అయినా 'அங்கபடி' ని 'అంగబడి'అనియే చదువుకోవలెను.

2. అంగలార్పు—దీనికి 'గంతులువేయు' అని వ్యుత్పత్త్యర్థమును వ్రాసి, తరువాత దానినుంచి పుట్టిన ఇతరార్థములను చూపవలసి ఉండెనని నేను సూచించినాను. దీనికి 'అంగ'అనునది మూలపద మని చెప్పినాను. 'అర్పు' అనుదానికి ఆర్పుతోగాని దుఃఖముతోగాని సంబంధము లేదని చెప్పినాను. ఆలంకారికమంటే మూలార్థమునకు భిన్నముగా దానినుండి పుట్టినదని నాఅభిప్రాయము. వ్యుత్పత్త్యర్థమును విస్మరించడము నైఘంటుక పద్ధతికి విరుద్ధము; తామేర్పరచుకొన్న విధానమునకున్ను విరుద్ధము.

3. అంగవించు—దీని అర్థము విషయములో కూడా వ్యుత్పత్త్యర్థమునుచూపెట్టకపోవడము నేదోషము పట్టినది. విరాటపద్యములో అంగవించిరేని' అనిన్ని, క్రీంది పద్యములో కదియకయుండవే' అనిన్ని ఉన్నంతమాత్రముచేత 'అంగవించు' అంటే కదియు అని అర్థము చెప్పడము తగదు. 'మదము గదురఁజేసి, మదమోహ మెక్కించి, చూపుఁదీఁగలందుఁ జుట్టుకొల్పి' మాటలతో అంగవించిరేని అనేమాటను కలిపి చదువుతే 'కదియు' కంటె ఎక్కువ అర్థము వస్తుంది' ఆపద్యమును తిరిగి తామే కొంచెము స్థిమితముగా చదువుకొంటే సందేహము విడిపోతుంది.

4. చేయక, చేయమి—వీటిలో క, మి, అనేవి వ్యతిరేకార్థకప్రత్యయములనీన్ని, అవి పరములైనప్పుడు ధాతువుకుది ఉత్వమునకు అత్వము ఆదేశముగా వస్తుందనిన్ని అర్థము వచ్చే వాక్యమును నిఘంటుకారులు వ్రాసినారు. 'అత్వ మొక్కటే వ్యతిరేకార్థబోధక మని నేను వ్రాసినాను. దాని నాక్షేపిస్తూ 'క, మ' అనేవి ఏమవుతవని రా. పంతులుగారు ప్రశ్న వేసినారు. అవి విశేషములను కల్పించే భావార్థకప్రత్యయములనీన్ని, వ్యతిరేకార్థముతో వాటికి సంబంధము లేదనిన్నీ నాసమాధానము. (పేర్) పేర్మి, (కలు) కల్మి, (పో) పోక, మొదలయినవాటిలో క, మి, లు భావార్థక ప్రత్యయములు. వీటికి వ్యతిరేకార్థము లేదు. 'పోక' అనేది వ్యతిరేకక్త్వార్థకముకూడా అవుతుంది. అప్పుడది 'పోనక' అనేదాని సంక్షేపరూపము అట్లే 'రామి' 'రాక' మొదలయినవికూడా సంక్షేపరూపములే. వాటిలో వ్యతిరేకార్థబోధకమయిన 'అ' కారము లీనమయి ఉన్నది. అయితే 'చేయక' అనే వ్యతిరేక వ్యతిరేక భావార్థకరూపమే వ్యతిరేకక్త్వార్థకరూప మెట్లవుతుం దని ప్రశ్న రావచ్చును. వ్యతిరేకక్త్వార్థకరూపముయొక్క తత్త్వమదే అని మా సమాధానము.

5. 'నిల్వరయేని'—అనేదానిలో అకారము అవధారణార్థకమని మామతము. ఇతరస్థలములలో ఇటువంటి సందర్భములలో నన్నయ క్రియలపై అత్వమును అవధారణార్థమునసే ఉపయోగించినాడు. ఇచ్చట గణముకొరకు నన్నయ కక్కుర్తి పడినాడని చెప్ప సాహసింపరాదు. సంస్కృతములో ఉన్నదున్నట్లే నన్నయ తెనిగించినాడని చెప్పడమునకున్ను వీలులేదు. రామయ్య పంతులుగారిచ్చిన ఒక్కశ్లోకపాదమును తెనిగించడములోనే నన్నయ ఎన్నిమార్పులు చేసినాడో చూడండి. "నసాసభాయత్రనసంతి సజ్జనా" అనేదానిని సరిగా తెనిగింపవలెనంటే "ఎచ్చట సజ్జనులు లేరో అది సభకాదు" అని వ్రాయవలసి ఉండెను. కాని నన్నయ 'అది సభయే

అని మొదట ప్రశ్నించినాడు. "ప్రియంవదేనగన్" అని మూలములో లేనిదానిని చేర్చినాడు. 'సంతి' అన్నదానికి 'నిల్వరయేని' అని అన్నాడు. 'సజ్జనాః' అనేపదమునకు 'ఆర్యులు' అన్నారు. ఇది మూలమునకు సరియైన తెలుగుసేత కాదు. అందుచేత 'నిల్వరయేని'అనే దానివల్ల ఒక విశేషార్థమును బోధించడమునకే నన్నయ 'నిల్వరు'అన్నక్రియమీద అవధారణార్థక అకారమునుచేర్చి నాడు కాని, కక్కుర్తికోసము కాదు. 'ఆర్యులు లేనిది పథకాదు'అని చెప్పితే సరిపోలేదు. బోడిగా వున్నది.

6. 'అంచుక యించుక'—'ఆడకుగాని మాట లొకయంచుక యించుక వీనులొగ్గి సా, యాడినమాట లెల్ల విను నర్మిలితో—'అని పినవీరన్న పద్యము. దీనికి అభిజ్ఞానశాకుంతలములో మూలము "వాచంనమిశ్రయతి యద్యపి మేవచోభిః, కర్ణం దదాత్యభిముఖంమయి భాషమాణే" అనేది. "అంచుకయించుక" అనేదానికి మూలములో సరియైనపద మేదీలేదు. అయితే,పినవీరన్న దానిని నిరర్థకముగా కక్కుర్తికోసమయిన ఉపయోగించిఉండవలెను, లేదా మూలమునకు మెరుగుతెచ్చుటకై నా ఉపయోగించి ఉండవలెనుకదా. మెరుగుకోసమే వేసినాడని నా యభిప్రాయము. "నాతో కొంచెమైనను మాటలాడను" చెవులు నిక్కబెట్టుకొని నేనాడినమాటలన్నీ వింటుంది—అని రామయ్యపంతులుగారుచెప్పిన అర్థము విరసముగాను, అస్వారస్యముగాను ఉన్నది. 'అక్కడ కొంచెము ఇక్కడ కొంచెము మాటలాడను'అని నేనువ్రాయ మలేదు, పినవీరన్న అభిప్రాయముకూడా అది కాదు. "ఆడదుగాని మాటలు" అనే దగ్గరవాక్యమును విరుపు చేయవలెను."నా యాడినమాటలెల్ల ఒక యంచుకయించుక వీనులొగ్గిఅర్మిలితో వినున్"అనిఅన్వయముచేసుకోవలెను. మాటతో మాటకలుపదుగాని అక్కడక్కడ(అప్పుడప్పుడు) చెవులొగ్గి నా మాటలను అర్మిలితో వింటుంది—అని చెప్పడములో కాళిదాసుకంటె పినవీరన్న శృంగారాభినయములో రవంత వ్రాసి చూపించినాడు. మాట్లాడకుండా మొద్దువలె మొగమువేసి అదేచూడడము శృంగార చేష్ట కాదు. విననట్లునటించినా అప్పుడప్పుడు మాటలకు చెవులొగ్గడము శృంగార విలాస మవుతుంది. అందుచేత, రామయ్యపంతులుగారి ఖండనము సరియైనది కాదు.

7. "అంగదట్టము, మి. వి. (క. అంగదట్ట)–శరీర ముకప్పు ముసుగుబట్ట–పావడ, గాగర" అని వ్రాసినారు. పైదానిలో "శరీరముకప్పు ముసుగుబట్ట" అనే దానిని వ్యుత్పత్తిగా ఇచ్చినారట. అది అర్థముకాదట. అది వ్యుత్పత్తిఅని తెలుసుకొనడమునకు సంకేత మేమీ ఇవ్వకుండా "ఇదియెంతగట్టి ప్రశ్నయోచదువరు లూహింతురు గాక"అని వ్రాసినది ఎంతగట్టి ఖండనమో ఆచదువరులే ఊహింతురుగాక.

8. తక్కినఖండనముకూడా ఈరీతిగానే ఉన్నది. ఈఖండన ఖండనములతో కాలము వ్యర్థముచేసుకొనడము నాకిష్టము లేదు. మాటకు మాట తెగులు, నీటికి నాచు తెగులు. వ్రాసినదానిని పద్ధావముతో గ్రహించ నిశ్చయించుకొననివారితో వాదము పెంచుకొనడము వృథాప్రయాసము. "ఇవన్నీ మేము యోజింపనివికావు. అట్లుండవలెను కావుననే అట్లు వ్రాసినాము. దేహబలము, అర్థబలము, బుద్ధిబలము కల వారికే మానిఘంటు వుద్దేశింపబడినది" అను వాదమునకు దిగినవారికి సమాధానము చెప్పడము కష్టము. అయినా, భాషావిషయములు గనుక రెండుసంగతులు మాత్రము వ్రాసి విరమిస్తాను.

9. "ఏ నేడు లగుదెంచె నర్జునుండేగి—యింతకే తెంచు" అనేదానిలో 'అగుదెంచె' అనేదానికి 'ఏనేడు లయినవి, పూర్తి అయినవి' అని రామయ్యపంతులుగా రర్థము చెప్పుచుంటారు. "ఏనేడులు కావచ్చినవి— ఇంకా పూర్తి కాలేదు, కొంచెముకాలములో అవుతవి" అని నేనర్థము చెప్పుకోవలె నన్నాను. "కథా సందర్భము న సంస్కృతాంధ్రభారతములు చూచిన తెలియును" అని రామయ్యపంతులుగారు హెచ్చరించినారు. సంస్కృతభారతమును చూడగా, జటాసురవధపర్వము తరువాత—

స సమానీయ తాన్ సర్వాన్
భ్రాతౄ న్నిత్యబ్రవీ ద్వచః;

ద్రౌపద్యా సహితాః కాలే
సంస్మరన్ భ్రాతరం జయమ్;
సమాకృతస్తోఽభిగతాః
శివేన చరతాం వసే;
కృతోద్దేశః సవీభత్సుః
పంచమీ మభిత స్సమామ్.

అనేశ్లోకములు ఉన్నవి. వీటికి తెనుగు ఆంధ్రభారతము లోని పద్యములు. ఇందువల్ల పదేండ్లు గతించిన పన్న అర్థము వస్తుందేమో పండితు లూహింతురుగాక. ఇదిగాక తమ అర్థమును సమర్థించుకొనెంచి 'అర్జునుఁ డింత కే తెంచున్' అంటే 'ఈపాటికర్జునుఁడు వచ్చియుండును' అని అర్థము వ్రాసినారు. ఇందులో 'ఇంతకు' అనేదానికి 'ఈపాటికి' అని అర్థముచెప్పడ మొక తప్పు. 'ఇంతలో, కొద్దికాలములో' అని చెప్పవలెను. "ఏతెంచున్" అంటే "వచ్చియుండును" అని అర్థము వ్రాయడము రెండో తప్పు. "వస్తాడు" అని కేవలభవిష్యదర్థమును చెప్పవలెను. ఇంగ్లీషులో "He will come presently" అనే దానికిన్ని, "He would (might have come by this time" అనేదానికిన్ని ఎంత అర్థభేద మున్నదో పై రెండర్థములకున్న అంత భేద మున్నది. 'ఏతెంచున్' అనేదానికి 'వచ్చియుండును' అనే అర్థము నవీనమైనది. నన్నయ ఆ 'would have come' అనే అర్థములో ఆ క్రియారూపమును వాడడు. ఆ అర్థమిప్పుడు మనవ్యవహారములో ఉన్నది. చూడండి. "నీవు వాడిని పిలిచి నావా?—లేదు.—అయ్యో, ఎందుకు పిలువలేదు? పిలుస్తే వచ్చునే; పోయి పిలువు, వస్తాడు"—ఇక్కడ "వచ్చును" అంటే "వచ్చి ఉండును" అనే అర్థమున్న 'వస్తాడు' అంటే కేవలభవిష్యదర్థమున్న ఉన్నవి. ఇప్పటి వ్యావహారికార్థమును నన్నయవాడిన క్రియారూపమునకు రామయ్యపంతులుగారు ముడిపెట్టినారు.

10. "అంత సరోరుహాప్తుఁ డుదయంబగుదెంచె... సత్వరుఁడై చనుదెంచె నొక్కవాఁడ్"—ఇందులో అగుదెంచె అనేది "కడచు గతించు" అనే అర్థమునకు ఉదాహరణము కాదట. 'కలదియగు' అనే అర్థమునకుదాహరణమట. అట్లయినా సూర్యోదయముఅయినదనేకదా అర్థము సూర్యోదయము కాలేదని నేనుచేసిన ఆక్షేపము. 'అగుదెంచెన్' అన్నదానితరువాత 'చనుదెంచెన్' అని రూపములో భూతకాలమును తెలియజేసే క్రియ ఉన్నదానికి వర్తమానార్థమునే చెప్పుకోవలెను. 'సత్వరుఁడై చనుదెంచుచున్నాడో' అన్నట్లుగా సరోరుహాప్తు డుదయింప ప్రారంభిస్తున్నాడు' అని పైదాని కర్థము. ధాతువుపై 'తెంచు' అనుప్రయుక్తమయినప్పుడు దానికి రెండు విధములయిన అర్థభేదములను కలిగిస్తుంది. (1) ధాతువు తెలిపే కార్యము పూర్తికాక కొద్దికాలములో పూర్తి అవుతుందని సూచించడము (2) ధాతువు తెలిపే కార్యము అభిముఖమగుటను సూచించడము అగు, అగుదెంచు— అనేజంట మొదటిదానికి ఉదాహరణము. వీఁచు, వీతెంచు—అనేజంట రెండోదాని కుదాహరణము. 'అయ్యెన్' అంటే 'అగుదెంచెన్' అనిన్నీ, 'వీఁచెన్' అంటే 'వీతెంచెన్' అనిన్నీ అర్థము చెప్పరాదు. 'ఏపాటిభాషాజ్ఞానము కలవారూ (ఇట్టి అర్థమును) 'చెప్పరు' అని నేను వ్రాసినదాని అభిప్రాయమిదే.

11. పీఠికలో తాము వ్రాసిన వాక్యములలో కర్త అసమాపకక్రియకువేసి దాని సమాపకక్రియ కర్మణ్యర్థములో వ్రాయడమును గురించి నేనుచేసిన ఆక్షేపము నెత్తుకొని, నామీదనేకాకుండా నాగురువుగారయిన రామమూర్తి పంతులుగారి మీదికికూడా ఏకో పెద్ద విషయమును కనిపెట్టినట్లు 'ఇదిగో' అని ససంభ్రమముగా నన్నయ తిక్కనలనుంచి నాలుగుదాహరణముల నిచ్చినారు. నన్నయ తిక్కనల ప్రయోగము లున్నవనుకొన్న పీఠికశైలి ఎట్లు నిర్దుష్టమవుతుందో తెలియరాకున్నది. ఏనాటి పలుకుబడి ఆనాటిదే. అది మారినప్పుడు మారినపలుకుబడినే వాడడము భాషాసంప్రదాయము నన్నయ ప్రయోగ మొకటి తిక్కన ప్రయోగ మొకటి పెద్దనప్రయోగమొకటి, (తరిగొండ) వెంకమ్మప్రయోగమొకటి—ఈరీతిగా వివిధకాలముల ప్రయోగములను గుదిగ్రుచ్చి వ్రాసినది అతుకులబొంత అవుతుందిగాని శైలి అనిపించుకోదు.

అయినా, నన్నయ తిక్కన ప్రయోగములలో కర్త అసమాపకక్రియకు సంబంధించియుండగా సమాపక

Lump అను పదము పుట్టినదని వారు పరిగణింప వచ్చును గదా.

మానవమాత్రునకుఁ బ్రమాదములు కలుగకపోవుట యసాధారణము. కాని యవి కలుగుటలో తర తమ భావము లుండును. "పుటకు డెబ్బదిపదారొండు తోటు కులుఁడు వారు వీరును నోకతీరువారు గారు" అన్నట్లు వేంకటరాయశాస్త్రులుగారు మొదలగు ప్రతిభానిధులకుఁ బ్రమాదము లసాధారణముగా అల్పముగాఁ గల్గుచుండును. అస్మదాదు లడుగడుగునకు నధికముగాఁ గల్గుచుండును. క్లిష్ట విషయమును స్పష్టముగా క్లుప్తముగా చక్కఁగా సంప్రదాయశుద్ధముగా వ్యాఖ్యానించుటలో నేఁటి తెలుఁగువారిలో శాస్త్రులుగా రగ్రగణ్యులని నా నమ్మకము. ఆంధ్రదేశమున నిజముగా వా రభినవ మల్లినాథులే. అట్లయినను వారి వ్యాఖ్యానగ్రంథములందుఁ గూడ నందందుఁ గొన్ని ప్రమాదములు దొరలకపోలేదు.

శృంగారనైషధము తుదిపట్టున చంద్ర వర్ణన పద్యము,

మ. ఉడువీథీ హరినీలరత్నమయ పా
త్రోత్సంగభాగంబునన్
గడు గారామొనరన్ ఝషాంకునకు సం
కచ్ఛాయయన్ కమ్మనాఁ
బిడితోఁ గూడ సుధాంశుబింబమును స
ర్పిఃపాయసాహారమున్
గుడువం బెట్టెనొ బంతి హాళ్లకును జా
కోరంబు లేపారఁగాన్.

అను శాస్త్రులవారి సవ్యాఖ్యాన ముద్రణమునఁ గలదు. 'నాఁబిడి' సర్పిః 'పాయస' పదములు అర్థసంగతికై శాస్త్రులుగారు సంస్కరించి చేర్చినవి. అక్కడపాఠము పారంపర్యాగతము, తాళపత్ర దృష్టమును చకోరపక్షులు తర్వాత తాము బంతిని భుజించుటకై ముందుగా మన్మథునకు ఆకాశమను నింద్రనీలపుఁ బళ్ళెరమున, కళంకమను పిడికెఁడు కమ్మనావులతోఁ గూడిన చంద్రబింబమను నేయభిఘరించిన పరమాన్నమును, గుడువఁ బెట్టెనా యేమి? అని పద్యార్థము. శాస్త్రులుగా రీపద్యవ్యాఖ్యానము నుపలబ్ధపాఠముఁ బట్టి యెంత సారస్యము సాధింపనగునో యంత సారస్యమును సాధించి హృద్యాతిహృద్యముగా రచించిరి! ఆనంద ముద్రణాలయమువారి కొఱకై బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటశాస్త్రిగారు రచించిన వ్యాఖ్యానమున నీపద్యమున కర్థముఁ గొంచె మించుమించుగా వెంకటరాయశాస్త్రులుగారు వ్యాఖ్యానించినట్లే యున్నది. అందుఁ గొన్ని పాఠభేదము లున్నవి. "కడుగారామొనరన్" అని వెంకటరాయశాస్త్రులుగారి పాఠముండఁగా, 'కడుగారామునరే' అని వెంకటశాస్త్రులుగారి పాఠము. తబ్బిందును "రేన్ = రాత్రియందుఁ", బెట్టినట్లు వీరి వ్యాఖ్యావిశేషము. మఱియు, "నంజనాటిడితోఁ గూడ నేయింబాయస" అని వీరి పాఠములు. నావులపిండితోఁ జేసిన భక్ష్యవిశేషమని దాని టీక. అక్కడనెల్ల వేంకటరాయశాస్త్రిగారి వ్యాఖ్యానమునజోలియే కలదు. కాని పయి రెండు గ్రంథములు ముద్రితములయిన తరువాతఁ బ్రాఁత వ్రాఁతప్రతులఁ బరిశీలింపఁగాఁ బయిపద్యమున కిట్లు ప్రశస్తపాఠము దొరకెను.

మ. ఉడువీథీ హరినీలరత్నమయ పా
త్రోత్సంగభాగంబునన్
గడుగారామునరే ఝషాంకునకు సం
కచ్ఛాయ యన్ కమ్మనా
టిడితోఁ గూడ సుధాంశుబింబమును నే
యిం బాయసాహారమున్
గుడువం బెట్టెనొ బంతిహాళ్లకును జా
కోరంబు లేరేఁగాన్.

ఇదిగదా శ్రీనాథునిపాఠము! ఇందు, విందుపెట్టినది పక్షులయిన చకోరములు గాక రే=స్త్రీయగు నిశాదేవి! గొప్పవారిని విందుకుఁ బిలిచి, ప్రశస్తపదార్థముల వారగింపఁ బెట్టునప్పు డాపదార్థముల సారస్య మెఱిఁగిన వారిని తమకును వింద్లారగింప వచ్చినవారికిని పరిచితుల నితరులను గూడ సహపంక్తి భోజనమునకుఁ బిలుచుట కలదు. అవిధమున నిక్కడ చకోరములు బంతికుడుపునకై వచ్చినవి. 'గారామునరే' 'చాకోరంబు లేరేఁగాన్'అను ప్రశస్త పాఠములు దొరకక

పోవుటచే వెంకటరాయశాస్త్రిలుగారికిని 'గారాముసరి' యనుపాఠము దొరకినను, 'చాకోరంబు లే లేరఁగాక' అనుపాఠము దొరకకపోవుటచే వెంకటశాస్త్రిలుగారికిని నీహృద్యార్థమును గుర్తింపఁ గుదురదయ్యెను. నూటిడి, యనుచో నూవులతోఁజేసిన యిడి యని యర్థము. ఇడి యను భక్ష్యమును శ్రీనాథుఁడు కాశీఖండమునఁ జేర్కొన్నాఁడు.

మఱియు,

గీ. మిసిమి గల పుల్లఁజెరుగుతో మిళితములగు
నావ పచ్చళ్లు చవిచూచి రాదరమునఁ
జుల్లుమని మూర్ధములు దాఁకి యొల్లఁదనము
పొగలు వెడలింప నాసికా పుటములందు.

దీనికి వేంకటరాయశాస్త్రిలవారు "ఆవ పచ్చళ్లు (కర్త) చుల్లుమని నసాళమంటి, ముక్కుఁ జెవురలందు, ఎల్లఁదనమును, బొగలను, వెడలించుచున్నవి అనియర్థము వచ్చునట్లు వ్యాఖ్యానించిరి.

కేతవరపు వెంకటశాస్త్రిగారును ఇట్లే వ్రాసిరి. పద్యపాఠము పైవిధముననున్నప్పు డింకొక విధముగా నర్థమేర్పడ నేరదు గదా! కాని యిక్కడ ప్రశస్తమయిన పాఠమొకటి గలదు

గీ. మిసిమి గల పుల్లఁజెరుగుతో మిళితములగు
నావ పచ్చళ్లు చవిచూచి రాదరమునఁ
జుల్లుమని మూర్ధములు దాఁకి యొల్లఁదనము
పొగలు వెడలింప నాసికాపుటములందు.

ఇందు, పద్యము పూర్వార్ధ మొక వాక్యము. ఉత్తరార్ధము వేఱొక వాక్యము. ఈపాఠమును బట్టి చూడఁగా మూర్ధములు దాఁకినది యావపచ్చళ్లుగాక, ఒల్లఁదనము= కారపుగాటు, అనుచున్నది. ఒల్లఁదనము నసాళమంటి ముక్కుఁ జెవురలందు పొగలు వెడలించినది, అని ఉత్తరార్ధము టీక.

సాధు పాఠములు గల తాళపత్ర ప్రతుల సాహాయ్యము చాలినంత లేకపోవుటచే నిట్టి సరసార్థములు కొన్ని పయివారి వ్యాఖ్యానములందుఁ బొందుపడక పోవలసెను. మఱియు, ఆముక్తమాల్యదా వ్యాఖ్యానమున—

ఉ. ఎన్నిమఁగూర్చి నన్నవిను
మేమును దాల్చిన మాల్యమిచ్చు న
ప్పిన్నది రంగమందయిన
పెండిలి చెప్పుము మున్ను గొంటి నే
వ న్నసదండ యొక్క మగ
వాఁ డిడ నేను దలంగురాయఁడన్
కన్నడరాయ! యక్కొనుమ
గప్పు ప్రియాపరిభుక్త భాక్కృశన్.

అనుపద్యమున మున్ను గొంటి నేవ న్నన దండ యొక్క మగవాఁడిడ నేను దలంగురాయఁడన్ అనుదానికి "పూర్వము నేను కృష్ణావతారమందు సుదాముఁడను మాలాకారు డీయఁగా పూలదండను మగవాని చేతినుండి కొనవలసివచ్చెనుగదా యని మనస్సులో నేవగించుదు కయి కొంటిని" అని శాస్త్రిలవారర్థము వ్రాసిరి. ఆముక్తమాల్యదకుఁ బ్రాచీనవ్యాఖ్య లనేకము లున్నవి అన్నింటను నిట్లే యర్థము గలదు. కాని యిక్కడ శ్రీకాకుళమ్మునఁ దలంగురాయనికథ (స్థలమాహాత్మ్యమునఁ గలదు.) యను సంగ్రహము. ఆ స్వామి యర్చకుఁడగు వైఖానసుఁడు రాజుగారు స్వామి కైంకర్యముకై పంపెడు పూదండలెల్లఁ దన లంజెకిచ్చుచుండువాఁడట! ఇది విని రాజొకనాఁడు పరీక్షింప స్వామిదర్శనమునకు వచ్చెను. అర్చకుఁడు లంజె కొప్పున నున్న పూదండను గొనివచ్చి స్వామికలంకరించి, తత్ప్రసాదముగా రాజు కొసఁగెను. రాజు గొనిపోయి పరిశీలింపఁగా నందు నిడుపైన తలవెండ్రుక లగపడెను. రాజు ర్చకు నడిగెను. అతఁడు స్వామికి వెండ్రుకలు గలవనెను. రాజు పరిశోధించెను. భక్తత్రాణపరాయణుఁడగు స్వామికి మర్నాడు రాజు చూడవచ్చునప్పటికి వెండ్రుకలు మొలచియుండెను. చల్లపల్లి సంస్థానమునఁ బ్రఖ్యాతములుగా రెండు పుణ్యక్షేత్రములు గలవు. పెదకళ్లేపల్లి, శ్రీకాకుళము, అనునవి. చల్లపల్లి జమీందారులు వాని ధర్మకర్తలు. బోడివాఁడు, బొమ్మువాఁడు, (నాగేశ్వర స్వామి, ఆంధ్రనాయకస్వామి.) తమ యిలువేల్పులని, యీ సంస్థానమున పూర్వులు పలుకుచుండెడివారట! స్థానికమయిన యీగాథ యెల్లరకు వెల్లడిగాఁ దెలియఁదగినది గాదు. నేనక్కడివాఁడ నగు

టచే నెలిఁగియుంటిని. ఇది చెప్పనందుకు ప్రాచీన వ్యాఖ్యాతలపైఁగాని, శాస్త్రిలవారిపైఁ గాని దోషముంగఁ బెట్టఁదగునా? ప్రాచీన వ్యాఖ్యాతల తప్పుల నెన్నింటినో శాస్త్రిలవారు తమ యాముక్తమాల్యద వ్యాఖ్యలో సంస్కరించిరి. అయినను జరాభారముచేతను, ఆ యా వ్యాఖ్యాతల మీఁది నమ్మకము చేతను నక్కడక్కడ సంస్కరింపవలసినవానిఁ గొన్నింటిని శాస్త్రిలవారు విడిచిరి.

“పసలేదు నిలరోరి పాతకులారని దేవాయుధంబులు ఊవువారు”(7 ఆశ్వా)అను చరణమునఁ బ్రాచీన వ్యాఖ్యాతలు, దేవాయుధము లనఁగా యజ్ఞోపకరణము లని వ్రాసిరి. శాస్త్రిలుగారు దానిని గ్రహించిరి ముద్రణ మయిన తర్వాత దేవాయుధము లనఁగా—తిల్లు, శాప నార్థములు, అని యర్థమగుట గుర్తింపఁబడెను. ఇట్టి వక్కడక్కడ కలవు.

విజయవిలాసమునకు ధర్మారావు నాయఁడుగారిదివఱకే సంపూర్ణవ్యాఖ్య రచియించి పెక్కుపట్టణములందుఁ దద్విశేషముల నుపన్యసించిరట. కాన, యాగ్రంథమునకు శాస్త్రిలవారు రచించిన టిప్పణిలో దొరలిన ప్రమాదముల నిక్కడఁ జేర్కొనకుండెదను. ఏలన ధర్మారావుగారిచే నుపన్యస్తముల నే నెఱుఁగను. నేను దెల్పునవి వారు గుర్తించినవి కావచ్చును. క్రొత్తవి కావచ్చును. వారు గుర్తించినచో, మేము వెల్లడించినవే పేర్కొనె ననుటకేని గుర్తింపనిచోఁ గ్రొత్తగా నందిచ్చిన ట్లగుటకేని, కారణముగల్గును. సారంగధర చరిత్ర వ్యాఖ్యను ధర్మారావుగా రింకను నుపన్యసింప లేదు గాన దానిఁగూర్చి పేర్కొనవచ్చును గదా!

శ్రీశాస్త్రిలవారు విజయవిలాస సారంగధరచరిత్రములకు టిప్పణులను తమయొద్దఁ బనిచేయుచున్న యొక గ్రంథకర్త, అప్పయపంతులు గారి ప్రాఁత టీక ననుసరించి వ్రాసికొని వచ్చి యిచ్చిన లఘుటీకను సరిపఱిచి రచించిరట! అట్లు సరిపఱుచుటలో నా లఘుటీక లోని ప్రమాదములు కొన్ని యపరిశీలితములుగా నట్టివిడువఁబడియుండు నని శాస్త్రిలవారు నాతోననిరి. అది యట్లే యైయుండును. ఏలనఁగా, ఉప్పునైవట్టి—అనుపదమునకు గొప్ప—అని జాలూరి అప్పయపంతులుగారి టీకలో నుండఁగా (అట్లున్నట్లు ధర్మారావుగారు వ్రాసిరి.) శాస్త్రిలుగారి టిప్పణిలోఁగూడ నదే కలదు. శాస్త్రిలుగారు స్వయము ఇట్లు వ్రాయుదురని నేను నమ్మఁజాల నయ్యెదను.

క. పలపుసటు, వావులానపీ
పలుకు లసత్యము ×..........
తలదడపి బాసఁజేసిన
జలజాక్షుల నమ్మరాదు సారంగధరా!

అని శాస్త్రిలవారి సారంగధరచరిత్ర ముద్రణలో పద్య మున్నది. తలదడపి=స్నానముచేసి అని టిప్పణితో నున్నది. ఇట్టి పద్యము సుమతి శతకమునఁ గూడఁగలదు. ఇందు తలదడవి' అను పాఠముండవలెను. ఇట్టి ప్రమాదములింకను గొన్ని సారంగధర చరిత్ర టిప్పణిలో గలవు.

శాస్త్రిలవా రింతకు ముందే యిట్టివానిని కొన్నింటి నాకళించి యుంచిరి. పునర్ముద్రణమున సరిపఱుపఁ దలఁచియుండిరి. వారు కడు వృద్ధులగుటచేతను, ఇప్పటి స్థితిలో వారింతలో పునర్ముద్రణాలు సాగింపఁజాలకుండు టచేతను, ఆయా సంస్కారముల నిప్పుడు ప్రత్యేకముగా నొకచోట ముద్రించి వెల్లడింపనున్నారు. అందున బొందక ప్రమాదము లింకను అన్యులకు గోచరింపవచ్చును. వాఙ్మయాభ్యున్నతియందు సద్విమర్శనము సల్పు తలఁపుతో నట్టివానిని వెల్లడించువారికి సహృదయులు కృతజ్ఞులై యుందురు.

ఆక్షేపింపను గూడఁ గూడని పట్టున శాస్త్రిలుగారి నధిక్షేపించి నందుకును నిజముగాఁ దమ కపూర్వవిషయముల నొసఁగిన యాకరములను జేర్కొనక పోయినందుకును ధర్మారావుగారి చోళక నేపాళశబ్ద విమర్శనమునకు నేను బదులు వ్రాయవలసెనుగాని కడచిన భారతిలో సారంగధరచరిత్ర పద్యమునుగూర్చి మర్యాదను దప్పక యుక్తముగా వారు చేసిన విమర్శము వంటివిమర్శమునకు నేను కడు జిజ్ఞాసువునై యుందును.

ఇక సారంగధరచరిత్ర వ్రాఁతప్రతినిగూర్చి వారు వ్రాసినదానిఁ గూర్చి యించుక:—

సారంగధరచరిత్ర పీఠికను గూర్చి మా మిత్రులగు శ్రీ సోమశేఖరశర్మ ప్రభృతులకు ధర్మారావుగారి విమర్శము రాకమునఁ గొన్ని నెలల ముందే నేను విన్నవించుకొని యుంటిని. శాస్త్రులవారును తత్పత్రికా విషయ సాంకర్యము నాకళించియున్నారు.

ధర్మారావుగారి దగ్గఱనున్న తాళపత్ర ప్రతి నింత వఱకింకను తెలిపియుండ నెవరకున్నచో నొక్కతూరి నాకుఁగూడఁజూపఁదగుదురు. నాకందలి విషయ లక్ష్యము లేదు, గాని సులువుగా దానిని విడఁబఱచి, చదువఁ దగునట్లు చేయఁగల్గుదు నేమో! అట్టివానిని గొన్నింటిని సరి పఱిచి చదువఁ గల్గితిని గాన తెలుపుచున్నాను.

—వేటూరి ప్రభాకరశాస్త్రి.

ఆరోగ్యము

వేమూరి సీతారామశాస్త్రి గారు

ధనమున్నన్, గృహమున్నఁ, బుత్త్రులు కళత్రంబున్న, సామ్రాజ్య శో
భనమున్నన్, మది కేదిలేక యుదయింపం బోదు మోదమ్ము; సా
ధన జాతమ్ము లవమ్ము లేకయును నిత్యస్ఫూర్జితానంద తో
యనిధిం దేల్పఁగఁజాలు నెయ్య దదె వో యారోగ్యభాగ్యం బనన్.

జడిమ న్మాన్చును; బూన్చు సంతసను; నుత్సాహమ్ముఁ గల్పించు; మై
వడఁకుం దీర్చును; గూర్చు ధైర్యము; మనోవైక్లబ్యముం బాపు; ముం
దడుగేయించు నశేషకార్యముల; నీ యామేల్లు నానేల? పె
ల్లడంగం జేయుఁ బరమ్మిహమ్ముఁ; గనుఁడీ యారోగ్య సౌభాగ్యముల్.

ప్రాతఃస్నానము, ధౌతవస్త్రధృతి, శుభ్ర స్పర్శనాహారముల్
స్వాతంత్ర్యమ్ముఁ, బురాణగోష్ఠియు, సుధీ సాంగత్యమున్ బ్రహ్మచ
ర్యా తాత్పర్యము, శౌచనిష్ఠ, నయవిద్యాసక్తి, సంతృప్తియున్
భ్రాతల్! హేతులు సు ండనామయత కీరల్ శ్రద్ధ నూహింపుఁడీ.

కామము క్రోధమున్ మొదలుగాఁగల యాంతర శత్రుకోటి కిం
తే మొనయంగఁ దావిడక యేయెడ కాయెడఁ దృప్తి శాంతియున్
బ్రేమయు నార్జవంబు, ఋతనిష్ఠయుఁ బూనుఁడు దానఁ జేసి చి
త్తామయము దొలంగి సతతామల సౌఖ్యముఁ గాంతురో జనుల్.

శ్రుతులు, స్మృతుల్ పురాణములు శోధనచేయఁగ ధర్మకర్మ ప
ద్ధతు లెవి యేవి కన్పడెడుఁ దత్సకలమ్ము ననామయత్వ సం
స్థితికిఁ బ్రధానసూత్రమయి దీప్తివహించు; యథావకాశ మా
హిత కృతు లాచరింపుఁడిదె యేల? భజింతురు పెక్కుభద్రముల్.

జాబుల వ్రాత

టి. శివశంకరం గారు

ప్రపంచ నాగరక సంసర్గముచే మన దేశమందలి విజ్ఞానాబ్ధి సర్వతోముఖముల విస్తరిల్లుచుండుట విచారపరులకు తోచకపోదు. దేశాటనము, పండితభాషణము, రాజసభాప్రవేశము విజ్ఞానవ్యాప్తికి సాధనముల వంటివి మన పూర్వీకులు గ్రహించిన విషయము. రైళ్లు మోటారుబండ్లు, యిదివరకే కొలదికాలముచే తోడుపడుచుండెడివి. వీనితో పాటు ఆకాశవిమానముల పర్యటనము వ్యాపించుచుండుట మరియొక యాశ్చర్యము. రూటర్ తంతిసంస్థచే వేలకొలది మైళ్ల దూరములో జరుగు పండితసంభాషణమును గూర్చి మరుసటి దినమో, అథవా, మూడవదినమో మనమున్న చోట వార్తాపత్రికలయందు చదువబూనుట పాతసంగతి. (Wireless Sets) "వయర్ లెస్ సెట్స్" అను పేరితో తంత్రీరహితయంత్రములు కొన్ని బయలు దేరుచున్నవి. వీని మూలమున అమెరికా, ఆస్ట్రేలియా వంటి దూర దేశములయందు జరుగు సంగతిని, ఉపన్యాసములను, అక్షణమే విని యానందించుచున్నాము. ఈ యంత్రములు కలకత్తా బొంబాయి వంటి గొప్పనగరములయందు వాడుకలో నున్నవి. కొలది కాలములోనే పల్లెటూళ్లకు సహితము వ్యాపించును. "టెలివిజన్" (Tele-Vision) అను మరియొక యంత్రము కనిపెట్టబడి యున్నది. దీనిచే సంజయుడు భారతయుద్ధమును దూరమునుండి చూడగలిగినట్లు దేశాంతరములలో జరుగు సంగతులు సమక్షమప్పుడప్పుడే గోచరము లగుట, రాజసభలయందలి చర్చలు, వాచస్పతినామములు, దినపత్రికల మూలమున తెలిసికొనుచున్నాము. ఇట్టి పరిస్థితులకు తగినట్లు వస్తుప్రపంచమును, భావప్రపంచమును, మన కనులయెదుట క్షణక్షణమును విస్తరించుచున్నది. ఇట్లు విస్తరించు కొలది ఆలోచనాపరంపర, భావవ్యక్తియు, క్రొత్తదోవల పెరుగును. ఇట్టి యత్నమందు క్రొత్తక్రొత్త భావములు జనించుకొలది దేశభాషల పదసంచయమందే కాక వాక్యరచనయందును వికల్పము లేర్పడును. ఇట్లున్నను వచనశైలియందు అతిశయోక్తివంటి యలంకారములకు గాని, కఠినమగు సంస్కృత దీర్ఘసమాసములకుగాని అవకాశము కాదు. లలితమగు చిన్నపదములతో కూర్చబడిన వాక్యముల మూలమున గొప్పసంగతులు సుబోధకమగునట్లు భాషాశైలి తనంతట తాను కుదురుచు వచనరచనకు క్రొత్తయాదర్శముల చూపుచున్నది. ఇట్టి నూతనశైలి దేశభాషలయందు నెలకొనుట శ్లాఘ్యము.

విదేశ నాగరక సంసర్గముచే పైవివరించినతీరున దేశభాషా వాఙ్మయము వివిధమైన మార్గముల మార్పు చెందుచున్నది. ఒక్క యంశమునందు మాత్రము ఇంకను మార్పు కలుగలేదు. ఆంగ్లేయ వాఙ్మయమునందు జాబులు వ్రాయు శైలికి గరిమయే లేదు. విజ్ఞానవ్యాప్తికి జాబుల వ్రాత మరియొక సాధనము రహస్యము మన వారింకను కనుగొనలేదు. వార్తాపత్రికల వ్రాతలవలె గాక, గ్రంథస్థము లగు వ్రాతల వలె గాక, ఒకరికొకరు వ్రాయు జాబులయందు జీవకళయు మనస్సునకు విందుగొల్పు లాలిత్యమును మంచి విజ్ఞాన వినోదముల నాపాదింపవచ్చును. ఆంగ్లేయులు యీ చతురతకు పుట్టినిల్లని చెప్పుదురు. మన దేశమందు ఒక వారము ఇంగ్లాండునుండి పోస్టు చేయబడు యిట్టి లలితములైన జాబులసంఖ్య తక్కువ యుండదు. వీనిని సివిల్ సర్వీస్ ఉద్యోగస్థులు, ఆర్మి ఆఫీసరులు, మిషనరీలు, వర్తకులు, ప్రయాణికులును వ్రాయుచుందురు. ఇట్టి జాబులు వారమున కనీసము లక్షవరకు ఒక్క సంవత్సరములో విజ్ఞానవ్యాప్తి కెంతటి సాధనమగునో మనవారు లాహింప వచ్చును. ఇట్టి జాబులు వ్రాయు పద్ధతి మనదేశమందు నెలకొనునట్లు విజ్ఞానాభివృద్ధికి ప్రతివారును సహకారముగ నుండును. బడి విడచిన పిమ్మట పెద్దలైన స్త్రీ పురుషుల విజ్ఞానమును (Adult and Female Education) వ్యాపింప చేయుటకు ఇంత

కన్న సామాన్యసాధనము వేరొకటి యుండదు. మనలో హితోపదేశమును వ్రాసిన విష్ణుశర్మ కథల జెప్పి వివేకమును బోధించెనో, యాపని యాంగ్లేయులు జాబులు వ్రాసి చేయుదురు. గొప్పవారు వ్రాసిన జాబులు సేకరించుటయు, వాని మూలమున వారి జీవితములు వ్రాసికొనుటయు వారియందాచారమై యున్నది. మార్లీ (Morley) ప్రభువు 'Reflections' అను పేరితో హిందూదేశమును గూర్చి వైస్రాయిగా నున్న మింటో ప్రభువునకు అప్పుడప్పుడు వ్రాసినట్టి జాబులు పుస్తకరూపమున ప్రచురింపబడి యున్నవి. రాజనీతిని బోధించుటకు యిట్టి వ్రాతల వెల యపారము. రైట్ ఆనరబిల్ శ్రీనివాసశాస్త్రిగారు గోఖ్లేయొక్క జీవితచరిత్రమును యిట్లే వ్రాయ బూని యున్నారు. అయితే అది ఆంగ్లభాషయందే వ్రాయబడ నున్నది. ఆంధ్రభాష యందు జాబుల వ్రాతకు ప్రత్యేకమైన శైలి భాషాభిమానులు ఇంకను నెల కొల్పవలసి యున్నది.

ఇప్పటి పరిస్థితుల యందు విద్యార్జన మునకై బాలురును, విత్తనమునకయి పెద్దవారును పెరచోటుల యందు ఎక్కువగ వాసము చేయుచున్నారు. ఆకారణముచే మిత్ర బంధువర్గములకు వ్రాయవలసిన యవకాశము లెక్కువగ నున్నవి. విద్యార్థి తన తండ్రులకు వ్రాయు జాబులలో నాటికి తోంబ వంతున పైకము పంపమని తగాదాలతో యుండు గాని, తన జీవితమెట్లు? సహపాఠులమైత్రి ఎట్టిది? ఉపాధ్యాయుల సౌజన్యమేమి? తాము నేర్చుచుండు విద్య వలన తెరవేది వీనిని గూర్చి యేమియును వ్రాయరు. తండ్రులకు కొడుకు గలిగె నపుడు అభినందించి వ్రాయు జాబు కళాశాల విద్యార్థికి కూడ తెలిసియుండుట యవసరము. దుఃఖములు సంభవించినపుడు, ఓదార్చి ధైర్యమిచ్చునట్టి వ్రాత బడిలో మాకు నేర్ప లేదందురు. తమ తల్లిదండ్రులు పలుమార్లు శిక్షించిన త్యాగముతో బిడ్డల చదివించుటకు పడరాని కడగండ్లు పడుచున్నారని వి...రులు వారమున కొక్కసారి దైవము తమపై నెమ్మది నిచ్చుమాట వ్రాయుదురా అని సందేహము. ఒక్కొక్క విద్యార్థియు, వారమున కొకసారి యింటికి తల్లికో చెల్లెలికో జాబువ్రాయుచున్నాడను కొందము. ఒక్కొక్క జాబునందును తాను నేర్చుచుండు కొత్తవిషయములను చిన్నమాటలతో వివరించి వ్రాయునను కొందము. సముదాయమున యిట్టివ్రాత ఒక్క సంవత్సరమునకు విజ్ఞానము నెంతమాత్రము వ్యాపింప జేయునో యూహింప వచ్చును. ఈప్రయోజనము యొక్క పరిమాణమింత యని గ్రహింపలేని, యీయుద్యమము వెల యూహింపనగు. మచ్చునకై యొక మనోదాహరణ యీక్రింద వ్రాయబడి యున్నది. ఇది యొక కళాశాల విద్యార్థి తన చెల్లెలికి వ్రాసిన ట్లూహింప బడినది.

చే యూ రు

ఫాల్గుణ శుద్ధనవమి

జా న కి,

ఈజాబును నిన్న సాయంత్రమే వ్రాయ మొదలుపెట్టి ముగియకమునుపే నా సహపాఠులతో పాఠములు చదువ వెళ్ళవలసి వచ్చినది. మేమందరము నేను క్రికెట్ ఆటకు పోయి యుంటిమి. మా యాట యుత్సాహమున యింటికి మరలు వరకు శ్రమయే తోచలేదు. నేనొక్కడే 150 రన్లు చేసితిని. మా యాటను చూచుటకు అనేకులు వచ్చి యుండిరి. అమ్మయును నీవును వచ్చిచూడ లేదే యని పలుమార్లు మనస్సునకు తోచినది.

రేపుసాయంత్రము మా ఉపాధ్యాయులు కొందరును నాక్లాసులో చదువు నామిత్రులును కలసి ప్రక్కనున్న ఇంద్రగిరియను కొండనెక్కి విహరింప దలచుకొన్నాము. ఆకొండయొక్క యెత్తు అక్కడి శీతోష్ణస్థితి కొలుచుటకు మా కళాశాలలో యంత్రమున్నది. వానిని తీసికొని పోవుచున్నాము. నేను ఊరికి వచ్చినప్పుడు సమస్తము నీకాచిత్రము వివరించి చెప్పెదను. నేను ఊరినుండి వచ్చినప్పుడు అమ్మయు నీవునుచేసి యిచ్చిన చక్కిలములలో సుమారు 20 వరకు మిగిలి యుండెను. దానిని నాస్నేహితులు యిపుడే తినివేయ చూచిరి కాని నేను దానికి సమ్మతించ లేను. రేపటి ప్రయాణమునకై యుంచిపెట్టి యున్నాము.

చిన్నిబాలి (పనికత్తె కొడుకు) బడికిపోవుచున్నాడా? నీవే స్వయముగ వానికి పద్యములు చెప్పించుచుంటివే. ఎన్ని పద్యములను నేర్పినావు? వానికై కట్టె గుఱ్ఱము నొకటి కొని పెట్టి యున్నాను. వచ్చినపుడు తెచ్చెదను. అమ్మను నిన్ను చూచి ఏండ్లు గడచినట్టున్నది. ఉగాది పండుగ వరకు సెలవు దొఱకదు. ఇందులో నాయనగారికి వేరేజాబు వ్రాసి యున్నాను. అలసట తీరి నెమ్మదిగా కూర్చున్నప్పుడు వారిచేతికిమ్ము. అమ్మకు నానమస్కారములు చెప్పుము.

ఇట్లు నీ అన్న,

రమణ.

హెచ్చరిక

తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు

ఎంతటివాఁడవోయి నిను నేమనవచ్చు నఖండకీర్తి యా
శాంతముల న్నిటింపఁగ మహామహిమం దనరారినట్టి స
త్సంతతిలో జనించి యవిచారమతీ నగుఁబాటు చెద్దుముల్
ఘాంతలకేగుచుంటి విది పోలినకార్య మఁటయ్య, సోదరా!

చెల్లరె! సర్వదేశముల జీవధనంబు ధారవోసి య
ల్లెల్లరు స్వేచ్ఛకై పెనఁగు నీసమయంబున దాస్యవృత్తిచే
నుల్లము పల్లవింపఁ గడునుబ్బుచు విధి నెంచకుంటి నీ
తల్లి యవస్థఁ బాపవలదా? తలదాఁదవేల, సోదరా!

ఖద్దరుగట్టి బీదలకు గంజినిబోయుఁ, భారతార్థికా
పద్దశ దీఱఁబాయు"నని పల్కెడు గాంధిమహాత్ము బోధకుం
డిద్దెదు పంగనామమును "చేలికయన్న అసీటులేని యీ
మొద్దులఁ దాల్చు"టెట్లనుచు మూఁడవైతి గదయ్య, సోదరా!

"మాలలనంటరాదు కసుమాలపుజా" యటంచు వారి నీ
లీల బహిష్కరించి మతిలేక "దురాత్ములు దక్షిణాఫ్రికా
నేలెడువారు హైందవుల నెంతయుఁ జులకఁగా గణింతు"రం
చేల విచారమందెద విసీ! నిను నేమనవాఁడ సోదరా!

స్వార్థ పరాయణుండవయి స్థానికసంఘములందుఁ జేరి సూ
త్రార్థము మార్చి దానికి నపార్థము సూపుచు రచ్చకెక్కి- స
ర్వార్థము ధారవోసి పురుషార్థము లెవ్వియులేక లేకివై
వ్యర్థుఁడవై చరింతు విదియా? మగపాడి యఁటన్న సోదరా!

మానము దువ్వుచుర్వి బగలు మాసరమంతయుఁ దూల "నాత్మ సం
త్రానము వీడి మా జనని దాస్యముఁ బాపఁగ రం"డఁటంచు ప
న్యాస పరంపరం గురియు దాతియుకాని యొకింతచేయ వీ
వేసముఁజూచి లోకమున విజ్ఞులు మెత్తురఁటయ్య సోదరా!

"మనము మహామ్మదీయులును మచ్చరముల్ విడనాడి కూడి నె
మ్మనముల భేదభావముల వాని చరించుట మే"లఁటంచు నీ
వనయము హెచ్చరించి యిసుమంత వివేకములేక యింట నీ
యనుజులతోడఁ బోరెద హా! యిది నింద్యముగాదె? సోదరా!

నీతిని జాతినిన్మఱచి నీవణుమాత్రము సిగ్గులేక, ప్ర
ఖ్యాతి నడంచి బుద్ధిబలకాంధబలంబుల రూపుమాపి నీ
చేతికిఁ జిప్పనిచ్చు మధుసేవ లోఁబడి రచ్చలందు "మా
తాతలు సోమపీథు" లని ర్పములాడెదవేల సోదరా! (సశేషము)

తా ళీ వ ని

పెనుమర్తి వేంకటరత్నము గారు

ఓ సమున్నత తాళభూమీరుహావ-లే యుగాల నాటివో? యిపు డనూన
నిశ్చలాస్పంద ముకుళిత నేత్రమును-తలచుచున్నవి! యుగయుగమ్ముల చరిత్ర!
జనన దేశమునుండీ నిశ్చలతపొందు-పూర్వలౌల్యమ్ము విస్మృతి పొందినట్టి
జీవులో యేమొ? గాలి వీచినని-పలుకనే పల్కు వీ రహః ప్రణయమేమొ?
ఈ యుగయుగాంత జీవు లెన్నెమార్లు-ఆశలను బెంచుకొనిరో! దిగంతములకు
ప్రాకలేని యాసల తలపై ధరించిల నిలంబడు శీతోష్ణములు సహించి!





౪. ఒక సుందరమైన రజతకరండముమీద రజతమయ బోధివృక్షము. కరండమునకు నలువైపుల నాలుగుబుద్ధ విగ్రహములు చెక్కబడినవి. ఒక్కొక విగ్రహముకడ నొక్కొక శిష్యునిచిత్రముకలదు. శాసన లేఖనము కొంతపాళీ, కొంత పయ్యాభాషలయందుకలదు. ఈకరండ ముండిన స్తూపము క్రీ.శ. 6,7 వఁ చెందినది.


౫. ధేనుకాసురవధ, పహారిపుర దేవాలయ పీఠభాగముననున్న శిలాచిత్రము. ఈచిత్రముల యలంకార వైఖరి సుందరముగా నున్నది. పయ్యాభాషయందున్న శాసన మొకటి యిందు చెక్కబడియున్నది.



౬. నాలందాయొద్ద త్రవ్వితీసిన పెక్కు సుందరలోహవిగ్రహములలో నొకటి. ఈవిగ్రహము అష్టాదశభుజయగు తారాదేవిది. ఇందలిపనితనము, విగ్రహవిన్యాసము అందముగానుండి ప్రాచీనకాలపు చిత్రకారులసామర్థ్యము చాటుచున్నది.



౭. బుద్ధవిగ్రహము. నీగ్రోవానియాకారమున నున్నది. ఇదిపురాతనప్రోమునగరమున రజతకరండము(చూ.చి౪.)లో దొరకినది. ఆకారము ఇదివరకు దొరకిన విగ్రహములకంటె భిన్నమైనదిగ నున్నది.



౮. రాధాకృష్ణవిగ్రహములు-పహారపుర దేవాలయపీఠభాగమున చెక్కబడిన ఈ శ్శైత్తు చిత్రములలో నొకటి



1. తండ్రి వైదికుడు. కొడుకు వైదికుడు. వేదము, సంస్కృతము చదువుచున్నాడు. 2. తండ్రి వైదికుడు. కొడుకు చదువుటకై చెన్నపురికిపోవ నున్నాడు. 3. సొమ్ముకై తండ్రికి ఉత్తరము వ్రాయుచున్నాడు కొడుకు. 4. తండ్రి: నా ఇనాములను అమ్మవలసినదేనా? తల్లి: తప్పకుండా; కుఱ్ఱవాడు బి. ఏ. ప్యాసు కావలెను. 5. అర్థమంతయు వ్యర్థమైనది. 6. చివరకు బి. ఏ. అయినాడు. 7. వెళ్లిపో: ఉద్యోగం లేదు, సద్యోగం లేదు. 8. వైదికుడగు కొడుకిపుడు పెద్ద అయినాడు. అతని ఇల్లు; అతని పొలము; అతని పుస్తకములు; అతని పసువులు; అతని పిల్లడు; ఆహా! ఆనందమయ జీవనము! 9. పొలము లేదు; ఇల్లు లేదు; పని లేదు; తలితండ్రులు ముదుసళ్లు; తిండికే లేదు. కట్టా! కడగండ్ల జీవనము.

భారతదేశము వ్యవసాయప్రధాన మైనది. గ్రామములవంక మరలుడు!!

చిత్రకారుడు: కంచి శివరామమూర్తిగారు.



అమానుల్లాఖాన్ రాజు—విద్యాభివృద్ధి

ప్రస్తుత ఆఫ్గనిస్థానపురాజు విద్యావిషయమున చేసిన సేవనుగూర్చి 'ది ఎడ్యుకేషన్ ఔట్లుక్' పత్రికయందు వి. బి. మెట్టాగారు వ్రాయుచున్నారు:

1919 సం॥లో అమానుల్లాఖాను సింహాసన మధిష్ఠించినపుడు ఆఫ్గనిస్థానమున విద్య చాలా వెనుకబడిన స్థితియందుండెను. మసీదు బడులలో ముల్లాలు (మహమ్మదీయ పురోహితులు) బాలురకు వ్రాత, చదువు, లెక్కలు, ఖొరానును బోధించుచుండిరి. ఆధునికవిద్య కొరకు 1910 సం॥లో శ్రీ. శే. అమీరుహాబీబుల్లాఖాను స్థాపించిన యొక కళాశాలయుండెను. ఈకళాశాలలో భారతదేశ విశ్వవిద్యాలయములలో, విద్యాభ్యాసమొనరించిన భారతీయోపాధ్యాయులు గణితశాస్త్రము, ప్రకృతిశాస్త్రము, ఇస్లాము మతచరిత్ర బోధించువారు. ఈరాజుగారి తల్లి 1912 సం॥లో కాబూలునం దొక విద్యాలయమును పెట్టించెను; అందు బాలికలకు ప్రాథమికవిద్య యొసంగబడుచుండెను. అప్పు డాదేశములో నేవియు కళా, శిల్ప, పరిశ్రమల విద్యాలయములు లేకుండెను.

ఇప్పటి రాజుగారు దేశమందరును తమతమ బిడ్డలను పాఠశాలలకు పంపింపవలసినదని కోరుచు ప్రకటన పత్రికలను ప్రతిపట్టణములోను, గ్రామములోను అంటింపించిరి. ప్రభుత్వోద్యోగులందరును తమ బిడ్డలను పాఠశాలలకు పంపితీరవలెనని ఆజ్ఞాపింపబడిరి; వారట్లు కావింపనిచో వారికి జరిమానా విధింపబడుటయో లేక ఉద్యోగమునుండి తొలగింపబడుటయో జరుగునని ప్రకటింపబడినది. అన్ని పట్టణములలో ప్రాథమికవిద్యాలయములు స్థాపింపబడినవి. కాబూలునందు మరిరెండు మాధ్యమిక పాఠశాలలు స్థాపింపబడినవి; అందు ఒకదానిలో ఉపాధ్యాయులు ఫ్రెంచివారు. మరొకదానిలో జర్మనీవారు. ప్రాథమికవిద్యయు, మాధ్యమికవిద్యయుగూడ ఉచితముగనే బోధింపబడుచున్నవి.

ఈరాజుగారు స్త్రీవిద్యగూర్చి చాలపాటుపడిరి. కాబూలులోనున్న బాలికాపాఠశాలయందు తానురాజ్యాధిపత్యమునకు రాకపూర్వము 300 మందియే విద్యార్థు లుండినచోట నేడు 2,500 మంది యున్నారు. ఇతర పట్టణములలోకూడ బాలికాపాఠశాలలు స్థాపింపబడినవి. రాజకుటుంబములోని కొందరు నారీమణులును, గొప్పకుటుంబములవారి కుమార్తెలు కొందరును ప్రభుత్వవ్యయముపై విద్యకొఱకు ఐరోపాకు పంపబడిరి.

ప్రకృతిసిద్ధమగు స్వరూపములను ప్రతిబింబించుటను ఖురాను గ్రంథము నిషేధించుట వాస్తవమైనను, ఈరాజు కాబూలులోను, యితరపట్టణములలోను శిల్పకళాశాలలను స్థాపించెను. అందు సాధారణ, వర్ణ, చిత్రరచనము, శిల్పవిద్య నేర్పబడుచున్నవి. కాబూలునం దొక పురాణవస్తుప్రదర్శన, శిల్పవిద్యాప్రదర్శన, శాల నెలకొల్పబడెను.

ఇప్పటికింకను ఆఫ్గనిస్థానములో సాంకేతికవిద్యాశాలలు (కార్మికవిద్యలను నేర్పునవి) లేవు, కాని ప్రభుత్వమువారి కర్మాగారములోనికి వెళ్లి వివిధవస్తువు లెట్లు

తయారు చేయబడుచున్నవో చూచుటకు ప్రజల కవకాశము గలదు. గనుల పరిశ్రమ, ధాతుశోధనము, (లోహ) విద్యుత్ యంత్రగతిశాస్త్రము నభ్యసించుటకు చాలా మంది విద్యార్థులను ప్రభుత్వమువారు యూరపు, అమెరికాలకు పంపిరి. కాబూలునందు ఒకజాతీయ విశ్వవిద్యాలయమును సంస్థాపించుట కిపుడు ఆఫ్గను ప్రభుత్వము వారాలోచించుచున్నారు.

నూతనచారిత్రకపరిశోధనలు

ఈమధ్య బీహారు జిల్లాలోని నలందాలోను, రాజషాహిజిల్లాలోని పహార్‌పూరులోను బయల్పడిన మధ్యకాలములోని రెండు సుప్రసిద్ధములగు కట్టడములచే నాటి బౌద్ధమతపరిస్థితులు కొన్ని తెలియుచున్నవి.

జీ. ఏ. పేజిగారు గొప్ప స్తూపము నొకదానిని భూమిలోనుండి త్రవ్వి కనిపెట్టిరి. ఈపని నిర్వహించుటయందు వీరు మిక్కిలి నిపుణతను జూపిరి. దీనికి తూర్పు భాగమున నొక విశాలమగు తరుపంక్తియు, శారుతీరిన మఠములును పశ్చిమమునకూడ నిదేవూదిరి శిథిలమఠములును కలవు. ఇవన్నియు మొత్తమున నెనిమిది. ఇయ్యవి 7_12 శతాబ్దములమధ్య నెన్నియోసారులు తిరిగి కట్టబడినవి. అంతియేకాక ఒకదానిపై నొకటిగ దాదాపు తొమ్మిది కట్టడముల కట్టినట్లుకూడ నిదర్శనము కలదు. హ్యూయన్‌త్సాంగ్ తాను నలందాలో చూచిన మఠములు నాలుగంతస్తులు ఎత్తున నున్నవని వ్రాసియున్నాడు. ఇయ్యవి పరశురామప్రీతియై యుండును. ఇందట్టి చిహ్నములు కాన్పించుచున్నవి.

ఇందులో విలువగల వస్తువులేకాక, రాగి, కంచుతో చేయబడిన 8, 9 శతాబ్దములనాటి విగ్రహములు కలవు. అవియు నాటి శిల్పకళలను స్పష్టపరచుచున్నవి. వీటిలో హిందూదేవతల విగ్రహములు పెక్కు కలవు. వీటిచే బ్రాహ్మణమత మెంతవరకు బౌద్ధమతము నాక్రమించినదో విదితమగుచున్నది. చిత్రములు కొన్ని యీ సంచికయందు గలవు.

[౧౯౨౮ సం ఏప్రిలు ౮-వ తేది టైమ్సు ఆఫ్ ఇండియానుండి.]

అమెరికా, ఇంగ్లాండు దేశములకు యుద్ధమా?

చార్లెస్. సి. ప్లంకెట్ అను నొక అమెరికను ఉపసేనాపతి న్యూయార్కు పట్టణమున నొక విందు సందర్భమున నిట్లు నుడివినాడట.

"నాచరిత్రజ్ఞానము సరియైనదైనచో, యుద్ధమునకు మనము నేడున్నంత సమీపముగ మున్నెన్నడు నుండలేదని నేను చెప్పగలను. ఏలయన, మనము నేడు వర్తకవ్యవహారమున పోటీపద్ధతి నవలంబించి ఇతరజాతులను మూలకు ద్రోసివైచుచున్నాము. ఇట్టి విధానము యుద్ధము గల్పించుట తప్పదు.

"మీరు మీ వర్తకపు సామానులతో సముద్రముపై సంపూర్ణాధికారము వహించుటకు పోటీ చేయుచున్నంతకాలము, యుద్ధముపంకకు బోవుచున్నారన్న మాటయే. మీ రీగదిలో గూరుచుండుట యెంతసత్యమో యిదియు నంత సత్యమే. మనము నేడవలంబించుచున్న మార్గము నే యనుసరించుచుందుమేని యుద్ధము తప్పదు.

"గ్రేటుబ్రిటనుతోనే కానిండు, లేక మరి యే యితరజాతితోనైన గానిండు, మనకు యుద్ధము సంఘటించుచున్నది"

ఇంతటితో సభ నిలిచిపోయెనట. తరువాత "మీ యభిప్రాయము గ్రేటుబ్రిటనుతో యుద్ధము సంభవించుననియా?" యని యడుగ నాయన వెంటనే స్పష్టముగ నిట్లు చెప్పెనట. "అవును. గ్రేటుబ్రిటను అనియే నా యభిప్రాయము. కాకున్న నష్టపడిన మరి యేయితర జాతియైన గావచ్చును. ఆరంభముననే గ్రేటుబ్రిటను యుద్ధమునకు దిగకున్నను ముందుకు నేదియో యొక చిన్న దేశమును ద్రోసి, మెల్లగ దాను దానివెనుక జేరును."

ప్లంకెటుగారు ప్రకటించిన యీయభిప్రాయము లండను న్యూయార్కులలోని రాజకీయ రంగములలో చాల సంక్షోభమును గలిగించినదట. నానాజాతిసమితి సార్థకమగుటకు మార్గ మిదియే కాబోలు!

భారతదేశమున స్త్రీవిద్యయొక్క యాదర్శము.

ఆర్. కృష్ణాబాయి, బి.ఏ., యల్.టి. గారు, 'బ్రాహ్మణేతరయువక (Non-brahmin Youth) పత్రికలో భారతదేశమున స్త్రీవిద్యయొక్క యాదర్శములనుగురించి వ్రాయుచు నిట్లు నుడువుచున్నారు.

"నష్టమైన విజ్ఞానమును, కళను, మతమును మరల నుద్ధరించి, భారతీయ వనితల వ్యక్తిత్వమును గాపాడుటయే నిజముగ నిప్పుడు కావలసినది. కావున విజ్ఞానమూలముగ మనకునకు శిక్షణ నొసంగి, యాత్మజ్ఞానముచే దాను పరిపూర్ణత్వమునందు నట్లు చేయుటయే ఇప్పు డనుసరణీయమగు బోధనపద్ధతి. వందలకొలది యేండ్లు మనవారి నిరాదరమునకు పాత్రమై భారతీయ వనితాత్వమదృశ్యమై యున్నను విదేశీయుల దండయాత్రలు తుపానులవలె నొకదానివెనుక నొకటిగ నావ్యాపర్తమును ముంచివైచి యెన్నియో మార్పులకు లోబరచినను భారతీయ వనితాత్వముయొక్క పునాదిరాయి యట్లే నిశ్చలముగ జెక్కుచెదరక నిలిచియున్నది. మన యాడువాండ్రు గూడ మగవారి కార్యవిధానముచే యనుసరించి వారితో బోటీచేయకుండుటయే దీనికి గారణము. ఆధునిక నేటి యీ స్వాతంత్ర్యసమానత్వములను నభిప్రాయములచే బరవశరైయి, స్వదేశపు భావిసౌభాగ్యము, భావ్యభివృద్ధియు, దనచేతనున్న దన్న యంశమును మరచిపోవునేని అది చాల శోచనీయమగు విషయము. సంసారమునకు బయట నిర్వర్తింపదగు కార్యము లాడుదానికి లేవని నాయభిప్రాయము కాదు. ప్రపంచ మంతయు నామె కార్యరంగమే. ఆమె ప్రత్యేకోత్సాహమునకు లక్ష్యమగు కార్యరంగ మేదియైనను, స్త్రీ తనవ్యక్తిత్వమును గోల్పోయి, జీవితమును నిష్ప్రయోజనమొనర్పకుండు గాక. మనము మరియొక జాతి ననుకరింపకుందుముగాక. మననాగరకత పురాతనమైనది. మనపూర్వచరిత్ర కీర్తిమయము. మన పూర్వ చరిత్రమునకు మనము గర్వింపవలసినదే. అట్టి గర్వమునకే యాలవాలమగు భవిష్యత్తునే మనము గోరుదుము. మన భవిష్యద్యశస్సు నేటి మన గృహములపై నాధారపడి యుండును.

తమ గృహకార్యముల జక్కబెట్టుటకై కొందఱి బానిసల సృష్టించి, తమ బిడ్డలకు స్తన్యమిచ్చుటయన్న నేమో యెరుగని వనితారత్నములు పైవాక్యముల శ్రద్ధతో గమనింతురుగాక.

సంపూర్ణ మద్యపాన బహిష్కార మసాధ్యమా?

సారాయమును కొద్దికొద్దిగ బుచ్చుకొన్నను నష్టమే కలుగునని వ్రాయుచు డాక్టరు కోర్ట్నీ. సి.వీక్స్. యమ్. ఆర్. సి. యస్., యల్.ఆర్.సి.పి., గారిట్లు వ్రాయుచున్నారు.

"మద్యపానము ఆరోగ్యవంతమగు జీవితమునకన్నటికిని దోడ్పడజాలదని, ఉన్న వ్యాధుల విషయమునగూడ నది యిదివరకు ననుకొన్నంత యావశ్యకము కాదనియు వైద్యులు సంపూర్ణముగ గుర్తించినారు. ఏబది వత్సరములకు పూర్వము లండను నగరమున మితపాన వైద్యశాల (Temperance Hospital) స్థాపింపబడినప్పుడు ఒక వైద్యపత్రిక "భగవంతుడే రోగులను రక్షించుగాక" యని నుడువగలిగెను. అప్పుడు సారాయము సాయము లేక రోగముల మాన్పుట యసంగత మని పించెను. ఐనను నాడు మొదలుకొని యావైద్యాలయమున 50,000 రోగులు చికిత్సనందియున్నారు. వీరిలో 190 మందికి మాత్రమే వైద్యభాగముగ సారాయము పయోగింపబడినది. 1875వ సం॥మున రాయల్ విక్టోరియా ఇన్‌ఫర్మరీ (న్యూ కాజిల్ ఆన్ టైన్) అను ఆసుపత్రి సగటున ప్రతిరోగికిని 2 షా. 9 ల మద్యపదార్థములను వాడియుండెను. 1925 సం॥న సారాయము అప్పటి

కన్న నాలుగున్నర రెట్లు వెల యెక్కువైనను, పగటున రోగి ఒక్కంటికి 5¼ పెన్నీల విలువగలిగిన దిమాత్రమే యుపయోగింపబడినది. నలుబది యేండ్లకు బూర్వము వెస్టరన్ ఇన్‌ఫర్మరీ (గ్లాస్గో) అను ఆసుపత్రిలో పగటున ప్రతిరోగికిని 104 డ్రాముల సారాయ మొసంగబడెను. పోయినయేట ప్రతిరోగికిని పగటున వాడినది మూడు డ్రాములే.

"ఈ క్రిందియంకెలు ఇప్పుడే స్టాకుహోం విశ్వవిద్యాలయములోని వైద్యశాస్త్ర పండితునివద్దనుండి నాకందినవి. 1900–వ సంవత్సరమున స్టాకుహోం ఆసుపత్రిలో 3,934 రోగులకు 40,000 ఔన్సుల సారాయ ముపయోగింపబడెను. 1926 సం॥లో 5334 రోగులకు 3500 ఔన్సులు వాడబడినవి. అనగా: ఒక్కొక్క రోగికి 96 డ్రాములనుండి, యించుమించుగ నాలుగు డ్రాములకు తగ్గినదన్నమాట.

"వైద్యప్రపంచములో విశేషముగ నీమార్పునకు కారణమేమి? సారాయము శరీరనిర్మాణమునకు గాని శరీరపోషణమునకుగాని యుపయోగింపదు. పరిమితముగ కొన్ని తీవ్రవ్యాధులసందర్భమున, నాహారముగ నది యుపయోగపడవచ్చును. కాని మత్తువస్తువుగనుండి ముఖ్యములగు నితరవ్యాపారములకు అది కలుగజేయునష్టము, దానివలన గలుగు లాభములకన్న నెంతయో యధికము. ఈసంగతిని వైద్యులు అనుభవపూర్వకముగను, ఆచరణమూలకముగను గని పెట్టుటయే పైమార్పునకు కారణము. రాజకీయవైద్యశాలకు (Royal college of Physicians) అధ్యక్షులయిన సర్ హంఫ్రేసరోల్‌స్టన్‌గారు నుడివినట్లు దాని ప్రభావము లాభములకన్న అపాయములనే యెక్కువగ గలుగజేయుచున్నది."

"హృదయమునకు, మెదడునకు, నితర ముఖ్యవ్యవహారములకును, సారాయము, అభివృద్ధికరమను ప్రాతతలంపు సాధారణప్రజలలో నింకను ఊగులాడుచున్నను వివేకశాలురగు వైద్యులు దానిని విడిచిపెట్టినారు. సారాయము ముఖ్యముగ మత్తుపదార్థము. అలవాటునుబట్టియు, మామూలు వాడుకను బట్టియు, సాధారణభాషలో 'ప్రోత్సాహకరము' అనుమాట యిప్పటికిని గన్పించుచున్నను, అది మత్తుపదార్థ మనియే అన్ని గ్రంథములలోను అంగీకరింపబడినది. మత్తుపదార్థమగుటచే సారాయము, మెదడుయొక్క ఉన్నత ముఖ్యభాగములను- వేనిమూలమున మనస్సునకు వివేకయుతమగు నిర్ణయమును విచక్షణకు నిగ్రహమును సమకూరుచున్నవో, వేనివి శాంతిపొందించుకొనుట కఠినతమమగు కార్యమో- యట్టి యున్నతముఖ్యభాగములనే జడములుగ, వికలములుగజేసి స్తంభింప జేసివైచుచున్నది.

మద్యపానము దైనికాహారములో నొక భాగముగ గల పాశ్చాత్య దేశమునందు దాని విషయమున నిట్టియభిప్రాయము ప్రబలియున్న కాలమున, మద్యపానము విధి నిషిద్ధముగ గల మన దేశములో సంపూర్ణనిషేధ మసాధ్యమని బ్రిటిషుప్రభుత్వ చెప్పుటలో గలరహస్యము జదువరులు బాగుగ గుర్తింతురుగాక.

ఇంగ్లండు దేశమున జర్మనీపరిపాలనము

హెచ్. డబ్లియు. నెవిన్సన్ అనునాయన, కొన్ని యేండ్లకు బూర్వము "నార్తు అమెరికన్ రివ్యూ" అను పత్రికలో 'దాసీనకాపము న' (Under the Yoke) అను వ్యాసము నందు ఇంగ్లండు దేశము జర్మనీవారికి వశమైనట్లుగ భావించి, యట్టి దాస్యమున ఇంగ్లండుదుర్దశ యీక్రిందివిధమున నుండునని వర్ణించినాడు.

"జర్మను రాజప్రతినిధుల యధికారము క్రింద ఇంగ్లండు నాలుగుభాగములుగ విభజింపబడును. స్కాట్లండు, వేల్సు, ఐర్లండు దేశములలో జర్మను రాజప్రతినిధు లుందురు. జిల్లా యధికారులుగనుండి పన్నులను వసూలుచేయుచు, పోలీసుశాఖ నిర్వహించుటకు జర్మనులు నియమింపబడుదురు. ప్రభుత్వ నియమితు లయిన

కొలదిమంది బ్రిటిషు జమీందారులతోడను, సేవకులతోడను గూడుకొనిన జర్మనుసభ యొకటి ప్రతిరాష్ట్రమును బరిపాలించును. సేనాధిపతి, కోశాధికారి మున్నగు ముఖ్యపదవు లన్నియు జర్మనులతో నిండియుండ, నెల్లప్పుడును జర్మనులే యధికసంఖ్యాకులుగ గల యొకసంఘములో గూర్చుండి యొకజర్మనురాజప్రతినిధి విండ్సరు, బకింగుహాం రాజభవనములలో సభల జరుపును. తమ పరిపాలకులయొక్క యాధ్యాత్మికశ్రేయస్సును గోరుచు, నింగ్లీషు వారు ల్యూథరన్ దేవాలయములను (Lutheran Churches) పోషింపవలసి యుండును. లండను మున్నగు నగరములకు లార్డుమేయరులుగ జర్మను లుందురు. జర్మనుభాషయే దేశమందంతట రాజకీయ భాషగ నుండును. న్యాయస్థానములలో దుభాషీలుండిన నుందురుగాక. ప్రభుత్వపుపరీక్ష లన్నియు జర్మనుభాషలో జరుపబడును. ప్రభుత్వమున గొప్ప గొప్ప యుద్యోగముల నాశించువారు చదువుకొనుటకై జర్మనీకి పోవలసి యుండును.

“ప్రధానములగు వార్తాపత్రిక లన్నియు జర్మను భాషలో బ్రకటింపబడును. టైమ్సు మున్నగు విద్రోహపు బత్రికలపై కట్టుదిట్టమగు కాపలా యుంచబడును. జర్మను ప్రభుత్వమును విమర్శించిన, నది రాజద్రోహము గును. ఇంగ్లీషుపత్రిక లన్నియు నిర్బంధింపబడును. ఇంగ్లీషుపత్రికాసంపాదకు లందరును దుర్భరములగు జరిమానాలకు గాని, తీవ్రములగు కారాగారశిక్షలకుగాని పాల్పడవలసియుండును. ఇంగ్లీషువక్తలెల్లరు, కారణము చూపబడకయే, విచారణలేకయే ఆర్కునీస్ (Ornkeys) ప్రాంతములకు దేశాంతరవాసమునకు బంపబడుదురు. మిల్టను, వర్డ్సువర్తు, బర్కు, మిల్, మోర్లేప్రభువు, మున్నగు స్వాతంత్ర్యారాధకుల గ్రంథములన్నియు నిషేధింపబడును. షిల్లర్, హైనె, కారల్ మార్క్సు, మున్నగు జర్మను లేఖకుల గ్రంథములు కూడ నిషేధింపబడును.

“రైలుబండ్లలో నింగ్లీషువారు రెండవమూడవ తరగతుల బండ్లలోనే ప్రయాణము చేయవలయును. మొదటి తరగతిలో బ్రయాణముచేసిన, జర్మనువారి యౌద్ధత్యమునకు లోబడవలసినదే. బహుశః ఏజర్మను అధికారియో వచ్చి వాండ్రను క్రిందికి లాగివైచును. ప్రభుత్వభవనము లన్నియు జర్మనుపద్ధతిని నిర్మింపబడును. ఇంగ్లండులోని దుకాణము లన్నియు జర్మనువస్తువులలో మునిగిపోవునట్లుచేయు నొక వర్తకపు విధానముచే ఇంగ్లండుదేశపు బరిశ్రమ లన్నియు నణచివైవబడును. ఇంగ్లండునకు గల నైపుణ్య మంతయు మాయమైపోవును.

“ఆయుధధారణము నిషేధింపబడును. స్కాట్లండు, పశ్చిమోత్తరరాష్ట్రములలోని సామాన్యప్రజలందరును జర్మనుఅధికారులక్రిందనున్న దేశీయసైన్యములో చేరునట్లు ప్రోత్సహింపబడుదురు. ఏ బ్రిటిషు అధికారియు లెఫ్టినెంటు పదవికన్న పైకిబోగూడదు. ముఖ్యపదవులన్నియు జర్మనులకై ప్రత్యేకించి యుంచబడును. స్వయంసేవకదళములు రాజద్రోహపు సంఘములుగ బరిగణింపబడును. జర్మనులు కొందరు లీస్టరుషైరులోనికి నక్కలను వేటాడుచు బోయినప్పుడు ప్రజలు పవిత్రమగు నాజంతువు వధింపబడుట కడ్డువచ్చిరేని గ్రామస్థులగు ప్రధానులు కొందరు ఉరిదీయబడుదురు. అట్లురిదీయునప్పుడు కొందరు కొరడాదెబ్బలను దినవలసి యుండును.

“మనకు జర్మనుప్రభువుం దేవుడు
మనుచుగావుత నెప్పుడున్,
మన విదేశప్రభువు చిరజీ
వనముతో వలరారుతన్.”

అనుచు జాతీయగీత మారంభ మగును.

“బ్రిటనుతల్లీ,పరిపాలింపుము” (Rule Britannia) అనుపాట రాజద్రోహముగ నెంచబడును.

“ఈటన్, హారో మున్నగు ప్రభుత్వవిద్యాలయము లన్నియు, ఆక్సుఫర్డు కేంబ్రిడ్జి కళాశాలల భవనములతో సహా మూసివైచి, జర్మనులు వానిని సైనికస్థావములుగ మార్చెదరు. విద్యార్థులు పట్టణములలోని తమ బసలకుబోయి, నైశ్వర్యము విషయమున నందరు నిదివరకుకన్న నెక్కువ సమానముగ నొకరితో నొకరు తులదూగుచుందురు.

“జర్మనుభాష యంత యందమైన భాషకాదు. ఐన, నదియు నొకవాఙ్మయమే. ప్రభుత్వవ్యవహారము

లన్నిటిలోను, వ్రాతకును, సంభాషణమునకును జర్మను భాషనే యుపయోగించునట్లు ఇంగ్లీషువారు నిర్బంధింపబడుదురు. జర్మను సారస్వతమును గూర్చియు,జర్మను చరిత్రమునుగూర్చియు వారు కొంత నేర్చుకొందురు. తెల్లరొట్టెకన్న నెక్కుడు ఇష్టమైన నల్లరొట్టెను దినుటగూడ వారు నేర్చెదరు. పరే-జర్మనుసామ్రాజ్య సంరక్షణమునకును, తమ దేశమునందున్న జర్మను సైన్యములకును, దమ తీరములకు గావలియున్న యుద్ధనావలకును, ఇంగ్లీషు వారందరు దుర్భరముగ ఖర్చుల భరింపవలసియుండుననుట వేరుగ జెప్పనక్కఱ లేదు."

పై వర్ణనమును జదివినవారి కెల్లరకు నేటి మన భారతదేశముయొక్క దురవస్థ స్పష్టముగ గోచరించును. నేవిన్సనుగారు గూడ దీనిని వ్రాయునప్పుడు హిందూదేశమునే యుద్దేశించి యుండవచ్చును. ఐనను నేడు పండ్లుతోముకొనుట మొదలుకొని పరమేశ్వరునారాధించుటవరకు సర్వవిధముల నాంగ్లేయుల ననుకరించుటకే భారతీయులు తమ శక్తిసామర్థ్యముల వినియోగించుచున్నారు. రాజకీయముగ, సాంఘికముగ, నార్థికముగ, విద్యావిషయికముగ నేవంకజూచినను భారతీయులు పాశ్చాత్యులకడ బానిసతనమునకే పరువిడుచున్నారు. ఎంతశోచనీయము! ఎంత యవమానకరము!!

ఆధునిక భారతీయగ్రంథములు

పండిత దివాన్ చంద్ శర్మ యం.ఏ. గారిట్లు వ్రాయుచున్నారు:

నే నన్నివిధముల పుస్తకాలయములను చూచితిని. దీనిచే, భారతీయులకు సరియగు విజ్ఞానాహారమొసంగబడుటలేదని నిశ్చయించుకొనవలసి వచ్చినది. విద్యాంసులను కొలదిమందినిగూర్చి నేను చెప్పుటలేదు. తెలియనివారిని, తెలిసియు దెలియనివారిని మాత్రమే మనకున నుంచికొని నేనీమాట చెప్పుచున్నాను. వీరు చదువున దేమి?—సంక్షోభకరములు, భావోద్రేకజనకములు నగు కథలు; నీచోద్దేశములను, తుచ్ఛాశయములను వర్ణించుక్లిష్టపన్యములు; అసత్యములతో నిండిన జీవితచరిత్రలు, గ్రంథకర్త మతమునకే యెక్కువ శ్రేష్ఠత్వము నిచ్చునట్టియు, మానవస్వభావములోని యౌదార్యము నుద్దేశింపక, యందలి ద్వేషమును, నీచతమము లగు దురాశలను బురికొల్పునట్టియు గ్రంథములు. ఇట్టి యహితకరమగు విజ్ఞానాహారమును గ్రోలుటచే, భారతీయు లనుభవించెడి శోచనీయము లగు ఫలితము లెల్లరకు సువిదితములే.

దీనికంతకు కారణమేమి? మొదటికారణము: మన సాధారణసారస్వతము అసహజ మయినది. అది విదేశీయము. దానిని గొనివచ్చి మనదేశమున నాటవలయునని మనము ప్రయత్నించుచున్నాము. చాలవర కది నిస్సారమగు ననుకరణము. అన్యవాఙ్మయముల యనుకరణము. తుదకు దీనిఫలిత మేమగుచున్నదనగా;ఒకవిధమైన యసహజత్వము, ప్రత్యేకత్వము, దాని నావహించుకొనుచున్నవి. అందుచే నది చాలినంత లోతుగ బారుకొని పోజాలకున్నది. రెండవకారణము: మన సాధారణసారస్వతమున ఉదారాశయత్వము లేదు. భావౌన్నత్యము కానరాదు. భావసూచనములో నిగ్రహము తక్కువ. మోటుగ, నసభ్యముగనుండును. మనయీసారస్వతము స్వప్రయోజనమునకు సత్యమును, స్వాభిప్రాయములకు భావతీక్ష్ణతను, రంజకత్వమునకు సరళత్వమును బలియిచ్చుచున్నది. మనసాధారణభాష, పామరజనులందరిచేతను జదువబడుభాష సంపూర్ణముగ యసహజమైపోవుటయే తుదకు దీని యనివార్యమగు ఫలితము. ఈసారస్వతములో భారతీయుల స్థితిగతులు ప్రతిబింబించుటలేదు. ఇందు భారతీయుల జీవితములు వర్ణింపబడుటలేదు. కుటీరములలో నివసించుచు, శాలములలోను, గనులలోను పనిజేయుచు బొట్టబోసికొను భారతీయ ప్రజలను మన యీ సారస్వతము మరచిపోవుచున్నది. అందుచే ప్రస్తుతము మనకు గావలసినది మనభాషయొక్క

విషయానుక్రమణిక

చిత్రములు

పునరుద్ధారణము. భారతీయ గ్రంథకర్తలు స్వదేశీయుల యభిప్రాయములతో, వారిజీవితముతో నెక్కుడు పరిచయము గలిగించు కొందురుగాక. జీవితము నున్నదన్నట్లు పరీక్షించి తెలిసికొని, తమశక్తికొలంది దానిని వర్ణింతురుగాక. ఈవిధముగ, భారతీయులకు తేజము గలిగించు భావములను వారిని కార్యదక్షులనొనర్చు నాశయములను, వారి నెదుర్కొను సమస్యలను, వారి నవమానితులజేయు దౌర్బల్యములను వారి నుద్ధరించు సాదర్శములను, వారి నణగద్రొక్కు లోటుపాటులను, మనగ్రంథములలో వర్ణించుటకు దగు ప్రయత్నముల గావింపవలయును.

విదేశములలోని భారతీయులు

ఏప్రిల్ మాసపు 'ఇండియన్ రివ్యూ' పత్రికలో విదేశములయందలి భారతీయుల సంఖ్య యీక్రిందివిధమున వివరింపబడినది.

దేశముపేరు	భారతీయుల జనసంఖ్య	జనాభా తీసికొనబడిన సంవత్సరము
(బ్రిటిషుసామ్రాజ్యములో)		
సింహళము	820000	1926
బ్రిటిషుమలయా	660000	,,
హాంకాంగు	2555	1911
మారిషస్ (Mauritius)	264527	1921
సిచెల్లీస్	332	1911
జిబ్రాల్టర్	50	1920
నైగేరియా	100	1920
కెన్యా	26759	1926
ఉగాండా	5604 (ఆసియా వారు)	1921
నయాసాలాండ్	515	1921
జాంజిబార్	12841	1921
టాంగనయికా	9411	1921
జమైకా	18401	1922
ట్రినిడాడ్	121420	1921
బ్రిటిష్‌గయానా	124938	1921
ఫిజీద్వీపములు	60634	1921
బసుటోలాండ్	179	1911
స్వాజీలాండ్	7	1911
ఉత్తరరొడీషియా	56 (ఆసియా వారు)	1921
దక్షిణరొడీషియా	1250 ,,	1921
కనడా	1200	1920
ఆస్ట్రేలియా	2000	1922
న్యూజీలాండు	606	1921
నెటాల్ }	141336	1921
ట్రాన్స్‌వాల్ }	161 13 45	1921
కేప్‌కాలనీ }	339 . 6498	1921
ఆరంజ్ ఫ్రీస్టేటు }	100	1921
బ్రిటిషుసామ్రాజ్యములో మొత్తము	2294724	
(ఇతర దేశములు)		
అమెరికాసంయుక్త రాష్ట్రములు	3175 (ఆసియా వారు)	1910
మడగాస్కర్	5272 ,,	1917
రియూనియన్	2194	1921
డచ్ ఈస్టిండీస్ (సే)	50000 భారతీయులు	
సురినాం	34957	1920
మొజాంబిక్	1100 (ఆసియా తెలియదు వారు, అర్ధజాతుల వారు)	
పెర్షియా	3827	1922
ఇతర దేశములలో మొత్తము	100528	

మొత్తముపై విదేశము లన్నిటిలోనుగల భారతీయులసంఖ్య 2395249.

నేటినవలలు—కల్పనానిగ్రహము

బుక్‌మన్ (Bookman) పత్రికలో డీన్ ఇంజిగారు నేటి నవలలనుగూర్చి యిట్లు వ్రాయుచున్నారు:—

నేడు నవలకుగల పలుకుబడి చాల నపాయకరమని నానిశ్చితాభిప్రాయము. దాని రచనలో నిగ్రహము లేక పోవుటకాదు దీనికి కారణము. అనిగ్రహమును నేనంతగ లెక్కసేయను. మానవస్వభావమును నీచముగ జిత్రించుట నది పెంపొందించుచున్నది. ఇదియే పై యనర్థమునకు కారణము "కీర్తిదాయకము, హితకరమునగు నింగ్లీషు నవలల సాంప్రదాయమునకు మరలవలయునని నేను హృదయపూర్తిగ వాంఛించెదను. చిత్రకారుని వలెనే గ్రంథకారుడును సునిశ్చితమగు నొక యాదర్శము గలిగి యుండవలయును. బొమ్మలో చిత్రింపబడరాని నీచతమములగు వస్తువులు కొన్ని కలవు. మానవునిస్వభావమునను, జీవితసంఘటనములలోను గూడనట్లే కలవు. గొప్ప కల్పనాశక్తిగల లేఖకుడు, ప్రాపంచికజీవనము యొక్క ప్రయోజనమును తత్వమును ఉచితభావమున నరయఁగలవాడై యుండవలయును. అతిదూరపు మూలగు సంఘటనములను, ఈప్రయోజనముతోడను తత్వముతోడను సమన్వయపఱచి యతడు చిత్రింపవలయును. తనసారమునంతను, తనశాశ్వతత్వమునంతను ఏకైకసంఘటనములో ప్రతిబింబింపజేసెడి శాశ్వతప్రయోజనములగు సౌమనస్యమును, సత్యమును, సౌందర్యమును, గ్రంథరచయిత అరయఁజాలడేని యతడు వ్రాత మానినచో మంచిది. ఏలయన ఇంక మనకు నేర్పదగిన దేమియు నతనివద్ద లేదు. ఏవి యువకుల హృదయములను నిప్పటికిని బ్రదీప్తముల గావించుచున్నవో, యేవి వికలహృదయముగు నేటి మానవబృందము పునరుద్ధరింపబడుటకు అనన్యసాధనభూతములై యున్నవో యట్టి యాశాప్రేమవిశ్వాసములను గ్రంథరచయిత హేయములగు ననుభవముల జిత్రించి, విధ్వస్తములుగ నొనర్చివైచుచున్నాడు. "లక్ష్యము లేనిచోట బ్రజలు నశింతురు." తనదేశమును సోదరప్రజలను ప్రేమించుచున్నానని చెప్పుకొనువాడు, ఇట్టి లక్ష్యమునుండి యువకులనెడ బాపునేని యది నీచమగు మాయయని చెప్పనగును.

కవి

కాశీ వ్యాసాచార్యులుగారు

పసిడి మిసిమించు తారకావళుల తోడ-నంచితమగు సువర్ణప్రపంచమందుఁ
బుట్టి తనరారి సత్కవి పుంగవుండు-మంచిచెడ్డల తారతమ్యం బెఱింగి
చావుబ్రతుకులలో రహస్యంబుఁ దెలిసి-తాను దానన నెవ్వండో తరచి చూచి
నిరసనగుణంబునే చూచు నిరసనమునఁ;-ప్రేమయందుననే నిజప్రేమఁ గొలుపు
ద్వేషభావంబు మీఁదనే ద్వేషమూను-చిన్మయాత్ముని సృష్టి విచిత్రమెల్ల
తెరచిపెట్టిన పొత్తంబు కరణి యతని-కనుల చెంగట విశదంబుగాఁ గనఁబడు;
అతఁడు జనుల కలభ్యమైనట్టి కీర్తి-రాజమార్గంబు పైని వర్తనము సతముఁ
జేయుచుండుఁ బ్రతిధ్వనించెడి సుగతుల-కాంతి మయ కంక పత్త్ర పుంఖములతోడ
నలరు తన్మహనీయ సూహాశుగములు - సర్వలక్ష్యైక గాములై పర్వుచుండు.

(టెన్నిసను కవి యాంగ్ల పద్యమునుండి)



గ్రంథములు

మహాభారతయుద్ధము

ఈనాటకము రాయల్ సైజున 96 పుటలను గలిగి యున్నది. గ్రంథకర్తగారు కవిరాజ శ్రీపాద కృష్ణ మూర్తిశాస్త్రులుగారు; వెల రు 1-0-0. వలయువారు గ్రంథకర్తగారి పేర రాజమహేంద్రవరమునకు వ్రాసిన బడయగలరు.

శ్రీమన్మహాభారతాంధ్రీకరణ దీక్షితులగు గ్రంథకర్తగారిని నేడు క్రొత్తగ నాంధ్రలోకమునకు బరిచితుల గావింప నక్కఱలేదు. శాస్త్రిగారు, అవతారికలో వ్రాసినట్లు "భారతమంతయు నొక్కరేయి బ్రదర్శించుట కర్హమగునట్లు ముఖ్యవిషయములను విడువక" సరసముగ నీమహాభారత యుద్ధనాటకమును రచించినారు. మహాభారతము బోలుకథను, సంపూర్ణముగ నొక్కనాటి ప్రదర్శనమున కనుకూలముగ, రచించుట కష్టసాధ్యము. కావుననే వారికి 'రంగములు పెట్టుట యిష్టముగాకున్నను అట్లుచేయక తప్పినదికాదు.' శాస్త్రిగారి శైలి చక్కదనమునకు వారి శ్రీకృష్ణభారతమే సాక్షి.

(ప్ర.రం.)

ప్రాచీన హిందూదేశ రాజ్యాంగచరిత్రము

ఈగ్రంథము సాహిత్యవిశారద కోన వెంకటరాయ శర్మగారిచే రచియింపబడినది. డెమ్మిసైజున 110 పుటలు గలిగియున్నది. వెల రు 0-12-0 వలయువారు గ్రంథకర్తగారి పేర పశ్చిమగోదావరిజిల్లా ఏలూరుకు వ్రాసి తెప్పించుకొనవచ్చును.

మనపూర్వులు సింహాసనస్థు డగు యేలికయొక్క నిరంకుశప్రభుత్వమునే కాని నిజమగు ప్రజాప్రభుత్వము నెన్నడు ననుభవించియుండలేదనియు, ప్రజాప్రభుత్వ ధర్మముల నీనాటికి భారతదేశమున దామె నెలకొల్పితిమనియు దరచుగ నాంగ్లేయులు మనల బరిహసించుచుందురు. శర్మగారీగ్రంథమున నీవాదము బూటకమనియు, మనదేశమునగూడ ప్రజాప్రభుత్వ ముండెననియు, సోదాహరణముగ నిరూపింపగలిగిరి.

గ్రామనిర్మాణము, ప్రభుత్వకార్యములు, మంత్రులు, సైన్యవ్యవస్థ, నాగరకము, ప్రభుత్వాదాయము, రాజు, శాసనసభలు, అనుశర్తి కలతోడి యెనిమిది ప్రకరణములలో చాణుక్యుడు మున్నగు భారతీయ ప్రముఖుల యొక్కయు, మెగస్తనీసు మొదలగు పైదేశిక ప్రముఖులయొక్కయు గ్రంథములనుండి, యనేకచారిత్రకవిషయములను సమకూర్చి వేదకాలము మొదలుకొని, ముసలుపరిపాలన మంతమొందువఱకు, హిందూదేశమున నమలులో నుండిన ప్రభుత్వవిధానములును, తేటతెల్లములగు మాటలతో గ్రంథకర్తగారు వివరించియున్నారు.

ఆయాయంశముల బ్రోవొనర్చి కూర్చుటలో నచ్చటచ్చట కొంచెము వరుస తప్పినది. రాబోవుకూర్పులో గ్రంథకర్తగారీలోటు దీర్తురుగాక.

మొత్తముపై గ్రంథము మిగుల నుపయోగకారిగ నున్నది. (ప్ర. రం.)

5, 5- 20

'ఇంటా బయటా'

ఇది సుప్రసిద్ధ కవీంద్రుడగు రవీంద్రనాథ ఠాగూరుగారి బంగాళీనవలకు ఆంధ్రీకరణము. ఆంగ్లమున Home and Abroad అనే నవల. శోభనాదేవి, కొరుమూరి వైకుంఠరావుగార్లనువదించిరి. కవికులచంద్రుడగు మహాకవి వ్రాసిన యీ 426 పుటలగ్రంథమును గూర్చి చర్చించుటకుగాని, దానియందిమిడియుండు భావములను విశదీకరించుటకుగాని యీ కొంచెము స్థలమున సాధ్యముకాదు.

ఈగ్రంథము సాంఘిక రాజకీయ సమస్యలనాధారముచేసుకొనియున్న యొక చక్కనినవల. ఇందుముఖ్యపాత్రలు ముగ్గురు. ఒకభార్య, భర్త, వారి స్నేహితు డొకడు. ఈ కథనుండ నీముగ్గురువ్యక్తులు తమతమ అవస్థలనుండి వేరువేరుగా చెప్పినది, కలిపియల్లినది.

ఇంటను, బయటను, దేశములోను, ప్రపంచములోను, గృహవిషయములందును, బాహ్యసంఘమునందును మానవవ్యక్తికి-స్త్రీకిగాని, పురుషునకుగాని ఉండవలసిన స్వేచ్ఛ, నిజమైనట్టి, స్వచ్ఛమైనట్టి స్వేచ్ఛయొక్క ఆవశ్యకతను మూలవిషయముగా గొని వ్రాయబడిన దీనవల.

ఈస్వాతంత్ర్య సంపాదనేచ్ఛతో లోకమున వ్యవహరించునపుడు వ్యక్తికి కలుగుకష్టనష్టములు, జయాపజయములును తెలియజేయు కథ యీనవలలోని వస్తువు.

దేశముయొక్క స్వాతంత్ర్య సంపాదనములో దౌర్జన్యము జబర్దస్తీపద్ధతులు అవలంబించుట యెంతమాత్రము పనికిరాదనియు; స్వాతంత్రేచ్ఛ ప్రజలలో పూర్ణముగా కలుగజేసి, తగు ధర్మానుగుణశాంతియుత మార్గముల స్వాతంత్ర్యము సంపాదింపవలెననియు నట్టిదే స్థాపితముగా నుండగలదనియు, సత్యధర్మములకు విరుద్ధమైగాని న్యాయపథమునుండి తొలగినదిగాని యైనట్టి మార్గమున సంపాదింపబడు స్వాతంత్ర్యము మన కక్కరలేదనియు నిందు కవి బోధించుచున్నాడు.

కేవ లావేశపూరితులై, అత్యుత్సాహముతో బలవంతముగా ప్రజలను దేశభక్తిపూరితులను జేయుట, స్వదేశిదీక్షితులను జేయుట, యీకవికి అయిష్టములగు విషయములు. కేవల మొక దేశమునకేగాక యావత్ప్రపంచమునకు కావలసిన స్వేచ్ఛాస్వాతంత్ర్యములకై మానవజాతి పాటుపడవలెననియు నీకథవలన సూచితమగుచున్నది.

కథ యతి మనోహరమై, యింపుగా నున్నది. పాఠకులయందు మంచి భావదీప్తిని కలుగజేయగలదు. చక్కని ఉన్నతమైన భావములకు సముద్రముగదా రవీంద్రుని రచన!

భాషాంతరీకరణము అతి సరళముగాను, స్వేచ్ఛగాను, సహజముగ నున్నది. చక్కని యింపైన వాడుక భాష యుపయోగింపబడినది. ఠాగూరుగారి భావములకేమాత్రమును నష్టము కలిగియుండదనియే చెప్పవచ్చును.

ఇది విశ్వభారతీగ్రంథమాల యేజన్సీ 323 తిరువత్తూరు హైరోడ్, తండియార్ పేట, మద్రాస్ వారిచే ప్రచురింపబడినది. ఇందు ఠాగూర్ గారి పట మొకటి ముందు చేర్పబడియున్నది. క్రౌన్ 16 సైజు; 426 పుటలు మంచి కాగితముపై చక్కని యచ్చు; మంచి బైండు. వెల 3-0-0.

జ. బ్ర.

'పోస్టాఫీసు'

ఇది రవీంద్రకవీంద్రుని నాటకమునకు కొరుమూరి వైకుంఠరావుగారి యాంధ్రీకరణము.

ఇందు ప్రధానపాత్ర యొకబాలుడు. అతడు మనుష్యుడు ప్రయోగించుశిక్షలు, కట్టుబొట్లవల్ల లోపుననున్న జీవనావేగము పూర్తిగా చల్లారనివాడు. జిజ్ఞాసుహృదయుడు, అనురాగపూర్ణుడు. అతని చిన్నతనపు అకల్మషపుచేష్టలు, కోరికలు, భావములవలన అట్టివానినభివృద్ధిపొందించుకొనిన, మనుష్యుని జీవనపూర్ణవికాసమెట్లుండగలదో కవి చూపించుచున్నాడు. కథ అతి సులువైనదిగాను, సాధారణమైనదిగాను కన్పడుచున్నను ఇందలి భావములు కడును ఉత్తమమైనవి.

మనుష్యజీవనము ఆవేదనవలన, ముక్తజీవనపథగామిగా నెట్లగుటకు యత్నించునో కవి యందు తెలియబరచుచున్నాడు.

బాలుని ముద్దులొలుకు పదములు యింపుగొలుపు చుండును. భావ సరళమై, ఆనందము నొడగూర్చుచున్నది.

ఇందు కథాసందర్భమగు నొక పటమున్నది. క్రౌన్ 16 సైజు; 84 పుటలు. వెల 0-10-0. విశ్వభారతీ గ్రంథమాల ఏజన్సీ 323 తిరువత్తూరు హైరోడ్, తండి యార్పేట, మద్రాసు. —జ. బ్ర.

'స్టిల్ మాండ్ మేజస్ట్రేట్'

ఇది బెల్జియమ్ దేశపు కవి, మారిస్ మేటర్ లింక్ ఫ్రెంచిభాషలో వ్రాసిన 'బర్గోమా స్టర్ స్టిల్ మాండ్' అనే నాటకానికి తెలుగు. ఈకవి 1911 సంవత్సరంలో నాటకరచనకు నోబెల్ ప్రైజ్ అనే బహుమానము పొందినవాడు.

ప్రకాశకుడు: కారుమూరి వైకుంఠరావుగారు.

ఇందలికథ: బెల్జియమ్ దేశముపైకి జర్మనులు ఆక్రమించుకొనుటకు వచ్చి, యుద్ధముచేయుటకు, దేశపు గ్రామములను లోబరుచుకొనుటకు, పన్నిన రొుక యధర్మపు పన్నాగము. విశ్వాసపాత్రుడును, అమాయకుడును, సత్యవంతుడు నగు నొకతోటమాలి, తన జర్మను సేనలోని యొుక యుద్యోగిని చంపెనను నొకయబద్ధపు నేరము పెట్టి యతనికి మరణశిక్ష విధింపవచ్చిన జర్మన్ మేజర్ లెఫ్టినెంటుల దౌర్జన్యమును సహింపనేరక, ఆతోటమాలి యజమానుడు, నేరముచేసినది తననాకరు కాదన్నందుకును, అతనికి ఘోరశిక్ష విధించుటకును నిరసించినందుకు నాతనికి పెద్దమొత్తము జరిమానాగను, దేశము నాక్రమించుకొన్నందుకు తమకు చెల్లింపవలసినపన్ను కొంత మొత్తమును, తోటమాలికి ప్రాణదానము చేయవలసిన యెడ నతనిబదు లీతోటయధికారి (ఒక మేజస్ట్రేటు) నే దండనకు పాలొనర్చుటయు, ఈమేజస్ట్రేటుకు స్వయం అల్లుడైన యొుకజర్మనుడుకూడ నాసైన్యములో ముఖ్యోద్యోగిగా నుండియు, అతడును యీదౌర్జన్యమునందును అధర్మమునందును తోడ్పడి మామగారి కేవిధముగను తోడ్పడక పోవుటయేగాక మామగారిచేకూడ నధర్మమునకు మెడలు వంచ ప్రయత్నించును. మామగారు, మేజస్ట్రేటు ధర్మపరుడు, న్యాయమూర్తి. అతడు అమాయకుడగు తననౌకరు ప్రాణముకొఱకు తనప్రాణము నర్పించును. అతనితో బాటతని కొడుకును కూతురును కూడ నీయధర్మమునకు తమ నిరసనము తెల్పుచు నాతనితో పాటు ప్రాణములర్పింప సిద్ధమగుదురు.

ఈకథయందు స్వార్థపరుల విచక్షణలేని యన్యాయ ప్రవర్తనలును; స్వార్థరహితుల, ధర్మకాంక్షాపరుల న్యాయైకవర్తనయు, పరోపకారనిరతియు చక్కగా చూపింపబడినవి.

నాటకభాషలో సుబోధకముగా వ్రాయబడినది. కథలో విశేషము లేకపోయినను భావము లుత్తమమైనవి. 147 పుటలు. పుస్తకము మొదట మేటర్ లింక్ కవి ఫోటోగ్రాఫ పటమొకటి చేర్పబడియున్నది. వెల రు 1-0-0. విశ్వభారతీ ఏజన్సీ, 323 తిరువత్తూరు హైరోడ్డు, తండియార్పేట, మద్రాస్. —జ. బ్ర.

'స్వాతంత్ర్యలక్షణము'

ఇది సుప్రసిద్ధ ఐరిషుస్వాతంత్ర్యవాదియగు టెరన్సు మేక్స్విని గారి 'ప్రిన్సిపిల్స్ ఆఫ్ ఫ్రీడమ్' అను ఆంగ్ల గ్రంథమునకు శ్రీవోలేటి వేంకటసుబ్బయ్యశాస్త్రి బి.ఏ., గారి యనువాదము. మెక్స్విని గారు స్వాతంత్ర్యసమరమున తన ప్రాణముల నర్పించిన సంగతి మన మెన్నటికిని మరువజాలనిది. ఐరిషుదేశస్వాతంత్ర్యాందోళన దౌర్జన్యసహితమై యుండినను, స్వాతంత్ర్యేచ్ఛ యడుగున నుండు నుద్దేశములు భారతదేశస్థులవానితో నేకీభావమును పొందియే యున్నవి. ఉత్కృష్టధర్మావలంబనచేగాక ఆశ్చర్యకరమగు త్యాగము సాధ్యముకాదని యిందు ధృవమగుచున్నది!

శాంతియుతమైనట్టియు, ధర్మసంయుతమైనట్టియు నన్నివిధముల మార్గములచేతను దేశస్వరాజ్యమును సంపాదింప బూనుకొన్న భారతీయులకు గాంధీమహాత్ముడు బోధించు ధర్మసూత్రము లీగ్రంథమందును గానవగును. స్వాతంత్ర్యముయొక్క ముఖ్యావశ్యకతను, నిజమైన స్వాతంత్ర్యస్వరూపమును, నిందు మెక్స్వినీగారతిస్పష్టముగ విశదీకరించిరి. మెక్స్వినీగారి యీయుత్తమగ్రంథము దేశస్వాతంత్ర్యాభిలాషు లెల్లరకు నుపయోగకరముగ నుండగలదు.

ఇందు స్వాతంత్ర్యతత్త్వము; ఆంగ్లేయసామ్రాజ్యమునుండి విడిపోవుట; ధర్మబలము; మిత్రులు-శత్రువులు; బలము-దానిరహస్యము; కర్మయోగము; భక్తి; వీరపత్ని; పొలిమేర; సారస్వతము-స్వాతంత్ర్యము, మతము; మానసికస్వాతంత్ర్యము; సైనికవ్యవస్థ; సామ్రాజ్యము; యుద్ధము-ఆక్షేపణలు; మొదలగు విషయములుచర్చింపబడినవి.

'మనకు స్వాతంత్ర్యము ఆడంబరమునకై గాని, యిరుగుపొరుగు రాజ్యములవలె పరాక్రమవంతుల మగుటకుగాని, మనస్థితి బాగుచేసికొనుటకుగాని కాదు. ఇంతకన్న గొప్పకారణములు మనలను పురికొల్పుచున్నవి. అవి యాధ్యాత్మికములు. స్వాతంత్ర్యమునకై మన యంతరాత్మలు పరితపించుచున్నవి. ఆత్మస్వాతంత్ర్యమునకై ప్రయత్నించని వ్యక్తిగాని, జాతిగాని కలుగబోదు' అని మెక్స్వినీగారు వ్రాసినది పుస్తకప్రవేశమునందు ముద్రింపబడియున్నది. టెరెన్సుమెక్స్వినీగారి ఛాయాచిత్రమొకటి గూడ నిందు దొలుత చేర్పబడియున్నది.

అనువాదము సులభశైలిలో నున్నది. ఈగ్రంథము ప్రతియాంధ్రుడును చదువదగినది.

సైజు క్రౌను 16. పుటలు 248. వెల 1 మాత్రమే. వలయువారు:—నోగోటి వెంకటసుబ్బయ్య శాస్త్రిగారు, బి. ఏ., సహాయసంపాదకులు, ఆంధ్రపత్రికా కార్యాలయము, మద్రాసు అని వ్రాయవలయును.

'శ్రీ తులసీరామాయణము'

మహాభక్తుడును, కవియు, విరాగియునై యుండిన గోస్వామి తులసీదాస కృత హిందీపద్యరామాయణమును మాతృకగా గొని తెనుగున రచియింపబడిన నిర్వచనకావ్యమిది. ఇదివరకు బాలకాండమును, అయోధ్యాకాండమున ప్రథమభాగమును వచ్చినవి ఇది అయోధ్యాకాండమున రెండవభాగము, పాదుకా పట్టాభిషేకము. గ్రంథకర్త భాగవతుల నృసింహశర్మగారు హిందీరామాయణములోని భక్తిరసమును పూర్తిగా నిందు దెచ్చుటకు మిక్కిలి పాటుబడుట ప్రశంసార్హము. విఖ్యాతమగు రాముని కథగల గ్రంథమునుగూర్చి చెప్పుట కేమున్నది?

పద్యము లతినక్కని పాకములోనుండి, హాయి నిచ్చుచున్నవి.

ఈగ్రంథము వేగుంజుక్క గ్రంథమాల—27-వ ప్రచురము. 121 పుటలుగలది. వెల రూపాయి. భాగవతుల నరసింహశర్మగారు, 'వేగుంజుక్క గ్రంథమాల' పూడిపెద్దివారివీథి, బరంపురం (గంజాం) అని వ్రాసిన బడయగలరు. —జ. బ్ర.

The Vizagapatam Medical College Magazine.

ఇది యర్ధసంవత్సరమున కొకసారి ప్రకటింపబడు పత్రిక. మొదటిసంపుటము, ప్రథమసంచిక ఫిబ్రవరిలో ప్రకటింపబడినది మాకుచేరినది. ఇది విశాఖపట్నం వైద్యకళాశాలవిద్యార్థి సంఘమువారిచే స్థాపింపబడినది. ఈశ్వర మార్తాండశాస్త్రిగారు సంపాదకులు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఉపాధ్యక్షులగు రామలింగారెడ్డిగారి తొలిపలుకుతో నారంభమయి ఉన్నతవైద్యవిద్య యభ్యసించుచున్నవారు, ఉత్తీర్ణులైనవారు, వ్రాసిన యనేకవ్యాసములు వైద్యముగూర్చియు, శస్త్రచికిత్సను గూర్చియు నున్నవి. వైద్యసంబంధమగు వార్తలు, విశేషములు, సంపాదకీయవ్యాఖ్యావళి, వైద్యవిద్యాలయ విషయములు, వ్యాయామవిద్యాసంఘవిశేషములు మొదలగునవి గలవు. డాక్టర్ సర్ పి. సి. రే గారు వారివిద్యాలయమున ప్రాచీన హిందూరసాయనశాస్త్రము-వైద్యమును గూర్చి యొసంగిన యుపన్యాసపురిపోర్టు నిందు జేర్పబడినది. 'వినోదములు' ఒకపుట చేర్పబడియున్నది. 'పొగాకు దురలవాటు'నుగూర్చి ప్రొఫెసరుడిక్సనుగారొసంగిన యుపన్యాససార మిందు పొందుపరుపబడినది. 'భారతి'యందు గతసంచికలో ప్రకటింపబడిన 'పొగాకువలని దోషములు' దీనిలోనిదే. వైద్యమందు ప్రవేశములేని యితరులందరును గూడ చదువదగునది. 'The Confusing factor' అను మార్తాండశాస్త్రిగారి వ్యాసము ఆలోచనను పురికొల్పునట్టిది.

ఇందు మద్రాసు గవర్నరు, సర్ పి. సి. రేగారు మొదలగువారిచిత్రములు కొన్నియు నున్నవి. ముత్తము

క్రౌను ⅛ సైజు 115 పుటలుగలది. విద్యార్థులకు చందా సం॥ రు 2-0-0. —జ. బ్ర.

కృతజ్ఞత అను కిళాంబి రామానుజాచార్య నిర్యాణతారావళి

గ్రంథకర్త శ్రీయుత భోగరాజు నారాయణ మూర్తిగారు. ధారాళమైన శైలిలో తమ యాచార్యుని యందు గలభక్తి, శ్రద్ధలు పద్యరూపమున వెలిబుచ్చిరి. తమ యభివృద్ధికి హేతుభూతుఁడైన పండితోత్తముని నిర్యాణముచే కలిగిన హృదయావేదనము స్పష్టముగ తెలి పుచ్చిరి. దీనివెల 0-1-0. విజయనగర గంధర్వమహల్ వారిచే ప్రచురితము. —కో. నా.

పుష్పాంజలి

గ్రంథకర్త: చేబ్రోలు సూరన్నగారు. అంజలీ గ్రంథపరంపర ౧ టవ ప్రచురణము. క్రౌను 16 సైజు 50 పుటలు. వెల 0-8-0

ఈఖండకావ్యముల సంపుటము తేలికగను హృద్య ముగను నుండు గీతములచే వెలయుచున్నది. పూర్ణముగ ఛందోబద్ధమగు కవిత్వము కాకపోయినను పద్దములు కర్ణపేయములుగ నున్నవి. విశేషభాగము భగవద్గుణాను వర్ణనము. భక్తిరసప్రధానము. ఇందు ఉపాసనాదిక్రమములు మృదుతరములు. రవీంద్రకవీంద్రుని "సత్యకాము"డనుకథ కనువాదము చక్కగ నున్నది. మొత్తమున నీగ్రంథము సరసము. —కో. నా.

గీతాశ్రయము

శ్రీయుత ఇక్కుర్తి తిరుపతి రాయుడుగారిచే రచియింపఁబడినది. క్రౌను 16 సైజున 25 పుటలగ్రంథ ము. ఇందలి గీతములు సులభశైలిని వ్రాయఁబడినవి. పాఠశాలలయందలి విద్యార్థులయుపయోగముచే గ్రంథ కర్తగారు రచించినను దైవచింతనమగుటు, భక్తులకందఱ కును నుపయోగము. ఇది శతకసాంప్రదాయ మనుసరించి "అట్టి జగదేకమూర్తి సేనాశ్రయింతు"నను మకుటముతో పద్యములన్నియు గూర్పబడినవి. —కో. నా.

గండికోట

శ్రీ బాలభారతీ గ్రంథనిలయమువారి యనుబంధ గ్రంథమాలయం దిది మొదటిది. కృతికర్త: శ్రీయుత జే. సుబ్బయ్యగారు. కడపజిల్లాలోని గండికోట పూర్వ వైభవమును స్మరించుచు వ్రాసిన గీతమాలిక. సరళమగు శైలిని చదువరుల మనమాకర్షించుచున్నది. ఈగ్రంథము కర్నూలు జిల్లాలోని చాగలమర్రి గ్రామమున పై గ్రంథ నిలయమువారికడ 0-4-0 లకు దొరకును. —కో. నా.

విభవ సిద్ధాంతపంచాంగము

శ్రీయుత జవ్వాజి సుబ్బారాయగుప్త సిద్ధాంతి గారు గుణించినది. డెమ్మీ 1/8 సైజు 68 పుటలు గలవు. జ్యోతిషవిషయములు కొన్ని చేర్చబడినవి. వలయువారు వాసవీ గ్రంథనిలయము జేష్టవారపేట అని వ్రాయ వలెను. —కో. నా.

ఓంకారలింగశతకము

శ్రీయుత బళ్ల. వెంకన్నగారిచే రచియింపఁబడిన శతకము. భగవంతుని విషయమగు పద్యములు బాగుగనే యున్నవి. దీనివెల 0-2-0. వలయువారు బళ్ల వెంకన్న అండ్ సన్ బుక్కుసెల్లర్ కాకినాడ అని వ్రాయవలెను. —కో. నా.

నళిని

ఇది గంధర్వగ్రంథమాలయందలి ప్రథమసారిక. గ్రంథకర్తలు శ్రీయుత వేంకట కాళిదాసకవులు. ప్రేమ యొక్క బలీయతను చూపుచు ప్రకృతివర్ణనలతో నల రారుచున్న యొక్కచిన్నకథ. శైలి మృదువుగ నున్నది. గ్రంథకర్తలు చక్కగ కథను నిర్వహించి పాఠకుల కానందము కలిగించినారు. దీనివెల 0-8-0. చందాదారు లకు 0-4-0. —కో. నా.

ప్రేమజాబులు (మొదటిభాగము)

గ్రంథకర్త శ్రీయుత అయినాపురపు సుందర రామయ్యగారు. డెమ్మిసైజు 100 పుటల గ్రంథము. వెల

0-12-0. దీనిలో భార్యాభర్తలు వ్రాసికొను లేఖలు మెండుగ నున్నవి. కొన్ని ప్రశ్నపద్యములుకూడ గలవు. లేఖలన్నియు పద్యరూపముననే యున్నవి. ఎవరియం దెవరి కేవిధముగ ప్రేమకలుగవలెనో యది కలిగింపఁ జేయుట కియ్యది వ్రాసినట్లు గ్రంథకర్తగారు వ్రాసియుంచిరి. కాని యాయుద్దేశ్యము పద్యరూపమున నున్న జాబులకంటె వచనరూపముననున్న సర్వసామాన్యముగ నర్థమగుటచే నెక్కువగ సఫలమయ్యెడిదేమో. ఎటులైనను పద్యములుకూడ మిక్కిలి సులభశైలిలో వ్రాయఁ బడియుండుటచే వచనమువలెనే యర్థము కావచ్చును. గ్రంథకర్త ప్రయత్నము ప్రశంసనీయము. —కో. నా.

నిర్మలానందము

గ్రంథకర్త, శ్రీయుత బులుసు. వెంకటరమణయ్యగారు. డెమ్మిపైజున 63 పుటల నాటకము. వెల 0-8-0. ఈగ్రంథమున కైవల్యము కేవలము యత్యాశ్రమమువలననే గాక గృహస్థాశ్రమమువలనఁ గూడఁ గలుగ వచ్చుననియు, నిశ్చలధ్యానమే ముక్తిమార్గమనియు బోధించునటుల కథ కల్పింపఁబడినది. ప్రదర్శనమునకంటె పఠనమున కిది మిగుల సుఫయోగకారి యని తలఁచెదను. కపటయోగుల మాయానటనము, ఉత్తమసతీధర్మములు లెస్సగ చిత్రింపబడినవి. ప్రస్తుతము విద్యార్థి యగు నీయువకుని కవిత్వము, భావ్యభివృద్ధి సూచకముగ నున్నది. —కో. నా.

పంచరత్నములు

దేవరకొండ జగన్నాథరావు గారు, యం. ఏ.

ఆఁడువేషంబు గైకొని యాడు నటుఁడు-పురుషుఁ డగుఁగాని యాఁడుదై పరఁగు టెట్లు
కచ కుచాదులు దొలఁగించి కాంచునంతఁ-బురుషరూపంబు నిక్కమై పొలుచు నచట.

అట్లె జగదాకృతిని దోఁచు నాత్మ యెప్పు-డాత్మయే కాని యన్యమై యమర దెందు
కడఁగి నామరూపంబులు గడకుఁ ద్రోచి-కాంచ నంతయు నాత్మయై కానఁబడును.

కట్టెయేనుఁగు రంగులఁ గ్రాలుచున్న-దారువే కాని యేనుఁగై తనర దెందు
బాలు రదిచూచి గజమని భ్రాంతిఁగొన్న-పెద్దవారికి దారువై వెలయు నదియె.

కల్లజగ మిది సత్యమై కానుపింపఁ-గల్లయగుఁగాని సత్యంబు గాకయుండు
మూఢజనములు నిజమని మోహమంద-ఘన వివేకులు మిథ్యగాఁ గాంతు రెపుడు.

తాను దేహాదిక మటంచుఁ దలఁచునతఁడు-మూఢుఁ డగువాని కెన్నఁడు ముక్తిలేదు.
సచ్చిదానంద రూపంబు జ్ఞాని యెపుడు-తానుగా నెంచి ముక్తుఁడై తనరుచుండు.

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thumbu Chetty Street, G.T, Madras